# పరుసవేది

## పాలో కొయిలో

# THE ALCHEMIST

## PAULO COELHO

మంచి పుస్తకం



# పరుసవేది




## పాలో కొయిలో


*ఇంగ్లీషు అనువాదం: అలాన్ ఆర్ క్లార్క్*

*తెలుగు అనువాదం: కె. సురేష్*


**మంచి పుస్తకం**

పోర్చుగీసు మూలం : ఓ అల్కెమిస్టా
రచయిత : పాలో కొయిలో
ఆంగ్ల మూలం : ది ఆల్కెమిస్ట్
ఇంగ్లీషు అనువాదం : అలాన్ ఆర్ క్లార్క్

Original Portuguese Title : O Aquimista by Paulo Coelho
English Title : The Alchemist
Translated by : Alan R. Clarke
Telugu Title : Parusavedi
Translated by : K. Suresh

# పరుసవేది

అనువాదం: కె. సురేష్

© 1998 by Paulo Coelho. This edition was published by an arrangement with Sant Jordi Asociados, Barcelona, Spain.
All Rights Reserved, www.paulocoelho.com



| | | | |
|---|---|---|---|
| మొదటి ముద్రణ | ఆగస్టు, 2007 | కాపీలు : | 3000 |
| రెండవ ముద్రణ | మార్చి, 2008 | కాపీలు : | 2000 |
| మూడవ ముద్రణ | జనవరి, 2009 | కాపీలు : | 2000 |
| నాల్గవ ముద్రణ | ఏప్రిల్, 2010 | కాపీలు : | 2000 |
| ఐదవ ముద్రణ | ఏప్రిల్, 2011 | కాపీలు : | 1000 |

**eBook: kinige.com, May 2012**
**వెల: రూ. 90/-**

ప్రచురణ, ప్రతులకు:
**మంచి పుస్తకం,**
12-13-439, వీధి నెం.1
తార్నాక, సికింద్రాబాద్ – 500 017.
ఫోను: 94907 46614
Email: info@manchipustakam.in
Website: www.manchipustakam.in

సోల్ డిస్ట్రిబ్యూటర్
**నవోదయ బుక్ హౌస్,**
ఆర్య సమాజ్ ఎదురుగా,
కాచిగూడ, హైదరాబాద్
ఫోను: 2465 2387

## జీవనగమ్యాల వైపు.....

రోజువారీ జీవితంలోని సమస్యల పరిష్కారం కోసమో, జ్ఞాన సముపార్జన కోసమో, నిరంతరం పేరుకుపోయే విసుగుని బద్దలు కొట్టడం కోసమో సాహిత్యాన్ని ఆశ్రయించే పాఠకులకి తనదైన తత్వదర్శనం చేయించి విశ్వతత్వాన్ని అర్థం చేస్తూ సమాజ స్వభావాన్ని అవగాహన చేసుకోడానికి అవకాశం ఇస్తూ స్వీయ పరిణామానికి కావలసిన మార్గాన్ని సుగమం చేయడమే సాహిత్య ప్రధాన ప్రయోజనం.

మన బలహీనతలను రెచ్చగొడుతూ, భ్రమలలో జోకొడుతూ, భద్రతా రాహిత్యాల విముక్తి కోసం అవిటి ట్రిక్కులనీ, నిర్జీవమైన మార్గాంతరాలనీ అందించే సాహిత్యంతో పుస్తకాల సంత విలవిలలాడుతోంది. ఈ విషాద సందర్భాన మానవ తత్వాన్నీ సరళంగా, సహజంగా అర్థం చేస్తూ, వాటి మధ్య ఉన్న అనుసంధానతని విపులంగా విశదీకరిస్తూ తెలుగు సాహిత్య రంగంలోకి "పరుసవేది" ప్రవేశించడం మనందరికీ మహదానందం.

ఈ చరాచర సృష్టిలోని అంశాలన్నీ ఒక అనుసంధానంతో ఒకే అస్థిత్వంగా పనిచేస్తూ ఉంటాయన్న "సృష్టి ఏకత్వ" సూత్రాన్ని ఆధారంగా ఎంచుకుని ఈ కథ సాగడం గొప్ప విశేషం. కొరుకుడు పడని తత్వ చర్చలు లేకుండా, కదనకుతూహల రాగంలో ఒక కళాత్మక దర్శనంగా కథని నడపడం రచయిత చేసిన గొప్ప ఫలవంతమైన సాహసం.

కథానాయకుడు శాంటియాగోతో పాటు పాఠకులుగా మనమూ ప్రయాణిస్తూ గొర్రెలకి పుస్తకాలు చదివి వినిపించడంలోనూ, వాటితో కష్టసుఖాలని పంచుకోవడంలోనూ, ఎడారితో మాట్లాడడంలోనూ ఉన్న ఔచిత్యాన్ని అర్థం చేసుకుంటాం. సృష్టితల్లి ఆత్మిక అంశలుగా ఎరుకబద్ధమైన స్పృహతో మన జీవన గమ్యాలవైపు సాగిపోయే క్రమంలో మనందరికీ ప్రధాన ప్రతిబంధకంగా ఎదురయ్యే

మన "గుంపు – మౌఢ్యాన్ని (Mob dogma ని)" బద్దలు కొట్టుకోవడం ఎలాగో అవగాహనకి తెచ్చుకుంటాం. ప్రకృతిలో ఉన్న వనరుల్నీ, జ్ఞాన సంపదల్నీ మన జీవన సందర్భాలలోకి సునాయాసంగా ప్రవహింపచేసుకోవడం ఎలాగో నేర్చుకుంటాం.

శాశ్వతం అనుకున్న సంపదలు కరిగిపోయిన వేళ.... నిత్యం అనుకున్న ఆత్మీయ బంధాలు ప్రపంచంలో కలిసిపోయిన వేళ.... అన్నీ పోగొట్టుకున్న వాళ్ళమై, అనామకులుగా మనం మిగిలిపోయిన వేళ..... అనాలోచితంగా ఆత్మశక్తిని ప్రయోగించడం అనే అమాయకపు సాహసాల లోనించే జీవన సందర్భాలని సుసంపన్నం చేసుకునే తక్షణ ప్రతిభల్ని సృష్టించుకోవడంలో నిపుణులమౌతాం.

ఒకే కప్పు కింద జీవిస్తూ ఒకరికొకరం అర్ధంకాని సమాజ భాషలో జన్మంతా మాట్లాడుకుంటూ ఉండే స్థితి నుండీ సృష్టిలోని ప్రతి అంశతోను సంభాషించి స్పందింపచేసుకోగలిగిన "విశ్వ భాష" స్థాయికి ఎదిగిపోతాం. పాఠకజన్మకి ఇంతకన్నా సార్ధకత ఏం కావాలి?

మతాలలో ఇమడలేక సులువైన, సహజమైన ఆధ్యాత్మిక అద్భుతాన్ని అందుకోలేక స్వీయప్రేరిత అయోమయాలతో, గందరగోళాలతో అవస్థపడుతూ, జనబాహుళ్యాన్ని అవస్థపెట్టే ఆధ్యాత్మిక గురువులకీ, అమాయక ఆధ్యాత్మిక విద్యార్థులకీ...., అభ్యాసులకీ ఈ పుస్తకం గొప్ప కనువిప్పు.

తర్కాలకీ, హేతుబద్ధతకీ, ఇంద్రియాల గ్రహింపుకీ.... కుదరనీ, అందనీ నిశిత, నిగూఢ స్థాయిలో అసలైన మౌలిక ప్రజ్ఞలన్నీ... గుప్తనిర్మాణంగా.... నెలకొని ఉంటాయనీ, ఈ ప్రజ్ఞలు సందర్భోచితంగా వ్యక్తనిర్మాణాలుగా.... నైపుణ్యాలుగా ప్రకటితమౌతాయని అర్థం చేసుకోకపోతే నిండైన పరిణామానికి దూరమై, మన సంకల్ప వాస్తవాలను స్పృష్టించుకోవడంలో విఫలమౌతాయని మనకి అర్థం చేయడమే ఈ రచన యొక్క ప్రధాన గమ్యం.

తను పరిణామం చెందకుండా పరిసరాలలోని ఏ అంశాన్ని మానవుడు పరిణామం చెందించలేడన్న అద్భుత వాస్తవాన్ని పరుసవేదాత్మకంగా వివరించడానికి రచయిత చేసిన ప్రయత్నం అసమాన్యం. సీసం నుంచి బంగారాన్ని తయారు చేసే విధానాన్ని "పరుసవేది'', ‘‘పరుసవేదం'' అని అంటారు. బంగారం మీద ఆశతో ప్రతి నాగరికతలోనూ, ప్రతి తరంలోనూ ఈ ప్రయత్నం సాగి సాగి వైఫల్యాలతోనే ముగుస్తూ ఉంటుంది. వ్యక్తి తన ముతక ధర్మాలని పరిహరించుకుని సునిశిత ధర్మాలలోకి అంటే ఉన్నత చైతన్యాలలోకి ఎప్పుడు ఎదుగుతాడో.... అప్పుడు... బంగారంలా మారిన తనకి.... సీసం నుంచే బంగారం చేయడం అనే పరుసవేద విద్య ఎలా సొంతం అవుతుందో, మన చరిత్రలోనూ ఈ పుస్తకంలోనూ నిరూపితమైన స్థిరమైన శాశ్వత వాస్తవం.

సంపూర్ణమైన సంసిద్ధతతో, వినమ్ర సమర్పణతో, సృష్టితత్వాన్ని సాక్షాత్కరింపచేసుకోవడమే గమ్యమైనప్పుడు, అది ఇసకరేణువయినా ఆ సాక్షాత్కారం కుదురుతుందన్న మహత్తర వాస్తవాన్ని నొక్కిచెప్పడంలో రచయిత ఉద్దేశం మానవుణ్ణి ఒక సూక్ష్మ సృష్టిగా లేదా అధిసూక్ష్మ సృష్టిగా అర్థం చెయ్యడమే.

విశ్వాత్మ అంశగా మానవుడికి పట్టాభిషేకం చేసిన అపురూపమైన ఈ పుస్తకాన్ని అనువదింపచేసి, ప్రచురించి తెలుగు పాఠకులకి అందించిన "మంచి పుస్తకం'' సాహసం మన కథానాయకుడి సాహసానికి ఏ మాత్రం తీసిపోయింది కాదు.

30 ఆగస్ట్, 2007 వి. రామచంద్రరావు

హైదరాబాద్ – 60 చైర్మన్: అభయ్ ఇంటర్నేషనల్ ఎకాడమీ ఆఫ్ హ్యూమన్ లైఫ్ టెక్నాలజీ



# మొదటి భాగం

ఆ యువకుడి పేరు శాంటియాగో. అతడు తన గొర్రెల మందతో పాడుబడ్డ క్రైస్తవ మందిరాన్ని చేరుకునే సరికి సంధ్య చీకట్లు అలుముకుంటున్నాయి. ఆ మందిరం కప్పు చాలా ఏళ్ళ క్రితమే కూలిపోయింది. పవిత్ర పాత్రలు, ఇతర సామాగ్రి పెట్టి ఉండే గదిలో ఇప్పుడొక పెద్ద అంజూర చెట్టు ఉంది.

ఆ రాత్రికి అక్కడ గడుపుదామని యువకుడు అనుకున్నాడు. పాడుబడ్డ గేటు నుంచి గొర్రెలన్నీ లోపలికి వచ్చాయో లేదో చూసుకున్నాడు. ఆ తరువాత రాత్రిపూట మంద చెల్లాచెదురు కాకుండా ఉండటానికి గేటుకి అడ్డంగా చెక్క పలక ఉంచాడు. ఆ ప్రాంతంలో తోడేళ్ళు లేవు. కానీ ఓసారి ఒక గొర్రె రాత్రి ఎటో వెళ్ళిపోవటంతో ఆ మరునాడంతా యువకుడికి దానిని వెతకటం సరిపోయింది.

నేలను తన చలిచొక్కాతో శుభ్రం చేసి, చదవటం పూర్తిచేసిన పుస్తకాన్ని దిండుగా చేసుకుని యువకుడు నిద్రకి ఉపక్రమించాడు. ఇంకా పెద్ద పుస్తకాలు చదవటం మొదలు పెట్టాలనీ, వాటిని చదవటానికి ఎక్కువ సమయం పడుతుందనీ, అదీగాక అవి దిండుగా మరింత బాగుంటాయి అని తనలో తాను అనుకున్నాడు.

యువకుడు మేలుకునేసరికి ఇంకా చీకటిగానే ఉంది. కూలిన కప్పులోంచి ఆకాశంలో చుక్కలు కనిపిస్తూ ఉన్నాయి.

ఇంకాసేపు పడుకుంటే బాగుంటుంది అనుకున్నాడు. వారం ముందు వచ్చిన కలే ఈ రోజు కూడా వచ్చింది. ఈసారి కూడా కల పూర్తి కాకుండానే మెలకువ వచ్చేసింది.

యువకుడు లేచి చేతి కర్రను తీసుకుని ఇంకా పడుకుని ఉన్న గొర్రెలను లేపసాగాడు. తాను లేచేసరికి గొర్రెలలో చాలావరకు లేవడం అతడు గమనించాడు. ఈ గొర్రెలనూ, తన జీవితాన్నీ ఒక వింత శక్తి ఏదో ముడిపెట్టినట్లు అనిపిస్తోంది: గత రెండు సంవత్సరాలుగా అతడు వాటితోనే జీవనయానం సాగిస్తూ పల్లెపట్టుల్లో మేత,

నీళ్ళు ఉన్న ప్రాంతాలకు వాటిని తీసుకెళుతున్నాడు. 'ఇవి నాకు అలవాటు పడ్డాయి. నా దిన చర్య ఏమిటో వీటికి తెలుసు,' తనలో తాను అనుకున్నాడు. ఇలా ఒక క్షణం ఆలోచించేసరికి నాణానికి మరోవైపు గోచరించినట్లు అనిపించింది: వాటి దినచర్యకు తాను అలవాటుపడినట్లు ఉన్నాడు.

కాని గొర్రెలలో కొన్ని ఇంకా నిద్రపోతూనే ఉన్నాయి. ఒక్కొక్క దాన్ని పేరుతో పిలుస్తూ , కర్రతో తడుతూ యువకుడు వాటిని లేపుతున్నాడు. తను చెప్పేది గొర్రెలు అర్థం చేసుకుంటాయని అతడి నమ్మకం. అందుకనే పుస్తకంలో తనకు బాగా నచ్చిన అంశాలను వాటికి చదివి వినిపించేవాడు; గొర్రెల కాపరి ఒంటరితనం గురించి, సంతోషాల గురించి వాటికి చెప్పేవాడు. ఒక్కొక్కసారి తాము దాటి వచ్చిన ఊరిలో చూసిన వాటి గురించి వ్యాఖ్యానించేవాడు.

గత కొద్ది రోజులుగా యువకుడు వాటితో ఒకే విషయం గురించి చెబుతున్నాడు: మరో నాలుగు రోజుల్లో తాము చేరుకోబోయే ఊరిలోని వ్యాపారి కూతురు గురించి. ఆ ఊరికి అంతకు ముందు ఒక్కసారే వచ్చాడు, అదీ సంవత్సరం క్రితం. ఆ వ్యాపారి ఎండుపళ్ళ దుకాణం యజమాని. మోసగింపబడకుండా ఉండాలని గొర్రెల ఉన్నిని తన సమక్షంలోనే గొరగాలని అంటాడు. ఒక మిత్రుడు ఆ దుకాణం గురించి చెప్పటంతో యువకుడు తన గొర్రెలతో అక్కడికి వెళ్ళాడు.

*

"కొద్దిగా ఉన్ని అమ్మాల్సి ఉంది," యువకుడు వ్యాపారితో అన్నాడు.

దుకాణం రద్దీగా ఉండటంతో మధ్యాహ్నం వరకు వేచి ఉండమని యజమాని చెప్పాడు. దాంతో యువకుడు దుకాణం మెట్లమీద కూర్చుని తన సంచిలోంచి ఒక పుస్తకాన్ని బయటికి తీసాడు.

"గొర్రెల కాపరులు పుస్తకాలు చదవగలుగుతారని నేను అనుకోలేదు," వెనకనుంచి అతడికి ఒక అమ్మాయి గొంతు వినిపించింది.

యాండలూసియా ప్రాంతపు ఆడపిల్లల మాదిరి ఆ అమ్మాయి కురులు పొడవుగా ఉన్నాయి. మైదాన ప్రాంతాల విజేతలను ఆమె కళ్ళు లీలగా గుర్తుకు తెస్తున్నాయి.

"సాధారణంగా పుస్తకాలకంటే ఎక్కువ నా గొర్రెలనుంచి తెలుసుకుంటుంటాను," అంటూ యువకుడు బదులిచ్చాడు. ఆ తరువాత వాళ్ళు రెండు గంటలసేపు కబుర్లు చెప్పుకున్నారు. తాను వ్యాపారి కూతుర్ననీ, ఊరిలో జీవితం గురించీ ఆమె చెప్పింది. అక్కడ ప్రతిరోజు పాతరోజు మాదిరిగానే ఉంటుంది. గొర్రెల కాపరి యాండలూసియా గ్రామీణ ప్రాంతాలగురించి, అంతకు ముందు తాను ఆగిన పట్టణాల గురించి ఆమెకు చెప్పాడు. ఎప్పుడూ గొర్రెలతో మాట్లాడే అతనికి ఈ అమ్మాయితో మాట్లాడటం బాగుంది.

మధ్యలో ఒకసారి "నువ్వు చదవటం ఎలా నేర్చుకున్నావు?" ఆ అమ్మాయి అడిగింది.

"అందరిలాగానే – బడిలో," అతడు బదులిచ్చాడు.

"చదవటం వచ్చిన వాడివి మరి గొర్రెల కాపరిగానే ఎందుకు ఉండిపోయావు?"

ఆ ప్రశ్నకు బదులివ్వకుండా ఉండటానికి అతడు ఏదో గొణిగాడు. ఆ అమ్మాయి ఎన్నటికీ అర్థం చేసుకోలేదని అతడికి తెలుసు. తన సంచార జీవిత గాథలను చెప్పసాగాడు. మెరిసే ఆమె కళ్ళు భయంతోనూ, ఆశ్చర్యంతోనూ పెద్దవి కాసాగాయి. సమయం గడుస్తున్న కొద్దీ ఆ రోజు ఎప్పటికీ అంతం కాకూడదనీ, ఆ అమ్మాయి తండ్రి పని ఒత్తిడిలో ఉండి మూడు రోజులపాటు తనని వేచి ఉండమనాలనీ అతడు కోరుకోసాగాడు. అంతకు ముందు ఎన్నడూ పొందని

అనుభూతిని ఆ రోజు అతడు పొందసాగాడు: ఒకే చోట జీవితాంతం ఉండిపోవాలని అతడికి అనిపించసాగింది. పొడవాటి కురులు ఉన్న ఆమెతో తన రోజులు ఇక ఎన్నడూ ఒకే మాదిరిగా ఉండవు.

చివరికి వ్యాపారి బయటకు వచ్చాడు. నాలుగు గొర్రెల ఉన్ని గొరిగి ఇవ్వమని అడిగాడు. ఉన్నికి డబ్బు చెల్లించి యువకుడిని మళ్ళీ సంవత్సరానికి రమ్మన్నాడు వ్యాపారి.

*

ఇంకొక నాలుగు రోజుల్లో అతడు మళ్ళీ అదే ఊరు చేరుకుంటాడు. అతడు ఒకవైపు ఉత్తేజానికి లోనవుతున్నాడు, మరోవైపు ఆందోళనగానూ ఉన్నాడు: ఆ అమ్మాయి బహుశా తనను మరిచిపోయి ఉండవచ్చు. ఉన్ని అమ్ముకుంటూ ఎంతోమంది గొర్రెల కాపరులు వచ్చి వెళుతుంటారు.

"ఏం పర్వాలేదులే," అతడు తన గొర్రెలతో చెప్పాడు, "నాకు ఇతర ప్రాంతాలలో వేరే అమ్మాయిలు వున్నారు."

అది నిజం కాదని అతడి హృదయానికి తెలుసు. నావికులు, ఊళ్ళు తిరిగే వ్యాపారస్తులు ఏ బాదరబందీ లేని తమ సంచార జీవనంలో ఆనందాలను పొందుతారు. అయినప్పటికీ ఆ ఆనందాలను మరిపింపచేసే వ్యక్తి ఉండే ఒక పట్టణాన్ని వాళ్ళు కనుగొన్నట్టే గొర్రెలకాపరులు కూడా కనుగొంటారని యువకుడికి తెలుసు.

సూర్యోదయం కానున్నది. గొర్రెల కాపరి తన గొర్రెలను తూర్పు వైపు నడిపించసాగాడు. గొర్రెలకి నిర్ణయాలు తీసుకునే అవసరం ఎప్పుడూ రాదు అనుకున్నాడు. అందుకేనేమో అవి ఎప్పుడూ తననే అంటిపెట్టుకుని ఉంటాయి.

ఆ గొర్రెలకు కావలసిందల్లా మేత, నీళ్ళు. యాండలూసియా ప్రాంతంలోని మంచి పచ్చిక బీళ్ళకు తీసుకెళ్ళినంత కాలం అవి తనకు మంచి మిత్రులుగా ఉంటాయి. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అంతులేదనిపించే గంటల మధ్య వాటి జీవితం ఎప్పుడూ ఒకే మాదిరిగా ఉంటుంది. వాటి బాల్యంలో వాటికి ఎప్పుడూ పుస్తకం చదివే పనిలేదు. సుదూర నగరాల గురించి అతడు చెప్పేది వాటికి అర్థమయ్యేది కాదు. తిండి, మేత ఉంటే చాలు అవి సంతృప్తి చెందేవి. దానికి బదులుగా అవి ఉదారంగా తమ ఉన్నిని, తోడుని, ఒక్కోసారి మాంసాన్ని ఇచ్చేవి.

నేను రాక్షసుడిగా మారిపోయి వాటిని ఒక్కటొక్కటిగా చంపుదామని నిర్ణయించుకుంటే దాదాపు మంద మూడొంతులు నిర్మూలమయ్యేదాకా వాటికి ఆ విషయం ఎరుక పడదని అతడనుకున్నాడు. అవి నన్ను నమ్ముతున్నాయి; ఆహారం వద్దకు నేను తీసుకెళుతున్నాను కాబట్టి అవి తమ సహజాతాలను మరిచిపోయాయి.

తన ఆలోచనలకు అతడే ఆశ్చర్యపోయాడు. అంజూర చెట్టు పెరుగుతున్న ఆ క్రైస్తవ మందిరంలో బహుశా భూతాలు ఉన్నాయేమో. తిరిగి అదే కల వచ్చేలా చేసింది, తనను నమ్మిన సహచరుల పట్ల కోపం వచ్చేలా చేసింది అవేనేమో. రాత్రి అన్నం తిన్న తరువాత మిగిలిన కొద్ది ద్రాక్ష సారాని తాగాడు. చలిచొక్కాని వంటికి దగ్గరగా హత్తుకున్నాడు. మరికొన్ని గంటలలో సూర్యుడు నడినెత్తికెక్కిన తరువాత ఎండ తీవ్రమై గొర్రెలను ఈ మైదానంలో నడిపించటం కష్టమని యువకుడికి తెలుసు. వేసవిలో ఈ సమయంలో స్పెయిన్ దేశమంతా నిద్రపోతుంటుంది. రాత్రి వరకు ఆ వేడిమి ఉంటుంది, కానీ అంతసేపు కూడా తన చలిచొక్కాను మోస్తూ తిరగాలి. దాని బరువును తలుచుకుని బాధపడిన మరుక్షణం దాని సహచర్యం వల్లనే వేకువ చలిని తట్టుకోగలిగానన్నది యువకుడు గుర్తించాడు.

మార్పునకు మనం సిద్ధంగా ఉండాలి అని యువకుడు అనుకున్నాడు. చలిచొక్కా బరువుకీ, దాని వెచ్చదనానికీ కృతజ్ఞుడయ్యాడు. ఆ చలిచొక్కాకి ఒక ఉద్దేశముంది, అలాగే అతడికి కూడా. అతడి జీవిత ఉద్దేశం ప్రయాణం చేస్తూ ఉండటం. యాండలూసియా ప్రాంతంలో రెండు సంవత్సరాలపాటు తిరగటం వల్ల అక్కడి పట్టణాలన్నీ యువకుడికి ఎరుకలోకి వచ్చాయి. ఈసారి ఆ అమ్మాయిని కలిసినప్పుడు ఒక సాధారణ గొర్రెలకాపరికి చదవటం ఎలా వచ్చో చెపుదామనుకున్నాడు. తన పదహారేళ్ళ వయస్సు వరకు అతడు మత గురువుల పాఠశాలకు హాజరయ్యాడు. అతని తల్లిదండ్రులు అతన్ని ఒక మత గురువుగా చూడాలనుకున్నారు, ఆ విధంగా ఒక సాధారణ రైతు కుటుంబానికి గర్వకారణంగా అతడు నిలుస్తాడని వారు ఆశించారు. గొర్రెల మాదిరి ఆహారం, నీళ్ళు సమకూర్చుకోవటం కోసమే వాళ్ళు ఎంతో కష్టించి పనిచేస్తారు. యువకుడు లాటిన్, స్పానిష్ భాషలను , మత శాస్త్రాలను చదివాడు. దేవుడి గురించి, మనిషి పాపాల గురించి నేర్చుకోవడం కంటే బాల్యం నుండి ప్రపంచం గురించి తెలుసుకోవడం అతడికి ఎంతో ముఖ్యంగా ఉండేది. బడి నుంచి ఇంటికి వచ్చిన ఒక మధ్యాహ్నం అతడు ధైర్యం కూడగట్టుకుని తనకి మత గురువు అవ్వాలని లేదనీ, ఊళ్ళు చూడాలని ఉందనీ తండ్రితో చెప్పాడు.

*

"ప్రపంచం నలు మూలలనుంచి ప్రజలు ఈ ఊరు వచ్చి వెళతారు నాయనా! " అన్నాడు తండ్రి. "వాళ్ళు కొత్త వాటిని వెతుకుతూ వస్తారు. కాని తిరిగి వెళ్ళేటప్పుడు వచ్చినప్పటికంటే ఏమీ తేడాగా ఉండరు. వాళ్ళు కొండనెక్కి కోటను చూస్తారు, ఇప్పటికంటే గతకాలం మేలన్న నిర్ణయానికి వస్తారు. వాళ్ళకి తెల్లజుట్టు ఉండవచ్చు, నల్ల చర్మం ఉండవచ్చు, కానీ అందరూ ఇక్కడ ఉంటున్న ప్రజలలాంటివారే."

"వాళ్ళ పట్టణాల్లోని కోటలను చూడాలని నాకుంది," అతడు వివరించాడు.

"ఇక్కడికి వచ్చిన వాళ్ళు మన ప్రాంతాన్ని చూసి ఇక్కడే కలకాలం ఉండిపోవాలనిపిస్తోందని అంటారు," తండ్రి చెప్పారు.

"నాకు వాళ్ళ ప్రాంతాలను, వారి జీవనాన్ని చూడాలని ఉంది," కొడుకు బదులిచ్చాడు.

"ఇక్కడికి వచ్చే వాళ్ళ దగ్గర డబ్బు దండిగా ఉంది, అందుకే వాళ్ళు ఆ యాత్రలు చేయగలుగుతున్నారు," తండ్రి అన్నాడు. "మనలో ప్రయాణాలు చేయగలిగేది ఒక్క గొర్రెల కాపరులే."

"అయితే నేను గొర్రెల కాపరినవుతాను!"

ఆపైన తండ్రి ఏమీ మాట్లాడలేదు. ఆ మరునాడు తన కొడుకుకి మూడు పురాతన స్పానిష్ బంగారు నాణాలు ఉన్న సంచిని ఇచ్చాడు.

"ఇవి నాకు ఒకరోజు చేనులో దొరికాయి. వారసత్వంలో భాగంగా వీటిని నీకివ్వాలని అనుకున్నాను. వీటిని ఉపయోగించుకుని నువ్వు గొర్రెల మందను కొనుక్కో. నీ ప్రయాణాన్ని కొనసాగించు. చివరికి ఏదో ఒక రోజున మన ప్రాంతమే అన్నింటిలోకి మంచిదనీ, ఇక్కడి ఆడవాళ్ళే అందరికంటే అందమైన వాళ్ళనీ నువ్వు తెలుసుకుంటావు."

అతడు కొడుకుని ఆశీర్వదించాడు. తండ్రి చూపులో తనకూ స్వయంగా ప్రపంచాన్ని చూసి రావాలని ఉన్న కోరిక కొడుకుకి కనపడింది. తాగే నీటికోసం, తినే తిండికోసం పాటు పడటంలోనూ, జీవితమంతా ప్రతిరాత్రి ఒకే ప్రదేశంలో నిద్రపోవటం కింద ఎన్నో ఏళ్ళపాటు ఆ కలలను అణిచివేసినప్పటికీ అవి ఇంకా మిణుకుమిణుకు మంటూనే ఉన్నాయి.

*

తూరుపు ఆకాశం ఎర్రబడింది, ఉన్నట్టుండి సూర్యడు బయటికి పొడుచుకొచ్చాడు. తండ్రితో తన సంభాషణని గుర్తుకు తెచ్చుకున్న యువకుడు సంతోషంతో పొంగిపోయాడు. ఇప్పటికే అతడు ఎన్నో కోటలు చూసాడు. ఎంతోమంది ఆడవాళ్ళని కలిశాడు (కాని వాళ్ళలో ఎవ్వరూ కొద్ది రోజులలో తను చూడబోతున్న ఆమె అంత అందంగా లేరు). అతడికి ఒక గొర్రెల మంద ఉంది, ఒక చలిచొక్కా ఉంది. ఒక పుస్తకం ఉంది – దానిని తిరిగి ఇచ్చి మరొకటి పొందవచ్చు. కానీ అన్నింటికంటే ముఖ్యమయినది ప్రతిరోజు అతడు తన కలను జీవించగలుగుతున్నాడు. యాండలూసియా మైదాన ప్రాంతాలతో అతడు విసుగుచెందితే తన గొర్రెల మందను అమ్మేసి సముద్రయానం చేపట్టవచ్చు. సముద్రయానం విసుగు పుట్టే నాటికి అతడికి మరిన్ని నగరాలతో, మరింత మంది ఆడవాళ్ళతో పరిచయం ఏర్పడుతుంది, ఆనందంగా ఉండటానికి మరిన్ని దారులు పరిచయమవుతాయి. సూర్యోదయాన్ని చూస్తూ పాత పాఠశాలలో నాకు దేవుడు దొరికేవాడు కాదు అని అతడనుకున్నాడు.

అవకాశం దొరికినప్పుడల్లా యువకుడు తాను ప్రయాణించటానికి కొత్త దారిని ఎన్నుకున్నాడు. ఆ ప్రాంతం గుండా అనేకసార్లు ప్రయాణించినా అతడు ఆ పాడుపడిన క్రైస్తవ మందిరాన్ని ఎన్నడూ చూడలేదు. ఈ ప్రపంచం చాలా పెద్దదీ, అనంతమైనదీ; కొంచెంసేపు గొర్రెలను దారి చూపించనిస్తే చాలు ఎన్నో ఆసక్తికరమైన విషయాలను అతడు కనుగొంటాడు. వచ్చిన సమస్యల్లా ఏమిటంటే ప్రతిరోజు ఒక కొత్త దారి వెంట నడుస్తున్నామని ఆ గొర్రెలకు తెలియదు. చేలు కొత్తవని కానీ, కాలాలు మారాయని కానీ అవి గుర్తించవు. వాటి ఆలోచనలు ఎప్పుడూ మేత, నీళ్ళ చుట్టూనే.

బహుశా మనమంతా అలాగే ఉంటామేమోనని యువకుడు అనుకున్నాడు. నేను కూడా ఆ వ్యాపారి కూతురిని కలిసిన తరువాత ఇక ఏ స్త్రీ గురించీ

ఆలోచించలేదు. సూర్యుడి వైపు చూసి మధ్యాహ్నానికి ముందే టారిఫా చేరుకుంటానని అంచనా వేసుకున్నాడు. అక్కడ తన దగ్గర ఉన్న పుస్తకం తిరిగి ఇచ్చి ఈసారి ఇంకా లావైన పుస్తకం తీసుకోవాలి. ద్రాక్షసవంతో సీసా నింపుకోవాలి. గడ్డం చేయించుకుని, జుత్తు కత్తిరించుకోవాలి. ఆ అమ్మాయితో తన సమావేశానికి సన్నద్ధం కావాలి. తనకంటే ముందే ఇంకా పెద్ద మంద ఉన్న గొర్రెల కాపరి వచ్చి ఆమె చేయిని కోరి ఉండే అవకాశం గురించి అతడు ఆలోచించ దలుచుకోలేదు.

మరోసారి సూర్యుడికేసి చూసి నడక వేగం పెంచుతూ కల నిజమయ్యే అవకాశమే జీవితాన్ని ఆసక్తికరంగా మారుస్తుందని యువకుడు అనుకున్నాడు. టారిఫాలో కలలను వివరించే ఒక వృద్ధురాలు ఉందని ఉన్నట్టుండి అతడికి గుర్తుకు వచ్చింది.

*

ఆ వృద్ధురాలు యువకుడిని తన ఇంటి వెనక గదిలోకి తీసుకెళ్ళింది. ముందుగదికీ ఆ గదికీ మధ్య రంగు పూసల తెర ఉంది. ఆ గదిలో ఒక బల్ల, రెండు కుర్చీలు, క్రీస్తు పవిత్ర హృదయం బొమ్మ ఉన్నాయి.

ఆమె కూర్చుని యువకుడిని కూడా కూర్చోమన్నది. ఆ తరువాత అతడి చేతులను తన చేతులలోకి తీసుకుని నిశ్శబ్దంగా ప్రార్థన చేయసాగింది.

అది ఒక బంజారా ప్రార్థనలాగా అనిపించింది. అప్పటికే యువకుడికి తాను తిరిగిన దారులలో బంజారాలతో అనుభవం ఉంది. వాళ్ళు కూడా ప్రయాణాలు చేస్తారు. కానీ వాళ్ళకు గొర్రెల మందలుండవు. ఇతరులను మోసం చేస్తూ బంజారాలు తమ బతుకును వెళ్ళదీస్తుంటారనీ, వాళ్ళకి దెయ్యాలతో ఒప్పందం ఉందనీ ప్రజలు చెప్పుకుంటుంటారు. వాళ్ళు పిల్లల్ని తమ రహస్య స్థావరాలకు ఎత్తుకెళ్ళి తమ బానిసలుగా చేసుకుంటారని చెబుతారు. బంజారాలు తనను

ఎత్తుకుపోతారన్న భయం తన బాల్యంలో అతడికి ఉండేది. యువకుడి చేతులను ఆమె తన చేతులలోకి తీసుకునేసరికి ఆ చిన్ననాటి భయం అతడిని తిరిగి ఆవరించింది.

అక్కడ ఆమె క్రీస్తు పవిత్ర హృదయం బొమ్మను ఉంచింది అని తనను తాను నెమ్మళించుకునే ప్రయత్నం చేశాడు. తన చేతులు వణికి తాను భయపడుతున్నానన్న సంగతి ఆ వృద్ధురాలికి వెల్లడి కావటం యువకుడికి ఇష్టం లేదు. నిశ్శబ్దంగా 'మా తండ్రీ' అన్న ప్రార్ధనను వల్లె వేయసాగాడు.

ఆమె యువకుడి చేతుల మీదనుంచి దృష్టి మరల్చకుండా చూస్తూ "చాలా ఆసక్తికరంగా ఉంది," అంది. ఆ తరువాత ఆమె మిన్నకుండిపోయింది.

అతడు ఆందోళన చెందసాగాడు. అతడి చేతులు వణకటం ఆమెకు తెలిసింది. అతడు వెంటనే తన చేతులను వెనక్కి లాగేసుకున్నాడు.

"చెయ్యి చూపించుకోటానికి నేను ఇక్కడకు రాలేదు," అతడన్నాడు. అక్కడికి వచ్చినందుకు అప్పటికే అతడు పశ్చాత్తాప పడుతున్నాడు. ఆమెకు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేసి ఏమీ తెలుసుకోకుండా వెళ్ళిపోవటం మంచిదని అతడనుకున్నాడు. మళ్ళీ మళ్ళీ వస్తున్న ఆ కలకు తాను అనవసరంగా ప్రాధాన్యత ఇస్తున్నాడేమో.

"నీ కలల గురించి తెలుసుకుందామని వచ్చావు," ముదుసలి అంది. "కలలు దేవుని భాష. అతడు మన భాషలో గనక మాట్లాడినట్లయితే నీ కలను నేను వివరించగలుగుతాను. అదే ఆత్మ భాషలో మాట్లాడినట్లయితే అది నీ ఒక్కడికే అర్ధమవుతుంది. ఏది ఏమైనా నీకు సమయం ఇచ్చినందుకు నువ్వు నాకు డబ్బు చెల్లించాలి."

ఇంకో మోసం అనుకున్నాడతను. అయినా ఒకసారి చూద్దామని నిర్ణయించుకున్నాడు. గొర్రెలకాపరి ఎప్పుడూ తోడేళ్ళ తోటి, కరువుతోటి దోబూచులాడుతుంటాడు. గొర్రెల కాపరి జీవితాన్ని అదే ఉత్సాహభరితంగా చేస్తుంది.

"అదే కల నాకు రెండుసార్లు వచ్చింది," యువకుడు చెప్పసాగాడు. "ఆ కలలో ఒక మైదానంలో నా గొర్రెలతో ఉన్నాను. అంతలో ఒక అమ్మాయివచ్చి నా గొర్రెలతో ఆడుకోసాగింది. అట్లా చేయడం నాకిష్టం ఉండదు. సాధారణంగా కొత్తవాళ్ళంటే గొర్రెలు భయపడతాయి. కాని పిల్లలు ఎప్పుడూ గొర్రెలను భయపెట్టకుండా వాటితో ఆడుకోగలుగుతారు. అలా ఎందుకు జరుగుతుందో నాకు తెలియదు. మనుషుల వయస్సు జంతువులకి ఎలా తెలుస్తుందో కూడా నాకు తెలియదు."

"నీ కల గురించి ఇంకా చెప్పు," ఆమె అంది, "నేను వెళ్ళి వంట చేసుకోవాలి. నీ దగ్గర ఎక్కువ డబ్బు లేదు కాబట్టి నీకు ఎక్కువ సమయం ఇవ్వలేను."

"చాలా సేపటి వరకు ఆ అమ్మాయి నా గొర్రెలతో ఆడుకుంది," కొంత ఇబ్బంది పడుతూనే యువకుడు కొనసాగించాడు. "ఉన్నట్లుండి ఆ అమ్మాయి నా చేతులను తీసుకుని పిరమిడ్ల వద్దకు చేర్చింది."

ఈజిప్టులో పిరమిడ్లంటే ఆమెకు అర్థమయ్యిందో లేదో తెలుసుకోటానికి అతడు ఒక్కక్షణం ఆగాడు. కానీ ఆమె ఏమీ మాట్లాడలేదు.

"అప్పుడు, ఈజిప్టులోని ఆ పిరమిడ్ల వద్ద" - ఆ వృద్ధురాలికి అర్థం కావాలని చివరి రెండు పదాలు అతడు నిదానంగా పలికాడు – "ఆ అమ్మాయి నాతో ఇలా అంది 'నువ్వు ఇక్కడికి వస్తే నీకు రహస్య నిధి దొరకుతుంది.' అ నిధి ఎక్కడ ఉందో ఆమె చూపించే లోపే నాకు మెలకువ వచ్చేసింది. రెండుసార్లు కూడా అలాగే జరిగింది."

ఆమె కొంచెం సేపు మౌనంగా ఉంది. మళ్ళీ యువకుడి చేతులు తీసుకుని జాగ్రత్తగా చూడసాగింది.

"ఇప్పుడు నీ దగ్గర నేను డబ్బులు ఏమీ తీసుకోను," ఆమె అన్నది, "కాని నీకు నిధి దొరకితే అందులో పదవ వంతు ఇవ్వాలి."

యువకుడు సంతోషం కొద్దీ నవ్వాడు. తనకి రహస్య నిధి గురించి కల వచ్చింది కాబట్టి ఇప్పుడు తన దగ్గర ఉన్న కొద్దిపాటి మొత్తం మిగలబోతోంది!

"సరే, కల గురించి వివరించు," అతడన్నాడు.

"ముందు ఒట్టు వెయ్యి. నేను చెప్పబోయేదానికి బదులుగా నీకు దొరికిన నిధిలో పదవ వంతు ఇస్తానని ఒట్టు వెయ్యి."

అలాగే చేస్తానని గొర్రెల కాపరి ఒట్టు వేశాడు. క్రీస్తు పవిత్ర హృదయం బొమ్మ చూస్తూ మరొక్కసారి ఒట్టు వెయ్యమని ఆ వృద్ధురాలు అడిగింది.

"ఇది ప్రపంచ భాషలోని కల," ఆమె అన్నది. "నేను దానిని వివరించగలను, కానీ ఇది చాలా కష్టమయినది. అందుకే నీకు దొరికే నిధిలో ఒక భాగం పొందే అర్హత నాకు ఉందని భావిస్తున్నాను.

"నా వివరణ ఇది: ఈజిప్టులోని పిరమిడ్ల వద్దకు నువ్వు వెళ్ళాలి. వాటి గురించి ఇప్పటివరకు నేను విని ఉండలేదు. కాని ఒక అమ్మాయి గనుక నీకు వాటిని చూపించి ఉంటే అవి తప్పక ఉండి ఉంటాయి. నిన్ను ధనికుడిని చేసే నిధి అక్కడ నీకు దొరుకుతుంది."

యువకుడికి మొదట ఆశ్చర్యమేసింది, తరువాత చికాకు కలిగింది. ఇది తెలుసుకోటానికి అతడు ఆమె దగ్గరకు రావలసిన పనిలేదు! అయితే ఇప్పుడు ఆమెకు ఏమీ ఇవ్వనవసరం లేదన్నది గుర్తుకు వచ్చింది.

"ఈ మాత్రం దానికోసం నా సమయాన్ని వృధా చేసుకోవలసిన పనిలేదు," అతడన్నాడు.

"నీ కల చాల కష్టమయినదని నేను ముందే చెప్పాను. జీవితంలో అత్యంత సామాన్యమైనవే ఎంతో అసాధారణమైనవి అవుతాయి. ఎంతో జ్ఞానులకే అవి అర్థమవుతాయి. నేను అంత తెలివైనదానిని కాదు కాబట్టి చేయి చూడటం వంటి ఇతర కళలు నేర్చుకోవలసి వచ్చింది."

"సరే, నేను ఈజిప్టుకి ఎలా చేరుకోవాలి?"

"నేను కలను వివరిస్తానంతే. వాటిని నిజం ఎలా చెయ్యాలో నాకు తెలియదు. అందుకే నేను నా కూతుళ్ళు ఇచ్చిన దానిపై ఆధారపడి బతుకుతున్నాను."

"నేను ఈజిప్టుకి ఎప్పటికీ చేరుకోకపోతే?"

"నాకు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. అలా జరగటం ఇది మొదటి సారి కాదు."

అప్పటికే అతడికి ఎక్కువ సమయం కేటాయించానంటూ ఆ ముదుసలి ఇక అతడిని వెళ్ళమంది.

దాంతో యువకుడు చాలా నిరుత్సాహపడ్డాడు. ఇక ఎప్పుడూ కలలను నమ్మగూడదని నిర్ణయించుకున్నాడు. తాను పూర్తిచేయవలసిన పనులు చాలా ఉన్నాయని అతడికి గుర్తుకు వచ్చింది. ముందుగా బజారులోకి వెళ్ళి కొంచెం తిన్నాడు. తన దగ్గర ఉన్న పుస్తకమిచ్చి ఇంకొక పుస్తకం తీసుకున్నాడు. బజారులో ఒక బల్లమీద కూర్చుని అతడు కొత్తగా కొన్న ద్రాక్షసవాన్ని రుచి చూశాడు. ఎండ చాలా తీవ్రంగా ఉండి, మద్యం అతడిలో ఎంతో ఉత్తేజాన్ని తిరిగి నింపింది. నగర దర్వాజా దగ్గర తన మిత్రుడి కొట్టంలో యువకుడు తన గొర్రెలను

ఉంచాడు. అతడికి ఈ నగరంలో చాలామంది తెలుసు. ప్రయాణాలు చేయటంలో ఇది అతడికి ఎంతో నచ్చేది – యువకుడు ఎప్పుడూ కొత్త మిత్రులను పరిచయం చేసుకుంటూ ఉండేవాడు; పైగా ఎప్పుడూ వాళ్ళతోనే ఉండాల్సిన అవసరం లేదు. తను చేరిన మత పాఠశాలలోలాగా ఒక వ్యక్తిని ఇంకొకరు ప్రతిరోజు చూస్తూ ఉంటే, ఆ వ్యక్తి వాళ్ళ జీవితంలో భాగమైపోతారు. ఆ తరువాత ఆ వ్యక్తి మారాలని వాళ్ళు కోరుకుంటారు. తాము కోరుకున్నట్లు ఇతరులు ఉండకపోయినట్లయితే వాళ్ళకి కోపం వస్తుంది. ఎదుటి వాళ్ళు వాళ్ళ జీవితాలను ఎలా జీవించాలో ప్రతి ఒక్కరికి స్పష్టంగా తెలుస్తుంది. కానీ తమ జీవితాలకి వచ్చేసరికే ఎవరికీ ఎటువంటి ఆలోచనా ఉండదు.

సూర్యుడు పడమటి వైపు ఇంకొంచెం కుంగే వరకు వేచి ఉండి అప్పుడు గొర్రెలను మైదానంలోకి తోలుకుని వెళదామనుకున్నాడు. ఇంకా మూడు రోజులలో అతడు వ్యాపారి కూతురును కలవబోతున్నాడు.

యువకుడు తాను తెచ్చుకున్న పుస్తకాన్ని చదవసాగాడు. మొదటి పేజీలోనే ఒక అంత్యక్రియ గురించి ఉంది. అందులో ఉన్న పాత్రల పేర్లు ఉచ్ఛరించడానికి చాలా కష్టంగా ఉన్నాయి. తానే గనుక పుస్తకం రాస్తే ఒకసారి ఒక పాత్రను మాత్రమే పరిచయం చేస్తానని అనుకున్నాడు. అప్పుడు ఒకేసారి ఎక్కువ పేర్లను గుర్తు పెట్టుకోవాల్సిన సమస్య పాఠకులకు ఉండదు.

తాను చదువుతున్న దాని మీద దృష్టి కేంద్రీకరించగలిగే సరికి అతడికి ఆ పుస్తకం నచ్చసాగింది. మంచుకురుస్తున్న రోజున అంత్యక్రియలు జరుగుతున్నాయి. చల్లగా ఉండటమన్న భావన అతడికి నచ్చింది. యువకుడు పుస్తకం చదువుతుండగా ఒక వృద్ధుడు అతని పక్కకి వచ్చి కూర్చుని మాటలు కలపటానికి ప్రయత్నించసాగాడు.

బజారులో ఉన్న మనుషుల వైపు చూపిస్తూ "వాళ్ళు ఏం చేస్తున్నారు?" అని ఆ వృద్ధుడు అడిగాడు.

"పని చేస్తున్నారు," తనను చదువుకోనివ్వమని అర్థం వచ్చేలా పొడిపొడిగా సమాధానం ఇచ్చాడు.

వాస్తవానికి అతడు వ్యాపారి కూతురి ఎదుట తన గొర్రెల ఉన్ని కత్తిరిస్తూ ఉన్నట్టు ఊహించుకుంటున్నాడు. తాను ఎంత పనిమంతుడో ఆమెకు తెలుస్తుంది. ఆ దృశ్యాన్ని ఈ పాటికే అతడు ఎన్నోసార్లు ఊహించుకున్నాడు. గొర్రెలకు ఉన్నిని వెనక నుంచి ముందుకు కత్తిరించాలని వివరించినప్పుడు ఆమె ప్రతిసారీ ఆశ్చర్యపడేది. గొర్రెలకు ఉన్ని కత్తిరిస్తూ ఆమెకు చెప్పటానికి మంచి కథలను గుర్తుకు తెచ్చుకోసాగాడు. వాటిల్లో చాలా వరకు అతడు పుస్తకాల్లో చదివినవే. కాని అవి అతని స్వంత అనుభవాలని చెబుతాడు. ఆమెకు చదవటం రాదు కాబట్టి నిజం తెలిసే అవకాశమే లేదు.

వృద్ధుడు పట్టువదలకుండా మాటలు కలపటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. తాను అలసిపోయి, దాహంగా ఉన్నానని మద్యం ఒక గుక్కతాగనివ్వమని వృద్ధుడు అడిగాడు. తనను ఇకనైనా ఒంటరిగా వదిలి పెడతాడన్న ఆశతో యువకుడు తన ద్రాక్షసవం సీసా ఇచ్చాడు.

కాని వృద్ధుడికి మాట్లాడాలని ఉంది, ఏం పుస్తకం చదువుతున్నావని అడిగాడు. ఒక క్షణం పాటు దురుసుగా బదులిచ్చి వేరొక బల్లమీదకి వెళదామనుకున్నాడు. కాని పెద్దల పట్ల గౌరవంతో మెలగాలని అతని తండ్రి నేర్పించాడు. దాంతో యువకుడు తను చదువుతున్న పుస్తకాన్ని వృద్ధుడికి అందించాడు. దానికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది ఆ పుస్తకం పేరు ఎలా ఉచ్చరించాలో అతడికి ఖచ్చితంగా తెలియదు; రెండవది వృద్ధుడికి చదవటం రాకపోతే సిగ్గుపడి అతడే వేరే బల్లమీదకి వెళ్ళిపోతాడు.

అదేదో వింత వస్తువు అయినట్లు వృద్ధుడు పుస్తకాన్ని అన్ని వైపులా చూసి "ఊ! ఈ పుస్తకం చాలా ముఖ్యమయినదే. కాని ఇది చికాకు కలిగిస్తుంది."

ఆశ్చర్యపడటం అతని వంతు అయ్యింది. వృద్ధుడికి చదవటం వచ్చు, అంతేకాక ఆపాటికే అతను ఆ పుస్తకం చదివి ఉన్నాడు. వృద్ధుడు చెప్పినట్లు ఆ పుస్తకం చికాకు కలిగించేదే అయితే దానిని ఇచ్చేసి ఇంకొకటి తెచ్చుకోటానికి ఇంకా సమయం ఉంది.

"ప్రపంచంలోని అన్ని పుస్తకాలు చెప్పేదే ఈ పుస్తకం కూడా చెబుతుంది," వృద్ధుడు చెప్పుకుంటూపోతున్నాడు. "వ్యక్తులు తమ జీవిత గమ్యాలను ఎంచుకోలేక పోవటాన్ని అది వివరిస్తుంది. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద అబద్ధాన్ని అందరూ నమ్ముతున్నారంటూ ఆ పుస్తకం ముగుస్తుంది."

"ప్రపంచంలోకెల్లా అతి పెద్ద అబద్ధం ఏమిటి?" ఆశ్చర్యపడుతూ యువకుడు అడిగాడు.

"ప్రపంచంలోకెల్లా అతి పెద్ద అబద్ధం ఇది: మన జీవితంలో ఏదో ఒక సమయంలో మనకి జరిగే వాటిపై నియంత్రణ కోల్పోయి మన జీవితాలు కర్మతో శాసింపబడతాయనుకోవటం."

"అలా నాకెన్నడూ జరగలేదు," అతడు అన్నాడు. "నేను మత గురువుని అవ్వాలని కోరుకున్నారు. కాని నేను గొర్రెల కాపరిని కావాలని నిర్ణయించుకున్నాను."

"నీకు ప్రయాణాలు చెయ్యటమంటే నిజంగా ఇష్టం కాబట్టి చాలా మంచి పని చేశావు," వృద్ధుడు అన్నాడు.

'నేను ఏమి ఆలోచిస్తున్నానో అతడికి తెలిసింది,' యువకుడు తనలో తాను అనుకున్నాడు. పుస్తకం తిరిగి ఇచ్చే ఉద్దేశం లేనట్టుగా ఆ వృద్ధుడు దాని పేజీలు

తిప్పుతూ చూస్తున్నాడు. వృద్ధుడు వేసుకున్న బట్టలు కొత్తగా ఉండటాన్ని యువకుడు గమనించాడు. అతడు అరబ్బులాగా కనిపించాడు. ఈ ప్రాంతంలో అరబ్బులు కనపడటం అంత వింతేమి కాదు. టారిఫా నుంచి ఆఫ్రికా కొన్ని గంటల దూరంలోనే ఉంది; సన్నటి జలసంధులను పడవలో దాటితే చాలు. వస్తువులు కొనుగోలు చేస్తూ, రోజులో పలుమార్లు తమ వింతైన ప్రార్థనలు వల్లిస్తూ అరబ్బులు ఈ నగరంలో తరచు కనపడుతుండేవారు.

"నువ్వు ఎక్కడినుంచి వచ్చావు?" యువకుడు అడిగాడు.

"అనేక చోట్ల నుంచి."

"అనేక చోట్ల నుంచి ఎవరూ రారు," యువకుడు అన్నాడు. "నేను గొర్రెల కాపరిని, నేను అనేక ప్రాంతాలకు వెళ్ళాను. కానీ నేను ఒక్క ప్రాంతం నుంచే వచ్చాను. అది పురాతనమైన కోట దగ్గర ఉన్న నగరం. నేను అక్కడే పుట్టాను."

"అలా అయితే నేను సాలెంలో పుట్టానని చెప్పవచ్చు."

సాలెం ఎక్కడ ఉందో అతడికి తెలియదు. తన తెలియనితనం బయట పడుతుందని అది ఎక్కడ ఉందని అడగలేదు. కాసేపు బజారులోని మనుషులకేసి చూశాడు; వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళు అందరూ ఎంతో హడావుడిగా ఉన్నట్లున్నారు.

"అయితే సాలెం ఎలా ఉంటుంది?" ఏమైనా ఆధారం దొరుకుతుందేమోనని యువకుడు అడిగాడు.

"అది ఎప్పుడూ ఉన్నట్లుగానే ఉంది."

ఇంకా ఏ ఆధారమూ దొరకలేదు. సాలెం యాండలూసియాలో మాత్రం లేదని యువకుడికి తెలుసు. ఉన్నట్లయితే దాని గురించి విని ఉండేవాడే.

"నువ్వు సాలెంలో ఏం చేస్తావు?" యువకుడు మళ్ళీ అడిగాడు.

"నేను సాలెంలో ఏం చేస్తానా?" వృద్ధుడు నవ్వాడు. "నేను సాలెం రాజుని!"

మనుషులు వింతైన సంగతులు చెబుతారని యువకుడు అనుకున్నాడు. ఏమీ చెప్పని గొర్రెలతో ఉండటం మంచిదని కొన్నిసార్లు అనిపిస్తుంది. పుస్తకంతో ఒంటరిగా గడపటం ఇంకా మంచిది. మనం వినాలనుకున్నప్పుడు అవి నమ్మశక్యంకాని తమ కథలు చెబుతాయి. కానీ మనుషులతో మాట్లాడుతున్నప్పుడు వాళ్ళు చెప్పే వింతైన విషయాలతో ఆ తరువాత సంభాషణ ఎలా కొనసాగించాలో తెలియదు.

"నా పేరు మెల్చిజెడెక్," వృద్ధుడు చెప్పాడు. "నీ వద్ద ఎన్ని గొర్రెలు ఉన్నాయి?"

"చాలినన్ని," అని బదులిచ్చాడు. తన జీవితం గురించి వృద్ధుడు మరింతగా తెలుసుకోవాలనుకుంటున్నాడని అతనికి అర్థమయ్యింది.

"అయితే మనముందు సమస్య ఉందన్నమాట. నీకు చాలినన్ని గొర్రెలున్నాయనిపిస్తే నేను సహాయం చేయలేను."

అతడికి చిరచిరలాడసాగింది. తాను ఎవరినీ సహాయం అడగలేదు. వృద్ధుడు తనని ఒక గుక్క ద్రాక్షాసవం అడిగి సంభాషణ మొదలు పెట్టాడు.

"నా పుస్తకం నాకనివ్వు," యువకుడు అన్నాడు, "నేను వెళ్ళి గొర్రెలను తీసుకుని ప్రయాణమవ్వాలి."

"నీ గొర్రెలలో పదవ వంతు నాకివ్వు," వృద్ధుడు అన్నాడు, "రహస్య నిధిని ఎలా కనుక్కోవాలో నేను చెబుతాను."

అతడికి తన కల గుర్తుకు వచ్చింది. మరుక్షణం యువకుడికి అంతా స్పష్టంగా గోచరించింది. ఆ ముదుసలి తన దగ్గర నుంచి డబ్బులేమి తీసుకోలేదు. కానీ ఈ వృద్ధుడు - బహుశా ఆమె భర్త అయ్యి ఉండవచ్చు - అసలు లేని దాని

గురించి సమాచారం ఇచ్చి తన నుంచి మరింత డబ్బు రాబట్టాలని చూస్తున్నాడు. ఈ వృద్ధుడు కూడా బంజారా అయి ఉండవచ్చు.

కానీ అతడు ఏమీ అనకముందే ఆ వృద్ధుడు ముందుకు వంగి ఒక కర్ర పుల్ల తీసుకుని నేల మీద ఇసుకలో రాయసాగాడు. అతడి ఛాతీనుంచి ఏదో అద్భుతమయిన కాంతి వెలువడి యువకుడి కళ్ళు క్షణంపాటు బైర్లుకమ్మాయి. తన వయసుకి చాలా వేగంగా కదలి వృద్ధుడు తన ఛాతీని చొక్కాతో కప్పేశాడు. తన కళ్ళు మామూలుగా అయిన తరువాత వృద్ధుడు ఇసుకలో రాసిందేదో యువకుడు చదవగలిగాడు.

అక్కడ బజారులోని ఇసుకలో యువకుడు తన తల్లిదండ్రుల పేర్లు, తాను వెళ్ళిన మత పాఠశాల పేరు చదివాడు. తనకే తెలియని వ్యాపారి కూతురు పేరు చదివాడు. అతడు ఇప్పటివరకు ఎవరికీ చెప్పని విషయాలను చదివాడు.

*

"నేను సాలెం రాజుని," వృద్ధుడు చెప్పాడు.

"ఒక రాజు ఒక గొర్రెల కాపరితో ఎందుకు మాట్లాడతాడు?" కొంత ఆరాధనతోనూ, కొంత ఇబ్బందిగానూ యువకుడు అడిగాడు.

"చాలా కారణాలు ఉన్నాయి. కాని అన్నిటిలోకి ముఖ్యమయినది నువ్వు నీ జీవిత గమ్యాన్ని కనుగొనటంలో విజయవంతం అయ్యావు."

ఒక వ్యక్తి 'జీవిత గమ్యం' అంటే ఏమిటో ఆ యువకుడికి తెలియదు.

"నువ్వెప్పుడూ సాధించాలని అనుకుంటున్నదే నీ జీవిత గమ్యం, బాల్యంలో అందరికీ తమ జీవిత గమ్యం ఏమిటో తెలుస్తుంది.

"ఆ వయస్సులో అంతా స్పష్టంగా ఉంటుంది, అన్నీ సాధ్యమే అనిపిస్తాయి. వాళ్ళు కలలు కనటానికి భయపడరు, తమ జీవితంలో కావాలనుకున్న దానికోసం

ఆశతో ఎదురు చూస్తూంటారు. కానీ కాలం గడుస్తున్నకొద్దీ తమ జీవిత గమ్యాన్ని సాధించుకోవటం అసాధ్యమని వాళ్ళు నమ్మేలా ఒక వింత శక్తి ఏదో చేస్తుంది."

ఆ వృద్ధుడు చెబుతున్నదేదీ యువకుడికి అర్థం కాలేదు. కానీ ఆ 'వింత శక్తి' ఏమిటో తెలుసుకోవాలని అతడికి ఉంది; దాని గురించి చెప్పినప్పుడు వ్యాపారి కూతురు తన మాటలకు ప్రభావితం అవుతుంది!

"అది నకారాత్మకమనిపించే శక్తి, కానీ వాస్తవంగా అది నీ జీవిత గమ్యాన్ని ఎలా సాధించుకోవాలో చూపిస్తుంది. అది నీ ఆత్మను, మనోభీష్టాన్ని సంసిద్ధం చేస్తుంది. ఎందుకంటే ఈ పుడమిపైన ఒకే ఒక గొప్ప సత్యం ఉంది: నువ్వు ఎవరివైనా, ఏమి చేస్తున్నా నీకు నిజంగా ఏదైనా కావాలనిపించిందంటే ఆ కోరిక విశ్వాత్మలో పుట్టింది. ఈ భూమిపైన నీ కర్తవ్యం అదే."

"అది కేవలం ప్రయాణం చేయాలనుకోవటం కావచ్చా? లేదా ఒక వస్త్ర వ్యాపారి కూతురిని పెళ్ళి చేసుకోవాలనుకోవటం కావచ్చా?"

"కావచ్చు. లేదా నిధికోసం వెతకటం కూడా కావచ్చు. ఈ విశ్వఆత్మ ప్రజల సంతోషం నుంచి బలాన్ని పొందుతుంది. దుఃఖం, ఈర్ష్య, అసూయల నుంచి కూడా. ఎవరి జీవిత గమ్యాన్ని వారు సాధించటమే వారి తప్పనిసరి కర్తవ్యం. అన్నీ ఒక్కటే.

"నీకు ఏదైనా కావాలనిపించినప్పుడు నువ్వు దానిని సాధించటంలో సహాయపడటానికి ఈ ప్రపంచమంతా కుట్ర పన్నుతుంది."

బజారుని, పట్టణ వాసులని చూస్తూ వాళ్ళు కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు. ముందుగా వృద్ధుడు మాట్లాడాడు.

"నువ్వు గొర్రెల మందని ఎందుకు కాస్తున్నావు?"

"నాకు ప్రయాణాలు చేయటమంటే ఇష్టం."

బజారులో ఒక మూల తన దుకాణంలో కూర్చుని ఉన్న రొట్టెలు తయారు చేసే వ్యక్తిని ఆ వృద్ధుడు చూపించాడు. “అతడు కూడా తన బాల్యంలో ప్రయాణాలు చెయ్యాలనుకున్నాడు. కాని ముందుగా రొట్టెల దుకాణం పెట్టి కొంత డబ్బు సంపాదించాలని అనుకున్నాడు. అతడు ముసలివాడైన తరువాత ఆఫ్రికాలో ఒక నెల గడిపి వద్దామనుకుంటున్నాడు. తాము కలగన్న దానిని జీవితంలో ఎప్పుడైనా సాధించే సామర్థ్యం మనుషులకు ఉంటుందని అతడు గుర్తించలేదు.”

"అతడు గొర్రెలకాపరి అయి ఉండాల్సింది,” యువకుడు అన్నాడు.

"దాని గురించి కూడా అతడు ఆలోచించాడు,” వృద్ధుడు చెప్పాడు. “కాని గొర్రెల కాపరులకంటే రొట్టెలు తయారు చేసే వాళ్ళకి గౌరవమెక్కువ. రొట్టెలు తయారు చేసేవాళ్ళకి ఇల్లు ఉంటుంది. కానీ గొర్రెల కాపరులు మైదానంలో నిద్రపోతుంటారు. తల్లిదండ్రులు తమ కూతుళ్ళను గొర్రెల కాపరులకంటే రొట్టెలు చేసే వాళ్ళకి ఇచ్చి పెళ్ళి చెయ్యటానికే ఇష్టపడతారు.”

వ్యాపారి కూతురు గురించి ఆలోచిస్తూ యువకుడి గుండె భారమయ్యింది. ఆ పట్టణంలో తప్పనిసరిగా రొట్టెలు తయారు చేసేవాడు ఒకడు ఉండి ఉంటాడు.

వృద్ధుడు ఇంకా చెపుతూ పోసాగాడు, “చివరికి మనుషులు తమ జీవిత గమ్యం కంటే గొర్రెల కాపరుల గురించీ, రొట్టెలు తయారు చేసే వాళ్ళ గురించీ ఇతరులు ఏమి అనుకుంటారో అన్నదానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు.”

వృద్ధుడు పుస్తకం తిరగేస్తూ మధ్యలో ఒక పేజీ చదవటం మొదలు పెట్టాడు. యువకుడు కాసేపు వేచి ఉండి అతడు తనకు అంతరాయం కలిగించినట్లే తాను అతడికి అడ్డు పడుతూ "ఇదంతా నాకు ఎందుకు చెబుతున్నావు?” అని అడిగాడు.

"ఎందుకంటే నువ్వు నీ జీవిత గమ్యాన్ని సాధించటానికి ప్రయత్నిస్తున్నావు. కానీ దానినంతటిని ప్రస్తుతం వదిలి పెట్టే స్థితిలో ఉన్నావు.”

"నువ్వు ఇటువంటి పరిస్థితుల్లో ఎప్పుడూ  ఏదో ఒక రూపంలో ప్రత్యక్షమౌతుంటావా?"

"అన్నిసార్లూ ఇలాగే కాదు. కానీ ఎప్పుడూ నేను ఏదో ఒక రూపంలో ప్రత్యక్షమౌతూనే ఉంటాను. కొన్నిసార్లు నేను ఒక మంచి ఆలోచన, ఒక పరిష్కారం రూపంలో వస్తుంటాను. ఇంకొన్నిసార్లు – చాలా కీలకమైన సమయాల్లో – కొన్ని తేలికగా జరిగేలా చేస్తాను. నేను ఇంకా ఎన్నో చేస్తాను. కాని చాలాసార్లు వాటిని నేనే చేశానని మనుషులు గుర్తించరు."

వారం రోజుల క్రితం విలువైన రాళ్ళ అన్వేషకుడి ముందు తాను ఒక రాయి రూపం తీసుకోక తప్పింది కాదని ఆ వృద్ధుడు చెప్పాడు. పచ్చరాళ్ళ అన్వేషణలో అతను తనకున్నదంతా త్యజించాడు. అతడు ఒక నదీ తీరాన  ఈ అన్వేషణలో అయిదు సంవత్సరాలు గడిపాడు. పచ్చరాళ్ళ కోసం కొన్ని వేల రాళ్ళను వెతికాడు. ఇంకొక్కరాయిని – ఒకే ఒక్క రాయిని – వెతికితే సాఫల్యం పొందే సమయంలో అతడు ఆ అన్వేషణను వదిలి పెట్టేయాలనుకున్నాడు. తన జీవిత గమ్యం కోసం అతడు సర్వం త్యాగం చేశాడు. కాబట్టి జోక్యం చేసుకోవాలని ఆ వృద్ధుడు నిర్ణయించుకున్నాడు. అతడు ఒక రాయిగా మారి అన్వేషకుడి కాలి దగ్గరకు దొర్లుకుంటూ వెళ్ళాడు. అయిదు సంవత్సరాల వృధా శ్రమ, ప్రయాసలకు ఆ అన్వేషకుడు విసుగు, కోపం చెంది ఆ రాయిని తీసి అవతలికి విసిరేశాడు. ఆ రాయిని ఎంత బలంగా విసిరాడంటే ఆ దెబ్బకు రాయి ముక్కలయ్యి  దాంట్లోంచి ప్రపంచంలోకెల్లా అందమయిన పచ్చరాయి బయట పడింది.

"తమ ఉనికికి గల కారణాన్ని కొంతమంది జీవితంలో చాలా తొందరగా తెలుసుకుంటారు," అన్నాడు ఆ వృద్ధుడు. అతని గొంతులో బాధ. "అందుకేనేమో చాలా తొందరగా కూడా దానిని వదులుకుంటారు. జీవితం అలా ఉంది."

రహస్య నిధి గురించి ఏదో చెప్పాడన్న విషయాన్ని వృద్ధుడికి యువకుడు గుర్తుచేశాడు.

"ప్రవహించే నీటి శక్తికి నిధి బయటపడుతుంది, అదే తరంగాలకు అది కప్పబడిపోతుంది కూడా," అన్నాడు వృద్ధుడు. "నీ నిధి గురించి తెలుసుకోవాలని ఉంటే నీ మందలోని పదవవంతు నాకివ్వాలి."

"నాకు దొరికే నిధిలో పదవ వంతు ఇస్తాను, సరేనా?"

వృద్ధుడు నిరాశపడినట్లు కనిపించాడు. "నీకు లేని దాని గురించి వాగ్దానాలు చేయటంతో మొదలు పెట్టావంటే దానిని సాధించాలన్న కోరికను నువ్వు కోల్పోతావు."

బంజారా ముదుసలికి తన నిధిలో పదవ వంతు ఇస్తానని మాటిచ్చిన సంగతి యువకుడు వృద్ధుడితో చెప్పాడు.

"మనుషులతో ఇటువంటి పనులు చేయించటంలో బంజారాలు తెలివైన వాళ్ళు," ఆ వృద్ధుడు నిట్టూర్చాడు. "ఏది ఏమైనా జీవితంలో ప్రతి దానికి ఒక వెల ఉంటుందని నువ్వు తెలుసుకుంటావు, అంతే చాలు. ఈ విషయాన్నే తెలియచేయటానికి కాంతి యోధులు ప్రయత్నిస్తుంటారు."

ముసలి వ్యక్తి పుస్తకాన్ని యువకుడికి తిరిగి ఇచ్చాడు.

"రేపు ఇదే సమయానికి నీ మందలో పదవ వంతు తీసుకుని రా. రహస్య నిధి ఎలా కనుక్కోవాలో నీకు చెబుతాను. మంచిది."

బజారు మలుపు తిరిగి అతడు మాయమైపోయాడు.

*

యువకుడు తిరిగి పుస్తకం చదవటం మొదలు పెట్టాడు కానీ అతడికి ఏకాగ్రత కుదరలేదు. వృద్ధుడు చెప్పింది నిజమేనని అతనికి తెలుసు కాబట్టి అతడు ఒత్తిడికీ, ఉద్వేగానికీ లోనయ్యాడు. రొట్టెలు అమ్మే వ్యక్తి దగ్గరకు వెళ్ళి ఒక రొట్టె కొనుక్కున్నాడు. అతడి గురించి వృద్ధుడు చెప్పింది అతడికి చెపుదామా వద్దా అన్న మీమాంసలో ఉన్నాడు. ఒక్కొక్కసారి కొన్ని విషయాలను అలా వదిలెయ్యటమే మంచిదనుకుని ఏమీ చెప్పగూడదని నిర్ణయించుకున్నాడు. అతడు ఏమైనా చెబితే రొట్టెలు చేసే వ్యక్తి తన జీవితానికి బాగా అలవాటు పడిపోయినప్పటికీ అన్నిటినీ వదిలిపెట్టాలన్న ఆలోచనలో కొన్ని రోజులు గడుపుతాడు. అతడిలో ఆ ఆందోళనను కలిగించకుండా ఉండగలిగాడు యువకుడు. ఆ తరువాత యువకుడు వీధులలో తిరుగుతూ నగర ద్వారాన్ని చేరుకున్నాడు. ఒక కిటికీ ఉన్న చిన్న భవనం అక్కడ ఉంది. అక్కడ కొంతమంది ఆఫ్రికాకి టిక్కెట్టు కొనుక్కుంటున్నారు. ఈజిప్టు ఆఫ్రికాలో ఉందన్న సంగతి అతడికి తెలుసు.

"నీకేమైనా సహాయపడగలనా?" కిటికీ వెనకనున్న వ్యక్తి అతనిని అడిగాడు.

"రేపు చూద్దాంలే," అంటూ యువకుడు అక్కడినుంచి వచ్చేశాడు. ఒక గొర్రెను అమ్మితే చాలు జల సంధి ఆవలివైపు వెళ్ళటానికి డబ్బులు సరిపోతాయి. ఆ ఆలోచనే అతడిని భయభ్రాంతుడిని చేసింది.

వెళ్ళిపోతున్న యువకుడిని చూసి "మరో స్వాప్నికుడు," టిక్కెట్ల అమ్మే వ్యక్తి తన సహాయకునితో అంటున్నాడు. "అతడి దగ్గర ప్రయాణానికి సరిపోను డబ్బులు లేవు."

టిక్కెట్లు అమ్మే కిటికీ దగ్గర నుంచుని ఉన్నప్పుడు యువకుడికి తన గొర్రెల మంద గుర్తుకు వచ్చింది. ఆ సమయంలో అతడు గొర్రెల కాపరిగా ఉండాలనే నిర్ణయం తీసుకున్నాడు. రెండేళ్ళలో గొర్రెలను పెంచటానికి సంబంధించిన

మెలకువలన్నీ అతడు నేర్చుకున్నాడు: గొర్రెల ఉన్ని ఎలా కత్తిరించాలో తెలుసు; చూడితో ఉన్న గొర్రెలను ఎలా చూసుకోవాలో తెలుసు; గొర్రెలను తోడేళ్ళ బారినుండి ఎలా కాపాడుకోవాలో తెలుసు. యాండలూసియాలోని మైదానాలు, పచ్చిక బీళ్ళన్నీ అతడికి తెలుసు. తన దగ్గర ఉన్న ప్రతి ఒక్క గొర్రె ఎంత ధర పలుకుతుందో కూడా అతడికి తెలుసు.

తన మిత్రుని కొట్టానికి సాధ్యమైనంత చుట్టూతిరిగి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. కొట్టం పక్కగా నడిచి వెళుతూ అతడు దారి మళ్ళి గోడపైకి తీసుకెళ్ళే రాతి చప్టాను ఎక్కాడు. అక్కడినుంచి యువకుడు దూరంగా ఉన్న ఆఫ్రికాని చూడగలిగాడు. స్పెయిన్ మొత్తాన్ని ఆక్రమించటానికి మూర్‌లు అక్కడినుంచే వచ్చారని ఎవరో అతనికి చెప్పారు.

ఆ చోటునుంచి వృద్ధుడితో తాను మాట్లాడిన బజారుతో సహా నగరమంతా యువకుడికి కనబడుతోంది. ఆ వృద్ధుడిని కలుసుకున్న క్షణాలకు అతడు శాపనార్థాలు పెట్టాడు. తన కలలను వివరించగల ఆమెను వెతుక్కుంటూ అతడు ఈ నగరానికి వచ్చాడు. అతడు గొర్రెలకాపరి అన్న విషయం ఆ బంజారా వృద్ధురాలిని గానీ, లేదా ఆ వృద్ధుడి గానీ ఏమాత్రం ప్రభావితం చెయ్యలేదు. వాళ్ళు ఒంటరి జీవులు, ఏ విషయం పట్లా వారికి నమ్మకం ఉండదు. అంతేకాక గొర్రెలకాపరులకి తమ గొర్రెలతో అనుబంధం ఏర్పడుతుందన్నది వాళ్ళకి అర్థంకాదు. అతడికి తన మందలోని ప్రతి ఒక్క గొర్రె గురించి అన్ని సంగతులూ తెలుసు. ఏది కుంటిదో, ఏది రెండు నెలల్లో ఈనబోతోందో, ఏది అన్నిటిలోకి నిదానమైనదో తెలుసు. వాటి ఉన్నిని కత్తిరించటమేకాదు, వాటిని ఎలా చంపాలో కూడా అతడికి తెలుసు. అతడు గనక వాటిని వదిలిపెట్టాలని నిర్ణయించుకుంటే అవి ఎంతో బాధపడుతాయి.

గాలి తీవ్రం కాసాగింది. ఆ గాలి అతడికి తెలుసు: ప్రజలు దానిని 'లెవాంటర్' అని అంటారు ; ఎందుకంటే మధ్యధరా సముద్రం తూర్పు అంచున ఉన్న లెవాంట్ మీదుగా మూర్‌లు ఆ గాలిమీద వచ్చారు.

గాలి తీవ్రత పెరగసాగింది. అటు గొర్రెలు, ఇటు నిధి మధ్య నేనున్నాను అనుకున్నాడు ఆ యువకుడు. తాను అలవాటు పడినదానికీ, తాను కోరుకునే దానికీ మధ్య ఒకదానిని ఇప్పుడు అతడు ఎంచుకోవాలి. వ్యాపారి కూతురు కూడా ఉంది. కానీ ఆమె తన మంద అంత ముఖ్యమయినది కాదు. ఎందుకంటే ఆమె తన మీద ఆధారపడిలేదు. బహుశా ఆమెకు తాను గుర్తుకూడా ఉండకపోవచ్చు. అతడు ఏ రోజున వస్తాడన్నది కూడా ఆమెకు అంత ముఖ్యమయినది కాదని అతడికి తెలుసు: ఎందుకంటే ఆమెకు ప్రతిరోజూ ఒకేలాంటిది. మనుషులు ప్రతి సూర్యోదయంలోనూ తమకు జరుగుతున్న మంచిని గుర్తించకపోవటం వల్ల ప్రతిరోజూ మాదిరిగానే మరుసటి రోజు ఉంటుంది.

నా తల్లిదండ్రులనూ, పుట్టిన ఊరునూ విడిచివచ్చాను. నేను లేకపోవటానికి వాళ్ళు అలవాటు పడ్డారు, అలాగే నేనూను. నేను లేకపోవటానికి గొర్రెలు కూడా అలవాటు పడతాయి అనుకున్నాడు యువకుడు.

తాను కూర్చున్న చోటునుంచి అతడు బజారుని చూడగలుగుతున్నాడు. రొట్టెలు అమ్మే వ్యక్తి దుకాణానికి ప్రజలు వస్తూపోతున్నారు. ముసలి వ్యక్తి, తాను కూర్చుని మాట్లాడుకున్న బల్లమీద ఒక యువ జంట కూర్చుని ఉంది, వారు ముద్దులాడుకుంటున్నారు.

'ఆ రొట్టెలు అమ్మేవ్యక్తి....' తనలో తాను అనుకుంటూ ఆ ఆలోచనని సగంలోనే ఆపేశాడు. తూర్పుగాలి మరింత వేగం పెరిగి దాని తాకిడి అతని ముఖం మీద తెలుస్తోంది. ఆ గాలి మూర్‌లను తెచ్చింది నిజమే, కాని అది ఎడారి వాసనలను, మేలి ముసుగుల మహిళల తలపులను కూడా తెచ్చింది.

అప్రకటితమైన వాటికోసం, బంగారంకోసం, సాహసాల కోసం - పిరమిడ్ల కోసం అన్వేషణలో బయలుదేరిన పురుషుల కలలను కూడా ఆ గాలి మోసుకొచ్చింది. గాలికున్న స్వేచ్ఛను చూసి ఆ యువకుడు కాసేపు ఈర్ష్యపడ్డాడు, తాను కూడా అంతే స్వేచ్ఛగా ఉండవచ్చనీ తెలుసుకున్నాడు. తనను పట్టి ఉంచేది ఏదీ లేదు - తాను తప్ప! గొర్రెలు, వ్యాపారి కూతురు, యాండలూసియా మైదానాలు తన జీవిత గమ్యంలో మెట్లు మాత్రమే.

ఆ మరునాడు మధ్యాహ్నం యువకుడు ఆ వృద్ధుడిని కలిశాడు. అతడు తనతోపాటు ఆరు గొర్రెలను తీసుకెళ్ళాడు.

"నాకు ఆశ్చర్యంగా ఉంది," యువకుడు అన్నాడు. "నా మిత్రుడు వెంటనే మిగిలిన గొర్రెలన్నింటినీ కొనేశాడు. అతడు గొర్రెలకాపరి కావాలని ఎప్పటినుంచో కలలు కంటున్నాడట, ఇది అతనికి మంచి శకునం అని చెప్పాడు."

"ఎప్పుడూ అలాగే జరుగుతుంది," అన్నాడు వృద్ధుడు. "దీనిని ఆరంభ సూత్రం అంటారు. నువ్వు పేకాట ఆడిన మొదటిసారి గెలవటం దాదాపు ఖాయం. దీనిని ఆరంభకుల అదృష్టం అంటారు."

"అలా ఎందుకు జరుగుతుంది?"

"నీ జీవితగమ్యాన్ని నువ్వు చేరుకోవాలని కోరుకునే శక్తి ఒకటి ఉంటుంది. విజయాన్ని చవిచూపడం ద్వారా అది నీలో ఉత్సాహాన్ని నింపుతుంది."

ఆ తరువాత వృద్ధుడు గొర్రెలను పరిశీలించసాగాడు. వాటిలో ఒకటి కుంటిదని అతడు కనుగొన్నాడు. అది మందలోకెల్లా తెలివైనదని, అన్నిటికంటే ఎక్కువ ఉన్ని ఇస్తుందని చెప్పి దాని కుంటితనం గురించి పట్టించుకోవలసిన అవసరం లేదన్నాడు యువకుడు.

"నిధి ఎక్కడ ఉంది?" యువకుడు అడిగాడు.

"ఈజిప్టులో, పిరమిడ్ల దగ్గర."

యువకుడు కలవరపాటుకు గురయ్యాడు. వృద్ధురాలు చెప్పింది కూడా అదే. కానీ దానికి ఆమె డబ్బులు ఏమీ తీసుకోలేదు.

"నువ్వు నిధిని కనుక్కోవాలంటే శకునాలను అనుసరించాలి. ప్రతి ఒక్కరూ అనుసరించటానికి దేవుడు ఒక దారిని తయారు చేశాడు. నీకోసం అతడు ఉంచిన శకునాలను చదవాలంతే."

యువకుడు బదులిచ్చేలోపు ఒక సీతాకోక చిలుక వచ్చి వారిద్దరి మధ్య రెక్కలారుస్తూ ఎగిరింది. తన తాత ఎప్పుడో చెప్పింది అతడికి గుర్తువచ్చింది: సీతాకోక చిలుకలు మంచి శకునాలు – కీచురాయి లాగా, తొండ లాగా, నాలుగు ఆకులు పిల్లి పెసరలాగా.

అతడి ఆలోచనను చదివిన వృద్ధుడు "అవును, మీ తాత చెప్పినట్టు ఇవి మంచి శకునాలు," అన్నాడు.

వృద్ధుడు తన పైచొక్కా తొలగించాడు. యువకుడు తాను చూసిన దానికి దిగ్భ్రాంతికి లోనయ్యాడు. వృద్ధుడి ఛాతీమీద బంగారు కవచం ఉంది, దాని నిండా అమూల్యమైన వజ్ర వైఢూర్యాలున్నాయి. అంతకు ముందురోజు చూసిన కాంతి యువకుడికి గుర్తు వచ్చింది.

అతడు నిజంగానే రాజు! దొంగల బారినుండి తప్పించుకోడానికి అతడు మారువేషం వేసుకుని ఉండాలి.

కవచం మధ్యలో ఉన్న ఒక నల్లరాయి, ఒక తెల్లరాయిని తీసి అతనికిచ్చాడు. "వీటి పేర్లు ఉరిం, తుమిం. తెల్లరాయి 'అవును'ని సూచిస్తుంది, నల్ల రాయి 'కాదు'ని సూచిస్తుంది. శకునాలను నువ్వు అర్థం చేసుకోలేక పోయినప్పుడు ఇవి నీకు తోడ్పడతాయి. ఎప్పుడూ ఔను, కాదు అనే సమాధానం వచ్చే ప్రశ్నలడగాలి.

"కాని సాధ్యమైనంతవరకూ నీ నిర్ణయాలను నువ్వే తీసుకో. నిధి పిరమిడ్ల దగ్గర ఉందని నీకు ముందే తెలుసు. నువ్వు నిర్ణయం తీసుకోవటంలో సహాయపడ్డాను కాబట్టి ఆరు గొర్రెలను నాకు ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేశాను."

యువకుడు ఆ రాళ్ళను తన గుడ్డసంచిలో వేసుకున్నాడు. ఇకనుంచి తన నిర్ణయాలను తానే తీసుకుంటాడు.

"నువ్వు వ్యవహరించే ప్రతిదీ ఒక్కటే తప్ప మరొకటి కాదన్నది మరిచిపోకు. శకునాల భాషను కూడా మరిచిపోవద్దు. అన్నిటికీ మించి నీ జీవిత గమ్యాన్ని చివరికంటా అనుసరించటం మరిచిపోవద్దు."

"వెళ్ళిపోయే ముందు నీకు ఒక చిన్న కథ చెబుతాను.

"ఒకానొక దుకాణదారుడు ఆనంద మూలాలను తెలుసుకోటానికి తన కొడుకును ప్రపంచంలోకెల్లా జ్ఞాని వద్దకు పంపించాడు. ఆ కుర్రవాడు ఎడారిలో నలభైరోజుల పాటు నడిచి చివరికి జ్ఞాని ఉంటున్న కొండపైన ఒక అందమైన కోట వద్దకు చేరుకున్నాడు.

"మన కుర్రవాడికి అతను ఊహించుకుంటున్నట్లు ఒక సాధువు ఎదురుకాలేదు. కోట ప్రధాన గదిలోకి అడుగుపెట్టిన అతనికి అక్కడ ఎంతో సందడిగా కనపడింది. వ్యాపారులు వస్తూ, పోతూ ఉన్నారు. అక్కడక్కడా మనుషులు కబుర్లు చెప్పుకుంటున్నారు. వాయిద్య బృందమొకటి మంద్ర స్వరంలో సంగీతాన్ని వినిపిస్తోంది. ఆ ప్రాంతంలో వండే రుచికరమైన వంటలన్నీ ఒక బల్లమీద పరిచి ఉన్నాయి. జ్ఞాని అందరితో మాట్లాడుతూ ఉన్నాడు. అతడి దృష్టి తనపై పెట్టే వంతు వచ్చేసరికి కుర్రవాడు రెండు గంటలు వేచి ఉండాల్సివచ్చింది.

“కుర్రవాడు తాను ఎందుకు వచ్చాడో వివరిస్తుంటే జ్ఞాని ఎంతో శ్రద్ధగా విన్నాడు. కానీ ఆనంద రహస్యాన్ని వివరించే సమయం తన వద్ద లేదన్నాడు. కోట అంతా తిరిగి చూసి రెండు గంటల్లో తిరిగి రమ్మన్నాడు.

" 'ఈలోగా నువ్వు ఒకటి చెయ్యాలి', ఒక చెంచాలో రెండు బొట్లు నూనె పోసి అతడికి ఇస్తూ జ్ఞాని అన్నాడు. 'నువ్వు కోటని తిరిగి చూసే సమయంలో ఈ చెంచాలోని నూనె కిందపడకుండా జాగ్రత్తగా ఉండు'."

“కుర్రవాడు కోటలోని మెట్లు ఎక్కుతూ, దిగుతూ చెంచాలోని నూనె కిందపడిపోకుండా దృష్టి దానిపై నిలిపి ఉంచాడు. రెండు గంటల తరువాత జ్ఞాని ఉన్న గదిలోకి కుర్రవాడు వచ్చాడు.

"నా భోజనాల గదిలో గోడకి వేలాడదీసిన పర్షియన్ వస్త్రం చూశావా? మా తోటమాలి పదేళ్ళపాటు శ్రమించి మలచిన తోట చూశావా? నా గ్రంథాలయంలో అందమైన రాత ప్రతులను గమనించావా?”

"కుర్రవాడు సిగ్గుపడిపోయాడు. తాను ఏమి చూడలేదని చెప్పాడు. జ్ఞాని తనకు అప్పగించిన నూనె జారిపోకుండా చూడటంలోనే అతడు నిమగ్నమై ఉన్నాడు.

"అయితే వెళ్ళి నా ప్రపంచంలోని అద్భుతాలను చూసిరా,” అన్నాడు జ్ఞాని. “అతడి ఇల్లు తెలియనంతవరకు ఒక వ్యక్తిని నువ్వు నమ్మటానికి లేదు.”

"ఊరట చెందిన యువకుడు చెంచా తీసుకుని కోటను చూడటానికి వెళ్ళాడు. ఈ సారి అతడు పైకప్పుమీద, గోడలకు ఉన్న అందమైన బొమ్మలనీ, కళాఖండాలను చూశాడు. తోటనీ, చుట్టూ ఉన్న కొండలనీ, పూల అందాలనీ, ఎంపిక చేసిన ప్రతి దాని వెనుక ఉన్న అభిరుచినీ అతడు చూశాడు. జ్ఞాని దగ్గరకు తిరిగి వచ్చి తాను చూసిన వాటన్నిటి గురించి చెప్పాడు.

"కానీ నేను నీకు అప్పగించిన రెండు నూనెబొట్లు ఏవీ?" జ్ఞాని అడిగాడు.

"తన చేతిలో ఉన్న చెంచాకేసి చూసిన కుర్రవాడు నూనె బొట్లు జారిపోయాయని గమనించాడు.

" 'నేను నీకు ఇవ్వగలిగిన సలహా ఒక్కటే,' అందరిలోకి జ్ఞాని అయిన ఆ వ్యక్తి అన్నాడు. "ప్రపంచంలోని అందాలన్నిటినీ చూస్తూనే చెంచాలోని నూనె చుక్కల గురించి మరిచిపోక పోవటంలోనే ఆనంద రహస్యం ఉంది.'"

గొర్రెల కాపరి ఏమీ మాట్లాడలేదు. వృద్ధ రాజు చెప్పిన కథ అతడికి అర్థమయ్యింది. గొర్రెల కాపరికి ప్రయాణమంటే ఇష్టముండవచ్చు, కానీ తన గొర్రెలను ఎప్పటికీ మరవకూడదు.

వృద్ధుడు రెండు చేతులూ కలిపి యువకుడి తలపై పలు రకాలుగా తిప్పాడు. ఆ తరువాత తన గొర్రెలను తీసుకుని అతడు వెళ్ళిపోయాడు.

*

టారీఫాలోని అత్యంత ఎత్తైన ప్రాంతంలో మూర్‌లు కట్టిన ఒక కోట ఉంది. దాని గోడల మీదకి ఎక్కి చూస్తే ఆఫ్రికా సుదూరంగా కనిపిస్తుంది. సాలెం రాజైన మెల్చిజెడెక్ ఆ మధ్యాహ్నం కోటగోడ మీద కూర్చున్నాడు. తూర్పుగాలి అతడి ముఖాన్ని బలంగా తాకుతోంది. కొత్త యజమానికి ఇంకా అలవాటు కాని గొర్రెలు దగ్గిరలోనే తచ్చాడుతున్నాయి; వాటి జీవితాల్లోని పెనుమార్పునకు అవి ఉత్తేజంగా కూడా ఉన్నాయి. వాటికి కావలసిందల్లా మేత, నీళ్ళు.

రేవునుంచి బయటికి వెళుతున్న ఒక చిన్న ఓడను మెల్చిజెడెక్ గమనిస్తున్నాడు. తన పడవ వంతు రుసుమును వసూలు చేసిన తరువాత అబ్రహాంను అతను తిరిగి చూడనట్లే ఆ యువకుడిని కూడా మళ్ళీ చూడడు. అతని పని అంతవరకే.

దేవుళ్ళకు జీవిత గమ్యాలు ఉండవు కాబట్టి వాళ్ళకు కోరికలు ఉండకూడదు. ఆ యువకుడు విజయం సాధించాలని సాలెం రాజు ఎంతగానో కోరుకున్నాడు.

నా పేరును యువకుడు త్వరలోనే మరిచిపోతాడని అతడు విచారంగా అనుకున్నాడు. అతను గుర్తుంచుకునేలా నేను మళ్ళీ నా పేరు చెప్పి ఉండాల్సింది. అప్పుడు నా గురించి చెప్పేటప్పుడు సాలెం రాజు మెల్చిజెడెక్ అని అనేవాడు.

తన ఆలోచనకు తానే సిగ్గుపడుతూ ఆకాశంవైపు చూస్తూ "దేవా, నువ్వు చెప్పినట్లు ఇటువంటి స్వాతిశయం అన్నిటిలోకి హానికరమైనదని తెలుసు. కానీ ఈ ముసలిరాజుకి తన చర్యలకు తాను గర్వించే క్షణాలను అప్పుడప్పుడూ అనుమతించు."

*

ఆఫ్రికా ఎంతో వింతైన ప్రదేశం అనుకున్నాడు ఆ యువకుడు.

టాంజియర్ ఇరుకు వీధుల్లోని అనేక హోటళ్ళ మాదిరిగా ఉన్న ఒక హోటలులో అతను కూర్చుని ఉన్నాడు. ఒక పొడవాటి గొట్టాన్ని ఒకరినుంచి ఒకరు అందుకుంటూ కొంతమంది హుక్కా పీలుస్తున్నారు. అక్కడికి వచ్చిన కొన్ని గంటల్లో అతడు చేయి చేయి కలిపి నడిచే పురుషులను, ముఖాలకు మేలి ముసుగు వేసుకున్న మహిళలను చూశాడు. మత గురువులు ప్రార్థనా మందిరాల పైకి ఎక్కి ప్రార్థనలు చేస్తుండగా ఎక్కడివాళ్ళు అక్కడ మోకాళ్ళమీద కూర్చుని నుదుటిని నేలకు తాకించటం చూశాడు.

'క్రైస్తవేతరుల ఆచారాలు,' అతడు తనలో తాను అనుకున్నాడు. తన చిన్నప్పుడు క్రీస్తు దేవాలయంలో సాధు సాంటియాగో మాటమొరోస్ చిత్రపటాన్ని ఎప్పుడూ చూసేవాడు. అందులో సాంటియాగో తెల్లటి గుర్రం మీద, దూసిన

కరవాలంతో ఉండేవాడు, అతని పక్కన ఇలాగే మోకరిల్లిన ప్రజలు ఉండేవారు. యువకుడు ఇబ్బందికి, తీవ్ర ఒంటరితనానికి గురయ్యాడు. ఇక్కడి వాళ్ళలో ఏదో దుష్టత్వం గోచరిస్తోంది.

అదీ కాకుండా అతడు ఇక్కడికి వచ్చే హడావిడిలో ఒకే ఒక్క విషయం మరిచిపోయాడు ; అదే అతడు నిధిని కనుక్కోటంలో చాలా ఆలస్యానికి కారణం కావచ్చు: ఈ దేశంలో కేవలం అరబ్బీ భాష మాత్రమే మాట్లాడతారు.

హోటలు యజమాని యువకుడి వద్దకు వచ్చాడు. పక్క బల్లమీద వాళ్ళు తాగుతున్న పానీయంకేసి యువకుడు చూపించాడు. అది తెచ్చి ఇచ్చిన తరువాత తాగి చూస్తే చాలా చేదైన తేనీరని తెలిసింది. యువకుడికి మద్యం కావాలని ఉంది.

అయితే ఇప్పుడతను దాని గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇప్పుడతను తన నిధి గురించి, దానిని చేరుకునే దారి గురించి ఆలోచించాలి. గొర్రెలను అమ్మటం వల్ల అతడి జేబులో డబ్బు దండిగానే ఉంది. డబ్బులో మాయ ఉందని యువకుడికి తెలుసు; డబ్బులున్నవాడు ఎప్పుడూ ఒంటరిగా ఉండడు. త్వరలోనే, బహుశా కొద్దిరోజులలోనే అతడు పిరమిడ్లను చేరుకుంటాడు. బంగారు కవచం ఉన్న వృద్ధుడు కేవలం ఆరు గొర్రెల కోసం అబద్ధం చెప్పి ఉండడు.

సంకేతాలు, శకునాలు గురించి వృద్ధుడు చెప్పాడు. జలసంధిని దాటుతుండగా యువకుడు శకునాల గురించి ఆలోచించాడు. అవును, వృద్ధుడు చెప్పింది నిజమే: యాండలూసియా మైదానాల్లో అతడు గడిపినప్పుడు ఆకాశాన్ని, నేలని పరిశీలించి ఏ దారిని అనుసరించాలో తెలుసుకున్నాడు. ఒక రకమైన పక్షి ఉంటే దగ్గరలో పాము ఉంటుందని అతడు కనుగొన్నాడు. ఒక రకమైన పొద ఉంటే ఆ ప్రాంతంలో నీటికి అది సంకేతం. ఈ విషయం అతనికి గొర్రెలు నేర్పాయి.

దేవుడు గొర్రెలకు అంత బాగా దారి చూపిస్తే ఒక మనిషికి కూడా అదే రకంగా దారి చూపిస్తాడని అతను అనుకున్నాడు. ఇది అతనికి గొప్ప ఊరటనిచ్చింది. తేనీరు ఇప్పుడంత చేదుగా అనిపించలేదు.

"ఎవరు నువ్వు?" వెనకనుంచి ఎవరో స్పానిష్ లో తనను అడగటం అతడికి వినిపించింది.

యువకుడికి మరింత ధైర్యం వచ్చింది. అతడు శకునాల గురించి ఆలోచిస్తున్నాడు. అంతలోనే ఒకటి ఎదురయ్యింది.

"నువ్వు స్పానిష్ ఎలా మాట్లాడగలుగుతున్నావు?" యువకుడు అడిగాడు. కొత్తగా వచ్చిన వ్యక్తి పాశ్చాత్య దుస్తులలో ఉన్నాడు. కానీ చర్మం రంగు చూస్తే అతడు ఈ ఊరువాడే అనిపిస్తోంది. అతడు యువకుడి ఈడువాడే, అతనంత ఎత్తే ఉన్నాడు.

"ఇక్కడ దాదాపు ప్రతి ఒక్కరూ స్పానిష్ మాట్లాడతారు. ఇక్కడికి స్పెయిన్ రెండు గంటల దూరంలోనే ఉంది."

"ఈ దేశంలో మద్యం ఉండదు," వచ్చిన యువకుడు చెప్పాడు. "మా మతం ప్రకారం అది నిషిద్ధం."

అప్పుడు యువకుడు తాను పిరమిడ్ల దగ్గరకు వెళ్ళాలని చెప్పాడు. నిధి గురించి చెబుదామని నాలుక చివరిదాకా వచ్చింది కాని, అతడు చెప్పలేదు. అది చెపితే అక్కడికి తీసుకెళ్ళినందుకుగాను నిధిలో కొంతవాటా ఆ అరబ్బు అడగవచ్చు. నీ చేతిలో లేని దానిని ఇస్తాననటం గురించి వృద్ధరాజు చెప్పింది అతనికి గుర్తుకు వచ్చింది.

"నీకు తెలిస్తే నన్ను అక్కడకు తీసుకెళ్ళు. నాకు తోడుగా ఉండి దారి చూపినందుకు నీకు కొంత డబ్బు చెల్లిస్తాను."

"అక్కడికి ఎలా వెళ్ళాలో నీకు తెలుసా?" కొత్త వ్యక్తి అడిగాడు.

హోటలు యజమాని పక్కనే నుంచుని వాళ్ళ సంభాషణను శ్రద్ధగా వినటం ఆ యువకుడు గమనించాడు. యజమాని అక్కడ ఉండటం అతనికెందుకో ఇబ్బందికరంగా అనిపించింది. కానీ అతనికి ఒక మార్గదర్శకుడు లభించాడు, ఆ అవకాశాన్ని అతడు వదులుకోదలచలేదు.

"నువ్వు సహారా ఎడారిని దాటాలి," కొత్త యువకుడు అన్నాడు. "అందుకు డబ్బుకావాలి. నీ దగ్గర సరిపడా డబ్బుందో లేదో నాకు తెలవాలి."

అది చాలా వింత ప్రశ్నగా యువకుడికి అనిపించింది. నీకు నిజంగా ఏదైనా చెయ్యాలని గాఢంగా అనిపించినప్పుడు, విశ్వమంతా నీకు అనుకూలంగా కుట్ర పన్నుతుందని చెప్పిన వృద్ధుడి మాటలను అతను నమ్మాడు.

తన వద్ద సంచిలో ఉన్న డబ్బుని తీసి అతనికి చూపించాడు. హోటలు యజమాని కూడా దగ్గరకు వచ్చి చూశాడు. ఆ ఇద్దరు వ్యక్తులూ అరబ్బీ భాషలో ఏదో మాట్లాడుకున్నారు. హోటలు యజమాని చికాకు పడుతున్నట్లు అతనికి అనిపించింది.

"మనని ఇక్కడి నుంచి వెళ్ళిపొమ్మంటున్నాడు, పద పోదాం," అన్నాడు కొత్తగా వచ్చిన వ్యక్తి.

యువకుడు హాయిగా ఊపిరి తీసుకున్నాడు. డబ్బులు చెల్లించటానికి అతడు లేచాడు. యజమాని అతడిని పట్టుకుని వేగంగానూ, పెద్ద పెద్దగానూ ఏదో మాట్లాడసాగాడు.

యువకుడు బలంగా ఉన్నాడు కాబట్టి తిప్పి కొట్టాలనిపించింది; కానీ అతడు పరాయి దేశంలో ఉన్నాడు. అతడి కొత్త స్నేహితుడు యజమానిని పక్కకు తోసేసి యువకుడిని తనతో పాటు బయటకు తీసుకెళ్ళాడు. "అతడు నీ డబ్బులు

లాక్కుందామనుకున్నాడు," అతడు చెప్పాడు, "టాంజియర్ మిగిలిన ఆఫ్రికా మాదిరి కాదు. ఇది రేవు పట్టణం, ప్రతి రేవు పట్టణంలోనూ దొంగలుంటారు."

యువకుడు తన కొత్త స్నేహితుడిని నమ్మాడు. ప్రమాదకరమైన పరిస్థితినుంచి అతడు తనను కాపాడాడు. యువకుడు తన వద్ద నున్న డబ్బులను బయటకు తీసి లెక్కపెట్టాడు.

అతడి దగ్గరనుంచి ఆ డబ్బులు తీసుకుంటూ "మనం రేపటికల్లా పిరమిడ్లను చేరుకుంటాం. కానీ ముందుగా నేను రెండు ఒంటెలను కొనాలి."

టాంజియర్‌లోని ఇరుకు బజార్ల గుండా వాళ్ళిద్దరూ నడిచి వెళుతున్నారు. ప్రతిచోటా అమ్మకానికి సరుకులతో దుకాణాలు ఉన్నాయి. సంత జరిగే ఒక పెద్ద ప్రాంతం మధ్యకి వాళ్ళు చేరుకున్నారు. అమ్ముతూ, కొంటూ, బేరాలాడుతూ వేలాది మంది అక్కడ ఉన్నారు. ఒక పక్కన కత్తులు, మరో పక్క కూరగాయలు; ఇటు చూస్తే తివాచీలు, అటు పొగాకు అమ్మకానికి ఉన్నాయి. కానీ యువకుడు మాత్రం తన కొత్తమిత్రుడి పైనుండి దృష్టి మరల్చలేదు. తన డబ్బులన్నీ అతడి దగ్గరే ఉన్నాయి. తన డబ్బులు తనకి తిరిగి ఇవ్వమని అడుగుదామనుకున్నాడు కానీ అది అంత మర్యాదగా ఉండదని ఊరుకున్నాడు. తానున్న కొత్త ప్రదేశంలోని ఆచార వ్యవహారాలేవీ అతనికి తెలియవు.

'నేను అతడిని ఒక కంట కనిపెడుతూ ఉంటాను,' తనలో తాను అనుకున్నాడు. తన మిత్రునికంటే తానే బలశాలినని అతడికి తెలుసు.

అంత గందరగోళం మధ్య ఉన్నట్లుండి అతడు అంతకు ముందెన్నడూ చూడనంత అద్భుతమయిన కత్తిని చూశాడు. కత్తికి వెండిపూత పూసి ఉంది; పిడి నల్లగా ఉండి, విలువైన రాళ్ళు పొదిగి ఉంది. తాను ఈజిప్టునుంచి తిరిగి వచ్చిన తరువాత ఆ కత్తిని కొంటానని యువకుడు తనకి తాను మాటిచ్చుకున్నాడు.

"ఈ కత్తి ఖరీదెంతో దుకాణాదారుని అడుగు," అని తన మిత్రునితో అన్నాడు. కత్తిని చూస్తూ కొద్ది నిముషాలపాటు తాను ఏమరుపాటుకు గురయ్యానని ఆ క్షణాన అతను గుర్తించాడు. ఉన్నట్లుండి అతని ఛాతీ నొక్కేసినట్లు, గుండె పిండేసినట్లయ్యింది. ఏం కనబడుతుందో తెలుసు కాబట్టి చుట్టూ చూడటానికి అతడు భయపడ్డాడు. పక్కకి తిరిగి చూసే ధైర్యాన్ని కూడగట్టుకునేదాకా అతడు ఆ కత్తికేసి చూస్తూ ఉండిపోయాడు.

తన చుట్టూ బజారు సందడిగా ఉంది. ప్రజలు వస్తున్నారు, వెళుతున్నారు. కొందరు అరుస్తున్నారు, కొందరు కొంటున్నారు. వింత వింత వంటకాల వాసనలు ముక్కు పుటాలను తాకుతున్నాయి.... కానీ తన కొత్త మిత్రుడు ఎక్కడా కనపడలేదు.

తన మిత్రుడు తననుంచి పొరపాటున విడిపడ్డాడని నమ్మాలని యువకుడికి ఉంది. కొంచెంసేపు అక్కడే ఉండి అతడు తిరిగి రావటం కోసం ఎదురు చూడాలని నిర్ణయించుకున్నాడు. అతడు అలా వేచి ఉండగా ఒక మత గురువు దగ్గరలోని ప్రార్థనా మందిరంపైకి ఎక్కి ప్రార్థనలు చేయసాగాడు. బజారులో ఉన్న ప్రతి ఒక్కరూ నేలమీద మోకరిల్లి, నుదుటితో నేలను తాకుతూ ప్రార్థనలు వల్లె వేయసాగారు. ఆ తరువాత చీమల దండు మాదిరి తమ దుకాణాలన్నింటిని తొలగించి ఇళ్ళకు తిరిగి వెళ్ళిపోసాగారు.

సూర్యుడు కూడా అస్తమించబోతున్నాడు. సూర్యుడు పడమటి దిక్కున కిందకి కదలటం ఆ యువకుడు కొంతసేపు చూశాడు. కాసేపటికి బజారు చుట్టూ ఉన్న తెల్లటి ఇళ్ళ వెనక్కి సూర్యుడు కనుమరుగైపోయాడు. ఆ రోజు సూర్యోదయ వేళలో యువకుడు ఇంకొక ఖండంలో, అరవై గొర్రెలున్న గొర్రెల కాపరిగా, ఒక అమ్మాయిని కలవటానికి ఎదురు చూస్తూ ఉన్న విషయం అతడికి గుర్తుకు వచ్చింది. ఆ ఉదయం తనకు పరిచితమైన మైదానాల్లో నడుస్తుండగా

జరగబోయేదంతా అతనికి తెలుసనిపించింది. కానీ సూర్యాస్తమయం అవుతున్న ఈ సమయంలో అతడు పరాయిదేశంలో, అపరిచిత ప్రాంతంలో అపరిచితుడుగా, అక్కడి భాష కూడా రాని వ్యక్తిగా ఉన్నాడు. అతడు ఇప్పుడు గొర్రెలకాపరి కూడా కాదు. అతడి దగ్గర ఇప్పుడు ఏమీలేదు, వెనక్కి తిరిగి వెళ్ళి మళ్ళీ అంతా మొదలు పెట్టడానికి కనీసం డబ్బు కూడా లేదు.

సూర్యోదయం, సూర్యాస్తమయాల మధ్య ఇదంతా జరిగిందని యువకుడు అనుకున్నాడు. తనమీద తాను జాలిపడ్డాడు. తన జీవితం ఇంత అకస్మాత్తుగా, ఇంత తీవ్రమైన మలుపు తిరిగినందుకు అతడు దుఃఖించాడు.

అతడికి తనివితీరా ఏడవాలనిపించింది. అతను ఇప్పటివరకు ఏనాడూ, చివరకి తన గొర్రెల ముందు కూడా ఏడవలేదు. కానీ ఇప్పుడు బజారు అంత శూన్యంగా ఉంది, తన ఇంటికి చాలా దూరంగా ఉన్నాడు. అందుకే అతను ఏడ్చాడు. దేవుడు  అన్యాయంగా ప్రవర్తించినందుకూ, తన కలలను నమ్మిన వ్యక్తికి దేవుడు ఈ రకంగా చేసినందుకు అతడు ఏడ్చాడు.

'నాకు గొర్రెలు ఉన్నప్పుడు నేను సంతోషంగా ఉన్నాను, నా చుట్టుపక్కలవాళ్ళని  సంతోషపరిచాను. నా రాకను గమనించి మనుషులు నన్ను ఆహ్వానించేవాళ్లు,' అని అతను అనుకున్నాడు. 'కానీ ఇప్పుడు నేను ఒంటరిగా, విచారగ్రస్తుడనై ఉన్నాను. ఒక వ్యక్తి నన్ను మోసం చేసినందుకు నేనిక మనుషుల్ని నమ్మబోను. నేను నా నిధిని అందుకోలేకపోయాను కాబట్టి దానిని అందుకున్న వాళ్ళని చూసి ద్వేషిస్తాను. నాకున్న కొద్దిపాటి ధనాన్ని ఇకనుంచి జారిపోకుండా పట్టుకుని ఉంటాను. ఈ ప్రపంచాన్ని జయించలేని అల్పుడిని నేను.'

తన దగ్గర ఏమి మిగిలి ఉందో చూసుకోటానికి అతడు తన గుడ్డసంచిని తీశాడు. పడవలో తినగా రొట్టె తుంపులేమైనా మిగిలాయేమోనని చూశాడు. కానీ

అతడికి బరువైన పుస్తకం, చలిచొక్కా, వృద్ధుడు ఇచ్చిన రెండు రాళ్ళు తప్పించి ఇంకేమీ కనిపించలేదు.

కారణం తెలియదు కాని ఆ రాళ్ళను చూసేసరికి అతడు ఎంతో స్వాంతన పొందాడు. తన ఆరు గొర్రెలనిచ్చి వాటికి బదులుగా బంగారు కవచంలోంచి తీసి ఇచ్చిన రెండు విలువైన రాళ్ళను పొందాడు. ఆ రాళ్ళను అమ్మి తిరుగు ప్రయాణానికి టిక్కెట్టు కొనుక్కోవచ్చు. కానీ ఈ సారి తాను చాలా జాగ్రత్తగా ఉండాలి అనుకుంటూ ఆ యువకుడు రాళ్ళను గుడ్డసంచి నుంచి తీసి తన జేబులో వేసుకున్నాడు. ఇది రేవు పట్టణం. తన మిత్రుడు చెప్పిన ఒకే ఒక్క సత్యం ఇక్కడ అంతటా దొంగలుంటారు.

హోటలు యజమాని అంతగా ఎందుకు ఆందోళన చెందాడో ఇప్పుడతనికి అర్థమయ్యింది: కొత్త వ్యక్తిని నమ్మవద్దని చెప్పటానికి అతడు ప్రయత్నించాడు. 'ప్రపంచం వాస్తవంగా ఎలా ఉందో కాక ఎలా ఉండాలని కోరుకుంటున్నామో ఆ దృష్టి కోణం నుంచి చూసే అందరిలాంటి వాడినే నేను కూడా.'

రాళ్ళమీద మెల్లగా వేళ్ళతో రాస్తూ, వాటి నునుపుదనాన్ని, వెచ్చదనాన్ని అనుభూతి చెందసాగాడు. అవే అతడి నిధి. వాటిని చేత్తో పట్టుకుంటే చాలు ఎంతో హాయిగా అనిపిస్తోంది. అవి వృద్ధుడిని గుర్తుకు తెస్తున్నాయి.

'నువ్వు ఏదైనా కావాలని అనుకున్నప్పుడు, దానిని నువ్వు సాధించటంలో సహాయపడే విధంగా ఈ విశ్వమంతా కుట్ర పన్నుతుంది,' అని అతడు చెప్పాడు.

వృద్ధుడు చెప్పిన దాంట్లో సత్యాన్ని అర్థం చేసుకోటానికి ఆ యువకుడు ప్రయత్నిస్తున్నాడు. అతడు అక్కడ బజారులో ఒంటరిగా ఉన్నాడు, అతని చేతిలో ఏగాణి కూడా లేదు. తాను రాత్రంతా కాపలా కాయవలసిన గొర్రె ఒక్కటి కూడా

లేదు. కానీ తాను ఒక రాజుని - తన గతం తెలిసిన రాజుని - కలిసినందుకు నిదర్శనంగా ఈ రాళ్ళు ఉన్నాయి.

"వాటిని ఉరిం, తుమిం అంటారు. సంకేతాలను అర్థం చేసుకోవటంలో అవి నీకు సహాయపడతాయి." యువకుడు రాళ్ళను తిరిగి గుడ్డ సంచిలోకి వేసి ఒక ప్రయోగం చేద్దామనుకున్నాడు. చాలా స్పష్టమయిన ప్రశ్నలు అడగమని వృద్ధుడు చెప్పాడు. అది చెయ్యాలంటే ముందుగా తనకేం కావాలో తెలుసుకోవాలి. వృద్ధుడి ఆశీర్వాదాలు ఇంకా తన వెంట ఉన్నాయా అని ముందుగా అడిగాడు.

రెండింటిలో ఒక రాయి బయటకు తీశాడు. అది "అవును".

"నేను నా నిధిని కనుగొంటానా?" అతడు అడిగాడు.

అతడు చేతిని గుడ్డ సంచిలోనికి పోనిచ్చి ఒక రాయి కోసం వెతికాడు. అలా చేస్తుండగా సంచిలో ఉన్న చిల్లులోంచి రెండూ కిందకి జారిపోయాయి. తన గుడ్డసంచికి చిల్లు ఉన్నట్లు యువకుడు ఇప్పటివరకు గమనించనేలేదు. కిందకు వంగి ఉరిం, తుమింలను ఏరి తిరిగి గుడ్డ సంచిలో వేశాడు. అవి నేలమీద ఉండగా చూసినప్పుడు అతడికి మరొక మాట గుర్తుకు వచ్చింది.

'శకునాలను గుర్తించి, వాటిని అనుసరించటం నేర్చుకో,' అని వృద్ధుడు చెప్పాడు.

ఒక శకునం. యువకుడు తనలో తానే నవ్వుకున్నాడు. రాళ్ళను తిరిగి గుడ్డసంచిలోకి వేసినా అతడు చిల్లును కుడదామని అనుకోలేదు - కావాలనుకున్నప్పుడు రాళ్ళు వాటంతట అవే కిందకి పడవచ్చు. ఒకరి జీవిత గమ్యం నుంచి పారిపోకుండా ఉండటానికి కొన్ని ప్రశ్నలు అడగకూడదని అతడు తెలుసుకున్నాడు. 'నా నిర్ణయాలను నేనే తీసుకుంటానని మాట ఇస్తున్నాను,' అని తనలో తాను అనుకున్నాడు.

వృద్ధుడు తన వెంటే ఉన్నాడని రాళ్ళు అతనికి చెప్పాయి, అది అతడిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించింది. ఖాళీగా ఉన్న బజారునంతా మరోసారి కలయచూశాడు, ఈసారి అది అంత నిస్పృహ కలిగించలేదు. ఇది కొత్త ప్రదేశమేగాని వింత ప్రదేశం కాదు.

ఇప్పటివరకు అతడు కోరుకున్నది కూడా అదే – కొత్త ప్రదేశాలు చూడాలనీ, తెలుసుకోవాలనీ. తాను పిరమిడ్లకు చేరుకోకపోయినప్పటికీ తనకు తెలిసి ఏ గొర్రెలకాపరీ ఇంత దూరం ప్రయాణం చేయలేదు. తాము ఉన్న చోటునుంచి ఓడ మీద రెండు గంటలు ప్రయాణిస్తే ఎంత కొత్తగా ఉంటుందో వాళ్ళకి తెలిస్తేనా! తన కొత్త ప్రపంచమైన ఈ బజారు ప్రస్తుతం శూన్యంగా ఉన్నప్పటికీ అది ప్రజలతో కిటకిటలాడుతున్నప్పుడు అతడు దానిని చూశాడు, అది ఎన్నటికీ మరిచిపోలేడు. అతడికి కత్తి కూడా గుర్తుకు వచ్చింది. దాని గురించి ఆలోచించటం కొంత బాధాకరంగా అనిపించినప్పటికీ అటువంటి కత్తిని అతడు అంతకు ముందెన్నడూ చూసి ఉండలేదు. వీటన్నిటి గురించి ఆలోచిస్తుండగా తనని తాను ఒక దొంగ బారిన పడ్డవానిగా గానీ, తన నిధికోసం అన్వేషణలో ఉన్న సాహసిగా గానీ చిత్రించుకోవచ్చని అతడు గుర్తించాడు.

'నేను నిధికోసం వెతుకుతున్న ఒక సాహసిని,' అని తనకు తానే చెప్పుకున్నాడు.

*

ఎవరో కుదపగా అతడికి మెలకువ వచ్చింది. బజారు మధ్యలో అతడికి నిద్రపట్టేసింది. మళ్ళీ జన సందోహం మొదలు కానున్నది.

తన గొర్రెలకోసం చుట్టూ పరికించి చూసి తానొక కొత్త ప్రపంచంలో ఉన్నానని గుర్తించాడు. కానీ విచారించటానికి బదులు అతడు సంతోషంగా ఉన్నాడు.

గొర్రెలకోసం తిండి, నీరు వెతకాల్సిన పని ఇప్పుడు లేదు. దానికి బదులు తన నిధి అన్వేషణకి బయలు దేరవచ్చు. జేబులో దమ్మిడీ లేదు కానీ గుండె నిండా విశ్వాసం ఉంది. పుస్తకాలలో తాను అభిమానించిన సాహసోపేత నాయకుల్లా తానూ ఉండాలని అతడు గతరాత్రి నిర్ణయించుకున్నాడు.

అతడు బజారులో మెల్లగా నడుచుకుంటూ వెళుతున్నాడు. దుకాణాదారులు తమ సరుకులను అమర్చుకుంటున్నారు. మిఠాయి అమ్మే అతనికి దుకాణం నెలకొల్పుకోవటంలో యువకుడు సహాయపడ్డాడు. మిఠాయి అమ్మే వర్తకుని ముఖంమీద చెదరని చిరునవ్వు ఉంది: అతడు సంతోషంగా ఉన్నాడు, తన జీవితం ఏమిటో అతనికి తెలుసు, ఆ రోజు చేయవలసిన పని మొదలు పెట్టడానికి అతడు సిద్ధంగా ఉన్నాడు. అతడి నవ్వు యువకునికి – వృద్ధుడిని – తాను కలసిన అద్భుతమయిన రాజుని గుర్తుకు తెచ్చింది. 'ఒక వ్యాపారి కూతురిని పెళ్ళిచేసుకోవటం కోసమని మిఠాయిలను వర్తకుడు అమ్మటం లేదు,' అనుకున్నాడు యువకుడు. వృద్ధుడిలా తాను కూడా ఒక వ్యక్తి అతని జీవిత గమ్యానికి దగ్గరగా ఉన్నాడా, లేక దూరంగా ఉన్నాడా అన్నది వాళ్ళని చూడటంతోనే గ్రహించ గలుగుతున్నాడు. అది చాలా తేలికని అతడికి అనిపించింది, కానీ ఇలా అంతకు ముందు తానెన్నడూ ఆలోచించలేదని అతడు గుర్తించాడు.

దుకాణం ఏర్పాటు చేసిన తరువాత వ్యాపారి తాను ఆరోజు అమ్మటానికని చేసిన వాటిలోంచి మొదటి మిఠాయిని యువకుడికి ఇచ్చాడు. యువకుడు అతనికి ధన్యవాదాలు చెప్పి, మిఠాయి తిని ముందుకు సాగిపోయాడు. తాము దుకాణం ఏర్పాటు చేస్తున్న సమయంలో ఒకరు అరబ్బీ భాషలోనూ, మరొకరు స్పానిష్ లోనూ మాట్లాడుకున్న విషయాన్ని కొంత దూరం వెళ్ళిన తరువాత కానీ యువకుడు గుర్తించలేదు.

కానీ ఒకరినొకరు బాగా అర్థం చేసుకోగలిగారు.

పదాలమీద ఆధారపడని భాష ఒకటి ఉండి ఉండాలి: ఇలాంటి అనుభవం నాకు ఇప్పటికే గొర్రెలతో ఉంది, ఇప్పుడది మనుషులతో ఏర్పడుతోంది అనుకున్నాడు యువకుడు.

అతడు చాలా కొత్త విషయాలు నేర్చుకుంటున్నాడు. కొన్ని విషయాలు కొత్తవేమీ కావు. అవి అతడికి అదివరకే అనుభవం అయినా, వాటిని ఎప్పుడూ అర్థం చేసుకోలేదు. వాటికి అతడు అలవాటు పడిపోయి ఉండటం వల్ల వాటిని అర్థం చేసుకోలేకపోయాడు. పదాలు లేని ఈ భాషని అర్థం చేసుకోవటం నేర్చుకుంటే తాను ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోగలనని అతడు గుర్తించాడు.

ఏమాత్రం కంగారుపడకుండా, తాపీగా టాంజియర్ ఇరుకు వీధులలో నడవాలని అతడు నిర్ణయించుకున్నాడు. అప్పుడే అతడు శకునాలను చదవగలుగుతాడు. దానికి చాలా ఓర్పు ఉండాలని అతడికి తెలుసు, గొర్రెల దగ్గర నేర్చుకున్న పాఠాలనే ఇప్పుడు కూడా అన్వయించుకుంటున్నానని అతడు మరోసారి గుర్తించాడు.

‘అన్ని విషయాలూ ఒకటే,’ అని వృద్ధుడు చెప్పాడు.

*

సూర్యోదయంతోటే గాజు వస్తువుల వ్యాపారి నిద్రలేచాడు, ప్రతిరోజు ఉండే ఆందోళన లాంటిదే ఆ రోజు కూడా అతనిలో నెలకొని ఉంది. అదే ప్రదేశంలో అతడు అనేక సంవత్సరాలుగా ఉంటున్నాడు: ఒక గుట్టపైన అతడికి దుకాణం ఉంది; అక్కడికి చాలా కొద్ది మంది కొనుగోలుదార్లు వస్తారు. ఇప్పుడు ఏ మార్పు చేద్దామన్నా చాలా ఆలస్యమైపోయింది. గాజు వస్తువులు కొనటం, అమ్మటం ఒక్కటే అతడికి తెలుసు. ఒకప్పుడు అతని దుకాణం చాలా ప్రసిద్ధి పొందింది. ధనవంతులైన అరబ్బు వ్యాపారస్తులు, ఫ్రెంచి, బ్రిటిషు భూగోళ శాస్త్రజ్ఞులు, జర్మన్ సైనికులు ఎందరో అతని దుకాణానికి వచ్చేవారు. ఆ రోజుల్లో గాజు వస్తువుల

అమ్మకం చాలా బాగుండేది. తాను బాగా ధనవంతుడిని అవుతానని, ముసలివాడు అయ్యేకొద్దీ చుట్టూ అందమైన అమ్మాయిలు ఉంటారని అతడు కలలు కనేవాడు.

కానీ కాలం గడిచిన కొద్దీ టాంజియర్ పరిస్థితి మారిపోయింది. దగ్గరలోని స్యూటా నగరం వేగంగా పెరిగి టాంజియర్‌లో వ్యాపారం పడిపోయింది. చాలా వరకు దుకాణాలు తరలిపోగా గుట్టమీద ఇప్పుడు కొన్ని చిన్న దుకాణాలు మిగిలి ఉన్నాయి. వీటిని చూడటానికి గుట్ట పైదాకా ఎక్కే ఆసక్తి ఎవరికీ లేదు.

కానీ గాజు వస్తువుల వ్యాపారికి మరోదారి లేకుండా పోయింది. అతడు తన జీవితంలో ముప్పై సంవత్సరాలపాటు గాజు వస్తువులు కొంటూ, అమ్ముతూ గడిపేశాడు; ఇప్పుడు వేరే ఏది చేయాలన్నా సమయం మించిపోయింది.

బజారులో అడపాదడపా వచ్చిపోయేవారిని చూస్తూ అతడు ఆ ఉదయమంతా గడిపాడు. సంవత్సరాల తరబడి అతడు ఇదే చేస్తున్నాడు, ఎవరు ఏ సమయంలో ఎటు వెళతారో అతనికి బాగా పరిచయం అయిపోయింది. కానీ ఆ రోజు భోజన సమయానికి ముందు ఒక యువకుడు తన దుకాణం ముందు ఆగాడు: అతడు సాధారణ వస్త్రధారణలో ఉన్నాడు. యువకుడి దగ్గర ఖర్చు పెట్టడానికి డబ్బులేమీ లేవని ఎంతో అనుభవమున్న వ్యాపారి కళ్ళు ఇట్టే పసిగట్టేశాయి. అయినా గానీ యువకుడు వెళ్ళిన తరువాతే భోజనానికి వెళదామని వ్యాపారి ఆగాడు.

*

ఆ దుకాణంలో పలు భాషలు మాట్లాడతారని తలుపుకి వేలాడదీసి ఉన్న కాగితం వెల్లడి చేస్తోంది. గల్లాపెట్టె వెనకకు ఒక వ్యక్తి రావటం యువకుడు గమనించాడు.

"కావాలంటే కిటికీలో ఉన్న గాజు సామగ్రిని శుభ్రం చేస్తాను," అన్నాడు యువకుడు, "ఇలా ఉంటే వాటిని కొనాలని ఎవరికీ అనిపించదు."

వ్యాపారి తన వైపు చూశాడు కానీ ఏమీ స్పందించలేదు.

"బదులుగా నాకు తినటానికి ఏమైనా ఇద్దువుగాని."

అయినప్పటికీ వ్యాపారి ఏమనలేదు. తనే ఏదో నిర్ణయం తీసుకోవాలని యువకుడు గ్రహించాడు. తన గుడ్డసంచిలో చలిచొక్కా ఉంది. ఆ ఎడారిలో దాని అవసరం అతడికి ఉండదు. దానిని బయటకి తీసి కిటికీలోని గాజు వస్తువులను శుభ్రం చేయసాగాడు. అరగంటలో కిటికీలోని గాజు వస్తువులన్నింటినీ శుభ్రం చేశాడు అతడు. అతడు పని చేస్తుండగా ఇద్దరు లోపలికి వచ్చి కొన్ని గాజు వస్తువులను కొనుక్కొని వెళ్ళారు.

శుభ్రం చేయటం పూర్తయిన తరువాత యువకుడు వ్యాపారిని తినడానికి ఏమైనా ఇవ్వమని అడిగాడు. "పద, బయటకు వెళ్ళి భోజనం చేద్దాం," అన్నాడు గాజు వస్తువుల వ్యాపారి.

ఎవరూ లేరన్న విషయాన్ని తెలియచేసే కాగితాన్ని తలుపుకి తగిలించి వాళ్ళు దగ్గరలో ఉన్న చిన్న హోటలుకి వెళ్ళారు. అక్కడ ఉన్న ఒకే ఒక్క బల్లదగ్గర వాళ్ళు కూర్చుంటుండగా వ్యాపారి నవ్వాడు.

"నువ్వు వస్తువులను శుభ్రం చెయ్యాల్సిన పనిలేదు," అతడు అన్నాడు. "ఆకలిగొన్న వ్యక్తికి అన్నం పెట్టడం కొరాన్ ప్రకారం నా ధర్మం."

"అయితే మరి నన్నెందుకు ఆ పని చేయనిచ్చావు?" యువకుడు అడిగాడు.

"గాజు వస్తువులు మురికిగా ఉన్నాయి. అదీగాక నువ్వూ, నేను కూడా మన మెదళ్ళను నకారాత్మక ఆలోచనల నుంచి శుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఉండింది."

భోజనం చెయ్యటం పూర్తి అయిన తరువాత యువకుడితో వ్యాపారి ఇలా అన్నాడు "నువ్వు నా దుకాణంలో పని చేస్తే బాగుంటుంది. ఈ రోజు నువ్వు పనిచేస్తుండగా ఇద్దరు కొనుగోలుదారులు వచ్చారు. ఇది మంచి శకునం."

మనుషులు శకునాల గురించి చాలా మాట్లాడుతుంటారు అనుకున్నాడు గొర్రెల కాపరి. గొర్రెలతో చాలా సంవత్సరాలుగా పదాలు లేని భాషని మాట్లాడుతున్నట్లు నేను గుర్తించనట్లే వాళ్ళేమంటున్నారో వాళ్ళకే తెలియదు.

"నువ్వు నా దగ్గర పని చేస్తావా?" వ్యాపారి అడిగాడు.

"నేను ఈ రోజంతా పని చేస్తాను," యువకుడు బదులిచ్చాడు. "నేను రాత్రంతా కూడా పనిచేసి దుకాణంలోని ప్రతి వస్తువూ శుభ్రం చేస్తాను. అందుకు బదులుగా రేపు నేను ఈజిప్టుకి చేరుకోటానికి డబ్బులు కావాలి."

వ్యాపారి నవ్వాడు. "నువ్వు ఒక సంవత్సరం మొత్తం గాజు సామాను తుడిచినా.... నువ్వు అమ్మిన ప్రతి వస్తువు మీదా కొంత డబ్బు నీకు ఇచ్చినా నువ్వు ఈజిప్టుకి వెళ్ళటానికి అప్పు చేయాల్సి ఉంటుంది. ఇక్కడికి అక్కడికి మధ్య వేలాది మైళ్ళ ఎడారి పరుచుకుని ఉంది."

ఒక క్షణకాలం సంపూర్ణ మౌనం ఆవరించుకుని, నగరమంతా నిదురపోతోందా అనిపించింది. బజార్లలో ఎటువంటి శబ్దాలు లేవు. వ్యాపారుల మధ్య వాదులాటలు లేవు, ప్రార్ధనా మందిరాల పైకెక్కి చేసే ప్రార్ధనలు లేవు. నిధి లేదు, పిరమిడ్లు లేవు. యువకుడి ఆత్మ మౌనంగా అయిపోయింది కాబట్టి ప్రపంచం కూడా మౌనంగా అయిపోయినట్లు ఉంది. హోటలు తలుపునుంచి శూన్య దృక్కులను ప్రసరిస్తూ అక్కడ కూర్చుని ఉండగా ఆ క్షణంలో తాను చనిపోయి అంతా అంతమైపోతే బాగుండునని అతడికి అనిపించింది.

వ్యాపారి కొంత ఆందోళనగా యువకుడి వంక చూశాడు. అతడిలో ఉదయం కనపడిన ఉత్సాహమంతా ఉన్నట్లుండి మాయమైపోయినట్లు అనిపించింది.

"నువ్వు మీ ఊరు తిరిగి వెళ్ళటానికి కావలసిన డబ్బులను నేను ఇవ్వగలుగుతాను బిడ్డా," అన్నాడు గాజు వస్తువుల వ్యాపారి.

యువకుడు ఏమీ మాట్లాడలేదు. అతడు లేచి నిలబడి బట్టలను సరిచేసుకుని గుడ్డ సంచిని చేత పట్టుకుని "నేను నీ దగ్గర పని చేస్తాను," అన్నాడు.

ఆ తరువాత చాలా సేపటికి "కొన్ని గొర్రెలు కొనుక్కోటానికి నాకు డబ్బులు కావాలి," అని జోడించాడు.



# రెండవ భాగం

గాజు వస్తువుల వ్యాపారి దగ్గర యువకుడు పనిచేయటం మొదలుపెట్టి దాదాపు ఒక నెల అవుతోంది. ఆ పని తనకి సంతోషాన్ని కలిగించేది కాదని అతడికి అర్థమయ్యింది. గల్లాపెట్టె దగ్గర కూర్చుని యజమాని గాజు వస్తువులు జాగ్రత్త, ఏదీ పగలగొట్టవద్దు అంటూ రోజంతా సణుగుతూ ఉంటాడు.

ముసలి వ్యాపారి సణుగుతూనే ఉన్నప్పటికీ తనని చక్కగా చూసుకుంటున్నందువల్లనే అతడు ఈ పనిలో కొనసాగుతున్నాడు. అతడు అమ్మిన ప్రతి వస్తువు మీద కొంత డబ్బు వస్తుంది. ఆపాటికే అతడు కొంత డబ్బు దాచగలిగాడు. ఆ రోజు ఉదయం కొన్ని లెక్కలు వేశాడు: ఇప్పుడు పని చేస్తున్నట్లే ప్రతిరోజూ పని చేస్తే కొన్ని గొర్రెలు కొనడానికి అతడు సంవత్సరమంతా పని చేయాల్సి ఉంటుంది.

"గాజు వస్తువులను ప్రదర్శించటానికి ఒక పెట్టె తయారు చేయాలని ఉంది," వ్యాపారితో యువకుడు చెప్పాడు. "దానిని బయట పెడితే గుట్ట కింద నుంచి వెళ్ళే వారిని ఆకర్షించగలుగుతాం."

"ఇప్పటివరకు నేను అటువంటిది చేయించలేదు," వ్యాపారి బదులిచ్చాడు. "వచ్చేపోయే వాళ్ళు దానికి తగిలి గాజు సామాను పగిలిపోతాయి."

"నేను నా గొర్రెలను మైదానానికి తీసుకెళ్ళినప్పుడు పాము కరిచి ఒకటి, రెండు చనిపోయే ప్రమాదముండేది. గొర్రెలకాపరి జీవితం అలాగే ఉంటుంది."

గాజు వస్తువులు కొనటానికి వచ్చిన కొనుగోలుదారుని వైపు వ్యాపారి తిరిగాడు. అతని అమ్మకాలు ఎప్పటికంటే బాగా ఉన్నాయి.... టాంజియర్ నగరంలోకెల్లా అత్యంత ఆకర్షణీయంగా నిలిచిన పాత రోజులు తిరిగి వచ్చాయా అన్నట్లుంది.

కొనుగోలుదారుడు వెళ్ళిపోయిన తరువాత "వ్యాపారం నిజంగా వృద్ధి చెందింది," యువకునితో అన్నాడు వ్యాపారి. "నా లాభాలు బాగున్నాయి. త్వరలో నువ్వుకూడా మళ్ళీ గొర్రెలను కొనుక్కోగలుగుతావు. ఇంతకంటే జీవితం నుంచి కోరుకునేది ఏముంటుంది?"

"అయినప్పటికీ శకునాలకు మనం స్పందించాలి," అనాలోచితంగా యువకుడు బదులిచ్చాడు. వ్యాపారి రాజుని కలవలేదు కాబట్టి ఆ మాటలు అన్నందుకు నాలుక కరుచుకున్నాడు.

'దీనిసే ఆదరించే సూత్రం, ఆరంభకుల అదృష్టం అంటారు. నీ గమ్యాన్ని చేరుకోవటంలో జీవితం నీకు సహాయపడాలని అనుకుంటుంది,' అని వృద్ధరాజు చెప్పాడు.

కానీ యువకుడు చెప్పింది వ్యాపారికి అర్థమయ్యింది. తన దుకాణంలో యువకుడు ఉండటమే ఒక మంచి శకునం. కాలం గడుస్తున్న కొద్దీ గల్లాపెట్టె గలగలలాడుతుండడంతో అతడిని పనిలో పెట్టుకున్నందుకు వ్యాపారి ఏనాడూ చింతించలేదు. అమ్మకాలు ఎక్కువగా ఉండవనుకుని అమ్మిన ప్రతి వస్తువు మీద యువకునికి ఎక్కువ డబ్బులు ఇస్తానని వ్యాపారి చెప్పాడు. దాంతో యువకుడికి డబ్బులు బాగానే వస్తున్నాయి. అతడు త్వరలోనే తన గొర్రెల వద్దకి వెళ్ళిపోతాడని అనుకున్నాడు.

"నువ్వు పిరమిడ్లకు వెళదామని ఎందుకనుకున్నావు?" మాట మార్చడానికన్నట్లు వ్యాపారి అడిగాడు.

"నేను వాటి గురించి చాలా రోజుల నుంచి వింటూ ఉన్నాను," తన కల గురించి ఏమీ చెప్పకుండా యువకుడు బదులిచ్చాడు. ఇప్పుడు నిధి ఒక

బాధాకరమైన జ్ఞాపకంగా ఉంది, దాని గురించి ఆలోచించకుండా ఉండటానికి అతడు ప్రయత్నిస్తున్నాడు.

"ఎడారిని దాటి కేవలం పిరమిడ్లను చూడాలనుకుంటున్న ఎవరినీ ఇక్కడ నేను చూడలేదు," అన్నాడు వ్యాపారి. "పిరమిడ్లంటే ఏముంది, అవి రాళ్ళ గుట్టలు మాత్రమే. కావాలంటే నీ ఇంటి పెరట్లో వాటిని కట్టుకోవచ్చు."

"నువ్వు ప్రయాణాలు చేయాలని ఎప్పుడూ కలగనలేదు," అప్పుడే దుకాణంలోకి అడుగుపెట్టిన కొనుగోలుదారుని వైపు తిరుగుతూ అన్నాడు యువకుడు.

రెండు రోజుల తరువాత వస్తువులను ప్రదర్శించటం గురించి యువకునితో వ్యాపారి మాట్లాడాడు.

"మార్పు అంటే నాకు అంతగా ఇష్టంలేదు," అతడు అన్నాడు. "ధనిక వ్యాపారి అయిన హసన్ లాంటి వాళ్ళం కాదు మనం. అతడు తన వ్యాపారంలో ఏదైనా పొరపాటు చేసినా అతడికి ముంచుకు పోయేది ఏమీ ఉండదు. కానీ మనిద్దరం ఆ పొరపాట్లను జీవితాంతం మోయాల్సి ఉంటుంది."

తన పొరపాటును తలచుకుని బాధపడుతూ వ్యాపారి చెప్పింది నిజమేనని యువకుడు అనుకున్నాడు.

"వస్తువులను ప్రదర్శించాలని నీకెందుకు అనిపించింది?"

"సాధ్యమైనంత త్వరగా నా గొర్రెల వద్దకు తిరిగి వెళ్ళాలని ఉంది. అదృష్టం మనవైపు ఉన్నప్పుడు దానిని మనం పూర్తిగా ఉపయోగించుకోవాలి. అది మనకు సహాయపడటానికి ఎంతగా ప్రయత్నిస్తోందో అంతగా మనం కూడా దానికి సహకరించాలి. దీనినే ఆదరించే సూత్రం లేదా ఆరంభకుల అదృష్టం అంటారు."

వ్యాపారి కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు. ఆ తరువాత ఇలా చెప్పాడు, “ప్రవక్త మాకు పవిత్ర గ్రంథమయిన కొరాన్‌ని ఇచ్చాడు. ఒక వ్యక్తి తప్పని సరిగా నిర్వర్తించాల్సిన విధులు అయిదున్నాయని అన్నాడు. అన్నిటికంటే ముఖ్యమయినది నిజమయిన దేవుడిని ఒక్కడినే నమ్మటం. మిగిలినవి: అయిదుసార్లు ప్రార్థనలు చేయటం, రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటం, పేదల పట్ల దాతృత్వం చూపటం.”

అతడు చెప్పటం ఆపాడు. ప్రవక్త గురించి చెప్పేటప్పుడు అతడి కళ్ళల్లో నీరు తిరిగింది. అతడు ఎంతో నిష్ఠాగరిష్ఠుడు. అతడిలో ఎంత అసహనం ఉన్నప్పటికీ ఇస్లాం బోధనల ప్రకారం నడుచుకోవాలనుకునే వ్యక్తి.

"అయిదవ విధి ఏమిటి?” యువకుడడిగాడు.

"నేను ప్రయాణం చెయ్యాలని ఎప్పుడూ కలగనలేదని రెండు రోజుల క్రితం నువ్వు నాతో అన్నావు,” వ్యాపారి బదులిచ్చాడు. “ప్రతి ముస్లిం తప్పనిసరిగా చేపట్ట వలసిన అయిదవ విధి పవిత్ర యాత్ర. జీవితంలో ఒక్కసారైనా మక్కాను తప్పనిసరిగా చూసి రావాలని మా మతం చెబుతుంది.”

"పిరమిడ్లకంటే కూడా మక్కా చాలా దూరంలో ఉంది. నేను యువకుడిగా ఉన్నప్పుడు సరిపడా డబ్బు కూడబెట్టి ఈ దుకాణం మొదలు పెడదామని అనుకున్నాను. ధనికుడినైన తరువాత మక్కాకి వెళ్ళగలుగుతానని అనుకున్నాను. నేను కొంత డబ్బు కూడబెట్టాను. కానీ నాజూకైన ఈ గాజు వస్తువులను ఇంకొకరికి అప్పగించి మక్కా యాత్ర చెయ్యలేకపోయాను. ఇన్ని సంవత్సరాలలో నా దుకాణం ముందు నుంచి ఎంతోమంది మక్కా ప్రయాణం చేశారు. వారిలో కొంతమంది ధనికులు ఉన్నారు, వారికి గూడు బళ్ళు, ఒంటెలు, సేవకులు ఉన్నారు. కానీ ఈ పవిత్ర యాత్ర చేసేవారిలో చాలామంది నాకంటే పేదవాళ్ళు.

"అక్కడికి వెళ్ళిన వాళ్ళందరూ తాము ఆ యాత్ర చేయగలిగిననందుకు సంతోషంగా తిరిగి వచ్చారు. ఆ యాత్రకి సంబంధించిన గుర్తులను తమ ఇళ్ళ తలుపులకు తగిలించారు. ఆ యాత్ర చేసిన వారిలో ఒకరు చెప్పులు కుట్టే వ్యక్తి. చెప్పులు బాగు చెయ్యటం ద్వారా అతని జీవిక కొనసాగుతుంది. అతడు ఎడారిగుండా ఒక సంవత్సరం పాటు ప్రయాణం చేశాడు. దానికంటే తోలు కొనుక్కోటానికి టాంజియర్ వీధుల్లో నడవటం ఎక్కువ అలసట కలిగిస్తుందని అతను అంటాడు."

"ఇప్పుడైనా మక్కాకు నువ్వు ఎందుకు వెళ్ళవు?" యువకుడు అడిగాడు.

"ఆ ఆలోచనే నన్ను సజీవంగా ఉంచుతోంది. ఎప్పుడూ ఒకే మాదిరిగా ఉండే రోజులను, మాట్లాడని ఈ గాజు వస్తువులను, అదే హోటలు బల్ల దగ్గర పగలు, రాత్రి భోజనం చెయ్యటం వంటి వాటిని ఎదుర్కోడానికి అదే బలాన్ని ఇస్తోంది. నా కల నిజమైతే నేను జీవించటానికి కారణం ఉండదేమోనన్న భయం ఉంది.

"నువ్వు నీ గొర్రెల గురించి, పిరమిడ్ల గురించి కలలు కంటావు. నువ్వు నీ కలలను సాకారం చేసుకోవాలనుకుంటున్నావు కాబట్టి నువ్వు నాలాగా కాదు. నేను మక్కా గురించి కేవలం కలలు కనాలని అనుకుంటున్నాను. ఎడారి దాటినట్టు, పవిత్ర రాయి ఉన్న స్థలాన్ని చేరుకున్నట్టు, దానిని తాకటానికి ముందు దాని చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేసినట్టు కొన్ని వేలసార్లు ఊహించుకున్నాను. నా పక్కన ఎవరు ఉంటారు, నా ముందు ఎవరు ఉంటారు, మేం చేసే ప్రార్థనలు, మాట్లాడుకునే మాటలు ఇలాంటివన్నీ ఊహించుకున్నాను. ఇదంతా వాస్తవంగా జరిగితే నేను నిరుత్సాహానికి గురి అవుతానేమోనన్న భయం, అందుకే నేను దాని గురించి కలలు కనటానికే ఇష్టపడతాను."

గాజు వస్తువులను ప్రదర్శించటానికి ఒక బీరువా తయారు చేయడానికి యువకుడికి ఆరోజు వ్యాపారి అనుమతిచ్చాడు. అందరి కలలూ ఒకే విధంగా సాకారం కావు.

*

మరో రెండు నెలలు గడిచాయి. గాజు వస్తువులతో ప్రదర్శనకు ఉంచిన బీరువా కారణంగా ఎక్కువ మంది కొనుగోలుదారులు దుకాణానికి వస్తున్నారు. ఇంకా ఆరు నెలలు పనిచేస్తే తాను స్పెయిన్‌కి తిరిగి వెళ్ళి అరవై గొర్రెలతోపాటు మరో అరవై గొర్రెలను కొనుక్కోగలనని యువకుడు అంచనా వేశాడు. ఈ విధంగా సంవత్సరం లోపే తన మందను రెట్టింపు చేసుకున్న వాడవుతాడు. అంతేకాకుండా ఇప్పుడు వాళ్ళ భాష మాట్లాడగలడు కాబట్టి అరబ్బులతో కూడా వ్యాపారం చేయగలుగుతాడు. బజారులో ఆ రోజు తరువాత అతడికి ఉరిం, తుమింలను ఉపయోగించే అవసరం రాలేదు. వ్యాపారికి మక్కా యాత్ర మాదిరిగానే తనకు ఈజిప్టు ఇప్పుడు అందని కల. ఏదేమైనా యువకుడు తన పనిలో సంతోషంగా ఉన్నాడు. విజయుడుగా టారిఫాలో అడుగుపెట్టే రోజు గురించి మాత్రమే ఇప్పుడు అతడు నిరంతరం ఆలోచిస్తున్నాడు.

'నీకు ఏం కావాలో నీకు ఎప్పుడూ తెలిసి ఉండాలి,' అని వృద్ధరాజు చెప్పాడు. యువకుడికి అది తెలుసు, ఇప్పుడు దానిని నిజం చేసుకోటానికి కృషి చేస్తున్నాడు. పరాయి దేశంలో అడుగుపెట్టి, ఒక దొంగతో దోచుకోబడి, ఏ పెట్టుబడీ లేకుండా మునుపటి కంటే రెట్టింపు మందను పొందటమే తన నిధి ఏమో!

తన పట్ల తనకి గర్వంగా ఉంది. గాజు వస్తువులతో వ్యాపారం ఎలా చేయాలో, పదాలు లేని భాషను.... ఇంకా శకునాలు వంటి కొన్ని ముఖ్యమైన విషయాలు అతడు నేర్చుకున్నాడు. కొండ ఎక్కిన తరువాత తేనీరు దొరికే ఏదైనా చక్కటి ప్రదేశం లేకపోవటం గురించి ఒక వ్యక్తి ఫిర్యాదు చేయటం ఒక మధ్యాహ్నం

యువకుడు విన్నాడు. శకునాలను గుర్తించటానికి అలవాటు పడిన యువకుడు వ్యాపారితో మాట్లాడాడు.

"కొండనెక్కిన వారికోసం తేనీరు అమ్ముదాం."

"ఇక్కడ చాలా చోట్ల తేనీరు దొరుకుతోంది కదా," అన్నాడు వ్యాపారి.

"కాని మనం గాజు పాత్రలలో టీ ఆమ్ముదాం. ప్రజలు తేనీటిని ఆస్వాదించడమే కాకుండా వారికి గాజు పాత్రలు కూడా కొనాలనిపిస్తుంది. అందం మనుషులను ఎంతగానో ఆకర్షిస్తుందని నేను విన్నాను."

అప్పటికి వ్యాపారి మిన్నకున్నాడు. కానీ ఆ మధ్యాహ్నం ప్రార్థన చేసి దుకాణం మూసివేసిన తరువాత అతడు యువకుడిని పిలిచి తనతో కూర్చోబెట్టుకుని అతడికి హుక్కా ఇచ్చాడు.

"నువ్వు దేనికోసం వెదుకుతున్నావు?" ముసలి వ్యాపారి అడిగాడు.

"ఇంతకు ముందే నీకీ విషయం చెప్పాను. నేను తిరిగి గొర్రెలను కొనుక్కోవాలి. దానికోసం డబ్బు సంపాదించాలి."

వ్యాపారి హుక్కా పాత్రలో మరో రెండు బొగ్గులు వేసి గొట్టంతో గట్టిగా ఒక దమ్ముపీల్చాడు.

"నేను ఈ దుకాణం పెట్టి ముప్పై సంవత్సరాలు అయ్యింది. గాజు వస్తువులలో మంచిదీ, మంచిదికాని దానితోపాటు వాటి గురించి తెలుసుకోవలసిందల్లా నేను తెలుసుకున్నాను. నాకు వాటి గుణగణాలన్నీ తెలుసు. మనం గాజు పాత్రలలో తేనీరు అమ్మితే దుకాణం పెరుగుతుంది. అప్పుడు నేను నా జీవిత విధానాన్ని మార్చుకోవాలి."

"అది మంచిదే కదా?"

"నేను ఇప్పుడున్న వాటికి అలవాటు పడిపోయాను. నువ్వు రాక ముందు నా మిత్రులు ఇక్కడి నుంచి వెళ్ళిపోయి బాగా ధనికులు కావటాన్ని లేదా దివాలా తీయటాన్ని తలుచుకుని నేను ఇదే ప్రాంతంలో కుళ్ళిపోతూ సమయం వృథా చేసుకుంటున్నానని భావించేవాడిని. అది నన్ను చాలా విచారగ్రస్తుడిని చేసేది. కానీ ఇప్పుడు చూస్తే పరిస్థితులు మరీ అంత దారుణంగా లేవని అనిపిస్తుంది. దుకాణం ఖచ్చితంగా నేననుకున్నంత పరిమాణంలోనే ఉంది. నేను మార్పును ఎదుర్కోలేను కాబట్టి నాకు దేనినీ మార్చాలని లేదు. ప్రస్తుతం నేనున్న పరిస్థితికి నేను అలవాటు పడ్డాను."

ఏం బదులివ్వాలో యువకుడికి తెలియలేదు. వ్యాపారి ఇంకా ఇలా అన్నాడు "నువ్వు నిజంగా నా పాలిట వరానివి. ఇంతకు ముందెన్నడూ చూడనిది ఈరోజు నేను అర్థం చేసుకున్నాను: విస్మరించిన ప్రతి వరమూ శాపం అవుతుంది. నాకు జీవితంలో ఇంకేమీ వద్దు. కాని సంపదవైపు, నేను ఇంతకు ముందు చూడని క్షితిజం వైపు చూసేలా నువ్వు నన్ను ఒత్తిడిచేస్తున్నావు. వాటిని చూసిన తరువాత, నాకున్న అవకాశాలను గుర్తించాక నువ్వు రాక మునుపు వ్యథ చెందిన దానికంటే ఇప్పుడు ఎక్కువ వ్యథచెందుతాను. ఎందుకంటే నేను సాధించగలిగిన విషయాలు తెలుసుకుని, అలా చేయటం ఇష్టంగాలేకపోవటం నాకు బాధను కలిగిస్తుంది."

టారిఫాలో రొట్టెలు అమ్మే వ్యక్తితో ఏమీ అనకుండా మిన్నకుండటం మంచిదే అయ్యిందని యువకుడు తనలో తాను అనుకున్నాడు.

సూర్యుడు అస్తమిస్తూ ఉండగా వాళ్ళిద్దరూ హుక్కాపీలుస్తూ కూచున్నారు. వాళ్ళిద్దరూ అరబ్బీ భాషలో మాట్లాడుకుంటున్నారు. అలా మాట్లాడగలుగుతున్నందుకు యువకుడికి గర్వంగా ఉంది. ప్రపంచంలో

నేర్చుకోదగినవన్నీ తన గొర్రెలు నేర్పగలవని ఒకనాడు అతడు అనుకున్నాడు కాని అవి అతడికి అరబ్బీ భాషను ఎన్నటికీ నేర్పగలిగేవి కావు.

ముసలి వ్యాపారిని చూస్తూ గొర్రెలు నేర్పలేనివి ప్రపంచంలో ఇంకా ఎన్నో విషయాలు ఉండి ఉంటాయనుకున్నాడు యువకుడు. నిజానికి అవి నిరంతరం తిండీ, నీళ్ళకోసం చూస్తుంటాయి. బహుశా అవి నేర్పటం లేదేమో, తానే వాటినుంచి నేర్చుకుంటున్నాడేమో.

'మాక్తుబ్,' చివరికి వ్యాపారి అన్నాడు.

"అంటే ఏమిటి?"

"నువ్వు దీనిని అర్థం చేసుకోవాలంటే ఈ దేశంలో పుట్టాలి. బహుశాః నీ భాషలో దీన్ని 'తథాస్తు,' అంటారేమో" జవాబిచ్చాడు.

హుక్కా పాత్రలోని బొగ్గులను ఆర్పేస్తూ గాజు పాత్రలలో తేనీటి అమ్మకాన్ని మొదలు పెట్టవచ్చని యువకుడితో అన్నాడు వ్యాపారి. ఒక్కొక్కసారి నదీ ప్రవాహాన్ని పట్టి ఉంచటం సాధ్యం కాదు.

*

గుట్టనెక్కి పైకి వచ్చేసరికి మనుషులు అలసిపోయేవారు. అయితే అక్కడ తాజాదనాన్ని నింపే పుదీనా తేనీరు అమ్మే గాజు వస్తువుల దుకాణం చూసి, అందమైన గాజు పాత్రలలో ఇచ్చే తేనీరు తాగటానికి వాళ్ళు దుకాణంలోకి అడుగుపెట్టేవారు.

"మా ఆవిడకి ఈ ఆలోచన ఎప్పుడూ రాలేదు," అన్నాడొకడు, ఆ రోజు రాత్రి అతనింటికి అతిధులు విందుకు రాబోతున్నారు. అందుకని అతడు కొన్ని గాజు పాత్రలు కొన్నాడు. "ఆ గాజు పాత్రల అందానికి అతిధులు చకితులవుతారు. గాజు పాత్రలో తేనీరు ఎప్పుడూ అద్భుతంగా ఉంటుంది. ఎందుకంటే గాజు పాత్రలో దాని

వాసన అలాగే ఉంటుంది," అని రెండవ వ్యక్తి అన్నాడు. "గాజు పాత్రలకి అద్భుతమయిన శక్తులు ఉన్నాయి కాబట్టి వాటిని తేనీరుకోసం ఉపయోగించటం ప్రాగ్దేశాల సాంప్రదాయ," మని మూడవ వ్యక్తి అన్నాడు.

అనతికాలంలోనే ఆ వార్త అంతటా వ్యాపించింది. ఎంతోకాలంగా ఉన్న ఒక దుకాణం వ్యాపారంలో కొత్తగా ఏదో చేస్తోందని అది చూడటానికి ప్రజలు తండోపతండాలుగా గుట్టనెక్కసాగారు. గాజు పాత్రలలో తేనీరు అమ్మే దుకాణాలను ఇతరులు కూడా తెరిచారు. కానీ అవి గుట్టపైన లేవు కాబట్టి వాటి వ్యాపారం అంతగా లేదు.

చివరికి వ్యాపారి మరో ఇద్దరు పనివాళ్ళను  పెట్టుకోవలసి వచ్చింది. అతడు గాజు పాత్రలతో పాటు పెద్ద ఎత్తున తేయాకు పొడిని దిగుమతి చేసుకోసాగాడు. కొత్తవాటిపట్ల మోజు ఉండే స్త్రీ, పురుషులు అతడి దుకాణానికి రాసాగారు.

ఆ విధంగా నెలలు గడిచిపోతున్నాయి.

*

సూర్యోదయం కాకముందే యువకుడు నిద్రలేచాడు. ఆఫ్రికా ఖండంపై అతడు అడుగుపెట్టి పదకొండు నెలల, తొమ్మిది రోజులు గడిచాయి.

ఆ రోజుకోసమని ప్రత్యేకంగా కొనుక్కున్న తెల్లటి అరబ్బీ దుస్తులు వేసుకున్నాడు. తలమీద ఒక బట్ట వేసుకుని అది చెదిరిపోకుండా ఒంటె చర్మంతో తయారు చేసిన వృత్తాకారపు పట్టీని పెట్టుకున్నాడు. తన కొత్త చెప్పులను తొడుక్కుని నిశ్శబ్దంగా కిందకి దిగాడు.

నగరం ఇంకా నిద్దుర మత్తులోనే ఉంది. ఒక రొట్టె ముక్క తీసుకుని గాజుపాత్ర నుంచి వేడిగా తేనీరు తాగాడు. ఆ తరువాత సూర్యోదయం అవుతుండగా హుక్కా పీలుస్తూ ద్వారంలో కూర్చున్నాడు. హుక్కాపీల్చటం అయిపోయిన

తరువాత చేతిని జేబులోకి పోనిచ్చి బయటికి తీసిన దానిని చూస్తూ అలాగే కొంచెం సేపు కూర్చుండిపోయాడు.

అది ఒక డబ్బుల కట్ట. నూట ఇరవై గొర్రెలను, తిరుగు ప్రయాణానికి టిక్కెట్టుని, ఆఫ్రికానుంచి తన దేశానికి వస్తువులను దిగుమతి చేసుకునేందుకు అనుమతి పత్రాన్ని ఆ డబ్బుతో కొనుక్కోవచ్చు.

వ్యాపారి లేచి, దుకాణం తెరిచేదాకా అతడు ఓపిగ్గా ఎదురు చూశాడు. ఆ తరువాత ఇద్దరూ మరోసారి తేనీరు తాగటానికి వెళ్ళారు. “నేను ఈ రోజు వెళ్ళిపోతున్నాను,” అన్నాడు యువకుడు. “నా దగ్గర గొర్రెలు కొనటానికి సరిపోయేటంత డబ్బు ఉంది, నీ దగ్గర మక్కాకి వెళ్ళటానికి కావలసినంత డబ్బు ఉంది.”

వ్యాపారి ఏమీ బదులివ్వలేదు.

"నీ ఆశీర్వచనాలు నాకు కావాలి," అడిగాడు యువకుడు.

"నువ్వు నాకెంతో సహాయం చేశావు," ఏమీ మాట్లాడకుండా వ్యాపారి తేనీరు తయారు చేస్తున్నాడు. ఆ పని అయిపోయిన తరువాత అతడు యువకుడివైపు తిరిగాడు.

"నిన్ను చూసి నేను ఎంతో గర్వపడుతున్నాను," వ్యాపారి అన్నాడు. "నా గాజు పాత్రల దుకాణంలోకి నువ్వు కొత్త అనుభూతిని తెచ్చావు. కానీ నేను మక్కా వెళ్ళటం లేదని నీకు తెలుసు. నువ్వు గొర్రెలను కొనబోవటం లేదని కూడా నీకు తెలుసు."

"నీకు ఎవరు చెప్పారు?" ఆశ్చర్యపోతూ యువకుడు అడిగాడు.

"అలాగే జరుగుగాక," అన్నాడు గాజు వస్తువుల వ్యాపారి.

అలా అంటూ అతడు యువకుడిని ఆశీర్వదించాడు.

*

యువకుడు తన గదికి వెళ్ళి తన వస్తువులన్నింటినీ సర్దుకున్నాడు. వాటితో మూడు సంచులు నిండాయి. బయటికి రాబోతుండగా గదిలో ఒక మూల తన పాత గుడ్డ సంచి కనిపించింది. అది ఉండలా పడి ఉంది. అతడు దాని గురించే మరిచిపోయాడు. బజారులో ఎవరికైనా ఇద్దామని సంచిలోంచి చలిచొక్కాని బయటికి తీస్తుండగా అందులోంచి రెండు రాళ్ళు బయట పడ్డాయి: ఉరిం, తుమిం.

ఆ రాళ్ళు అతడికి వృద్ధరాజుని జ్ఞాపకం చేశాయి. అతడి గురించి ఆలోచించి ఎంతకాలం అయిపోయిందో అనుకుని యువకుడు ఆశ్చర్యపోయాడు. స్పెయిన్‌కు సగర్వంగా తిరిగి వెళ్ళాలనే ఉద్దేశంతో అతడు ఈ సంవత్సరకాలంగా నిరంతరం పని చేస్తూ డబ్బు కూడబెడుతున్నాడు.

‘కలగనటం ఎప్పుడూ మానవద్దు,’ అన్నాడు వృద్ధరాజు. ‘శకునాలని అనుసరించు.’

ఉరిం, తుమింలను యువకుడు చేతిలోకి తీసుకోగానే వృద్ధరాజు తన పక్కనే ఉన్నాడన్న ఒక వింత అనుభూతి అతడికి మరోసారి కలిగింది. అతడు ఒక సంవత్సరంపాటు కష్టించి పనిచేశాడు, అతడు వెళ్ళవలసిన సమయం వచ్చిందని ఇప్పుడు శకునాలు చెబుతున్నాయి.

గొర్రెలు తనకు అరబ్బీ భాష నేర్పించకపోయినా, అంతకు ముందు చేసినదే మళ్ళీ చెయ్యటానికి నేను వెళుతున్నాను అనుకున్నాడు యువకుడు.

కానీ అంతకంటే ముఖ్యమయిన విషయాన్ని గొర్రెలు అతడికి నేర్పించాయి. ప్రపంచంలో అందరూ అర్థం చేసుకునే భాష ఒకటి ఉంది, దుకాణంలో పరిస్థితుల్ని మెరుగుపరచటానికి ఆ భాషనే యువకుడు ఇంత కాలమూ ఉపయోగించాడు. ప్రేమతో, ఒక ఉద్దేశంతో లీనమై చేసిన హృదయపూర్వకమైన ప్రయత్నాల్ని తెలియచేసే

భాష అది. మనఃపూర్వకంగా నమ్మి, కోరుకున్న దాని అన్వేషణలో ఆ భాష ఒక భాగం. టాంజియర్ ఇప్పుడు ఒక వింత పట్టణమేమీ కాదు, ఈ ప్రదేశాన్ని జయించినట్లే తాను ప్రపంచాన్ని కూడా జయించగలనన్న భావం అతనికి కలిగింది.

'నువ్వు ఏదైనా కోరుకున్నప్పుడు, దానిని సాధించటంలో నీకు తోడ్పడటానికి ఈ విశ్వమంతా కుట్ర పన్నుతుంది,' వృద్ధరాజు చెప్పాడు.

కానీ దోపిడీకి గురికావటం గురించీ, అంతులేని ఎడారుల గురించీ, తమ కలలు తెలిసీ వాటిని సాకారం చేసుకోని మనుషుల గురించీ వృద్ధరాజు ఏమీ చెప్పలేదు. పిరమిడ్లంటే కేవలం రాళ్ళ గుట్టలనీ, వాటిని ఎవరైనా తమ పెరట్లో కట్టుకోవచ్చని కూడా వృద్ధరాజు చెప్పలేదు. అంతకుముందు కంటే పెద్ద మందను కొనగలిగినంత ధనం సమకూరినప్పుడు ఆ పని చెయ్యమని చెప్పటం అతడు మరిచిపోయాడు.

యువకుడు తన గుడ్డ సంచిని తీసుకుని మిగిలిన సామానుతోపాటు పెట్టాడు. కిందకి వెళ్ళిచూడగా యజమాని ఒక పరదేశితో మాట్లాడుతూ ఉన్నాడు. మరో ఇద్దరు గాజు పాత్రలతో తేనీరు తాగుతూ దుకాణంలోని వస్తువులను చూస్తున్నారు. ఉదయం దుకాణంలో ఈ సమయానికి సాధారణంగా ఉండే కంటే ఎక్కువగానే రద్దీ ఉందని చెప్పాలి. అతడు నిలబడిన చోటునుంచి చూస్తే ముసలి వ్యాపారి జుట్టు వృద్ధరాజు జుట్టు మాదిరి ఉండటం అతడు మొదటిసారి గమనించాడు. టాంజియర్‌లో మొదటి రోజున తినటానికి తన దగ్గర ఏమీ లేక, ఎక్కడికి వెళ్ళాలో తెలియక ఉన్నప్పుడు కలిసిన మిఠాయి వర్తకుడి నవ్వు అతడికి గుర్తుకొచ్చింది. ఆ నవ్వు కూడా వృద్ధరాజు నవ్వులానే ఉంది.

వృద్ధరాజు ఇక్కడకు వచ్చి తన ముద్రను వేసి వెళ్ళినట్లుగా ఉంది. కానీ వీళ్ళెవ్వరూ వృద్ధరాజుని ఎన్నడూ కలవనే లేదు. అయితే తమ జీవిత గమ్యాన్ని సాధించుకోటానికి ప్రయత్నం చేస్తున్న వాళ్ళకి తాను ఎప్పుడూ సహాయపడుతుంటానని అతడు చెప్పాడు.

వ్యాపారికి వీడ్కోలు చెప్పకుండానే అతడు అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. మిగిలిన వాళ్ళ ముందు ఏడవటం అతడికి ఇష్టంలేదు. ఈ ప్రదేశమూ, ఇక్కడ నేర్చుకున్న మంచి విషయాలూ ఎప్పటికీ తన తలపులలోనే ఉంటాయి. అతడిలో ఇప్పుడు ఆత్మవిశ్వాసం మెండుగా ఉంది, ప్రపంచాన్ని జయించగలనని అతడికి అనిపిస్తోంది.

'కాని తిరిగి నాకు తెలిసిన మైదానాలకే వెళుతున్నాను, అక్కడ గొర్రెల మందను సాకుతాను,' తనకి తాను అతడు ఈ విషయాన్ని పదేపదే చెప్పుకున్నాడు, కానీ అతడు తీసుకున్న నిర్ణయం అతనికి ఏ మాత్రం సంతోషాన్ని ఇవ్వటంలేదు. ఒక లక్ష్యం కోసం అతడు ఒక సంవత్సరమంతా కష్టించి పనిచేశాడు. కాని ఆ లక్ష్యానికి దగ్గర అవుతున్న కొద్దీ అది అంత ముఖ్యమయినదిగా అనిపించటం లేదు. బహుశా అది అతడి నిజమయిన లక్ష్యం కాదేమో.

ఎవరికి తెలుసు... గాజు వస్తువుల వ్యాపారి మాదిరి మక్కాకి వెళ్ళకుండా అలా వెళ్ళాలని కోరుకుంటూ జీవితమంతా గడిపెయ్యటమే మంచిదేమో - తనను తాను మభ్యపరచుకుకోటానికి ప్రయత్నిస్తూ అనుకున్నాడు యువకుడు.

కాని ఉరిం, తుమిింలను చేతిలో పట్టుకునేసరికి వాటినుంచి వృద్ధరాజు బలం, స్థిరనిర్ణయం అతడిలోకి ప్రసరించినట్లయింది. యాదృచ్ఛికమో, లేక అది శకునమేమోనని యువకుడు అనుకున్నాడు - అతడు మొదటి రోజు వచ్చిన హోటలుకి చేరుకున్నాడు. అక్కడ దొంగ లేడు. యజమాని అతడికి ఒక కప్పు తేనీరు తెచ్చాడు.

నేను ఎప్పుడు కావాలంటే అప్పుడు గొర్రెల కాపరిని కావచ్చు అనుకున్నాడు యువకుడు. గొర్రెలను ఎలా సాకాలో నేను నేర్చుకున్నాను, ఆ విషయాలేవీ నేను మరిచిపోలేదు. కాని ఈజిప్టులోని పిరమిడ్లకు వెళ్ళటానికి మరో అవకాశం రాదేమో.

బంగారు కవచం తొడుక్కున్న వృద్ధుడికి తన గతం తెలుసు. అతడు నిజంగా రాజు, జ్ఞానియైన రాజు.

యాండలూసియా మైదానాలు రెండు గంటల దూరంలోనే ఉన్నాయి, కానీ తనకూ, పిరమిడ్లకూ మధ్య అనంతమైన ఎడారి ఉంది. ఇదే పరిస్థితిని మరో రకంగా కూడా చూడవచ్చని యువకుడికి అనిపించింది. అతడు తన నిధికి రెండు గంటలు దగ్గరయ్యాడు.... ఆ రెండు గంటలే ఒక సంవత్సరమంతా వ్యాపించాయన్నది వేరే విషయం.

'నా గొర్రెలమందకు ఎందుకు తిరిగి వెళ్ళాలనుకుంటున్నానో నాకు తెలుసు,' యువకుడు అనుకున్నాడు. నాకు గొర్రెల గురించి తెలుసు, అవి నాకు ఏ రకంగానూ సమస్యకావు, అవి మంచి నేస్తాలు కూడా అవుతాయి. ఇంకోవైపు ఎడారి నాకు నేస్తమవుతుందో లేదో తెలియదు, ఆ ఎడారిలోనే తన నిధి కోసం అతడు వెతకాలి. నిధి దొరకకపోతే ఎలాగూ ఇంటికి వెళ్ళిపోవచ్చు. ఇప్పుడు నా దగ్గర కావలసినంత డబ్బు ఉంది, సమయం ఉంది. ఎందుకు ప్రయత్నించకూడదు?

ఉన్నట్టుండి అతడు ఎంతో సంతోషానికి గురయ్యాడు. తను ఎప్పుడు కావాలంటే అప్పుడు గొర్రెల కాపరి కావచ్చు. కావాలంటే గాజు వస్తువుల వ్యాపారి కూడా కావచ్చు. ప్రపంచంలో దాగి ఉన్న నిధులు ఇంకా ఎన్ని ఉన్నాయో.... అతడికి ఓ కల వచ్చింది, అతడు ఒక రాజును కలిశాడు. అది అందరికీ ఎదురయ్యే అనుభవం కాదు!

హోటలునుంచి బయటకు వస్తూ అతడు తన ప్రణాళిక తయారు చేసుకోసాగాడు. గాజు వస్తువుల వ్యాపారికి సరుకు సరఫరా చేసే ఒక వ్యక్తి ఒంటెల బిడారుతో ఎడారి గుండా ప్రయాణించే వాడని అతడికి గుర్తుకు వచ్చింది. ఉరిం, తుమింలను చేతిలో పట్టుకున్నాడు. ఈ రాళ్ళ కారణంగా అతడు తిరిగి తన నిధి అన్వేషణను కొనసాగిస్తున్నాడు.

'ఎవరైనా తమ జీవిత గమ్యాన్ని సాధించుకోవాలని అనుకుంటున్నప్పుడు నేను ఎప్పుడూ వాళ్ళకి దగ్గరలోనే ఉంటాను,' వృద్ధ రాజు అతనితో అన్నాడు.

సరుకుల సరఫరాదారుని గోదాము దగ్గరకు వెళ్ళి పిరమిడ్లు నిజంగా అంత దూరంగా ఉన్నాయా అని తెలుసుకుంటే ఏం పోతుంది?

*

పశువుల చెమట, దుమ్ము వాసనలు వస్తున్న చోట ఒక బల్లమీద ఒక ఆంగ్లేయుడు కూర్చుని ఉన్నాడు. కొంత గోదాముగాను, కొంత పశువుల కొట్టంగానూ వాడుతూ ఉన్న భవనమది. రసాయనిక పత్రిక పేజీలను తిరగవేస్తూ చివరికి ఇటువంటి ప్రదేశంలో తేలతానని ఎన్నడూ ఊహించలేదని ఆంగ్లేయుడు అనుకున్నాడు. 'పదేళ్ళు విశ్వవిద్యాలయంలో పనిచేశాను, ఇప్పుడు ఈ పశువుల కొట్టంలో ఉన్నాను,' అనుకున్నాడు.

కానీ అతనికి అక్కడకు రాకతప్పింది కాదు. అతడు శకునాలను నమ్ముతాడు. తన జీవితాన్నీ, అధ్యయనాన్నీ విశ్వం యొక్క ఒకేఒక్క నిజమైన భాషను కనుగొనటానికి అంకితం చేశాడు. మొదట అతడు ఎస్పరాంటో నేర్చుకున్నాడు, తరువాత ప్రపంచంలోని మతాల గురించి తెలుసుకున్నాడు, ఇప్పుడు పరుసవేదాన్ని అధ్యయనం చేస్తున్నాడు. అతడు ఎస్పరాంటో మాట్లాడగలుగుతాడు, ప్రపంచ మతాలన్నింటినీ అర్థం చేసుకున్నాడు, కానీ ఇంకా పరుసవేది కాలేకపోయాడు. ముఖ్యమైన ప్రశ్నల వెనకనున్న సత్యాలను కనుగొనగలిగాడు కానీ ఒక దశ తరువాత ఇంకా ముందుకు సాగలేకపోతున్నాడు. ఎవరైనా ఒక పరుసవేదితో సంబంధం ఏర్పరచుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. పరుసవేదులు చాలా వింత వ్యక్తులు. వాళ్ళు ఎప్పుడూ తమ గురించే ఆలోచించుకుంటూ అతడికి సహాయం చేసేందుకు నిరాకరించారు. అన్నింటిలోకి

క్లిష్టమైన తాత్వికుని రాయి వెనకనున్న రహస్యాన్ని వాళ్ళు కనుగొనలేదేమో, అందుకే వాళ్ళు తమకి తెలిసింది ఎవ్వరికీ చెప్పటం లేదేమో ఎవరికి తెలుసు.

ఇప్పటికే అతడు తన తండ్రి నుంచి వచ్చిన ఆస్తిలో చాలావరకు 'తాత్వికుని రాయి' అన్వేషణలో కరిగించిపేశాడు. ప్రపంచ ప్రఖ్యాత గ్రంథాలయాలన్నింటిలో అతడు ఎంతో సమయాన్ని వెచ్చించాడు, పరుసవేదం గురించి ముఖ్యమైన, అరుదైన పుస్తకాలన్నింటినీ కొన్నాడు. ఒక ప్రఖ్యాత అరబ్బు పరుసవేది చాలా సంవత్సరాల క్రితం ఇంగ్లాండును సందర్శించాడని ఒక పుస్తకంలో చదివాడు. అతడికి రెండు వందల ఏళ్ళకు పైగా ఉంటాయని చెబుతారు, అతడు తాత్వికుని రాయినీ, 'జీవామృతాన్ని' కనుగొన్నాడని కూడా చెబుతారు. ఈ కథ వల్ల ఆంగ్లేయుడు ఎంతగానో ప్రభావితుడయ్యాడు. ఎడారిలో పురావస్తు పరిశోధనకు వెళ్ళి వచ్చిన తన మిత్రుడు అసాధారణ శక్తులు ఉన్న ఒక అరబ్బు గురించి చెప్పకపోతే అదంతా ఒక కట్టుకథగా జమకట్టేవాడు.

"అతడు అల్ - ఫయ్యూం అన్న ఒయాసిస్సు వద్ద ఉంటాడు," అతని మిత్రుడు చెప్పాడు. "అతడి వయస్సు రెండు వందల సంవత్సరాలకు పైనేనని, అతడు ఏ లోహాన్ని అయినా బంగారంగా మార్చగలడని ప్రజలు చెప్పుకుంటూ ఉంటారు."

ఆంగ్లేయుడి ఉత్సాహానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి. అతడు అంతకు ముందు పెట్టుకున్న పనులన్నింటినీ రద్దు చేసుకున్నాడు. తన దగ్గరున్న ముఖ్యమైన పుస్తకాలన్నింటినీ జమచేసుకుని ఇప్పుడు దుమ్ము, పశువుల వాసనలతో నిండిన గోదాములో కూర్చుని ఉన్నాడు. అల్ - ఫయ్యూం మీదుగా సహారా ఎడారిని దాటేందుకు బయట ఒక పెద్ద ఒంటెల బిడారు సిద్ధమవుతోంది.

ఆ పరుసవేదిని పట్టుకుని తీరతాను అనుకున్నాడు ఆంగ్లేయుడు. దాంతో పశువుల వాసన కొంత భరింపశక్యంగా మారింది.

ఒక యువ అరబ్బు బరువైన సామానుతో లోపలికి వచ్చి ఆంగ్లేయుడిని పలకరించాడు.

"ఎక్కడికి వెళుతున్నావు?" యువ అరబ్బు అడిగాడు.

"ఎడారిలోకి," అంటూ బదులిచ్చి అతడు పుస్తకం చదవటంలో మునిగిపోయాడు. ఈ సమయంలో ఎవరితోనూ మాట్లాడాలని అతనికి లేదు. పరుసవేది తప్పనిసరిగా తనని పరీక్షిస్తాడు కాబట్టి ఇన్ని సంవత్సరాలలో నేర్చుకున్నదానిని ఇప్పుడు పునశ్చరణ చేయాలి.

యువ అరబ్బు కూడా ఒక పుస్తకం బయటికి తీసి చదువుకోసాగాడు. అది స్పానిష్ భాషలోని పుస్తకం. అదీ మంచిదే అనుకున్నాడు ఆంగ్లేయుడు. అతడికి అరబ్బీ కంటే స్పానిష్ భాష బాగా వచ్చు, ఈ యువకుడు కూడా ఆల్ – ఫయ్యూంకి వెళుతుంటే తనకి ముఖ్యమైన పనులేవీ లేనప్పుడు ఇతడితో మాట్లాడవచ్చు.

*

పుస్తకం మొదట్లో ఉన్న అంత్యక్రియల దృశ్యాన్ని మరొకసారి చదవటానికి ప్రయత్నిస్తూ 'గత రెండు సంవత్సరాలుగా ఈ పుస్తకం చదువుదామని ప్రయత్నిస్తూనే ఉన్నానుగానీ మొదటి కొద్ది పేజీలకు మించి ముందుకు సాగటం లేదు,' అనుకున్నాడు యువకుడు. మధ్య మధ్యలో అడ్డు పడటానికి రాజు లేకపోయినా ఆ పుస్తకంపై ఏకాగ్రత కుదరటం కష్టంగా ఉంది.

తాను తీసుకున్న నిర్ణయం పట్ల అతడికి ఇంకా కొన్ని అనుమానాలు ఉన్నాయి. కాని అతడికి మాత్రం ఒక విషయం అర్థమయ్యింది: నిర్ణయం తీసుకోవటమన్నది ఆరంభం మాత్రమే. ఎవరైనా నిర్ణయం తీసుకున్నారంటే అది

ఉధృతమైన ప్రవాహంలోకి దూకటం లాంటిది, ఆ నిర్ణయం తీసుకున్నప్పుడు ఊహించనైనా ఊహించని ప్రదేశాలకు ఆ ప్రవాహం వారిని తీసుకెళుతుంది.

నేను నిధిని అన్వేషించాలన్న నిర్ణయానికి వచ్చినప్పుడు గాజు పాత్రల దుకాణంలో పని చేయాల్సి వస్తుందని నేను ఊహించలేదు అనుకున్నాడు. ఈ బిడారులో భాగం కావాలన్న నిర్ణయం కూడా నాదే అయ్యుండొచ్చు. కాని అది నన్ను ఎక్కడికి తీసుకెళుతుందో నాకు తెలియదు.

పక్కనే ఆంగ్లేయుడు పుస్తకం చదువుకుంటూ ఉన్నాడు. అతడు అంత స్నేహపూర్వకంగా లేడు. యువకుడు లోపలికి వచ్చినపుడు అతడు చికాకుపడినట్లున్నాడు కూడా. వాళ్ళు మిత్రులు అయ్యేవారే కానీ ఆంగ్లేయుడు సంభాషణను తుంచేశాడు.

యువకుడు తన పుస్తకాన్ని మూసివేశాడు. ఆంగ్లేయుడిలా అనిపించే ఏ పనీ తాను చేయకూడదని అతడు అనుకున్నాడు. అతడు తన జేబులోంచి ఉరిం, తుమింలను బయటకు తీసి వాటితో ఆడుకోసాగాడు.

"ఉరిం, తుమిం!" అంటూ ఆంగ్లేయుడు అరిచాడు.

మరుక్షణమే యువకుడు వాటిని తన జేబులో వేసేసుకున్నాడు.

"ఇవి అమ్మకానికి కావు," యువకుడన్నాడు.

"వాటి విలువ అంత ఎక్కువ ఏమీ ఉండదు," బదులిచ్చాడు ఆంగ్లేయుడు. "వాటిని రాతి స్ఫటికాలతో తయారు చేస్తారు. అటువంటి రాళ్ళు భూమి మీద కోట్ల కొద్దీ ఉన్నాయి. వీటి గురించి తెలిసిన వాళ్ళు మాత్రం ఇవి ఉరిం, తుమిం అని గమనించగలుగుతారు. ప్రపంచంలోని ఈ ప్రాంతంలో కూడా ఇవి దొరుకుతాయని నాకు తెలియదు."

"వీటిని ఒక రాజు నాకు బహుమతిగా ఇచ్చాడు," యువకుడు చెప్పాడు.

ఆంగ్లేయుడు బదులేమీ ఇవ్వకుండా తన చేతిని జేబులోకి పోనిచ్చి యువకుడి దగ్గర ఉన్నటువంటివే రెండు రాళ్ళను బయటకు తీశాడు.

"నీకు వాటిని ఒక రాజు ఇచ్చాడా?" అని ఆంగ్లేయుడు అడిగాడు.

"నా వంటి గొర్రెల కాపరితో ఒక రాజు మాట్లాడి ఉంటాడంటే నీకు నమ్మశక్యంగా ఉన్నట్లు లేదు," ఆ సంభాషణను అక్కడితో ముగించాలన్న ఉద్దేశంతో యువకుడు అన్నాడు.

"కానేకాదు. మిగిలిన ప్రపంచమంతా అంగీకరించ నిరాకరించిన రాజుని మొదటిగా గుర్తించింది గొర్రెల కాపరులే. అందుకే రాజులు గొర్రెల కాపరులతో మాట్లాడటం ఏమంత ఆశ్చర్యకరంగా ఉండదు."

తాను ఏమి మాట్లాడుతున్నాడో యువకుడికి అర్థం కాదేమోనన్న అనుమానంతో అతడు ఇంకా ఇలా కొనసాగించాడు: "ఇది బైబిలులో ఉంది. ఇదే పుస్తకం నాకు ఉరిం, తుమింల గురించి నేర్పింది. ఈ ఒక్క రకమైన భవిష్యత్తు వాణిని మాత్రమే దేవుడు అనుమతించాడు. వీటిని మత గురువులు బంగారు కవచాల్లో పెట్టుకుని ఉండేవారు."

తాను అక్కడ ఉన్నందుకు యువకుడిలో ఉన్నట్లుండి సంతోషం పొంగిపొర్లింది.

"బహుశా ఇది ఒక శకునమేమో," ఆంగ్లేయుడు సగం పైకి అన్నాడు.

"నీకు శకునాల గురించి ఎవరు చెప్పారు?" క్షణక్షణానికి యువకుడి ఆసక్తి పెరిగిపోతూ ఉంది.

"జీవితంలో ప్రతిదీ ఒక శకునమే," తాను చదువుతున్న పత్రికను మూసివేస్తూ ఆంగ్లేయుడు అన్నాడు. "అందరికీ అర్థమయ్యే విశ్వభాష ఒకటి ఉంది, కానీ దానిని దాదాపు అందరూ మరిచిపోయారు. మిగిలిన వాటితోపాటు నేను ఆ

విశ్వభాష గురించి కూడా అన్వేషిస్తున్నాను. అందుకే ఇక్కడకు వచ్చాను. ఆ విశ్వభాష తెలిసిన వ్యక్తిని నేను కలుసుకోవాలి. అతడు ఒక పరుసవేది."

గోదాము యజమాని రావటంతో వాళ్ళ సంభాషణకు అంతరాయం కలిగింది.

"మీ ఇద్దరి అదృష్టం బాగుంది," ఆ లావుపాటి అరబ్బు అన్నాడు. "అల్ - ఫయ్యూంకి ఈ రోజు ఒక బిడారు బయలుదేరుతోంది."

"కానీ నేను ఈజిప్టుకి వెళ్ళాలి," యువకుడు అన్నాడు.

"ఈజిప్టులోనే అల్ - ఫయ్యూం ఉంది," అరబ్బు బదులిచ్చాడు. "ఆ మాత్రం తెలియని నువ్వేమి అరబ్బువి?"

లావుపాటి అరబ్బు బయటకు వెళ్ళిపోయిన తరువాత "ఇది శుభ సూచకమైన శకునం," అన్నాడు ఆంగ్లేయుడు. "నేను రాయగలిగితే అదృష్టం, యాదృచ్ఛికం అన్న రెండు పదాలమీద ఒక పెద్ద విజ్ఞాన సర్వస్వాన్ని రాస్తాను. ఈ రెండు పదాలతోనే విశ్వభాష తయారయ్యింది."

చేతిలో ఉరిం, తుమిం ఉన్న అతడిని కలుసుకోవటం యాదృచ్ఛికమేమీ కాదని ఆంగ్లేయుడు అన్నాడు. అతడు కూడా పరుసవేదిని వెతుకుతూ బయలుదేరాడా అని అడిగాడు.

"నేను నిధి కోసం అన్వేషిస్తున్నాను," అన్నాడు యువకుడు. కానీ ఆ మరుక్షణమే దానిని వెల్లడి చేసినందుకు చింతించాడు. అయితే ఆంగ్లేయుడు దానికంత ప్రాముఖ్యతను ఇచ్చినట్లుగా అనిపించలేదు.

"ఒక రకంగా నేను కూడా నిధినే అన్వేషిస్తున్నాను," ఆంగ్లేయుడు చెప్పాడు.

"నాకు పరుసవేది అంటే ఏమిటో తెలియదు," అని యువకుడు చెబుతుండగా గోదాము యజమాని వచ్చి వాళ్ళని బయటకు రమ్మన్నాడు.

*

నల్లని కళ్ళు, గడ్డం ఉన్న ఒక వ్యక్తి "నేను ఈ బిడారుకి నాయకుడిని. నాతోపాటు తీసుకువెళ్ళే ప్రతి ఒక్కరి జీవన్మరణాలపై నాకు అధికారం ఉంది. ఈ ఎడారి చపలచిత్తురాలు, ఒక్కొక్కసారి ఇది మనుషులకు పిచ్చి ఎక్కిస్తుంది."

అక్కడ దాదాపుగా రెండు వందలమంది సమావేశమై ఉన్నారు. ఒంటెలు, గుర్రాలు, కంచరగాడిదలు, వాటి సంతానం కలిపి మొత్తం నాలుగువందల దాకా పశువులు ఉంటాయి. గుంపులో స్త్రీలు, పిల్లలతోపాటు భుజానికి కత్తులు, తుపాకులు వేలాడుతూ ఎంతోమంది పురుషులు ఉన్నారు. ఆంగ్లేయుడి వద్ద పుస్తకాలతో నిండిన అనేక పెట్టెలు ఉన్నాయి. అంతా గోలగోలగా ఉండటంతో అతడు చెప్పింది అందరికీ అర్థం కావటానికి నాయకుడు ఒకే విషయాన్ని పలుమార్లు చెప్పవలసివస్తోంది.

"ఇక్కడ అనేక రకాల మనుషులు ఉన్నారు, ప్రతి ఒక్కరికి వాళ్ళ వాళ్ళ దేవుడు ఉన్నాడు. నేను ఒక్క అల్లాని మాత్రమే నమ్ముతాను, ఈ ఎడారిని మరోమారు జయించటానికి చేయగలిగినదంతా నేను చేస్తానని అతడిమీద ప్రమాణం చేస్తున్నాను. ఏం జరిగినా నా అదేశాలను పాటిస్తానని మీరు నమ్మే దేవుళ్ళపై ప్రమాణం చెయ్యమని కోరుతున్నాను. ఎడారిలో అవిధేయత అంటే మృత్యువుతో సమానం."

గుంపునుంచి మంద్ర స్వరంతో ధ్వనులు వెలువడుతున్నాయి. ప్రతి ఒక్కరూ తమ తమ దేవుళ్ళ పేరు మీద ప్రమాణం చేస్తున్నారు. యువకుడు ఏసుక్రీస్తు పేరుమీద ప్రమాణం చేశాడు. ఆంగ్లేయుడు ఏమీ అనకుండా మిన్నకున్నాడు. ఒక చిన్న ప్రమాణం చేసినప్పటి కంటే ఎక్కువసేపే ధ్వనులు వినిపించాయి. రక్షణకోసం కూడా వాళ్ళు తమ దేవుళ్ళను ప్రార్థిస్తున్నారు.

బాకాతో పెద్దగా ఊదటంతో అందరూ తమ తమ పశువులపైకి ఎక్కారు. యువకుడు, ఆంగ్లేయుడు ఒంటెలను కొన్నారు, తటపటాయిస్తూ వాటి మీదకి ఎక్కారు. పుస్తకాల పెట్టెల భారాన్ని మోస్తున్న ఆంగ్లేయుడి ఒంటెను చూసి యువకుడు జాలి పడ్డాడు.

గోదాములో ఆగిపోయిన సంభాషణను తిరిగి కొనసాగిస్తూ ఆంగ్లేయుడు "నిజానికి యాదృచ్ఛికమన్నది లేదు. ఒక అరబ్బు గురించి నా మిత్రుడు విన్నందువల్ల నేను ఇక్కడకు....."

కాని బిడారు బయలుదేరటంతో ఆంగ్లేయుడు చెబుతున్నది వినలేక పోయాడు. కాని అతడేం చెప్పాలనుకున్నాడో యువకుడికి అర్థమయ్యింది: ఒక దానిని మరొకదానితో కలిపే మార్మికలంకె గురించి చెబుతున్నాడు. ఆ లంకె కారణంగానే అతడు గొర్రెల కాపరి అయ్యాడు, దాని వల్లనే అతడికి మళ్ళీ, మళ్ళీ ఆ కల వచ్చింది, దాని వల్లనే రాజుని కలిశాడు, దాని వల్లనే ఆఫ్రికాలోని ఒక నగరానికి వచ్చాడు, దాని వల్లనే మోసానికి గురయ్యి గాజు వస్తువుల వ్యాపారిని కలుసుకున్నాడు, దానివల్లనే....

ఒకరు తమ జీవిత గమ్యాన్ని సమీపిస్తున్నకొద్దీ ఆ జీవిత గమ్యమే వారి ఉనికికి అసలు కారణమవుతుంది అని యువకుడు అనుకున్నాడు....

బిడారు తూర్పు దిశగా సాగుతోంది. ఆ బిడారు ఉదయాలు ప్రయాణిస్తూ, ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు విశ్రాంతి తీసుకునేది. తిరిగి సాయంత్రం పయనమయ్యేది. ఆంగ్లేయుడు అధిక సమయం పుస్తకాలతో గడపుతుండటం వల్ల యువకుడు అతడితో అంతగా ఏమీ మాట్లాడలేదు.

ఎడారికి అడ్డంగా జంతువులు, మనుషుల పురోగమనాన్ని యువకుడు నిశ్శబ్దంగా పరిశీలిస్తున్నాడు. వాళ్ళు ప్రయాణం మొదలు పెట్టిన రోజున అంతా

గందరగోళం, అరుపులు, పిల్లల ఏడుపులు, పశువుల అరుపులు ఆందోళనతో కూడిన మార్గదర్శకులు, వ్యాపారుల ఆదేశాలతో కలగలసిపోయాయి.

కానీ ఎడారిలో ఎడతెగని గాలిహోరు, పశువుల గిట్టల శబ్దాలు మాత్రమే ఉన్నాయి. చివరికి మార్గదర్శకులు, కూడా ఒకరితో ఒకరు చాలా పరిమితంగా మాట్లాడుకుంటున్నారు.

"నేను ఈ ఎడారిని ఎన్నోసార్లు దాటాను," ఒకరాత్రి ఒంటెల సంరక్షకుడు ఒకడు చెప్పసాగాడు. "కానీ ఎడారి చాలా పెద్దది, క్షితిజరేఖ ఎంతో దూరాన ఉంటుంది. దాంతో మనిషికి తాను చాలా అల్పుడినని అనిపించేలా చేసి అతడిని మౌనపరుస్తుంది."

యువకుడు అంతకు ముందెన్నడూ ఎడారిలో అడుగు పెట్టకపోయినా సంరక్షకుడు చెప్పదలచుకుందేదో సహజాతంగా అర్థమయ్యింది. సముద్రాన్నీ, బడబానలాన్నీ చూసినప్పుడు వాటి మౌలిక శక్తిముందు అతడు మూగ పోయేవాడు.

నేను గొర్రెలనుంచి కొన్ని విషయాలను నేర్చుకున్నాను, గాజు వస్తువుల నుంచి కొన్ని విషయాలను నేర్చుకున్నాను అని యువకుడు అనుకున్నాడు. నేను ఎడారినుంచి కూడా కొన్ని విషయాలను నేర్చుకుంటాను. ఇది చాలా పురాతనమైదిగానూ, విజ్ఞురాలిగానూ కనపడుతోంది.

గాలి ఒక్క క్షణం కూడా ఆగలేదు. టారిఫాలో కోటపైన కూర్చుని ఉండగా ఇదే గాలి తన ముఖాన్ని తాకిన రోజు యువకుడి జ్ఞాపకాలలో మెదలింది. అది అతడికి తన గొర్రెల ఉన్నిని గుర్తుకుతెచ్చింది..... ఎప్పటి మాదిరిగానే అతడి గొర్రెలు యాండలూసియా మైదానాలలో మేత, నీటిని అన్వేషిస్తున్నాయి.

'ఇప్పుడు అవి నా గొర్రెలు కావు,' ఎటువంటి ఉద్వేగానికి గురికాకుండా తనలో తాను అనుకున్నాడు. 'అవి తమ కొత్త గొర్రెల కాపరికి అలవాటు పడి ఉంటాయి. ఈ పాటికి బహుశా నన్ను మరిచిపోయి ఉంటాయి. ప్రయాణాలకు అలవాటు పడిన గొర్రెల వంటి జీవాలకు ముందుకు సాగిపోవటం తెలుసు.'

వ్యాపారి కూతురి గురించి ఆలోచించాడు. ఈ పాటికి ఆమెకు పెళ్ళి అయిపోయి ఉంటుంది. బహుశా రొట్టెలు చేసే వ్యక్తినో, లేక చదువువచ్చి, అద్భుత సాహస గాథలు చెప్పగలిగే మరో గొర్రెల కాపరినో పెళ్ళిచేసుకుని ఉంటుంది. ఈ ప్రపంచంలో ఉన్నది అతనొక్కడే కాదు కదా. ఒంటెల సంరక్షకుడి వ్యాఖ్యానాన్ని సహజాతంగా తాను అర్థం చేసుకోగలగటంతో అతడు ఉత్సాహ పూరితుడయ్యాడు: మానవులందరి భవిష్యత్తు, వర్తమానాలకు సంబంధించిన విశ్వభాషని బహుశా అర్థం చేసుకుంటున్నాడేమో. ఇటువంటి వాటిని వాళ్ళ అమ్మ 'ముందుగానే తెలియడం' అని అనేది. విశ్వజీవన తరంగంలో ఆత్మ ఉన్నట్లుండి మునకవెయ్యడమే సహజాతం అని అతడికి అర్థం కాసాగింది; అందరి చరిత్రలు అక్కడ ముడిపడి ఉంటాయి; అంతా రాసి ఉంది కాబట్టి అంతా తెలిసిపోతూ ఉంటుంది.

గాజు వస్తువుల వ్యాపారిని గుర్తు తెచ్చుకుంటూ యువకుడు 'అలాగే జరుగుగాక' అనుకున్నాడు.

ఎడారిలో కొంతమేర అంతా ఇసుకతో నిండి ఉంటే, కొంతమేర రాతిమయంగా ఉంది. దారికి ఒక గుట్ట అడ్డంగా నిలిస్తే బిడారు దాని చుట్టూ తిరిగి వెళ్ళేది. రాతిమయప్రాంతం ఎదురైతే దారి మళ్ళించవలసి వచ్చేది. జంతువుల గిట్టలకు ఇబ్బంది కలిగించేంత సన్నగా ఇసుకఉంటే, మరింత బరకగా ఇసుక ఉన్న దారిని అన్వేషించేవారు, కొన్నిప్రాంతాలలో ఎండిపోయిన చెరువులలోని ఉప్పుతో నేల మేటవేసి ఉండేది. ఇటువంటి ప్రదేశాలలో జంతువులు కదలమని మొరాయించేవి. అప్పుడు ఒంటెలను నడిపేవాళ్ళు వాటిమీద ఉన్న బరువును దింపక తప్పేది

కాదు. అటువంటి ప్రమాదకర ప్రాంతంగుండా వెళుతుండగా బరువులను వాళ్ళే మోసి, అది దాటిన తరువాత ఒంటెల మీదకి ఎక్కించేవారు. దారి చూపేవాళ్ళల్లో ఎవరైనా జబ్బుపడినా, చనిపోయినా ఒంటెలను నడిపే వాళ్ళు చీటీలు తీసి ఆ బాధ్యతలను ఎవరు నిర్వర్తించాలో నిర్ణయించేవారు.

కాని ఇదంతా ఒకే ఒక మౌలిక ఉద్దేశంతో జరిగేది: ఎన్ని సర్దుబాట్లు చేసినా, ఎన్నిసార్లు పక్కదారులు తీసినా బిడారు మాత్రం దిక్సూచిలో ఒకే దిశగా పయనించేది. అవరోధాలను అధిగమించిన తరువాత తిరిగి గమ్యాన్ని చేర్చే బాటను పట్టేవి, ఒయాసిస్సును సూచించే తార ఆధారంగా ఆ దిక్కుకి నడిచేవి. ఉషోదయానికి ముందు ఆకాశంలో మెరుస్తున్న నక్షత్రం కనపడితే తాము నీళ్ళు, ఖర్జూరచెట్లు, ఆశ్రయం, ఇతర మనుషులు ఉండే చోటుకి వెళుతున్నామన్న నమ్మకం యాత్రికులకు కుదిరేది. అయితే ఆంగ్లేయుడు ఒక్కడే ఇవేవీ పట్టించుకునేవాడు కాదు, ఎక్కువ సమయం అతడు తన పుస్తకాలలో మునిగిపోయి ఉండేవాడు.

యువకుడు కూడా తన దగ్గర ఉన్న పుస్తకాన్ని చదువుదామని ప్రయాణం మొదట్లో కొన్ని రోజులు ప్రయత్నించాడు. కాని బిడారును పరిశీలించటం, గాలి చేసే శబ్దాలను వినడం అతడికి మరింత ఆసక్తికరంగా అనిపించింది. తన ఒంటెను బాగా అర్థం చేసుకోగలిగి, దానితో అనుబంధం ఏర్పడిన తరువాత యువకుడు తన పుస్తకాన్ని పక్కకు పడేశాడు. పుస్తకం తెరిచిన ప్రతిసారీ ఏదో ఒక ముఖ్యమయిన విషయాన్ని నేర్చుకుంటానన్న మూఢనమ్మకం ఏర్పడినప్పటికీ అది అనవసరమైన భారంగా యువకుడికి అనిపించింది.

తనతోపాటు ప్రయాణం చేస్తున్న ఒంటెల సంరక్షకుడితో అతడు స్నేహం చేశాడు. రాత్రిపూట మంట చుట్టూ చేరినప్పుడు ఒంటెల సంరక్షకుడికి యువకుడు గొర్రెల కాపరిగా తన సాహసాలను చెప్పేవాడు.

అలాంటి సంభాషణలలో ఒకసారి ఒంటెల సంరక్షకుడు తన జీవితం గురించి చెప్పాడు:

"నేను ఎల్ కైరం దగ్గర నివసించేవాడిని. నాకు ఒక పండ్లతోట, భార్య పిల్లలు ఉన్నారు. చనిపోయేవరకు జీవితం అలాగే గడిచిపోతుందని అనుకునేవాడిని. పంటలు బాగా పండిన ఒక సంవత్సరం మేమంతా మక్కా ప్రయాణం చేశాం, ఆ విధంగా జీవితంలో మిగిలిన ఒక్క కోరిక కూడా తీరిపోయింది. నేను ఇక సంతోషంగా చనిపోవచ్చని అనుకున్నాను. ఆ భావన నాకెంతో తృప్తినిచ్చింది.

"ఒక రోజు భూమి కంపించి, నైలునది ఒడ్డుపై నుంచీ ప్రవహించసాగింది. ఇటువంటిదేదో ఇతరులకు జరుగుతుంది కానీ నాకు కాదు అని అనుకునేవాడిని. వరదలో తమ ఆలివ్ చెట్లనన్నింటినీ కోల్పోతామని పక్క రైతు భయపడ్డాడు, పిల్లల్ని కోల్పోతామేమోనని నా భార్య భయపడింది. నాకున్నది మొత్తం సర్వనాశనమౌతుందని నేను అనుకున్నాను.

"భూమి సర్వనాశనమై బతకడానికి నేను వేరొక మార్గాన్ని వెదుక్కోవలసి వచ్చింది. ఇదిగో ఇలా ఒంటెను నడిపేవాడిని అయ్యాను. అల్లా యొక్క ప్రపంచాన్ని అర్థం చేసుకోటానికి ఆ ఉపద్రవం నాకు ఉపయోగపడింది: వాళ్ళకి అవసరమయినవి, కావలసినవి సాధించుకోగల సామర్థ్యం ఉన్నప్పుడు మానవులు తమకు తెలియని వాటి గురించి భయపడాల్సిన అవసరం లేదు.

"మనకి ఉన్నదేదో కోల్పోతామని భయపడుతూ ఉంటాం: అది మన ప్రాణం కావచ్చు, ఆస్తి కావచ్చు, వస్తువులు కావచ్చు. మన జీవిత కథలను, ప్రపంచ చరిత్రనూ ఒకే చెయ్యి రాసిందని అర్థం చేసుకుంటే ఆ భయం ఆవిరైపోతుంది."

ఒక్కొక్కసారి వారికి మరొక బిడారు తారసపడేది. ప్రతిదీ నిజంగానే ఒకే చెయ్యి రాసినట్టు ఒకరికి అవసరమైనవి వేరొకరి దగ్గర ఉండేది. రాత్రిపూట మంట

దగ్గర కూర్చుని ఒంటెల సంరక్షకులు ఇసుక తుపాను గురించి సమాచారాన్ని, ఎడారి కథలను పంచుకునేవారు.

మరికొన్నిసార్లు వింతైన ముసుగు మనుషులు కనపడేవారు. వాళ్ళు ఎడారిలో సంచారజీవులైన బెడోవిన్లు. వాళ్ళు బిడారు దారులపై నిఘా ఉంచి దొంగల గురించి, బర్బర జాతుల గురించి హెచ్చరించేవారు. వాళ్ళు నిశ్శబ్దంగా వెళ్ళిపోయేవారు. నల్లని వారి ముసుగుల లోంచి వారి కళ్ళు మాత్రమే కనపడేవి. ఒక రాత్రి ఆంగ్లేయుడు, యువకుడు మంట దగ్గర కూర్చుని ఉండగా వారి దగ్గరకు ఒంటెల సంరక్షకుడు వచ్చాడు. "ఎడారి తెగల మధ్య యుద్ధాలు జరుగుతున్నాయని పుకార్లు వినవస్తున్నాయి," అని వాళ్ళకు చెప్పాడు.

ముగ్గురూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఎవరూ ఏమీ మాట్లాడక పోయినా భయం వాళ్ళని ఆవరించిన విషయం యువకుడు గ్రహించాడు. మరోసారి అతడు మాటలు లేని భాష.... విశ్వభాషను అనుభూతి చెందసాగాడు.

తాము ప్రమాదంలో ఉన్నామా అని ఆంగ్లేయుడు అడిగాడు.

"ఒకసారి ఎడారిలోకి వచ్చిన తరువాత మళ్ళీ వెనక్కి మళ్ళటం అంటూ ఉండదు," ఒంటెల సంరక్షకుడు చెప్పాడు. "వెనక్కి వెళ్ళలేనప్పుడు ముందుకు వెళ్ళటానికి మంచిదారి ఏదని మాత్రమే ఆలోచించాలి. భయంతో సహా మిగిలిందంతా అల్లాకే వదిలి పెట్టాలి."

"అలాగే జరుగు గాక," అన్న వింత పదంతో అతడు ముగించాడు.

ఒంటెల సంరక్షకుడు వెళ్ళిపోయిన తరువాత "నువ్వు బిడారుపై మరింత శ్రద్ధ వహించాలి," అని ఆంగ్లేయుడితో యువకుడు అన్నాడు. "మనం చాలా పక్కదార్లు తీసుకుంటున్నా అంతిమంగా గమ్యం వైపుకే పురోగమిస్తున్నాం."

"నువ్వు ప్రపంచం గురించి మరింత చదవాలి," ఆంగ్లేయుడు బదులిచ్చాడు. “ఆ విధంగా చూస్తే పుస్తకాలు బిడారు వంటివి.”

మనుషులు, జంతువులతో ఉన్న ఆ పెద్ద బిడారు ప్రయాణ వేగాన్ని పెంచింది. పగళ్ళు ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉండేవి, కాని ఇప్పుడు మంటదగ్గర కబుర్లు చెప్పుకోటానికి బదులు రాత్రులు కూడా నిశ్శబ్దంగా మారాయి. బిడారు పైపు దృష్టి ఆకర్షించకుండా ఉండటానికి రాత్రులు మంట కూడా వెయ్యకూడదన్న నిర్ణయాన్ని ఒకరోజు బిడారు నాయకుడు తీసుకున్నాడు.

రాత్రులు జంతువులనన్నింటినీ గుండ్రంగా ఉంచి తాము మధ్యలో పడుకునే ఏర్పాటును ప్రయాణికులు చేసుకున్నారు. వృత్తం బయట సాయుధ కాపలాదారులను నాయకుడు ఏర్పాటు చేశాడు.

ఒక రాత్రి ఆంగ్లేయుడికి నిద్ర పట్టలేదు. యువకుడిని లేపి ఇద్దరూ ఇసుక తిన్నెల పైపు నడుచుకుంటూ దూరంగా వెళ్ళారు. అది పున్నమి రేయి. యువకుడు తన జీవిత కథను ఆంగ్లేయుడితో పంచుకున్నాడు.

గాజు వస్తువుల దుకాణంలో యువకుడు పనిచేయటం మొదలు పెట్టిన తరువాత అక్కడ అతను సాధించిన ప్రగతి ఆంగ్లేయుడిని అబ్బుర పరిచింది.

"అన్నింటినీ నియంత్రించే సూత్రం ఇదే," అని ఆంగ్లేయుడు చెప్పాడు. “పరుసవేదంలో దీనినే విశ్వాత్మ అంటారు. నువ్వు మనస్ఫూర్తిగా ఒక దానిని కోరుకుంటే అప్పుడు నువ్వు విశ్వాత్మకు అత్యంత సమీపంగా ఉంటావు. అది ఎప్పుడూ నీకు సహాయపడే శక్తిగా ఉంటుంది.”

ఇది ఒక్క మానవులకు మాత్రమే పరిమితమయిన బహుమతికాదు అని అతడు చెప్పాడు. ప్రపంచంలోని ప్రతి ఒక్కదానికీ – అది ఖనిజం కావచ్చు, మొక్క

కావచ్చు, జంతువు కావచ్చు, కేవలం ఒక ఊహ అయినా కావచ్చు – ఆత్మ ఉంటుంది.

"భూమి సజీవమైనది కాబట్టి... దానికి ఆత్మ ఉంది. అందుకే భూమిపైన ఉన్న ప్రతి ఒక్కటీ నిరంతర మార్పునకు గురవుతూ ఉంటుంది. ఆ ఆత్మలో భాగం అయిన మనకి అనుకూలంగా ఆ శక్తి పనిచేస్తోందని ఎప్పుడోగాని గుర్తించం. గాజు వస్తువుల దుకాణంలో నీ విజయానికి అవి కూడా కలిసి పని చేశాయన్నది గుర్తించి ఉంటావు."

చంద్రుడి పైపు, వెండిపూతలా ఉన్న ఇసుకవైపు చూస్తూ యువకుడు దాని గురించి కాసేపు ఆలోచించాడు. "ఎడారిని దాటుతున్న బిడారును నేను గమనించాను," యువకుడు చెప్పాడు, "ఎడారి, బిడారు ఒకే భాషను మాట్లాడతాయి, ఆ కారణంగానే బిడారు తనని దాటేందుకు ఎడారి అనుమతిస్తోంది. బిడారు వేసే ప్రతి అడుగు సమాయానుగుణంగా ఉందో, లేదో అని అది పరీక్షిస్తోంది. అడుగులు సకాలంలో ఉంటే మనం ఒయాసిస్సును చేరుకుంటాం."

"ఈ భాషను అర్థం చేసుకోకుండా వ్యక్తిగత సాహసం ఆధారంగా మనం ఈ ప్రయాణాన్ని చేపట్టి ఉంటే అది మరింత కష్టతరంగా ఉండేది."

చంద్రుణ్ణి చూస్తూ వాళ్ళు నిలబడి పోయారు.

"శకునాల అద్భుతమంటే ఇదే," యువకుడు కొనసాగించాడు. "ఎడారి సంకేతాలను మార్గదర్శకులు చదివే విధానాన్ని, బిడారు యొక్క ఆత్మ ఎడారి యొక్క ఆత్మతో మాట్లాడే విధానాన్ని నేను గమనించాను."

"నేను బిడారు పై మరింత శ్రద్ధ పెడతాను," అన్నాడు ఆంగ్లేయుడు.

"నీ పుస్తకాలపై నేను మరింత శ్రద్ధ పెట్టాలి," అన్నాడు యువకుడు.

*

ఆ పుస్తకాలు ఏమీ పాలుపోకుండా ఉన్నాయి. పాదరసం, లవణం, రాక్షసబల్లులు, రాజుల గురించి ఆ పుస్తకాల్లో ఉన్నాయి. అవేవీ యువకుడికి అర్థం కాలేదు. కానీ అన్ని పుస్తకాలలో ఒకే అంశం పునరుక్తమవ్వటం అతడు గమనించాడు: అన్ని విషయాలు ఒకే దానికి బాహ్య రూపాలు మాత్రమే.

పరుసవేదానికి సంబంధించిన సాహిత్యంలో ముఖ్యమైన అంశమంతా కొన్ని పంక్తులలో ఉందని, అది ఒక పచ్చల తాయెత్తు మీద రాసి ఉందని యువకుడు ఒక పుస్తకంలో చదివాడు.

"అది పచ్చల తాయెత్తు," యువకుడికి తాను నేర్పగలిగే అంశం దొరికిందని ఆంగ్లేయుడు గర్వంగా చెప్పాడు.

"అయితే ఇన్ని పుస్తకాల అవసరమేమిటి?" యువకుడు అడిగాడు.

"ఆ కొన్ని పంక్తులను అర్థం చేసుకోటానికి ఇవి ఉపయోగపడతాయి," తాను చెప్పినదాంట్లో తనకే నమ్మకం లేనట్లు ఆంగ్లేయుడు బదులిచ్చాడు.

యువకుడికి అన్నిటికంటే ప్రఖ్యాత పరుసవేదులకు సంబంధించిన కథల పుస్తకం ఆసక్తికరంగా అనిపించింది. ప్రయోగశాలలో లోహాలను శుద్ధిపరచటానికి తమ జీవితమంతా అంకితం చేసిన వాళ్ళు ఉన్నారు: ఒక లోహాన్ని కొన్ని సంవత్సరాలపాటు వేడిచేస్తే అది దాని వ్యక్తిగత గుణాలనుంచి విముక్తమయ్యి మిగిలేది విశ్వాత్మ అని వాళ్ళు నమ్మారు. అన్ని విషయాలు సంభాషించుకునే భాష ఇదే కాబట్టి, ప్రపంచంలోని అన్నింటినీ అర్థం చేసుకోటానికి వాళ్ళకి ఇది దోహదపడేది. ఈ విధంగా కనుగొన్న దానినే 'నిపుణులపని' గా పేర్కొనేవారు. ఇది కొంత ద్రవరూపంలోనూ, కొంత ఘనరూపంలోనూ ఉంటుంది.

"ఆ భాషను అర్థం చేసుకోటానికి మనుషులను, శకునాలను పరిశీలిస్తే సరిపోదా?" యువకుడు అడిగాడు.

"అన్నింటినీ సరళీకరించాలన్న పిచ్చి నీకుంది," చికాకుపడుతూ ఆంగ్లేయుడు బదులిచ్చాడు. "పరుసవేదం అన్నది చాలా శ్రద్ధతో నేర్చుకోవాల్సిన అంశం. గురువులు అనుసరించిన పథాన్ని యథాతథంగా అనుసరించాలి."

నిపుణుల పనిలో ద్రవరూపాన్ని 'జీవామృతం' అంటారనీ అది అన్ని జబ్బులను నయం చేస్తుందనీ; పరుసవేదికి ముసలితనం రాకుండా ఉపయోగపడుతుందనీ యువకుడు తెలుసుకున్నాడు. ఘన రూపాన్ని 'తాత్వికుల రాయి' అంటారు.

"తాత్వికుల రాయిని కనుగొనటం అంత తేలిక కాదు," ఆంగ్లేయుడు చెప్పాడు. "లోహాలను శుద్ధి చేసే మంటను గమనిస్తూ పరుసవేదులు ప్రయోగశాలలో అనేక సంవత్సరాలు గడిపారు. వాళ్ళు అగ్నికి దగ్గరగా అంతకాలం గడపటం వల్ల అన్ని రకాల ప్రాపంచిక గర్వాలను, స్వాతిశయాలను జయించారు. లోహాలను శుద్ధి చేసే క్రమంలో తమను తాము శుద్ధి చేసుకున్నామన్న అంశాన్ని వాళ్ళు గుర్తించారు."

గాజు వస్తువుల వ్యాపారి గురించి యువకుడు ఆలోచించాడు. గాజు వస్తువులను శుభ్రం చేయటం తనలోని నకరాత్మక ఆలోచనలను తుడిచి వేయటానికి ఉపయోగపడిందని యువకుడు అన్నాడు. రోజువారీ జీవితం నుంచి కూడా పరుసవేదాన్ని నేర్చుకోవచ్చన్న నమ్మకం యువకుడిలో పెరగసాగింది.

"అంతేకాదు. తాత్వికుల రాయికి ఒక అదృష్ట గుణముంది. పెద్ద మొత్తంలో లోహాన్ని బంగారంగా మార్చటానికి ఆ రాయిలోని కొంత రజను సరిపోతుంది," ఆంగ్లేయుడు చెప్పాడు.

అది విన్న తరువాత పరుసవేదమంటే యువకుడికి మరింత ఆసక్తి కలిగింది. కొంచెం ఓపిక పడితే ప్రతి దానినీ బంగారంగా మార్చవచ్చని అతడు అనుకున్నాడు. అలా చేయటంలో విజయం సాధించిన హెల్వెటియస్, ఎలియస్, ఫుల్కనెల్లి, జెబెర్

వంటి వివిధ వ్యక్తుల జీవితాల గురించి చదివాడు. అవి చాలా అద్భుతమయిన కథలు: ప్రతి ఒక్కరూ తమ జీవిత గమ్యాన్ని చివరికంటా సాధించారు. వాళ్ళు దేశ దిమ్మరులుగా తిరిగారు. జ్ఞానులతో మాట్లాడారు, నమ్మని వారికోసం అద్భుతాలు చేసి చూపించారు. వాళ్ళ దగ్గర తాత్వికుల రాయి, జీవామృతం ఉన్నాయి.

నిపుణుల పనిని సాధించాలని యువకుడు అనుకున్నాడు కానీ దానిని ఎలా చేపట్టాలో పాలుపోలేదు. కేవలం బొమ్మలు, నిగూఢ సూచనలు, అర్థంకాని వాక్యాలు ఉన్నాయి.

*

"విషయాలను ఇంత సంక్లిష్టంగా ఎందుకు చేశారు?" ఒక రాత్రి ఆంగ్లేయుడిని యువకుడు అడిగాడు. పుస్తకాలు తన దగ్గర లేకపోవటం వల్ల ఆంగ్లేయుడు చికాకుపడుతున్న విషయాన్ని యువకుడు గమనించాడు.

"అర్థం చేసుకున్న దానికి బాధ్యత వహించే వాళ్ళకి మాత్రమే అర్థమయ్యేందుకు అవి అలా ఉన్నాయి," ఆంగ్లేయుడు బదులిచ్చాడు. "అందరూ సీసాన్ని బంగారంగా మార్చగలగటాన్ని ఊహించుకో. అప్పుడు బంగారానికి విలువ లేకుండా పోయేది.

"పట్టు విడవకుండా సాధనచేసే వాళ్ళకి, విషయాలను లోతుగా అధ్యయనం చేయటానికి సిద్ధపడిన వాళ్ళకి మాత్రమే నిపుణుల పని వశమవుతుంది. ఈ కారణంగానే నేను ఇప్పుడు ఎడారి మధ్యలో ఉన్నాను. సంకేతాల నిగూఢ అర్థాలను తెలుసుకోటానికి సహాయపడే నిజమైన పరుసవేదిని నేను అన్వేషిస్తున్నాను."

"ఈ పుస్తకాలను ఎప్పుడు రాశారు?"

"ఎన్నో శతాబ్దాల క్రితం."

"అప్పట్లో అచ్చు యంత్రాలు లేవు కదా. అందరికీ పరసవేదం గురించి తెలిసే అవకాశం లేదు. అటువంటప్పుడు ఇంత వింత భాషని, ఇన్ని బొమ్మలను ఎందుకు ఉపయోగించారు?" యువకుడు వాదించసాగాడు.

అతనికి ఆంగ్లేయుడు సేరుగా బదులివ్వలేదు. గత కొద్ది రోజులుగా బిడారు నిర్వహింపబడుతున్న తీరుపై అతడు దృష్టి పెట్టాడు, కానీ అతడు కొత్త విషయమేదీ సేర్చుకోలేదు. యుద్ధం గురించిన మాటలు మరింత తరచుగా వినపడుతున్నాయన్న ఒక్క అంశాన్నే అతడు గుర్తించాడు.

*

ఒక రోజు యువకుడు పుస్తకాలను ఆంగ్లేయుడికి తిరిగి ఇచ్చేశాడు. "ఏమైనా సేర్చుకున్నావా?" అది ఏమై ఉంటుందోనన్న ఆసక్తితో అడిగాడు ఆంగ్లేయుడు. యుద్ధం సంభవించే అవకాశం గురించి ఆలోచించకుండా ఉండటానికి అతడికి ఎవరితోసైనా మాట్లాడాలని ఉంది.

"ప్రపంచానికి ఒక ఆత్మ ఉంటుందని తెలుసుకున్నాను, ఇది అర్థం చేసుకున్న వాళ్ళు విశ్వ భాషను కూడా అర్థం చేసుకోగలరని తెలుసుకున్నాను. ఎంతోమంది పరుసవేదులు తమ జీవిత గమ్యాన్ని సాధించుకున్నారనీ, విశ్వాత్మనీ, తాత్వికుల రాయినీ, జీవామృతాన్నీ కనుగొన్నారని తెలుసుకున్నాను.

"అన్నిటికీ మించి ఇవి అన్నీ చాలా తేలికైన విషయాలనీ, వాటినన్నింటినీ పచ్చల తాయెత్తుపై రాయవచ్చని తెలుసుకున్నాను."

ఆంగ్లేయుడు నిరుత్సాహానికి గురయ్యాడు. ఎన్నో ఏళ్ళ పరిశోధన, వింత సంకేతాలు, కొత్త పదాలు, ప్రయోగశాల పరికరాలు.... ఇవేవీ యువకుడిపైన ప్రభావం చూపలేకపోయాయి. వీటన్నిటినీ అర్థం చేసుకోలేని అదిమ దశలో యువకుడి ఆత్మ ఉందేమోనని ఆంగ్లేయుడు అనుకున్నాడు.

తన పుస్తకాలను తిరిగి తీసుకుని వాటిని పెట్టెలలో సర్దేశాడు.

"నువ్వు తిరిగి బిడారును గమనించటం మొదలు పెట్టు,'' అన్నాడు ఆంగ్లేయుడు, ''దాని నుండి నేను కూడా అంతగా నేర్చుకోలేకపోయాను.''

ఎడారి నిశ్శబ్దాలను, జంతువులు రేపిన ఇసుకను యువకుడు తిరిగి పరిశీలించసాగాడు. 'విషయాలు తెలుసుకోటానికి ఒక్కొక్కరికీ ఒక్కొక్క విధానం ఉంటుంది,' అనుకున్నాడు యువకుడు. 'అతని దారి నా దారి లాంటిదికాదు, అదే విధంగా నా దారి అతనిది కాదు. కానీ మేమిద్దరమూ మా జీవిత గమ్యాలను అన్వేషిస్తున్నాం, అందుకు అతడిని నేను గౌరవిస్తాను.'

*

పగలు, రేయి బిడారు ప్రయాణం చేయసాగింది. ముసుగు వేసుకున్న బెడోవిన్లు ఇప్పుడు మరింత ఎక్కువగా కనపడుతున్నారు. యువకుడికి మంచి స్నేహితుడు అయిన ఒంటెను నడిపే వ్యక్తి ఎడారి జాతుల మధ్య యుద్ధం ఆపాటికే మొదలయ్యిందని చెప్పాడు. బిడారు ఒయాసిస్సును చేరుకోవటం అదృష్టమేననుకోవాలి.

జంతువులు అలసిపోయి ఉన్నాయి. మనుషుల మధ్య మాటలు రాను రాను తగ్గిపోసాగాయి. రాత్రులు మౌనం అన్నిటికంటే భయంగొలిపేదిగా ఉంది. అంతకు ముందు ఒంటె మూలుగుని ఒంటె మూలుగుగానే భావించేవారు, ఇప్పుడు అది దాడికి సూచన ఏమోనని భయపడుతున్నారు.

యుద్ధం యొక్కముప్పు గురించి ఒంటెను నడిపే వ్యక్తి అంతగా బాధపడుతున్నట్లు లేదు.

చంద్రుని కాంతి, వెలుగు లేని ఒకనాటి రాత్రి ఖర్జూర పళ్ళు తింటూ "నేను బతికి ఉన్నాను,'' అని యువకుడితో అతను అన్నాడు. ''తింటున్నప్పుడు కేవలం

దాని గురించే నేను ఆలోచిస్తాను. ప్రయాణం చేస్తున్నప్పుడు ప్రయాణంపైనే దృష్టి పెడతాను. పోరాడవలసి వస్తే మిగిలిన అన్ని రోజులు లాగానే చావటానికి అది కూడా మంచి రోజే.

"నేను అటు గతంలోనో, ఇటు భవిష్యత్తులోనో జీవించటం లేదు. ప్రస్తుతంపైనే నాకు ఆసక్తి ఉంది. ఎప్పుడూ ప్రస్తుత క్షణం పైనే దృష్టి నిలపగలిగితే నువ్వు అదృష్టవంతుడివవుతావు. ఎడారిలో జీవం ఉందని, ఆకాశంలో చుక్కలు ఉన్నాయని, మానవజాతిలో భాగం కాబట్టి ఎడారి జాతులు పరస్పరం సంఘర్షించుకుంటాయని నువ్వు గమనిస్తావు. అలాంటప్పుడు జీవితం నీకు ఒక అద్భుతమయిన విందు అవుతుంది, ఎందుకంటే మనం గడుపుతున్న ప్రస్తుత క్షణమే జీవితం."

రెండు రోజుల తరువాత యువకుడు నిద్రకు ఉపక్రమిస్తూ ప్రతిరాత్రీ వాళ్ళు గమనించే నక్షత్రం కోసం చూశాడు. ఎడారిమీదే చుక్కలు కనపడేసరికి క్షితిజ రేఖ ఎప్పటికంటే కిందకి ఉన్నట్లుగా అనిపించింది.

"అది ఒయాసిస్సు," అన్నాడు ఒంటెను నడిపే వ్యక్తి.

"మరి ఇప్పుడే అక్కడికి ఎందుకు వెళ్ళటం లేదు?" యువకుడు అడిగాడు.

"మనం ప్రస్తుతం నిద్రపోవాలి – అందుకని."

*

సూర్యోదయంతోపాటే యువకుడు నిద్రలేచాడు. అంతకు ముందు రాత్రి నక్షత్రాలు ఉన్నాయనిపించినచోట ఇప్పుడు ఎడారి పొడవునా విస్తరించుకుని ఉన్న అంతులేని ఖర్జూరచెట్ల వరసలున్నాయి.

"మనం సాధించాం," త్వరగా నిద్రలేచిన ఆంగ్లేయుడు ఆనందంతో కేక వేశాడు.

కాని యువకుడు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఎడారి మౌనం అతడికి ఎంతగానో నచ్చింది, ఇప్పుడు చెట్లవైపు చూస్తూ సంతృప్తి చెందాడు.

పిరమిడ్లను చేరుకోవటానికి అతడు ఇంకా ఎంతో దూరం ప్రయాణం చేయవలసి ఉంది. ఏదో ఒకనాడు ఈ ఉదయం కూడా ఒక జ్ఞాపకంగా మిగులుతుంది. కాని ఇది ప్రస్తుత క్షణం. ఒంటెను నడిపే వ్యక్తి మాటల్లో చెప్పాలంటే జీవిత విందు - గతంలోని గుణపాఠాలతో, భవిష్యత్తును గురించిన కలలతో ఈ క్షణాన్ని జీవించాలని అతనికి ఉంది. ఖర్జూర చెట్ల దృశ్యం ఒకనాటికి జ్ఞాపకంగా మారిపోయినప్పటికీ ప్రస్తుతం అది నీటినీ, నీడనీ, యుద్ధం నుంచి ఆశ్రయాన్నీ అందించనున్నది. నిన్నటి వరకు ఒంటె మూలుగు ప్రమాదాన్నీ సూచిస్తూ భయపెడితే ఇప్పుడు ఖర్జూర చెట్ల వరసలు అద్భుతాన్ని ఆవిష్కరించనున్నాయి.

ప్రపంచం పలుభాషలు మాట్లాడుతుందని యువకుడు అనుకున్నాడు.

*

వందలాది మనుషులు, జంతువులు ఒయాసిస్సుకు చేరుకోవటం చూసి సమయం వేగంగా గడిచిపోతోంది, అలాగే బిడారులు అనుకున్నాడు పరుసవేది. కొత్తగా వచ్చిన వాళ్ళని చూసి ప్రజలు కేకలు వేస్తున్నారు. అక్కడ రేగిన ధూళికి ఎడారి సూర్యుడు కనుమరుగయ్యాడు. కొత్తవాళ్ళు రావడంతో ఒయాసిస్సులోని పిల్లలు ఉత్సాహాన్ని పట్టలేకుండా ఉన్నారు. ఒయాసిస్సు పెద్దలు బిడారు నాయకుడికి అభివాదం చేసి, అతడితో సుదీర్ఘంగా సంభాషించడం పరుసవేది గమనించాడు.

కాని ఇవేవీ పరుసవేదికి పట్టలేదు. ఎంతోమంది మనుషులు వస్తూ వెళుతున్నా ఎడారి మాత్రం అలాగే ఉండటం అతడు చూశాడు. ఎడారి ఇసుకలో

నడిచిన రాజులను, బిచ్చగాళ్ళను అతడు చూశాడు. గాలివల్ల ఇసుక తిన్నెలు నిరంతరం మారుతుంటాయి, కాని ఇసుక మాత్రం తాను చిన్నప్పటినుంచి చూస్తున్నదే. రోజులు తరబడి ఎడారి ఇసుక పసుపు దనాన్నీ, నీలకాశాన్నీ చూసిన ప్రయాణీకులు ఖర్జూరచెట్ల పచ్చదనం చూసి సంబరపడటం అతనిలోనూ సంతోషాన్ని నింపింది. మనిషి ఖర్జూర చెట్లను ఆస్వాదించడానికే దేవుడు ఎడారిని సృష్టించాడేమోనని అతడనుకున్నాడు.

మరింత ప్రాముఖ్యత గల విషయాలమీద దృష్టిని క్రేంద్రీకరిద్దామని అతడు అనుకున్నాడు. తనకు తెలిసిన కొన్ని రహస్యాలను నేర్పవలసిన ఒక వ్యక్తి బిడారులో ఉన్నాడని అతనికి తెలుసు. శకునాలు అతడికి ఈ విషయాన్ని తెలియచేశాయి. అతడికి ఆ వ్యక్తి ఎవరో తెలియదు, కానీ అతను కనపడితే అనుభవమున్న తన కన్ను ఆ విషయాన్ని గుర్తిస్తుంది. అంతకుముందు తన వద్ద ఈ విషయాలను నేర్చుకున్న వ్యక్తి మాదిరిగానే ఇతగాడు కూడా అంతే సమర్థుడైతే బాగుండునని అతను కోరుకున్నాడు.

ఈ విషయాలను నోటి మాటల ద్వారానే తెలియచేయవలసిన అవసరమేమిటని అతడనుకున్నాడు. వీటిని రహస్యాలనటానికి లేదు: దేవుడు తన రహస్యాలన్నింటినీ జీవులన్నిటికీ తేలికగా వెల్లడి చేస్తాడు.

దీనికి అతడి దగ్గర ఒక్కటే వివరణ ఉంది: అవి నిర్మలమైన జీవంతో రూపొందినవి కాబట్టి వాటిని ఇలాగే వెల్లడిచెయ్యాలి, ఈ రకమైన జీవాన్ని ఏ పదాలూ, బొమ్మలూ బంధించలేవు.

అంతేకాదు, పదాలకూ, బొమ్మలకూ ఆకర్షింపబడి మనుషులు విశ్వభాషను మరిచిపోతారు.

*

తన కళ్ళముందు కనిపిస్తున్న దాన్ని యువకుడు నమ్మలేకపోయాడు: ఒయాసిస్సు అంటే తాను భూగోళ పుస్తకంలో చూసిన ఒక బావి, దాని చుట్టూ కొన్ని ఖర్జూర చెట్లు కాదు; స్పెయిన్ లోని చాలా పట్టణాలకంటే అది పెద్దదిగా ఉంది. అక్కడ మొత్తం మూడు వందల బావులు, యాభైవేల ఖర్జూర చెట్లు, వాటి మధ్య అసంఖ్యాకంగా రంగు రంగుల గుడారాలు ఉన్నాయి.

"ఇది వెయ్యిన్నొక్క రాత్రుల మాదిరి ఉంది," అన్నాడు ఆంగ్లేయుడు. పరుసవేదిని ఎప్పుడు కలుస్తానా అని అతడు అసహనంగా ఉన్నాడు.

వస్తున్న మనుషులు, జంతువులను కుతూహలంతో చూసే పిల్లలు వాళ్ళను చుట్టుముట్టారు. వాళ్ళు ఏమైనా యుద్ధాలను చూశారేమోనని తెలుసుకోటానికి పురుషులు ఆతృత పడుతుండగా, వాళ్ళు తెచ్చిన బట్టలు, విలువైన రాళ్ళ కోసం మహిళలు పోటీ పడసాగారు. ఇప్పుడు ఎడారి మౌనం ఒక సుదూర స్వప్నంలా ఉంది. బిడారులోని ప్రయాణికులు ఇప్పుడు ఎడతెరిపి లేకుండా మాట్లాడుతున్నారు; ఆధ్యాత్మిక ప్రపంచం నుంచి బయటపడి తిరిగి మానవ ప్రపంచాన్ని కనుగొన్న వారిలా అరుస్తున్నారు, నవ్వుతున్నారు.

వాళ్ళు ఎడారిలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. ఒయాసిస్సు దగ్గర ఎక్కువగా స్త్రీలు, పిల్లలు ఉంటారు కాబట్టి వాటిని యుద్ధ రహిత ప్రాంతాలుగా భావిస్తారని ఒంటెను నడిపే వ్యక్తి వివరించాడు. ఎడారి అంతటా ఒయాసిస్సులు ఉన్నాయి. కాని ఎడారి జాతుల వాళ్ళు ఒయాసిస్సులను ఆశ్రయ స్థావరాలుగా వదిలి ఎడారిలో యుద్ధాలు చేసేవారు.

అతి కష్టం మీద బిడారు నాయకుడు ప్రయాణికులందరినీ ఒక చోటకి చేర్చి వాళ్ళకి తన ఆదేశాలను ఇచ్చాడు. ఎడారి జాతుల మధ్య యుద్ధం అయిపోయేవరకు వాళ్ళు అక్కడే ఉండాలి. వాళ్ళు సందర్శకులు కాబట్టి నివాస స్థలాన్ని అక్కడుంటున్న వారితో పంచుకోవాలి. వారికున్నంతలో మంచి నివాసాలను

ఇస్తారు. ఇది అతిథి మర్యాదల సూత్రం. ఆ తరువాత బిడారు కాపలాదారులతో సహా ప్రతి ఒక్కరూ తమ దగ్గర ఉన్న ఆయుధాలను ఒయాసిస్సు పెద్దలు నియమించిన వ్యక్తులకు అప్పగించాలని కోరాడు.

ఆయుధాలను సేకరించే వ్యక్తికి ఆంగ్లేయుడు తన సంచిలోంచి ఒక పిస్తోలు తీసి అప్పగించడం యువకుడు ఆశ్చర్యంగా చూశాడు.

"పిస్తోలు ఎందుకు?" యువకుడు అడిగాడు.

"మనుషులను నమ్మడానికి ఇది నాకు తోడ్పడింది," అని ఆంగ్లేయుడు బదులిచ్చాడు.

ఈలోగా యువకుడికి తన నిధి గుర్తుకు వచ్చింది. తన కలను సాకారం చేసుకోవటానికి దగ్గరవుతున్న కొద్దీ పరిస్థితులు క్లిష్టతరమౌతున్నాయి. వృద్ధరాజు చెప్పిన 'ఆరంభకుల అదృష్టం' ఇప్పుడు పనిచేస్తున్నట్లు లేదు. తన కలను నిజం చేసుకునే ప్రయత్నంలో అతడి పట్టుదలని, ధైర్యాన్ని పరీక్షిస్తున్నట్లుగా ఉంది. కాబట్టి తాను తొందరపడకూడదు, అసహనానికి గురికాకూడదు. మొండిగా ముందుకు దూసుకు వెళితే దేవుడు తన దారిలో ఉంచిన శకునాలను, సంకేతాలను తాను గమనించకపోవచ్చు.

దేవుడు తన దారిలో వాటిని ఉంచాడు. ఆ ఆలోచన అతనికే ఆశ్చర్యం కలిగించింది. తినటం, నిద్రపోవటంలాగా, లేదా ప్రేమను కోరుకోవటం, ఉద్యోగాన్ని పొందటంలాగా శకునాలు ఈ ప్రపంచానికి సంబంధించినవని అప్పటివరకు అతడు అనుకున్నాడు. తాను ఏం చేయాలో సూచించటానికి దేవుడి భాషగా వాటిని అనుకోలేదు.

‘తొందరపాటు వద్దు,’ తనకుతాను మళ్ళీ చెప్పుకున్నాడు. ‘ఒంటెను నడిపే వ్యక్తి చెప్పినట్లు తినే సమయంలో తినాలి, ప్రయాణం చేసే సమయంలో ప్రయాణం చేయాలి.’

మొదటిరోజు ఆంగ్లేయుడితో సహా అందరూ బడలికతో నిద్రపోయారు. తన మిత్రుడికి దూరంగా తన ఈడు వాళ్ళయిన మరో అయిదుగురితో కలిపి యువకుడికి ఒక గుడారాన్ని ఇచ్చారు. ఎడారి ప్రాంతం వాళ్ళు కావటాన పెద్ద నగరాల గురించిన కథలు వినటానికి వాళ్ళు తహతహలాడసాగారు.

గొర్రెల కాపరిగా తన జీవితానుభవాలను వాళ్ళకి యువకుడు చెప్పాడు. గాజు వస్తువుల దుకాణంలోని అనుభవాలు చెప్పబోతుండగా ఆంగ్లేయుడు గుడారంలోకి వచ్చాడు.

“పొద్దుటి నుంచి నీకోసం వెతుకుతున్నాను,” యువకుడిని బయటకు తీసుకెళుతూ అతడన్నాడు. “పరుసవేది ఎక్కడ ఉంటున్నాడో తెలుసుకోడానికి నీ సహాయం కావాలి.”

ముందుగా అతడిని తమంతట తాము కనుక్కోటానికి ప్రయత్నించారు. ఒయాసిస్సులోని మిగిలిన ప్రజలకంటే భిన్నంగా పరుసవేది నివసిస్తూ ఉండవచ్చు; అదీకాక అతడి గుడారంలో మంట నిరంతరం మండుతూ ఉండాలి. వాళ్ళు చాలాసేపు వెదికారు. కాని వాళ్ళు ఊహించిన దానికంటే ఒయాసిస్సు పెద్దగా ఉంది, అక్కడ వందలకొద్దీ గుడారాలు ఉన్నాయి.

"ఒక రోజంతా వృధా చేశాం," యువకుడితోపాటు ఒక బావి వద్ద కూర్చుంటూ ఆంగ్లేయుడు అన్నాడు.

"ఎవరినైనా అడగడం మంచిదేమో," యువకుడు అభిప్రాయ పడ్డాడు.

తాను ఒయాసిస్సుకు ఎందుకు వచ్చిందీ ఇతరులకు చెప్పటం ఆంగ్లేయుడికి ఇష్టం లేదు, అందుకే అతడు ఎటూ తేల్చుకోలేక పోయాడు. తనకంటే అరబ్బీ భాష బాగా వచ్చిన యువకుడు ఎవరినైనా అడగటానికి చివరికి ఒప్పుకున్నాడు. బావి వద్ద తోలు సంచిలో నీరు నింపుకోటానికి వచ్చిన మహిళను యువకుడు సమీపించాడు.

"ఏమండీ! ఒయాసిస్సులో పరుసవేది ఎక్కడ ఉంటాడో చెబుతారా?"

ఆ మహిళ అటువంటి మనిషి గురించి తాను వినలేదని చెప్పి పరుగు పరుగున అక్కడినుంచి వెళ్ళిపోయింది. నల్ల బట్టలు వేసుకున్న మహిళలు పెళ్ళైన వారని, అటువంటి వారితో మాట్లాడకూడదని ఆమె వెళుతూ వెళుతూ చెప్పింది. అతడు సంప్రదాయాలను గౌరవించాలి.

ఆంగ్లేయుడు నిరుత్సాహపడ్డాడు. ఇంత సుదీర్ఘమైన ప్రయాణాన్ని వృధాగా చేశానా అనుకున్నాడు. యువకుడు కూడా విచారానికి గురయ్యాడు; అతని మిత్రుడు తన జీవిత గమ్యాన్ని సాధించుకునే ప్రయత్నంలో ఉన్నాడు. ఎవరైనా తమ కలను సాకారం చేసుకునే ప్రయత్నం చేస్తుంటే వారు విజయం సాధించడానికి ఈ విశ్వమంతా ఆ వ్యక్తికి సహాయపడటానికి ప్రయత్నిస్తుంది. ఈ సంగతి వృద్ధరాజు చెప్పాడు. అతను ఊరికే ఇలా అని ఉండడు.

"నేను పరుసవేదుల గురించి ఇంతకు ముందెన్నడూ వినలేదు," యువకుడు చెప్పాడు. "బహుశా ఇక్కడ కూడా ఎవ్వరూ విని ఉండకపోవచ్చు."

ఆంగ్లేయుడి కళ్ళు తళుక్కున మెరిశాయి. "అదీ సంగతి! ఇక్కడ వారెవ్వరికీ పరుసవేది అంటే తెలియక పోవచ్చు! మనుషుల జబ్బులను నయం చేసేది ఎవరో తెలుసుకో!"

నల్లని బట్టల్లో చాలా మంది మహిళలు నీరు నింపుకోవడానికి బావి దగ్గరకు వచ్చారు. ఆంగ్లేయుడు ఒత్తిడి చేసినప్పటికీ యువకుడు వాళ్ళను ఏమీ ప్రశ్నించలేదు. అప్పుడు ఒక పురుషుడు అటుగా వచ్చాడు.

"ఇక్కడ మనుషుల జబ్బులను నయం చేసే వారెవరైనా నీకు తెలుసా?" యువకుడు అడిగాడు.

"అందరి జబ్బులను అల్లా నయం చేస్తాడు," కొత్తవాళ్ళని చూసి అతడు భయపడ్డాడని స్పష్టమవుతోంది. "మీరు మంత్రగాళ్ళకోసం చూస్తున్నట్లుంది." కొరాన్‌లోని వచనాలను వల్లిస్తూ అతడు వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ఒక చిన్న బక్కెట్టుతో ఒక ముసలి అరబ్బు వచ్చాడు. యువకుడు అదే ప్రశ్న తిరిగి వేశాడు.

"అటువంటి వ్యక్తి గురించి తెలుసుకోవాలని ఎందుకు అనుకుంటున్నారు?" ఆ అరబ్బు ప్రశ్నించాడు.

"అతడిని కలవటానికి నా మిత్రుడు నెలల తరబడి ప్రయాణం చేసి ఇక్కడకు వచ్చాడు," యువకుడు జవాబు ఇచ్చాడు.

"అటువంటి వ్యక్తి ఒయాసిస్సులో ఉన్నట్లయితే అతడు అందరికంటే శక్తిమంతుడై ఉండాలి," కొంచెంసేపు ఆలోచించి ముసలి వ్యక్తి బదులిచ్చాడు. "ఒయాసిస్సు పెద్దలు కూడా తాము కావాలనుకున్నప్పుడు అతన్ని కలవలేరు. అందుకు అతడు సమ్మతించాలి.

"యుద్ధం ముగిసేదాకా వేచి ఉండండి. ఆ తరువాత బిడారుతో వెళ్ళిపోండి. ఒయాసిస్సు జీవితంలో జోక్యం చేసుకోటానికి ప్రయత్నించవద్దు," అంటూ ముసలి వ్యక్తి వెళ్ళిపోయాడు.

కానీ ఆంగ్లేయుడి సంతోషానికి పట్ట పగ్గాలు లేవు. వాళ్ళు సరైన దారిలోనే ఉన్నారు.

చివరికి నల్ల బట్టల్లో లేని ఒక యువతి అక్కడకు వచ్చింది. ఆమె భుజం మీద ఒక నీటి పాత్ర ఉంది. ఆమె తల మీద బట్ట ఉంది కాని ముఖం మీద ముసుగు లేదు. పరుసవేది గురించి అడగటానికి యువకుడు ఆమెను సమీపించాడు.

ఆ క్షణంలో కాలం నిలిచిపోయినట్లు అతడికి అనిపించింది. విశ్వాత్మ అతడిలో ఉప్పొంగింది. ఆమె నల్లని కళ్ళలోకి చూసి, ఆమె పెదవులు చిరునవ్వుకి, నిశ్శబ్దానికి మధ్య ఉండటం గమనించిన తరువాత ప్రపంచమంతా మాట్లాడే భాషలోని ముఖ్యమైన భాగాన్ని అతడు తెలుసుకున్నాడు. పుడమి మీద ఉన్న వారందరూ తమ హృదయాంతరాల్లో ఆ భాషని అర్థం చేసుకోగలరు. అది ప్రేమ. అది మానవాళికంటే పురాతనమయినది, ఎడారికంటే ముందు నుంచే ఉన్నది. ఆ బావి దగ్గర తమ కళ్ళు కలుసుకున్నప్పుడు మాదిరి గానే రెండు జతల కళ్ళు కలుసుకున్న ప్రతిసారీ అది ఒకే శక్తిని వెలువరింపచేస్తుంది. ఆమె నవ్వింది. అది ఖచ్చితంగా శకునమే – అతడికి తెలియకుండానే తన జీవితమంతా ఈ శకునం కోసమే అతను ఎదురు చూస్తున్నాడు. గొర్రెలలో, పుస్తకాలలో, గాజు వస్తువులలో , ఎడారి నిశ్శబ్దంలో అతడు వెతికింది ఈ శకునం కోసమే.

ఇది స్వచ్ఛమైన విశ్వభాష. అనంతకాలంలో పయనించే విశ్వానికి ఎటువంటి వివరణ అవసరం లేనట్లే దీనికి కూడా ఏ వివరణా అవసరం లేదు. ఆ యువకుడికి ఆ క్షణంలో తన జీవితంలోని ఒకే ఒక మహిళ చెంత తాను ఉన్నాననిపించింది, ప్రపంచంలో మిగిలిన అన్నిటికంటే ఇదే ప్రస్ఫుటంగా అతనికి అనిపించింది. ఒక వ్యక్తికి నిబద్ధుడయ్యే ముందు ఆమె గురించి సంపూర్ణంగా తెలియాలని, ప్రేమలో పడాలని అతని తల్లిదండ్రులు, తాత నానమ్మలు చెప్పారు.

బహుశ అటువంటి వాళ్ళు విశ్వభాషని నేర్చుకుని ఉండరు. ఆ భాష తెలిస్తే ప్రపంచంలో ఒకరు నీకోసం ఎదురుచూస్తున్నారని తెలుస్తుంది. అది ఎడారి మధ్యలో కావచ్చు, పెద్ద నగరంలో కావచ్చు. అటువంటి ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు తారసపడి, వాళ్ళ కళ్ళు కలిసినప్పుడు గతమూ, భవిష్యత్తూ అప్రస్తుతం అయిపోతాయి. ఆ ఒక్క క్షణమే మిగులుతుంది. ప్రపంచంలో అన్నింటినీ ఒకే చెయ్యిరాసిందన్న నమ్మశక్యం కాని నిజం మాత్రమే మిగులుతుంది. ఆ చెయ్యి ప్రేమను జనింపచేస్తుంది. ప్రపంచంలోని ప్రతి వ్యక్తికీ మరొక ఆత్మను జతగా సృష్టిస్తుంది. అటువంటి ప్రేమ లభ్యం కాకుండా ఒకరి కలలకు అర్థం లేదు.

'అలాగే జరుగుగాక,' అనుకున్నాడు యువకుడు.

యువకుడిని కుదుపుతూ ఆంగ్లేయుడు "ఆమెను అడుగు," అంటున్నాడు.

యువకుడు ఆమెకు మరింత దగ్గరగా వెళ్ళాడు. ఆమె నవ్వగా తానూ నవ్వాడు.

"నీ పేరేమిటి?" యువకుడు అడిగాడు.

"ఫాతిమా," అంది ఆ యువతి, తన కళ్ళను పక్కకు తిప్పుకుంటూ.

"మా దేశంలో కొందరు ఆడవాళ్ళకి కూడా ఈ పేరు ఉంది."

"అది ప్రవక్త కూతురి పేరు," ఫాతిమా చెప్పింది. "దండయాత్రలు సాగించిన వాళ్ళు ఈ పేరును అన్ని ప్రాంతాలకు చేర వేశారు." అందమైన ఆ యువతి దండెత్తిన వారి గురించి ఎంతో గర్వంగా పలికింది.

ఆంగ్లేయుడు వెనక నుంచి పొడుస్తుండటంతో ప్రజల జబ్బులను నయం చేసే వ్యక్తి గురించి యువకుడు ఆమెను అడిగాడు.

"ప్రపంచంలో అన్ని రహస్యాలూ తెలిసిన వ్యక్తి అతడు," ఆమె చెప్పింది. "ఎడారిలోని దయ్యాలతో అతడు సంభాషిస్తుంటాడు."

దయ్యాలంటే మంచికీ, చెడుకీ సంబంధించిన ఆత్మలు. ఆ వింత మనిషి ఉండే ప్రదేశాన్ని సూచిస్తూ ఆమె దక్షిణ దిశను చూపించింది. ఆ తరువాత తన పాత్ర నింపుకుని ఆమె వెళ్ళిపోయింది.

పరుసవేదిని కలుసుకోవాలన్న ఆతృతతో ఆంగ్లేయుడు కూడా అక్కడి నుంచి కనుమరుగైపోయాడు. యువకుడు బావి దగ్గర చాలాసేపు కూర్చున్నాడు. టారిఫాలో తాను కూర్చుని ఉండగా తూర్పుగాలి ఈమె పరిమళాన్ని మోసుకు వచ్చిన సంగతిని అతడు గుర్తించాడు, ఆమె ఉందని తెలియకముందే ఆమెను ప్రేమించాడు. ఆమె పట్ల తన ప్రేమ కారణంగా తాను ప్రపంచంలోని ప్రతి ఒక్క నిధినీ కనుగొనగలనని అతడు గుర్తించాడు.

ఆమె కలుస్తుందన్న ఆశతో యువకుడు మరునాడు కూడా బావి దగ్గరకు వచ్చాడు. ఎడారి వంక చూస్తూ ఉన్న ఆంగ్లేయుడిని అక్కడ చూసి అతడు ఆశ్చర్యపోయాడు.

"నేను పరుసవేది కోసం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా ఎదురు చూశాను," ఆంగ్లేయుడు చెప్పాడు. "సాయంత్రం చుక్కలు పొడవటంతోటే అతడు కూడా కనపడ్డాడు. నేను దేనికోసం వచ్చానో అతడికి చెప్పాను. ఎప్పుడైనా సీసాన్ని బంగారంగా మార్చావా అని అతడు నన్ను అడిగాడు. అది నేర్చుకోవాలనే ఇక్కడికి వచ్చానని చెప్పాను.

"నేను దానికోసం ప్రయత్నించాలని అన్నాడు. 'వెళ్ళి ప్రయత్నించు,' అని మాత్రమే చెప్పాడు."

యువకుడు మౌనంగా ఉండిపోయాడు. పాపం! ఆంగ్లేయుడు ఇప్పటివరకు ఎన్నోసార్లు ప్రయత్నించినదే తిరిగి చేయటానికి ఇంతదూరం ప్రయాణించవలసి వచ్చింది.

"అయితే వెళ్ళి ప్రయత్నించు," ఆంగ్లేయుడితో యువకుడు అన్నాడు.

"అదే చేయబోతున్నాను. ఇప్పుడే వెళ్ళి మొదలుపెడతాను."

ఆంగ్లేయుడు అక్కడినుంచి వెళ్ళిన తరువాత ఫాతిమా వచ్చి తన పాత్రలో నీరు నింపుకుంది.

"నీకు ఒక విషయం చెప్పటానికి వచ్చాను," యువకుడు అన్నాడు. "నువ్వు నాకు భార్యగా రావాలి. నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

ఆమె పాత్రను జారవిడవడంతో నీరు కింద ఒలికిపోయింది.

"నేను నీకోసం ప్రతిరోజు ఇక్కడ వేచి ఉంటాను. ఎక్కడో పిరమిడ్ల దగ్గర ఉన్న ఒక నిధిని అన్వేషిస్తూ నేను ఈ ఎడారిని దాటాను. అంతలో ఈ యుద్ధం. దానిని నేను ఎంతగానో తిట్టుకున్నాను. కానీ అది నన్ను నీ దగ్గరకు తెచ్చింది కాబట్టి ఇప్పుడు దానిని వరంగా భావిస్తున్నాను."

"ఏదో ఒక రోజు యుద్ధం అంతం అవుతుంది," ఆమె అన్నది.

యువకుడు తన చుట్టూ ఉన్న ఖర్జూర చెట్లవైపు చూశాడు. తాను ఒకప్పుడు గొర్రెల కాపరినన్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు, కావాలంటే మళ్ళీ గొర్రెలకాపరి కాగలడు. తన నిధికంటె ఫాతిమా చాలా ముఖ్యమయినది.

"ఎడారి జాతులు ఎప్పుడూ నిధిని అన్వేషిస్తుంటాయి," అతడి ఆలోచనలు తెలిసినట్లుగా ఫాతిమా అంది. "ఎడారి మహిళలు తమ మగవాళ్ళను చూసి గర్వపడతారు."

ఆమె తన పాత్రను తిరిగి నింపుకుని వెళ్ళిపోయింది.

ఫాతిమాని కలవటానికి యువకుడు ప్రతిరోజు బావి వద్దకు వెళ్ళేవాడు. గొర్రెలకాపరిగా తన జీవితం గురించీ, రాజుగురించీ, గాజు వస్తువుల దుకాణం గురించీ

ఆమెకు చెప్పాడు. వాళ్ళిద్దరూ స్నేహితులయ్యారు. ఆమెతో గడిపే ఆ పదిహేను నిమిషాలు తప్పించి రోజు గడవటం లేదని అతడికి అనిపిస్తూఉండేది. ఒయాసిస్సుకు వచ్చి ఒక నెల అయిన తరువాత బిడారు నాయకుడు తనతోపాటు ప్రయాణించిన వారందరినీ సమావేశపరిచాడు.

"ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియదు కాబట్టి, మనం మన ప్రయాణాన్ని కొనసాగించలేం," అతడు చెప్పాడు. "ఈ యుద్ధం ఎంతో ముఖ్యమయినది. ఇది అధర్మంపై ధర్మం చేస్తున్న యుద్ధం కాదు. అధికారంలో సమతూకం కోసం రెండు శక్తుల మధ్య జరుగుతున్న యుద్ధమిది. ఇలాంటి యుద్ధం మొదలైనప్పుడు రెండు వైపులా అల్లా ఉంటాడు కాబట్టి ఇది చాలాకాలం కొనసాగుతుంది."

ప్రయాణికులు తాము ఉంటున్నచోటుకి తిరిగి వెళ్ళారు. ఆ మధ్యాహ్నం ఫాతిమాని కలవటానికి యువకుడు వెళ్ళాడు. ఆ రోజు ఉదయం జరిగిన సమావేశం గురించి ఆమెకు చెప్పాడు. "మనం కలిసిన మరుసటిరోజు నువ్వు నన్ను ప్రేమిస్తున్నానని చెప్పావు," ఫాతిమా అన్నది, "తరువాత నాకు విశ్వభాష గురించీ, విశ్వాత్మ గురించీ నేర్పావు. ఆ కారణంగా నేను నీలో భాగమైపోయాను."

యువకుడు ఆమె స్వరాన్ని వింటూ ఉండిపోయాడు. ఖర్జూర చెట్లలోని గాలి సవ్వడి కంటె ఆమె స్వరం ఎంతో తియ్యగా అనిపించింది.

"ఈ ఒయాసిస్సు దగ్గర నేను నీ కోసం ఎంతో కాలంగా వేచి ఉన్నాను. నేను నా గతాన్ని మరిచిపోయాను, మా సంప్రదాయాలను మరిచిపోయాను, ఎడారి పురుషులు తమ స్త్రీలు ఎలా ఉండాలని కోరుకుంటారో మరిచి పోయాను. ఈ ఎడారి నాకు ఒక అద్భుతమయిన బహుమతిని తెస్తుందని నేను చిన్నప్పటినుండి కలగనే దాన్ని. ఇప్పుడు నా బహుమతి నాకు దొరికింది, అది నువ్వే."

యువకుడు ఆమె చేతిని అందుకోవాలని అనుకున్నాడు. కానీ ఆమె చేతులు పాత్రని పట్టుకుని ఉన్నాయి.

"నువ్వు నీ కలల గురించి, ముసలి రాజు గురించి, నిధి గురించి చెప్పావు. ఆ శకునాలే నిన్ను నా దగ్గరకు చేర్చాయి కాబట్టి ఇప్పుడు నాకు దేనిగురించీ భయంలేదు. ఇప్పుడు నేను నీ కలలో భాగాన్ని, నువ్వు చెప్పే నీ జీవిత గమ్యంలో భాగాన్ని.

"అందుకే నువ్వు నీ లక్ష్యంపైపు కొనసాగాలని కోరుకుంటున్నాను. యుద్ధం అయిపోయేవరకు వేచి ఉండాల్సి వస్తే, అలాగే వేచి ఉండు. కానీ ఇంకా ముందుగానే వెళ్ళాల్సి ఉంటే నీ కలను అన్వేషిస్తూ తప్పనిసరిగా వెళ్ళు. గాలికి ఇసుక తిన్నెలు మారతాయికాని ఎడారి ఎప్పుడూ మారదు. ఒకరిపట్ల మరొకరికి ఉన్న మన ప్రేమ కూడా ఇలాగే ఉంటుంది.

"అలాగే జరుగుగాక," ఆమె అన్నది. "నేను నిజంగా నీ కలలో భాగాన్నే అయితే ఏదో ఒక రోజు నువ్వు తప్పక తిరిగి వస్తావు."

ఆ రోజు ఆమెను విడిచి వెళ్ళేటప్పుడు యువకుడు ఎంతో విచారంగా ఉన్నాడు. తనకు తెలిసిన పెళ్ళైన గొర్రెలకాపరులను గుర్తుకు తెచ్చుకున్నాడు. తాము సుదూర మైదానాలకు వెళ్ళాల్సి ఉందని వాళ్ళ భార్యల్ని ఒప్పించటానికి వాళ్ళు ఎంతో కష్టపడేవాళ్ళని గుర్తుకొచ్చింది. ప్రేమ ఉన్నప్పుడు ప్రేమించిన వాళ్ళకు దగ్గరగా ఉండాలి.

మరునాడు వాళ్ళు కలుసుకున్నప్పుడు ఈ విషయాన్ని అతడు ఫాతిమాకి చెప్పాడు.

"ఎడారి మా ప్రియతమలను మా నుంచి తీసుకెళుతుంది, అన్నిసార్లూ వాళ్ళు తిరిగిరారు," ఆమె అన్నది. "ఈ సంగతి మాకు తెలుసు, మాకు అది

అలవాటైపోయింది. తిరిగి రాని వాళ్ళు మబ్బుల్లో భాగమవుతారు, ఎడారులలో దాగే జంతువులలో భాగమవుతారు, భూమిలోంచి వచ్చే నీటిలో భాగమవుతారు. వాళ్ళు ప్రతి దాంట్లో భాగమవుతారు. వాళ్ళు విశ్వాత్మ అవుతారు.

"కొందరు తిరిగి వస్తారు. అప్పుడు ఏదో ఒక రోజు తమ ప్రియతమలు కూడా తిరిగి వస్తారన్న నమ్మకంతో మిగిలిన మహిళలు కూడా సంతోషిస్తారు. అటువంటి మహిళలను చూసి వాళ్ళ ఆనందానికి నేను అసూయ చెందేదాన్ని. ఇప్పుడు నేను కూడా వేచి ఉండే మహిళల్లో ఒకదాన్ని అవుతాను.

"నేను ఎడారి మహిళను, నాకు అందుకు గర్వంగా ఉంది. ఇసుక తిన్నెలకు రూపాన్నిచ్చే గాలి ఎలా స్వేచ్ఛగా సంచరిస్తుందో, అలాగే నా భర్త స్వేచ్ఛగా సంచరించాలని నేను కోరుకుంటాను. అతడు మబ్బులలోనూ, జంతువులలోనూ, ఎడారి నీటిలోనూ భాగమవ్వాల్సి ఉంటే ఆ వాస్తవాన్ని ఆమోదిస్తాను."

ఆంగ్లేయుడిని వెతుక్కుంటూ యువకుడు వెళ్ళాడు. అతడికి ఫాతిమా గురించి చెప్పాలని ఉంది. ఆంగ్లేయుడు తన గుడారం బయట ఒక బట్టీని తయారు చేసి ఉండటం అతడికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అది ఒక వింత బట్టీ; కింద కట్టె పుల్లలు మండుతున్నాయి; పైన పారదర్శక పాత్ర ఉంది. ఆంగ్లేయుడు ఎడారివైపు తేరిపార చూసినప్పుడు అతడి కళ్ళు పుస్తకం చదివేటప్పటికంటే కాంతివంతంగా ఉన్నాయి.

"ఇది నా పనిలో మొదటి దశ," అతడు చెప్పాడు. "నేను ముందుగా గంధకాన్ని వేరు చెయ్యాలి. ఇది విజయవంతంగా చెయ్యాలంటే వైఫల్యం గురించిన భయం ఉండకూడదు. వైఫల్యం చెందుతానన్న భయం కారణంగా ఇప్పటివరకూ నేను నిపుణుని పనికి పూనుకోలేదు. పది సంవత్సరాల క్రితం మొదలు పెట్టవలసినదానిని ఇప్పుడు మొదలు పెడుతున్నాను. కానీ మరో ఇరవై సంవత్సరాలు వేచి ఉండనందుకు సంతోషంగా ఉంది."

ఆంగ్లేయుడు మంటలోకి కట్టెపుల్లలు పెడుతూ కూర్చున్నాడు. సూర్యుడు అస్తమించబోయేముందు ఎడారి ఊదారంగుకు మారేవరకు యువకుడు అక్కడ కూర్చున్నాడు. ఎడారి నిశ్శబ్దంలో తన ప్రశ్నలకు ఏమైనా సమాధానాలు ఉన్నాయేమో చూడాలన్న తీవ్ర కోరిక అతడిలో చెలరేగింది.

ఖర్జూర చెట్లు కనుమరుగుకాకుండా అతడు కొంతసేపు ఒయాసిస్సుకు దగ్గరగా సంచరించాడు. అతడు గాలి సవ్వడులను విన్నాడు. కాలి కింద రాళ్ళను అనుభూతి పొందాడు. అక్కడొకటి, ఇక్కడొకటి నత్త గుల్లలు కనిపించాయి; ఎడారి గతంలో ఎప్పుడో సముద్రంగా ఉండేదన్న వాస్తవాన్ని గుర్తించాడు. ఒక రాయి మీద కూర్చుని క్షితిజాన్ని చూస్తూ దాని వశీకరణకు తనంతట తాను లోనయ్యాడు. ప్రేమ సిద్ధాంతానికీ, పొంది ఉండటానికీ మధ్య తేడాను గుర్తించటానికి ప్రయత్నించాడు. కానీ ఆ రెండింటినీ వేరుచెయ్యలేకపోయాడు. కాని ఫాతిమా ఎడారి మహిళ, అర్థం చేసుకోగలగటంలో తనకు సహాయపడగలిగేది ఎడారి ఒక్కటే.

అలా ఆలోచిస్తూ అక్కడ కూర్చుని ఉండగా తనపైన ఏదో కదులుతున్నట్లు అనిపించింది. పైకి చూసేసరికి ఆకాశంలో దూరంగా రెండు గద్దలు ఎగురుతూ కనిపించాయి.

గాలిలో విహరిస్తున్న ఆ గద్దలను అతడు గమనించసాగాడు. వాటి విహారానికి ఒక తీరు, తెన్నూ ఉన్నట్లు కనిపించకపోయినా యువకుడికి ఏదో అర్థమయినట్లు అనిపించసాగింది. అది ఏమిటో అతడికీ అంతు చిక్కకుండా ఉంది. గద్దల కదలికలను గమనిస్తూ దాంట్లోని అర్థాలను వెదకటానికి ప్రయత్నిస్తున్నాడు. పొంది ఉండటం కాకుండా ప్రేమతత్వాన్ని వివరించడానికి బహుశః ఈ ఎడారి పక్షులు ప్రయత్నిస్తున్నాయేమో.

అతడికి నిద్రమత్తుగా అనిపించింది. అతడి అంతరాంతరాల్లో మెలకువగా ఉండాలని ఉంది, కానీ నిద్రపోవాలని కూడా ఉంది. ‘నేను ప్రపంచ భాషని

నేర్చుకుంటున్నాను, ప్రపంచంలోని ప్రతిదీ నాకు అర్థమవుతోంది..... విహరిస్తున్న గద్దలు కూడా,' తనలో తాను అనుకున్నాడు. ఆ స్థితిలో తాను ప్రేమికుడు అయినందుకు ధన్యుడిగా భావించుకున్నాడు. ప్రేమ ఉన్నప్పుడు విషయాలు మరింత స్పష్టంగా అర్థమవుతాయని అతడనుకున్నాడు.

ఉన్నట్లుండి ఒక గద్ద ఆకాశంలో కిందికి దూసుకు వస్తూ రెండో దానిమీద దాడి చేసింది. అది అలా చేస్తుండగా కత్తులు దూసిన సైన్యం ఒయాసిస్సు మీదకి దూసుకువస్తున్న దృశ్యం యువకుడికి లిప్తపాటు కనిపించి మాయమయ్యింది. దృశ్యం వెంటనే కనుమరుగయ్యింది కానీ అది యువకుడిని కుదిపేసింది. ఎండమావుల గురించి ప్రజలు మాట్లాడుకోవటం తాను విన్నాడు, అతడు కొన్నింటిని చూశాడు కూడా: తీవ్ర రూపం దాల్చిన కోరికలు ఎడారి ఇసుకల మీద రూపు దాలుస్తుంటాయి, కాని ఒక సైన్యం ఒయాసిస్సుమీదకి దండెత్తి రావాలని అతడు ఏ మాత్రం కోరుకోలేదు.

ఆ దృశ్యాన్ని మరిచిపోయి తిరిగి ధ్యానంలో నిమగ్నం కావాలని ప్రయత్నించాడు. ఎడారిలోని ఊదా రంగు మీద, రాళ్ళమీద దృష్టి కేంద్రీకరించటానికి ప్రయత్నించాడు. కాని అతని మనస్సులో ఏదో అతన్ని నిలవనివ్వలేదు.

'శకునాలను ఎప్పుడూ పట్టించుకో,' వృద్ధరాజు చెప్పాడు. తాను చూసింది యువకుడు గుర్తు తెచ్చుకుని అది నిజంగా జరగబోతోందని తెలుసుకున్నాడు.

కూర్చున్న చోటునుంచి లేచి అతడు ఒయాసిస్సు వైపు నడవసాగాడు. తన చుట్టూ ఉన్న అనేక భాషలను అతడు మరొకసారి అర్థం చేసుకోగలిగాడు: ఈ సారి ఎడారి క్షేమంగా ఉంది, ఒయాసిస్సే ప్రమాదకరంగా మారింది.

ఒంటెల సంరక్షకుడు ఖర్జూర చెట్టుకు జారగిలబడి కూర్చుని సూర్యాస్తమయాన్ని చూస్తూ ఇసుక తిన్నెలకు అటువైపునుంచి యువకుడు రావటం గమనించాడు.

"ఒక సైన్యం దాడి చేయబోతోంది," యువకుడు చెప్పాడు. "నాకు ఆ దృశ్యం గోచరించింది."

"మనుషుల హృదయాలను దృశ్యాలతో ఎడారి నింపుతుంది," ఒంటెను నడిపే వ్యక్తి బదులిచ్చాడు.

అప్పుడు యువకుడు గద్దల గురించీ, వాటి విహారంలో తేడాను తాను గమనించడం గురించీ చెప్పాడు; ఉన్నట్లుండి తాను విశ్వాత్మలో లీనమయినట్లు అనిపించిందని చెప్పాడు.

యువకుడు మాట్లాడుతున్నదేమిటో ఒంటెను నడిపే వ్యక్తికి అర్థం అయ్యింది. ప్రపంచంలో ఏదైనా ఒకటి మిగిలిన వాటి చరిత్రను వెల్లడి చేయగలదన్న విషయం అతడికి తెలుసు. అది పుస్తకంలో ఒక పేజీని తెరవటం కావచ్చు, లేదా ఒకరి అరచేతిని పరిశీలించటం కావచ్చు; ఒక ముక్క తిరగెయ్యటం కావచ్చు, లేదా ఎగురుతున్న పక్షులను గమనించటం కావచ్చు.... దేనిని పరికించినా ఆ క్షణంలోని అనుభూతితో ఆ వ్యక్తికి సంబంధం ఏర్పడవచ్చు. వాస్తవానికి ఆ విషయాలు తమంతట తాముగా ఏమీ చెప్పవు; కానీ తమ చుట్టూ జరుగుతున్న దానిని గమనించిన మనుషులు విశ్వాత్మలోకి చొచ్చుకుని పోగలుగుతారు.

విశ్వాత్మలో తేలికగా లీనమైపోయి దానిపై ఆధారపడి జీవించే వాళ్ళు ఎడారిలో దండిగా ఉన్నారు. దివ్యజ్ఞానం కలిగిన సాధువులుగా వారిని ప్రజలు ఎరుగుదురు; వారంటే ఆడవాళ్ళకీ, వృద్ధులకీ ఎంతో భయభక్తులుండేవి. యుద్ధంలో చనిపోతామని ముందుగానే తెలిస్తే యుద్ధం సరిగా చేయలేమని పురుషులు వారిని

సంప్రదించటానికి భయపడేవాళ్ళు. యుద్ధంలోని ఆనందాన్ని, ఫలితం ఎలా ఉంటుందో తెలియని ఉత్సుకతనీ ఎడారిజాతి పురుషులు ఇష్టపడేవారు. భవిష్యత్తుని అల్లా ఆపాటికే రాసేశాడు, అతడు రాసిందంతా మానవుల మంచికే. కాబట్టి ఎడారి జాతి పురుషులు ప్రస్తుతంలో జీవిస్తున్నారు. ఆ ప్రస్తుతం ఎన్నో సంభ్రమాశ్చర్యాలతో నిండి ఉంటుంది, అంతేకాక అనేక విషయాల్లో అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది: శత్రువు కత్తి ఎక్కడ ఉంది? అతడి గుర్రం ఎక్కడ ఉంది? మరుక్షణం జీవించి ఉండాలంటే ఎటువంటి వేటు వెయ్యాలి? ఒంటెల సంరక్షకుడు సైనికుడు కాదు కాబట్టి అతడు సాధువులను సంప్రదించాడు. చాలా మంది సరిగానే చెప్పారు కానీ కొందరు తప్పు చెప్పారు. ఒకసారి అతడు ఒక వృద్ధ సాధువును సంప్రదించాడు (అతడంటే అందరికీ ఎంతో భయం). భవిష్యత్తు తెలుసుకోవాలని ఎందుకు అనుకుంటున్నావు అని ఒంటెల సంరక్షకుడిని సాధువు అడిగాడు.

"దాని వల్ల నేను ఏమైనా చేయగలుగుతాను," అతడు బదులిచ్చాడు. "జరగటం ఇష్టంలేని వాటిని నేను మారుస్తాను."

"అవి అప్పుడు నీ భవిష్యత్తులో భాగం కావు," సాధువు చెప్పాడు.

"అయితే జరగబోయేవాటికి సంసిద్ధుడిని కావటానికి భవిష్యత్తు గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను."

"మంచి జరగబోతుంటే, అది జరిగినప్పుడు సంభ్రమాశ్చర్యాలను తనతో తెస్తుంది," అంటూ సాధువు కొనసాగించాడు. "అదే చెడు జరగబోతుంటే, అది జరగక ముందు నుంచే నువ్వు ఎంతగానో బాధకు గురి అవుతావు."

"నేను పురుషుడిని కాబట్టి భవిష్యత్తుని తెలుసుకోవాలనుకుంటున్నాను," సాధువుతో ఒంటెల సంరక్షకుడు చెప్పాడు. "పురుషులు ఎప్పుడూ భవిష్యత్తు ఆధారంగా తమ జీవితాన్ని గడుపుతారు."

ఆ సాధువు పుల్లలను నేలమీదికి వేసి పడిన విధానాన్ని బట్టి భవిష్యత్తు చెప్పటంలో నిపుణుడు. ఆ రోజు అతడు పుల్లల్ని విసరలేదు. వాటిని బట్టలో చుట్టి తన సంచిలో పెట్టేసుకున్నాడు.

"ప్రజలకు భవిష్యత్తును వివరించి నా జీవికను పొందుతాను," సాధువు చెప్పాడు. "నాకు పుల్లల శాస్త్రం తెలుసు. వాటి ఆధారంగా అన్నీ రాసి ఉన్నచోటుకి ఎలా చొచ్చుకుపోవాలో నాకు తెలుసు. అక్కడ నేను గతాన్ని చదివి, మరుగున పడినదాన్ని కనుగొంటాను. అంతేకాక ప్రస్తుతంలో ఉన్న శకునాలను అర్థం చేసుకోగలను.

"ప్రజలు నన్ను సంప్రదించినప్పుడు నేను భవిష్యత్తును చదవటంలేదు, దానిని ఊహిస్తున్నానంతే. భవిష్యత్తు దేవుడికి చెందుతుంది, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే దానిని అతడు వెల్లడి చేస్తాడు. ప్రస్తుతంలోని శకునాల ఆధారంగా నేను భవిష్యత్తుని ఊహిస్తాను. మర్మమంతా ప్రస్తుతంలోనే దాగి ఉంది. నువ్వు ప్రస్తుతంపై శ్రద్ధ వహిస్తే దానిని మెరుగుపరచగలుగుతావు. నువ్వు ప్రస్తుతాన్ని మెరుగుపరచగలిగితే భవిష్యత్తు బాగా ఉంటుంది. దేవుడు తన బిడ్డలను ప్రేమిస్తాడన్న విశ్వాసంతో భవిష్యత్తు గురించి మరిచిపోయి అనుదినం అతని బోధనల ప్రకారం జీవించు. ప్రతిరోజూ దానంతట అదే శాశ్వతత్వాన్ని తీసుకొస్తుంది."

భవిష్యత్తు తనకి తెలిసేలా దేవుడు అనుమతించే పరిస్థితులు ఏమిటని ఒంటెల సంరక్షకుడు అడిగాడు.

"తనకై తాను వెల్లడి చేయాలనుకున్నప్పుడు తప్ప, చాలా అరుదుగా తప్ప దేవుడు భవిష్యత్తుని వెల్లడి చేయడు. అలా చేశాడంటే దానికి ఒకే ఒక కారణముంటుంది: అది మార్పు చెందాల్సిన భవిష్యత్తు."

భవిష్యత్తులో కొంత యువకుడికి అర్థమయ్యేలా దేవుడు చేశాడని ఒంటెల సంరక్షకుడు అనుకున్నాడు. యువకుడిని తన సాధనంగా అతడు ఎందుకు ఎంచుకున్నాడు?

"వెళ్ళి ఎడారి పెద్దలతో మాట్లాడు," ఒంటెల సంరక్షకుడు చెప్పాడు. "దండెత్తి వస్తున్న సైన్యాల గురించి వాళ్ళకి చెప్పు."

"వాళ్ళు నన్ను చూసి నవ్వుతారు."

"వాళ్ళు ఎడారి మనుషులు. శకునాలతో వ్యవహరించటం ఎడారి మనుషులకు తెలుసు."

"అయితే వారికి ఈపాటికే ఇది తెలిసి ఉంటుంది."

"వాళ్ళకి ఇప్పుడు అది పట్టదు. అల్లా తమకు ఏదైనా తెలియాలని అనుకుంటే దానిని ఎవరో ఒకరు తెలియచేస్తారని వాళ్ళు నమ్ముతారు. ఇలా అనేకసార్లు జరిగింది. ఈసారి ఆ వ్యక్తివి నువ్వే."

యువకుడు ఫాతిమాని గుర్తుకు తెచ్చుకున్నాడు. ఎడారి పెద్దలను కలవాలని నిర్ణయించుకున్నాడు.

*

ఒయాసిస్సు మధ్యలోనున్న తెల్లని, పెద్ద గుడారం ముందున్న కాపలావాడిని యువకుడు సమీపించాడు.

"నేను పెద్దలను కలుసుకోవాలి. ఎడారినుంచి శకునాలను తీసుకువచ్చాను."

ఏమీ బదులివ్వకుండా కాపలావ్యక్తి లోపలికి ప్రవేశించి కాసేపు అక్కడే ఉండిపోయాడు. కొంతసేపటికి అతడు బయటికి వచ్చినప్పుడు అతనితోపాటు తెలుపు, బంగారు దుస్తులలో ఒక యువ అరబ్బు ఉన్నాడు. తాను చూసినదానిని

యువకుడు అతనికి చెప్పాడు. అతడిని అక్కడే ఉండమని అరబ్బు యువకుడు గుడారంలోకి మాయమైపోయాడు.

రాత్రి అయ్యింది. అనేకమంది సైనికులు, వ్యాపారులు గుడారం లోపలికి వెళ్ళి, బయటకు వస్తున్నారు. గుడారాల ముందున్న మంటలను ఆర్పేస్తున్నారు, ఒయాసిస్సు కూడా ఎడారి మాదిరి మౌనంగా మారిపోయింది. ఆ పెద్ద గుడారంలో మాత్రమే దీపాలు వెలుగుతున్నాయి. ఇదంతా జరుగుతున్నంత సేపు యువకుడు ఫాతిమా గురించి ఆలోచిస్తున్నాడు. తమ చివరి సంభాషణ అతనికి ఇప్పటికీ అర్థంకాలేదు.

కొన్ని గంటల పాటు వేచి ఉన్న తరువాత చివరికి కాపలావాడు యువకుడిని లోపలికి రమ్మన్నాడు. గుడారం లోపల చూసి యువకుడు ఆశ్చర్యానికి గురయ్యాడు. ఎడారి మధ్యలో ఇటువంటి గుడారం ఒకటి ఉంటుందని దీన్ని చూడకపోతే అతడు ఎప్పటికీ ఊహించగలిగేవాడు కాదు. తాను ఇంతకు ముందెన్నడూ చూడని అందమైన తివాచీలతో నేల కప్పి ఉంది. గుడారం కప్పునుంచి చేతితో చేసిన బంగారు ప్రమిదలు వేలాడుతున్నాయి, వాటిల్లో కొవ్వొత్తులు వెలిగించి ఉన్నాయి. గుడారం వెనక భాగంలో ఎంబ్రాయిడరీ చేసిన పట్టు దిళ్ళకు ఆనుకుని ఎడారి పెద్దలు అర్థవలయంలో కూర్చుని ఉన్నారు. తేనీరు, సుగంధ ద్రవ్యాలు ఉన్న వెండి పళ్ళాలతో సేవకులు వస్తూ పోతూ ఉన్నారు. మరికొంతమంది సేవకులు హుక్కాల్లోని మంట ఆరిపోకుండా చూస్తున్నారు. వాతావరణం అంతా తియ్యటి పొగ వాసనతో నిండిపోయి ఉంది.

ఎడారి పెద్దలు మొత్తం ఎనిమిది మంది ఉన్నారు. కాని వీళ్ళందరిలో ముఖ్యమైనది ఎవరో యువకుడు వెంటనే గుర్తుపట్టాడు. ఆ ముఖ్యుడు అర్థవలయానికి మధ్యలో కూర్చుని ఉన్నాడు. తెలుపు, బంగారు దుస్తులు ధరించి

ఉన్నాడు. అతడి పక్కనే అంతకుముందు యువకుడితో మాట్లాడిన యువ అరబ్బు ఉన్నాడు.

ఒక కంట యువకుడిని చూస్తూ ఒక పెద్ద "శకునాల గురించి మాట్లాడే అపరిచితుడు ఎవరు?" అని అడిగాడు.

"నేనే," అంటూ యువకుడు బదులిచ్చి, తాను చూసినదాని గురించి చెప్పాడు.

"కొన్ని తరాలనుంచి మేమిక్కడ ఉంటున్నప్పుడు ఎడారి ఈ విషయాలను ఒక కొత్త వ్యక్తికి ఎందుకు వెల్లడిచేస్తుంది?" మరొక పెద్ద అన్నాడు.

"నా కళ్ళు ఇంకా ఎడారికి అలవాటు పడలేదు," యువకుడు బదులిచ్చాడు. "అలవాటు పడిన కంటికి కనపడనిది నేను చూడగలుగుతాను."

అంతేకాకుండా నాకు విశ్వాత్మ గురించి తెలుసు తనలో తాను అనుకున్నాడు.

"ఒయాసిస్సు యుద్ధ రహిత భూమి. ఒయాసిస్సుపై ఎవరూ దాడిచెయ్యరు," మూడవ పెద్ద అన్నాడు.

"నేను చూసినది మాత్రమే మీకు చెప్పగలను. నేను చెప్పినది మీకు నమ్మాలని లేకపోతే దాని గురించి మీరు పట్టించుకోనవసరం లేదు."

పెద్దలు తమలో తాము తీవ్రంగా చర్చించుకోసాగారు. వాళ్ళు మాట్లాడే అరబ్బీ భాష యువకుడికి అర్థం కాలేదు. కానీ తాను శలవు తీసుకుంటానని అన్నప్పుడు ఉండమని కాపలా వ్యక్తి అన్నాడు. యువకుడు భయానికి గురయ్యాడు, ఎక్కడో పొరపాటు జరిగిందని శకునాలు చెపుతున్నాయి. తాను ఎడారిలో చూసిన దాని గురించి ఒంటెల సంరక్షకుడితో చెప్పినందుకు అతడు పశ్చాత్తాపపడసాగాడు.

ఉన్నట్టుండి మధ్యలో ఉన్న ప్రముఖుడు కనపడీ కనపడకుండా నవ్వాడు. దాంతో యువకుడు కొంత ఊపిరి పీల్చుకున్నాడు. అతడు అప్పటిదాకా చర్చలో పాల్గొనలేదు, నిజానికి అతను ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కానీ యువకుడికి

విశ్వ భాష తెలిసి ఉండటం వల్ల గుడారమంతా శాంతి తరంగాలు ప్రసరించిన అనుభూతి అతనికి కలిగింది. తాను ఇక్కడికి రావడం మంచిదే అయిందని ఇప్పుడు అతనికి అనిపించసాగింది.

చర్చ ముగిసింది. గుడారంలోని పెద్ద చెప్పేది వినటానికి మిగిలిన వాళ్ళు మౌనం వహించారు. యువకుడి వైపు తిరిగాడు ప్రముఖుడు: ఈ సారి అతని ముఖంలో ఏ భావమూ లేదు.

"రెండు వేల సంవత్సరాల క్రితం ఒక సుదూర ప్రాంతంలో తన కలలను నమ్మిన ఒక వ్యక్తిని చెరసాలలో పడేసి బానిసగా అమ్మేశారు," ఈసారి ఆ వృద్ధుడు యువకుడికి అర్థమయ్యే యాసలో మాట్లాడాడు. "మా వ్యాపారులు అతడిని కొని, ఈజిప్టుకి తీసుకువచ్చారు. కలలను నమ్మే వ్యక్తికి వాటి గురించి వ్యాఖ్యానించడం కూడా వచ్చని మాకందరికీ తెలుసు."

అతడు ఇలా కొనసాగించాడు: "ఈజిప్టు రాజు ఫారో బక్క చిక్కిన ఆవులు, బలిసిన ఆవుల గురించి కలగన్నప్పుడు నేను చెబుతున్న మనిషి ఈజిప్టును కరువు నుంచి కాపాడాడు. అతడి పేరు జోసెఫ్. అతడు కూడా నీకు మాదిరే కొత్త ప్రదేశంలో కొత్త వ్యక్తి. బహుశః అప్పుడతడి వయస్సు కూడా నీ అంతే ఉండి ఉంటుంది."

అతను కాసేపు ఆగాడు. అతడి కళ్ళు స్నేహ పూర్వకంగా లేవు.

"మేం ఎప్పుడూ సాంప్రదాయాన్ని పాటిస్తాం. ఈ సాంప్రదాయమే ఆ రోజుల్లో ఈజిప్టుని కరువునుంచి కాపాడింది, ఈజిప్టు వాసులని అందరికంటే సంపన్నులుగా చేసింది. ఎడారిని ఎలా దాటాలో పురుషులకు సాంప్రదాయం నేర్పుతుంది. వాళ్ళ పిల్లలకు ఎలా పెళ్ళిళ్ళు చేయాలో చెబుతుంది. ఇరుపక్షాలకూ ఒయాసిస్సులు

ఉంటాయి. కాబట్టి, ఇద్దరూ దాడికి గురి కావచ్చు. అందుకే ఒయాసిస్సు యుద్ధ రహిత భూమి అని సాంప్రదాయం చెబుతుంది."

అతడు కొనసాగిస్తూ ఉండగా అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు.

"అయితే ఎడారి సందేశాలను నమ్మాలని కూడా సాంప్రదాయం చెబుతోంది. మాకు తెలిసినదంతా ఎడారి మాకు నేర్పిందే."

అతడు సంకేతం ఇవ్వటంతో అందరూ లేచి నిలబడ్డారు. సమావేశం ముగిసింది. హుక్కాలోని బొగ్గులను ఆర్పేశారు. కాపలాదారులు నిటారుగా నిలబడ్డారు. యువకుడు బయటికి వెళ్ళబోతుండగా ప్రముఖుడు మళ్ళీ మాట్లాడాడు:

"ఒయాసిస్సు వద్ద ఎవ్వరూ ఆయుధాలు కలిగి ఉండగూడదన్న ఒప్పందాన్ని రేపు ఉల్లంఘిస్తున్నాం. శత్రువుల కోసం పగలంతా నిఘా ఉంచుతాం. సూర్యాస్తమయం అయిన తరువాత అందరూ ఆయుధాలను తిరిగి నా వద్ద జమచేస్తారు. శత్రువులలో చనిపోయిన ప్రతి పది మందికి ఒకటి చొప్పున నీకు బంగారు నాణెం లభిస్తుంది.

"కానీ యుద్ధం చెయ్యకుండా ఆయుధాలు దుయ్యగూడదు. ఎడారి లాగానే ఆయుధాలు కూడా చపల చిత్తమైనవే. దూసిన తరువాత వాటిని ఉపయోగించకపోతే మరోసారి అవి పని చేయకపోవచ్చు. రేపటి రోజు ముగిసేసరికి ఏ ఒక్క ఆయుధమూ ఉపయోగించకపోతే వాటిల్లో ఒకటి నీ మీద ఉపయోగించబడుతుంది."

యువకుడు ఆ గుడారాన్ని వదిలి వెళ్ళేటప్పటికి చంద్రుని వెన్నెల మాత్రమే ఉంది. అతడు మెల్లగా తన గుడారం వైపు నడవసాగాడు.

జరిగిన దానికి యువకుడు తీవ్ర కలతకు గురయ్యాడు. విశ్వఆత్మను చేరుకోవటంలో అతడు సఫలమయ్యాడు, కాని దానికి మూల్యంగా తన ప్రాణం చెల్లించవలసి రావచ్చు. ఈ పందెం భయం కొలిపేదిగా ఉంది. అయితే తన జీవిత గమ్యాన్వేషణలో గొర్రెలను అమ్మిన రోజు నుంచి ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటూనే ఉన్నాడు. అదీగాక ఒంటెల సంరక్షకుడు చెప్పినట్లు మరో రోజున చనిపోవటం కంటే రేపు చనిపోవటం ఏ విధంగానూ దారుణమైనది కాదు. ప్రతిరోజూ జీవించటానికి ఎంత అవకాశం ఉందో, మహాభినిష్క్రమణకూ అంతే అవకాశం ఉంది. ప్రతిదీ ఒకే ఒక్క మాట మీద ఆధారపడి ఉంది: 'అలాగే జరుగుగాక.'

మౌనంగా నడుస్తున్న యువకుడిలో జరిగిన దానికి చింత లేదు. రేపు అతను చనిపోయాడంటే భవిష్యత్తును మార్చటం దేవుడికి ఇష్టంలేదని అనుకోవాలి. జలసంధిని దాటి, గాజు వస్తువుల దుకాణంలో పనిచేసి, ఎడారి నిశ్శబ్దాన్నీ, ఫాతిమా కళ్ళ మౌనాన్ని తెలుసుకున్న తరువాతే చనిపోయాడన్న తృప్తి మిగులుతుంది. ఎన్నో సంవత్సరాల క్రితం ఇల్లు వదిలిపెట్టిన నాటినుంచి అతడు ప్రతిరోజునీ సంపూర్ణంగా జీవించాడు. అతడు రేపు చనిపోయినా మిగిలిన గొర్రెల కాపరులకంటే ప్రపంచాన్నెంతో చూశాడన్న గర్వం అతనికి ఉంటుంది.

ఉన్నట్టుండి అతడికి పిడుగులాంటి శబ్దం వినపడింది. అంతకు ముందెన్నడూ ఎరగనంత తీవ్రమైన గాలి అతడిని కిందకి పడేసింది. ఆ ప్రాంతమంతా దుమ్ము సుడులు తిరగటంతో చంద్రుడు కూడా కనపడకుండా పోయాడు. అతడి ముందు ఒక పెద్ద, తెల్లని గుర్రం ఉంది. అది భయంకరంగా సకిలిస్తోంది.

అంధకారమయం చేసిన దుమ్ము కొంత అణిగిన తరువాత యువకుడు తనకు కనపడిన దృశ్యానికి ఒణికిపోయాడు. గుర్రాన్ని ఎక్కి ఉన్న వ్యక్తి నల్లని దుస్తులు ధరించి ఉన్నాడు. అతడి ఎడమ భుజం మీద ఒక డేగ ఉంది. అతడు తలపాగా ధరించి ఉన్నాడు. కళ్ళు తప్పించి మిగిలిన ముఖమంతా నల్లని రుమాలుతో కప్పి

ఉంది. అతడు ఒక ఎడారి దూతలా అనిపించాడు, కాని అతని అస్థిత్వం దూతకంటే శక్తిమంతంగా ఉంది.

గుర్రం జీనుకు కట్టి ఉన్న ఒర నుంచి అతడు ఒక పెద్ద, ఒంపు తిరిగిన కత్తిని బయటికి తీశాడు. చంద్రకాంతిలో అది తళతళా మెరుస్తోంది.

"గద్దలు ఎగరటంలో అర్థాన్ని చదవటానికి సాహసించింది ఎవరు?" అతడు పెద్దగా అడిగాడు. అల్ - ఫయ్యూంలోని యాభైవేల ఖర్జూర చెట్లలో ఆ మాటలు ప్రతిధ్వనించినట్లు అనిపించింది.

"నేనే," అన్నాడు యువకుడు. వచ్చిన వ్యక్తి తెల్లగుర్రం మీద ఉన్న శాంటియాంగో మాటమొరోస్, అతని గుర్రపు గిట్టల దగ్గర క్రీస్తుని నమ్మని వాళ్ళు ఉన్న బొమ్మని యువకుడికి తలపుకు తెచ్చాడు. ఈ వ్యక్తి కూడా అలాగే అనిపించాడు, పాత్రలు మాత్రం తారుమారు అయ్యాయి.

"నేనే," అని మళ్ళీ జవాబిచ్చి కత్తివేటుకు సిద్ధపడుతూ యువకుడు తల వంచాడు. "విశ్వాత్మలోకి నేను చూడగలిగాను కాబట్టి ఎన్నో ప్రాణాలు కాపాడబడతాయి."

కత్తి వేటు పడలేదు. దానికి బదులు కొత్తవ్యక్తి కత్తి కొన యువకుడి నుదుటిని తాకేలాగా దానిని మెల్లగా కిందకు దించాడు. ఒక్కబొట్టు రక్తం కారింది.

ఆశ్వారోహుడు, యువకుడు ఏ మాత్రం చలనం లేకుండా ఉండి పోయారు. పారిపోవాలన్న ఆలోచన కూడా యువకుడికి రాలేదు. అతడి హృదయంలో ఒక వింత ఆనందానుభూతి నెలకొన్నది: తన జీవిత గమ్యాన్వేషణలో తాను చనిపోబోతున్నాడు. ఫాతిమా కోసం కూడా. శకునాలు నిజమే అయ్యాయి. ఇప్పుడతను శత్రువుతో ముఖాముఖి ఉన్నాడు, చావు గురించి ఆలోచించాల్సిన

అవసరం లేదు. విశ్వాత్మ అతడికోసం ఎదురు చూస్తోంది. త్వరలో అతడు అందులో భాగమవుతాడు. రేపు తన శత్రువు కూడా ఆ అత్మలో భాగమవుతాడు.

యువకుని నుదుటిమీద కత్తిని అలాగే వుంచాడు కొత్త వ్యక్తి. "పక్షులు ఎగరటాన్ని ఎందుకు అర్థం చేసుకున్నావు?"

"పక్షులు నాకు తెలపాలనుకున్నదే నేను అర్థం చేసుకున్నాను. ఒయాసిస్సును కాపాడాలని వాటికి ఉంది. మీ కంటే ఒయాసిస్సులో ఎక్కువమంది పురుషులున్నారు కాబట్టి రేపు మీరంతా చావబోతున్నారు."

కత్తి ఇంకా అతడి నుదుటి మీదే ఉంది. "అల్లా అనుకున్నది మార్చటానికి నువ్వెవరివి?"

"సైన్యాలను అల్లా సృష్టించాడు, గద్దలను కూడా అల్లాయే సృష్టించాడు. పక్షుల భాషను నాకు అల్లానే నేర్పించాడు. ప్రతిదీ ఒకే చేతితో రాయబడింది," ఒంటెల సంరక్షకుని మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ యువకుడు చెప్పాడు.

యువకుడి నుదుటి మీద నుంచి అతడు కత్తిని తీసివెయ్యటంతో యువకుడు ఊపిరి పీల్చుకున్నాడు. అయినాగాని అక్కడి నుంచి పారిపోలేకపోయాడు.

"భవిష్యత్తు గురించి చెప్పేటప్పుడు జాగ్రత్తగా ఉండు," కొత్త వ్యక్తి అన్నాడు. "ఏదైనా రాసిన తరువాత దానిని మార్చే దారి ఉండదు."

"నేను ఒక సైన్యాన్ని చూశానంతే," యువకుడు చెప్పాడు. "యుద్ధ ఫలితాన్ని నేను చూడలేదు."

ఈ జవాబుతో కొత్త వ్యక్తి సంతృప్తి చెందినట్లు ఉన్నాడు. కాని కత్తి ఇంకా చేతిలోనే ఉంది. "దేశంకాని దేశంలో నువ్వు ఏమి చేస్తున్నావు?"

"నేను నా జీవిత గమ్యాన్ని అనుసరిస్తున్నాను. అది నీకు అర్థం కాదు."

కొత్త వ్యక్తి కత్తిని ఒరలో పెట్టేశాడు. యువకుడి ప్రాణం కుదుటపడింది.

"నీ ధైర్యాన్ని పరీక్షించాల్సి వచ్చింది," కొత్త వ్యక్తి అన్నాడు. "విశ్వభాషను అర్థం చేసుకోవటంలో అన్నిటికంటే ముఖ్యమయినది ధైర్యం."

యువకుడు ఆశ్చర్యపోయాడు. చాలా కొద్దిమందికే తెలిసిన విషయాల గురించి కొత్తవ్యక్తి మాట్లాడుతున్నాడు.

"ఇంత దూరం వచ్చిన తరువాత పట్టు వదలగూడదు," కొత్త వ్యక్తి కొనసాగించాడు. "నువ్వు ఎడారిని ప్రేమించాలి కాని దానిని ఎప్పుడూ పూర్తిగా నమ్మవద్దు. పురుషులందరినీ ఎడారి పరీక్షిస్తుంది: ప్రతి అడుగునీ సవాలు చేస్తుంది, ఏమరుపాటుకి లోనైన వారిని చంపేస్తుంది."

అతడు చెప్పింది యువకుడికి వృద్ధరాజుని జ్ఞప్తికి తెచ్చింది.

"సైన్యం దండెత్తి వచ్చి, రేపు సూర్యాస్తమయం తరువాత కూడా నీ భుజాల మీద తల నిలబడి ఉంటే వచ్చి నన్ను కలుసుకో," అన్నాడు కొత్త వ్యక్తి.

కత్తిని పట్టిన చెయ్యి ఇప్పుడు కొరడా పట్టుకుని ఉంది. గుర్రం ముందుకి ఉరకడంతో మళ్ళీ దుమ్ము మేఘం కమ్ముకుంది.

అతడు గుర్రంపైన వెళ్ళిపోతుంటే "నువ్వు ఎక్కడ ఉంటావు?" అంటూ యువకుడు అడిగాడు.

కొరడా ఉన్న చెయ్యి దక్షిణ దిశను చూపించింది.

యువకుడు పరుసవేదిని కలుసుకున్నాడు.

*

మరునాడు ఉదయం అల్ - ఫయ్యూం ఖర్జూర చెట్లలో రెండు వేలమంది ఒయాసిస్సు పురుషులు సాయుధులై దాక్కుని ఉన్నారు. సూర్యుడు నడినెత్తికి

రావటానికి ముందు క్షితిజ రేఖపైన ఎడారి జాతి వాళ్ళు అయిదువందల మంది దాకా కనిపించారు. అశ్వారోహులైన వాళ్ళు ఉత్తర దిక్కునుంచి ఒయాసిస్సులోకి ప్రవేశించారు. అది పైకి ఒక ప్రశాంతమైన యాత్ర లాగా అనిపించింది కాని వాళ్ళ దుస్తుల్లో దాచిపెట్టి ఆయుధాలున్నాయి. అల్ – ఫయ్యూం మధ్యలో ఉన్న తెల్లని గుడారానికి చేరుకున్న తరువాత వాళ్ళు తమ కత్తులను, దూశారు. తీరా చూస్తే వాళ్ళు దాడి చేసిన గుడారం ఖాళీగా ఉంది.

బయటినుంచి గుర్రాలపైన వచ్చిన వాళ్ళని చుట్టుముట్టి ఒక్క అరగంటలో ఒక్కడిని తప్ప మిగిలిన ఆగంతకులందరినీ ఒయాసిస్సు పురుషులు చంపేశారు. పిల్లలందరిని ఖర్జూర తోపునకు ఆవలి వైపు ఉంచటంతో ఇక్కడ జరిగిందేదో వాళ్ళు చూడలేదు. ఆడవాళ్ళు తమ భర్తల క్షేమం కోసం ప్రార్ధనలు చేస్తూ గుడారాలలోనే ఉండిపోయారు కాబట్టి వాళ్ళు కూడా జరిగిందేమీ చూడలేదు. నేలమీద పడి ఉన్న శవాలను మినహాయించి ఒయాసిస్సులోని మిగిలిన రోజుల మాదిరిగానే ఆ రోజు కూడా ఉన్నట్లుంది.

ప్రాణాలతో పట్టుకున్న ఒకే ఒక వ్యక్తి దండెత్తి వచ్చిన దళానికి నాయకుడు. ఆ మధ్యాహ్నం అతడిని ఒయాసిస్సు పెద్దల ముందు ప్రవేశపెట్టారు. సాంప్రదాయాన్ని ఎందుకు అతిక్రమించావని వాళ్ళు అతన్ని అడిగారు. తన మనుషులు ఆకలి, దాహంతో బాధపడుతూ రోజుల తరబడి యుద్ధం చేసినందువల్ల అలసిపోయి ఉన్నారనీ, అందుకే ఒయాసిస్సుపై దాడిచేసి శక్తినీ, ఉత్సాహాన్ని తిరిగి పొంది యుద్ధ భూమికి తిరిగి వెళ్ళవచ్చన్న ఉద్దేశంతో ఆ పని చేశామని నాయకుడు చెప్పాడు.

ఎడారి జాతి వాళ్ళ పరిస్థితికి తాను జాలిపడుతున్నానని ఒయాసిస్సు పెద్ద చెప్పాడు, కాని సాంప్రదాయాలు పవిత్రమైనవి. ఎటువంటి మర్యాదలు పాటించకుండా దళనాయకుడికి మరణశిక్షను అమలు జరపాలని అతడు ఆదేశించాడు. కత్తితోగాని,

తుపాకి గుండుతోగాని చంపకుండా చచ్చిపోయిన ఖర్జూరచెట్టుకి అతడిని ఉరిపేశారు. ఎడారి గాలిలో అతడి శవం ఊగుతూ ఉంది.

ఒయాసిస్సు పెద్ద యువకుడిని పిలిపించి అతడికి యాభై బంగారు నాణాలను ఇచ్చాడు. ఈజిప్టుకి చెందిన జోసఫు కథను మళ్ళీ అతడికి వినిపించి, ఒయాసిస్సుకి సలహాదారుగా చేరమని కోరాడు.

*

సూర్యుడు అస్తమించి, తొలిచుక్కలు పొడిచిన తరువాత యువకుడు దక్షిణ దిశగా పయనమయ్యాడు. అలా వెళుతుండగా చివరికి ఒంటరిగా ఉన్న ఒక గుడారం కనపడింది. అటుగా వెళుతున్న అరబ్బుల బృందం అది దయ్యాలు ఉండే ప్రదేశమని యువకుడికి చెప్పింది. అయినప్పటికీ యువకుడు అక్కడే కూర్చుని ఎదురు చూడసాగాడు.

చంద్రుడు బాగా పైకి ఎగబాకిన తరువాతగాని గుర్రాన్ని ఎక్కివస్తూన్న పరుసవేది కనపడలేదు. అతడి భుజం మీద చనిపోయిన రెండు గద్దలున్నాయి.

"నేను వచ్చాను," యువకుడు చెప్పాడు.

"నువ్వు ఇక్కడ ఉండకూడదే," పరుసవేది బదులిచ్చాడు. "లేక నీ జీవిత గమ్యం నిన్ను ఇక్కడకు తీసుకు వచ్చిందా?"

"ఎడారి జాతుల మధ్య జరుగుతున్న యుద్ధాల కారణంగా ఎడారిని దాటడం అసాధ్యం. అందుకే నేను ఇక్కడికి వచ్చాను."

పరుసవేది గుర్రాన్ని దిగి తనతోపాటు గుడారంలోకి రావలసిందిగా యువకుడికి సంజ్ఞ చేశాడు. ఒయాసిస్సులోని అనేక గుడారాల మాదిరే అది కూడా ఉంది. పరుసవేది ఉపయోగించే పొయ్యి, ఇతర పరికరాల కోసం యువకుడు అంతా

కలియచూశాడు గానీ అవేమీ కనపడలేదు. ఒక కుప్పగా కొన్ని పుస్తకాలు, వంటకి ఒక చిన్న పొయ్యి, వింతైన డిజైన్లతో నేసిన తివాచీలు తప్పించి ఇంకేమీ లేవు.

"కూర్చో, మనం ఏదైనా తాగి, ఈ గద్దలను వండుకుని తిందాం," అన్నాడు పరుసవేది.

అంతకు ముందు రోజు తాను చూసిన గద్దలు అవేనన్న అనుమానం యువకుడికి వచ్చింది కాని అతడేమీ మాట్లాడలేదు. పరుసవేది మంట వెలిగించగానే గుడారమంతా చక్కని సువాసన అలుముకుంది. హుక్కాల వాసన కంటే అది ఎంతో బాగుంది.

"నన్ను ఎందుకు కనపడమన్నావు?" యువకుడు అడిగాడు.

"శకునాల కారణంగా," పరుసవేది బదులిచ్చాడు. "నువ్వు వస్తావని, నీకు సహాయం అవసరమనీ గాలి నాకు తెలియచేసింది."

"గాలి చెప్పింది నా గురించికాదు, అది ఇంకో పరదేశీ అయిన ఆంగ్లేయుడి గురించి. అతడు నీ కోసం చూస్తున్నాడు."

"అతడు ముందుగా చేయాల్సిన ఇతర పనులు ఉన్నాయి. అయితే అతడు సరయిన దారిలోనే ఉన్నాడు. ఎడారిని అర్థం చేసుకోవటాన్ని అతడు మొదలు పెట్టాడు."

"మరి నా సంగతి ఏమిటి?"

"ఒక వ్యక్తి నిజంగా దేనినైనా కోరుకుంటే, ఆ కల సాకారమై అతడు దానిని సాధించేలా సహాయపడటానికి విశ్వమంతా కుట్ర పన్నుతుంది," వృద్ధరాజు మాటలను ప్రతిధ్వనిస్తూ పరుసవేది అన్నాడు. యువకుడికి అర్థమయ్యింది. తన జీవిత గమ్యంలో సహాయపడటానికి మరొక వ్యక్తి సిద్ధంగా ఉన్నాడు.

"అయితే ఏం చేయాలో నాకు చెబుతావా?"

"లేదు. నువ్వు తెలుసుకోవలసినదంతా ఈ పాటికే తెలుసుకున్నావు. నేను నీ నిధి ఉన్న దిశను మాత్రమే చూపిస్తాను."

"కానీ ఎడారి జాతుల మధ్య యుద్ధం జరుగుతోంది," యువకుడు పునరుద్ఘాటించాడు.

"ఎడారిలో ఏం జరుగుతోందో నాకు తెలుసు."

"నాకు నా నిధి దొరికింది. నా దగ్గర ఒంటె ఉంది. గాజు వస్తువుల దుకాణంలో సంపాదించిన డబ్బు ఉంది, యాభై బంగారు నాణాలు ఉన్నాయి. నా దేశంలో నన్ను ధనికుడిగా పరిగణిస్తారు."

"కాని వాటిలో ఏ ఒక్కటీ నీకు పిరమిడ్ల దగ్గర దొరకలేదు," పరుసవేది అన్నాడు.

"నాకు ఫాతిమా కూడా ఉంది. ఇప్పటివరకు నేను పొందిన అన్నింటికి మించిన నిధి ఆమె."

"ఆమె కూడా నీకు పిరమిడ్ల దగ్గర దొరకలేదు."

వాళ్ళు మౌనంగా తినసాగారు. పరుసవేది ఒక సీసా మూతతీసి యువకుడి పాత్రలోకి ఎర్రటి మద్యాన్ని పోశాడు. అతడు రుచి చూసిన మద్యాలన్నింటిలోకి ఇది ఎంతో అద్భుతంగా ఉంది.

"మద్యాన్ని ఇక్కడ నిషేధించలేదా?"యువకుడు అడిగాడు.

"మనిషి నోట్లోకి ప్రవేశించేది ఏదీ దుష్టమయినదికాదు," పరుసవేది చెప్పాడు. "అతడి నోటిలోంచి బయటకు వచ్చేదానితోనే సమస్య."

పరుసవేది ఎంతకీ అంతుపట్టకుండా ఉన్నాడు. అయితే యువకుడు సారాయం తాగుతూ ఎటువంటి ఒత్తిడికీ గురికాకుండా కూర్చుని ఉన్నాడు. తినటం

పూర్తయిన తరువాత వాళ్ళు గుడారం బయట కూర్చున్నారు. ఆకాశంలో చంద్రుని కాంతి ముందు తారలు వెలవెలబోతున్నాయి.

యువకుడు ఆనందంగా ఉండటం చూసి పరుసవేది ఇలా అన్నాడు: “సంతోషంగా ఉండు. యుద్ధానికి సన్నద్ధం అవుతున్న సైనికుడి మాదిరి ఈ రాత్రికి బాగా విశ్రాంతి తీసుకో. నీ హృదయం ఉన్నచోట నీ నిధి దొరుకుతుందన్నది గుర్తుంచుకో. ఇప్పటివరకు దారిలో నువ్వు నేర్చుకున్నదంతా అర్థవంతంగా మారాలంటే నువ్వు నిధిని కనుక్కోవాలి.”

"రేపు నీ ఒంటెను అమ్మేసి గుర్రాన్ని కొనుక్కో. ఒంటెలు భలే మోసం చేస్తాయి. అవి వేల మైళ్ళు నడిచినా అలసి పోయినట్లు కనిపించవు. కాని ఉన్నట్టుండి కిందకి కూలబడిపోయి చనిపోతాయి. కానీ గుర్రాలు కొద్ది కొద్దిగా అలసిపోతాయి. వాటి నుంచి ఏమి పొందవచ్చో, అవి ఎప్పుడు చనిపోతాయో నీకు నిత్యమూ తెలుస్తూనే ఉంటుంది.”

*

మరుసటి రాత్రి యువకుడు ఒక గుర్రంతో పరుసవేది గుడారం దగ్గరకు వచ్చాడు. పరుసవేది సిద్ధంగా ఉన్నాడు. అతడు తన గుర్రాన్ని ఎక్కి డేగను ఎడమభుజంపైన ఉంచుకున్నాడు. అతడు యువకుడితో ఇలా అన్నాడు. “ఎడారిలో జీవం ఎక్కడుందో నాకు చూపించు. జీవితంలో ఇలాంటి సంకేతాలను చూడగలిగిన వారే నిధిని కనుక్కోగలుగుతారు.”

చంద్రకాంతి దారి చూపుతుండగా వాళ్ళు ఎడారిలోకి పయనమయ్యారు. ఎడారిలో జీవాన్ని కనుక్కోగలుగుతానో లేదో తెలియదని యువకుడు అనుకున్నాడు. ఎడారి ఇంకా అతడికి అంత బాగా తెలియదు.

అదే విషయాన్ని పరుసవేదికి చెబుదామనుకున్నాడుగానీ, అతడంటే భయంగా ఉంది. యువకుడు ఆకాశంలో గద్దలను చూసిన రాతిమయ ప్రదేశానికి వాళ్ళు చేరుకున్నారు. కాని ఇప్పుడు అక్కడ నిశ్శబ్దమూ, గాలి సవ్వడి మాత్రమే ఉన్నాయి.

"ఎడారిలో జీవాన్ని ఎలా గుర్తించాలో నాకు తెలియదు," యువకుడు అన్నాడు. "ఇక్కడ జీవం ఉందని తెలుసు, కాని ఎక్కడ చూడాలో నాకు తెలియదు."

"జీవం జీవాన్ని ఆకర్షిస్తుంది," పరుసవేది బదులిచ్చాడు.

అప్పుడు యువకుడికి అర్థం అయ్యింది. గుర్రాన్ని పట్టి ఉంచిన పగ్గాలను కొంచెం వదలటంతో అది రాళ్ళు, ఇసుక మీదగా ముందుకి ఉరకలు వేసింది. యువకుడి గుర్రాన్ని పరుసవేది దాదాపు అరగంటసేపు అనుసరించాడు. ఇప్పుడు వాళ్ళకి ఒయాసిస్సు దగ్గరి ఖర్జూర చెట్లు కనిపించటం లేదు. ఆకాశంలో పెద్దగా ఉన్న చందమామ – ఎడారిలోని రాళ్ళు ప్రసరింపచేస్తున్న వెండికాంతి మాత్రమే కనిపిస్తున్నాయి. ఉన్నట్లుండి, ఏ కారణం లేకుండానే యువకుడి గుర్రం మెల్లగా నడవసాగింది.

"ఇక్కడ ప్రాణం ఉంది," పరుసవేదితో యువకుడు అన్నాడు. "ఎడారి భాష నాకు ఇంకా తెలియదు, కాని నా గుర్రానికి జీవ భాష తెలుసు."

వాళ్ళిద్దరూ గుర్రాలమీదనుంచి కిందికి దిగారు. పరుసవేది ఏమీ మాట్లాడలేదు. మెల్లగా అడుగులు వేస్తూ రాళ్ళ మధ్య వెదకసాగారు. పరుసవేది ఉన్నట్లుండి ఆగి నేల మీదికి వంగాడు. అక్కడ రాళ్ళ మధ్య ఒక కలుగు ఉంది. పరుసవేది తన చేతిని అందులోకి చొప్పించాడు. ఆ తరువాత భుజం వరకు లోపలికి పోనిచ్చాడు. లోపల ఏదో కదులుతూ ఉంది. చంద్రకాంతిలో పరుసవేది

కళ్ళు మాత్రమే కనిపిస్తున్నాయి. అతను కష్టపడుతూ కళ్ళను చికిలించాడు. కలుగులో ఏముందోగాని దానితో అతని చెయ్యి కుస్తీ పడుతూ ఉంది. తరువాత చేతిని బయటికి తీసి, పక్కకెరిగి కాళ్ళ మీద నిలబడ్డాడు. అతడు ఒక పాముతోకని తన చేతిలో పట్టుకుని ఉన్నాడు. ఆ చర్యకు యువకుడు ఉలిక్కిపడ్డాడు.

యువకుడు కూడా పరుసవేదికి దూరంగా గెంతాడు. పాము వీరోచితంగా పోరాడుతోంది. దాని బుసలు ఎడారి నిశ్శబ్దాన్ని భంగపరుస్తున్నాయి. అది ఒక తాచుపాము. దాని విషం నిముషాల్లో మనిషిని చంపెయ్యగలదు.

"అది కాటెయ్యకుండా చూసుకో," యువకుడు అన్నాడు. పరుసవేది తన చేతిని కలుగులోకి పోనిచ్చినప్పుడు పాము అతడిని కరిచే ఉంటుంది. అయినా అతని ముఖం ప్రశాంతంగా ఉంది. 'పరుసవేదికి రెండు వందల ఏండ్లు ఉంటాయి,' ఆంగ్లేయుడు తనతో చెప్పాడు. ఎడారిలోని  పాములతో ఎలా వ్యవహరించాలో అతడికి తెలిసే ఉంటుంది.

పరుసవేది తన గుర్రం వద్దకు వెళ్ళి కత్తిని బయటకు తియ్యటం యువకుడు చూశాడు. దాని మొనతో అతడు ఇసుకమీద ఒక వలయాన్ని గీసి పాముని దాంట్లో వదిలాడు. పాము వెంటనే ప్రశాంతంగా మారిపోయింది.

"ఆందోళన పడవలసింది ఏమీలేదు," పరుసవేది అన్నాడు. "అది వలయాన్ని దాటి బయటకు వెళ్ళలేదు. నువ్వు ఎడారిలో జీవాన్ని కనుగొన్నావు. నాకు కావలసిన శకునం దొరికింది."

"అది అంత ముఖ్యమయినదా?"

"అవును మరి. పిరమిడ్ల చుట్టూ ఎడారి పరచుకుని ఉంది."

పిరమిడ్ల గురించి మాట్లాడాలని యువకుడికి లేదు. అతడి హృదయం భారంగా ఉంది. నిన్న రాత్రి నుంచి అతడు విచారంగా ఉన్నాడు. నిధికోసం అన్వేషణను కొనసాగించటమంటే ఫాతిమాను విడిచి వెళ్ళాలి.

"ఎడారిని దాటడంలో నీకు సహాయం చేస్తాను," పరుసవేది అన్నాడు.

"నాకు ఒయాసిస్సు దగ్గరే ఉండాలని ఉంది," యువకుడు బదులిచ్చాడు. "నాకు ఫాతిమా దొరికింది. నాకు సంబంధించినంత వరకు నిధి కంటే ఆమే ఎక్కువ."

"ఫాతిమా ఎడారి మహిళ," పరుసవేది చెప్పాడు. "మళ్ళీ తిరిగిరావటానికి పురుషులు బయటి ప్రపంచంలోకి వెళ్ళాలని ఆమెకు తెలుసు. ఆమెకు తన నిధి దొరికింది: అది నువ్వు. ఇప్పుడు నువ్వు నీ నిధిని అన్వేషించాలని ఆమె కోరుకుంటుంది."

"నేను ఇక్కడే ఉండిపోవాలని నిర్ణయించుకుంటే ఏమవుతుంది?"

"ఏమవుతుందో చెబుతాను విను. నువ్వు ఒయాసిస్సుకి సలహాదారు అవుతావు. ఎన్నో గొర్రెలు, ఒంటెలను కొనడానికి నీ దగ్గర కావలసినంత డబ్బు ఉంది. నువ్వు ఫాతిమాని పెళ్ళి చేసుకుంటావు. మీరిద్దరూ ఒక సంవత్సరం పాటు సంతోషంగా ఉంటారు. నువ్వు ఎడారిని ప్రేమించటం నేర్చుకుంటావు. యాభైవేల ఖర్జూర చెట్లలో ప్రతి ఒక్కటీ నీకు పరిచయం అవుతుంది. ప్రపంచం నిరంతరం మారుతోందని నిరూపిస్తూ అవి పెరగటాన్ని నువ్వు గమనిస్తూ ఉంటావు. అన్నింటిలోకి ఉత్తమ గురువు ఎడారి కాబట్టి నువ్వు శకునాలను మరింత బాగా అర్థం చేసుకోగలుగుతావు.

"రెండవ సంవత్సరంలో ఎప్పుడో నీకు నిధి గుర్తుకు వస్తుంది. శకునాలు పట్టు వదలకుండా దాని గురించి మాట్లాడుతుంటాయి, నువ్వు వాటిని

పట్టించుకోకుండా ఉండటానికి ప్రయత్నిస్తావు. ఒయాసిస్సు, దాని ప్రజల సంక్షేమం కోసం నీ జ్ఞానాన్ని ఉపయోగిస్తావు. నువ్వు చేస్తున్న దానిని ఒయాసిస్సు పెద్దలు మెచ్చుకుంటారు. నీ ఒంటెల ద్వారా నీకు సంపద, అధికారం సమకూరుతాయి.

"మూడవ సంవత్సరంలో కూడా శకునాలు నీ నిధి గురించి, జీవిత గమ్యం గురించి మాట్లాడుతుంటాయి. నువ్వు రాత్రిళ్ళు ఒయాసిస్సులో తిరుగుతూ గడుపుతావు. నీ అన్వేషణను తానే అడ్డుకున్నానని ఫాతిమా దుఃఖిస్తూ ఉంటుంది. కాని నువ్వు ఆమెను ప్రేమిస్తావు. ఆమె తిరిగి నిన్ను ప్రేమిస్తుంది. ఉండిపొమ్మని ఆమె ఎప్పుడూ అనలేదన్నది నీకు తెలుసు, తన పురుషుడి కోసం వేచి ఉండటం ఎడారి మహిళలకు తెలుసు. అందుకనే ఆమెను నువ్వు తప్పుపట్టవు. కాని ఎన్నో సార్లు నువ్వు ఎడారి ఇసుకలో తిరుగుతూ నువ్వు వెళ్ళి ఉండవలసిందని... ఫాతిమా పై నీ కున్న ప్రేమలో మరింత నమ్మకం ఉంచవలసిందని నీకు అనిపిస్తుంది. మళ్ళీ తిరిగి రావేమోనన్న నీ భయమే నిన్ను ఒయాసిస్సు దగ్గర ఉంచిందని నీకు తెలుసు. ఆ సమయంలో నీ నిధి శాశ్వతంగా కప్పివేయబడిందని శకునాలు నీకు చెబుతాయి.

"ఇక నాలుగవ సంవత్సరంలో నువ్వు శకునాలు చెప్పింది వినటం ఎప్పుడో మానేసావు కాబట్టి అవీ నిన్ను విస్మరిస్తాయి. ఆ విషయం ఒయాసిస్సు పెద్దలు గమనించి నిన్ను సలహాదారు పదవి నుంచి తొలగిస్తారు. కాని ఆపాటికి నువ్వు ఎన్నో ఒంటెలు, ఎంతో సరుకుతో సంపన్న వ్యాపారివి అయిపోతావు. నీ జీవిత గమ్యాన్ని అనుసరించలేదని, ఇప్పుడు సమయం మించిపోయిందని వగస్తూ శేష జీవితాన్ని గడిపేస్తావు.

“ఒక వ్యక్తి తన జీవన గమ్యాన్ని అనుసరించటాన్ని ప్రేమ ఎన్నటికీ ఆపదని నువ్వు అర్థం చేసుకోవాలి. ఒకవేళ ఆ అన్వేషణని వదిలిపెట్టాడంటే అది విశ్వభాష మాట్లాడే నిజమైన ప్రేమ కాదు.”

ఇసక మీద గీసిన వృత్తాన్ని పరుసవేది చెరిపివేయడంతో రాళ్ళ మధ్య పాక్కుంటూ పాము వెళ్ళిపోయింది. మక్కాకి వెళ్ళాలని నిరంతరం కోరుకునే గాజువస్తువుల వ్యాపారి, పరుసవేది అన్వేషణలోని ఆంగ్లేయుడు యువకుని జ్ఞాపకాల్లో మెదిలారు. ఎడారిపై నమ్మకం ఉంచిన మహిళను గుర్తుచేసుకున్నాడు. తాను ప్రేమించిన మహిళ దగ్గరకు తీసుకువచ్చిన ఎడారి వైపు చూశాడు.

వాళ్ళిద్దరూ గుర్రాలని ఎక్కారు. ఈసారి పరుసవేదిని అనుసరించి యువకుడు ఒయాసిస్సుకు వచ్చాడు. ఒయాసిస్సు శబ్దాలను గాలి వారి వద్దకు మోసుకువచ్చింది, యువకుడు ఫాతిమా స్వరాన్ని వినటానికి ప్రయత్నించాడు.

ఆ రాత్రి వలయంలోని తాచుపాముని తాను గమనిస్తుండగా భుజంపైన డేగ ఉన్న వింత ఆశ్వికుడు ప్రేమ గురించి, నిధి గురించి మాట్లాడాడు, ఎడారి మహిళల గురించి, తన జీవిత గమ్యం గురించి మాట్లాడాడు.

"నేను నీతో వస్తున్నాను," యువకుడు చెప్పాడు. వెంటనే అతడి హృదయంలో శాంతి నెలకొంది.

"రేపు సూర్యోదయం కాక ముందు బయలుదేరదాం," అని మాత్రమే పరుసవేది స్పందించాడు.

*

యువకుడు ఆ రాత్రి నిద్ర లేకుండా గడిపాడు. ఉషోదయానికి రెండు గంటల ముందు తనతోపాటు గుడారంలో నిద్రపోయే వారిలో ఒకతన్ని నిద్రలేపి ఫాతిమా గుడారాన్ని చూపించమని అడిగాడు. ఆమె గుడారాన్ని చేరుకున్న తరువాత గుడారాన్ని చూపిన అతనికి ఒక గొర్రెను కొనుక్కోవటానికి సరిపడా బంగారాన్ని యువకుడు ఇచ్చాడు.

ఆ తరువాత యువకుడు తన మిత్రుడిని గుడారం లోపలికి వెళ్ళి ఫాతిమాని లేపి తాను బయట ఉన్న సంగతిని చెప్పమన్నాడు. అలా చేసినందుకు మరొక గొర్రెను కొనుక్కోవటానికి సరిపడా బంగారాన్ని అతనికి ఇచ్చాడు.

"ఇక మమ్మల్ని ఒంటరిగా ఉండనివ్వు," యువకుడు తన స్నేహితుడితో చెప్పాడు. ఒయాసిస్సు సలహాదారుకి సహాయపడ్డానన్న గర్వంతో, రెండు గొర్రెలు కొనుక్కోవటానికి సరిపోయే డబ్బులున్నాయన్న సంతృప్తితో అరబ్బు గుడారానికి తిరిగి వెళ్ళి నిద్రపోయాడు.

గుడార ద్వారం దగ్గరికి ఫాతిమా వచ్చింది. ఇద్దరూ ఖర్జూర చెట్ల మధ్య నడవసాగారు. ఇది సాంప్రదాయాన్ని భంగపరచటమని యువకుడికి తెలిసినప్పటికీ ఆ సమయంలో అతడు దానిని పట్టించుకోదలచుకోలేదు.

"నేను వెళుతున్నాను," అతడు చెప్పాడు. "మళ్ళీ తిరిగి వస్తానని నీకు తెలియాలి. నేను నిన్ను ఎందుకు ప్రేమిస్తున్నానంటే..."

"ఏమీ చెప్పవద్దు," ఫాతిమా అడ్డుపడింది. "ఒకరిని ఒకరు ప్రేమించినందుకు ప్రేమిస్తారు. ప్రేమించడానికి ఏ కారణం అవసరం లేదు."

కాని యువకుడు ఇలా చెప్పసాగాడు. "నాకు ఒక కల వచ్చింది, ఒక రాజుని కలిశాను. నేను గాజు వస్తువులను అమ్మాను, ఆ తరువాత ఎడారి దాటాను. ఎడారి జాతుల మధ్య యుద్ధం జరుగుతుండటంతో పరుసవేదిని వెదకుతూ బావి దగ్గరకు వచ్చాను. నిన్ను కనుగొనటానికి ఈ విశ్వమంతా కుట్ర పన్ని సహాయపడింది కాబట్టి నిన్ను ప్రేమిస్తున్నాను."

ఇద్దరూ కౌగలించుకున్నారు. ఒకరినొకరు తాకటం అదే మొదటిసారి.

"నేను తిరిగి వస్తాను," యువకుడు అన్నాడు.

"ఇంతకు ముందు నేను ఎడారివైపు కోరికతో ఎదురు చూసేదాన్ని," ఫాతిమా చెప్పింది. "ఇప్పుడు ఆశతో ఎదురు చూస్తుంటాను. ఒక రోజు మా నాన్న ప్రయాణమై వెళ్ళాడు. మళ్ళీ తిరిగి మా అమ్మను చేరుకున్నాడు. అప్పటినుంచి అతడు ప్రయాణాలు చేస్తూ, తిరిగి వస్తూ ఉంటాడు."

ఆ తరువాత వాళ్ళు మౌనంగా ఉండిపోయారు. మరికొంత సేపు నడిచిన తరువాత యువకుడు ఆమెను గుడారం దగ్గర వదిలిపెట్టాడు.

"మీ అమ్మ దగ్గరికి మీ నాన్న తిరిగి వచ్చినట్లే నేను కూడా తిరిగి వస్తాను," యువకుడు చెప్పాడు.

ఫాతిమా కళ్ళలోని తడిని అతను చూశాడు.

"నువ్వు ఏడుస్తున్నావా?"

"నేను ఎడారి మహిళను," ఆమె ముఖాన్ని పక్కకు తిప్పుకుంటూ చెప్పింది, "కాని అన్నింటికీ మించి నేను మహిళను."

ఫాతిమా తిరిగి తన గుడారంలోకి వెళ్ళిపోయింది. సూర్యోదయం అయిన తరువాత ఎప్పటి మాదిరే తన రోజువారీ పనులు చేయటానికి పూనుకుంది. కానీ ఇప్పుడు అంతా మారిపోయింది. యువకుడు ఇప్పుడు ఒయాసిస్సులో లేడు. దాంతో ఒయాసిస్సుకు నిన్న ఉన్న అర్థం ఈ రోజు లేకుండా పోయింది. అది యాభై వేల ఖర్జూర చెట్లు, మూడు వందల బావులు ఉన్న ప్రదేశం కాదు, సుదీర్ఘ ప్రయాణం తరువాత యాత్రికులు చేరుకుని సేదదీరే ప్రాంతం కాదు. ఆ రోజు నుంచి ఆమెకు ఒయాసిస్సు శూన్య ప్రదేశం.

ఆ రోజు నుంచి ఆమెకు ఎడారి ముఖ్యమవుతుంది. ఆమె రోజూ ఎడారివైపు చూసి నిధి అన్వేషణలో యువకుడు ఏ నక్షత్రాన్ని అనుసరిస్తున్నాడో ఊహించుకుంటుంది. గాలి తన ముద్దులను యువకుడికి చేరవేసి తాను

బతికున్నానని చెబుతుందన్న ఆశతో గాలిలో ఆమె ముద్దులు పంపించాలి. తన నిధిని అన్వేషిస్తున్న ఓ సాహసి కోసం తాను వేచి ఉన్నానని తెలియచేయాలి. ఆ రోజు నుంచి ఆమెకు ఎడారి అంటే అతడు తిరిగి వస్తాడన్న ఆశ మాత్రమే.

*

"నువ్వు వెనక వదిలిపెట్టి వచ్చినదాని గురించి ఆలోచించకు," ఎడారి ఇసుక మీద ప్రయాణం మొదలు పెట్టిన తరువాత యువకుడితో పరుసవేది అన్నాడు. "ప్రతిదీ విశ్వాత్మలో రాసి ఉంది, కలకాలం అది అక్కడ ఉండి పోతుంది."

"పురుషులు ఇంటిని వదిలి వెళ్ళడంకంటే తిరిగి చేరుకోవటం గురించే ఎక్కువగా కలలు కంటారు," యువకుడు అన్నాడు. అతడు ఎడారి నిశ్శబ్దానికి తిరిగి అలవాటు పడిపోయాడు.

"తాము కనుగొన్నది స్వచ్ఛమైన పదార్థంతో చేసినదైతే అది కలకాలం నిలిచి ఉంటుంది. అంతే కాక ఎప్పుడైనా తిరిగి చేరుకోవచ్చు. నువ్వు కనుగొన్నది పేలిన నక్షత్రంలా క్షణకాలం ఉండే కాంతి అయితే తిరిగి వెళ్ళినప్పుడు నీకు ఏమీ కనపడదు," అన్నాడు పరుసవేది.

అతడు పరుసవేద భాష మాట్లాడుతున్నాడు. కాని అతడు ఫాతిమా గురించి కూడా చెబుతున్నాడని యువకుడికి అర్థమయ్యింది.

తాను వదిలిపెట్టి వచ్చిన దాని గురించి ఆలోచించకుండా ఉండటం కష్టంగా ఉంది. అంతులేని దూరాల వరకు ఒకే తీరుగా ఉన్న ఎడారి యువకుడిని కలలకు గురిచేసింది. ఖర్జూర చెట్లు, బావులు, తాను ప్రేమించిన స్త్రీ ముఖాన్నీ యువకుడు ఇంకా చూడగలుగుతున్నాడు. తన ప్రయోగాలు కొనసాగిస్తున్న ఆంగ్లేయుడినీ, తనకీ తెలియకుండానే గురువైన ఒంటెల సంరక్షకుడినీ చూడగలుగుతున్నాడు. బహూశా పరుసవేది ఎన్నడూ ప్రేమించలేదేమోనని యువకుడు అనుకున్నాడు.

భుజం మీద డేగతో పరుసవేది ముందు స్వారీ చేస్తున్నాడు. ఎడారి భాష ఆ పక్షికి బాగా తెలుసు. వాళ్ళు ఆగినప్పుడల్లా వేటని అన్వేషిస్తూ అది ఎగిరేది. మొదటి రోజు అది ఒక కుందేలుతో తిరిగి వచ్చింది, రెండవరోజు రెండు పక్షులతో తిరిగి వచ్చింది.

రాత్రిళ్ళు వాళ్ళు పక్కలు పరుచుకున్న తరువాత ఎవరికీ కనపడకుండా మంట వేసేవారు. ఎడారి రాత్రులు చాలా చలిగా ఉన్నాయి. కృష్ణ పక్ష చంద్రుడి వల్ల రాత్రులు మరింత చీకటిగా ఉన్నాయి. ఎడారి తెగల మధ్య యుద్ధాల నుంచి తప్పించుకోవాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో మాట్లాడుకుంటూ వాళ్ళు ఒక వారం రోజులపాటు ప్రయాణించారు. యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. పేగులు తిప్పేసేలా రక్తం వాసనను ఒక్కోసారి గాలి మోసుకొచ్చేది. వారికి చాలా సమీపంలోనే యుద్ధాలు జరుగుతున్నాయి. శకునాల భాష ఒకటుందని యువకునికి గాలి గుర్తుచేసేది. కళ్ళు చూడలేకపోయిన వాటిని తెలియచేయటానికి శకునాలు ఎప్పుడూ సిద్ధంగా ఉండేవి.

ఏడవరోజున రోజుకంటే ముందే ప్రయాణాన్ని విరమించాలని పరుసవేది నిర్ణయించాడు. వేటని అన్వేషిస్తూ డేగ ఎగిరిపోయింది. తన దగ్గర ఉన్న నీటి పాత్రని పరుసవేది యువకుడికి ఇచ్చాడు.

"నువ్వు ప్రయాణం చివరి దశలో ఉన్నావు," పరుసవేది అన్నాడు. "నీ జీవిత గమ్యాన్ని అనుసరించినందుకు నిన్ను అభినందిస్తున్నాను."

"దారిలో కొత్త విషయాలేవీ నువ్వు చెప్పలేదు," యువకుడు అన్నాడు. "నీకు తెలిసిన విషయాలలో కొన్ని నేర్పుతావని అనుకున్నాను. కొంతకాలం క్రితం ఎడారిలో ప్రయాణం చేస్తున్నప్పుడు పరుసవేదంపై పుస్తకాలున్న ఒక వ్యక్తి కలిశాడు. కాని వాటినుంచి నేనేమీ నేర్చుకోలేకపోయాను."

"నేర్చుకోవటానికి ఒకటే దారి ఉంది: అది చర్యల ద్వారా," పరుసవేది బదులిచ్చాడు. "నువ్వు తెలుసుకోదగినదంతా నీ ప్రయాణంలో నేర్చుకున్నావు. నువ్వు నేర్చుకోవలసింది ఇంకా ఒక్కటే ఉంది."

అదేమిటో తెలుసుకోవాలని యువకుడు అనుకున్నాడు. కానీ తన డేగను అన్వేషిస్తూ పరుసవేది క్షితిజంపైపు చూస్తూ ఉన్నాడు.

"నిన్ను పరుసవేది అని ఎందుకంటారు?"

"నేను అదే కాబట్టి."

"ఇతర పరుసవేదులు బంగారం తయారుచేయటానికి పూనుకుని విఫలురైనప్పుడు, వారు ఏవిధమైన పొరపాటు చేస్తున్నారు?"

"వాళ్ళు కేవలం బంగారం కోసమే చూస్తున్నారు," అతడు బదులిచ్చాడు. "వాళ్ళు తమ జీవిత గమ్యాన్ని అనుభూతి చెందాలని కోరుకోకుండానే నిధిని ఆశించారు."

"నేను ఇంకా తెలుసుకోవలసింది ఏమిటి?" యువకుడు అడిగాడు.

కాని పరుసవేది ఇంకా క్షితిజం వైపే చూస్తున్నాడు. డేగ చివరికి వాళ్ళ ఆహారంతో తిరిగి వచ్చింది. మంట కనపడకుండా ఉండటానికి గుంట తవ్వి నిప్పు రాజేశారు.

"నేను పరుసవేదిని కాబట్టి నేను పరుసవేదిని," వంట చేయటానికి సిద్ధమవుతూ అతడు చెప్పాడు. "నేను ఈ శాస్త్రాన్ని మా తాత దగ్గర నేర్చుకున్నాను, వాళ్ళ తండ్రి దగ్గర నుంచి ఆయన నేర్చుకున్నాడు, అలా అలా సృష్టి మొదలు వరకు వెళతాం. ఆ రోజుల్లో నిపుణుల పనిని ఒక పచ్చల తాయెత్తుపై రాయగలిగేవారు. కానీ సులువుగా ఉన్న వాటిని మనుషులు తిరస్కరించటం మొదలు పెట్టి పద్ధతులు, వ్యాఖ్యానాలు, తాత్విక అధ్యయనాలు రాయసాగారు.

ఇతరులకు తెలిసిన దానికంటే మెరుగైన పద్ధతి తమకు తెలిసిందని వారికి అనిపించసాగింది. అయినప్పటికీ కూడా ఈనాటికీ పచ్చల తాయెత్తు సజీవంగా ఉంది."

"పచ్చల తాయెత్తులో ఏం రాసి ఉంది?" యువకుడికి తెలుసుకోవాలనిపించింది.

పరుసవేది ఇసుకలో రాయటం మొదలుపెట్టి అయిదు నిమిషాలలోపే పూర్తిచేశాడు. అతడు గీస్తుండగా యువకుడు వృద్ధ రాజు గురించి, బజారులో తాము కలిసిన ఆ రోజు గురించి ఆలోచించసాగాడు. అది ఎన్నో సంవత్సరాల క్రితం జరిగినట్లు అనిపిస్తోంది.

"పచ్చల తాయెత్తు మీద రాసి ఉన్నది ఇది," పూర్తయిన తరువాత పరుసవేది చెప్పాడు.

ఇసుకలో ఏం రాశాడో చదవటానికి యువకుడు ప్రయత్నించాడు.

"ఇది సంకేత భాష," ఆశాభంగ స్వరంతో యువకుడు అన్నాడు. "ఆంగ్లేయుడి పుస్తకాలలో ఉన్నట్టే ఉంది."

"కాదు," పరుసవేది బదులిచ్చాడు. "ఇది రెండు గద్దలు ఎగరటం వంటిది, దీనిని కేవలం హేతువు ద్వారా అర్థం చేసుకోలేం. విశ్వాత్మను నేరుగా చేరుకోవటానికి పచ్చల తాయెత్తు దారి చూపిస్తుంది.

"ఈ భౌతిక ప్రపంచం స్వర్గానికి నకలు అని, దాని ప్రతిరూపమనీ విజ్ఞులు అర్థం చేసుకున్నారు. ఈ ప్రపంచం ఉన్నదంటే మరో పరిపూర్ణ ప్రపంచానికి ఇది రుజువు మాత్రమే. తన ఆధ్యాత్మిక బోధనలను, తన అద్భుత సృష్టిని మనుషులు అనబడే వస్తువుల ద్వారా అర్థం చేసుకుంటారని దేవుడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడు. నా ఉద్దేశంలో చర్య అంటే ఇదే."

"పచ్చల తాయెత్తుని నేను అర్థం చేసుకోనవసరం లేదా?" యువకుడు అడిగాడు.

"నువ్వు పరుసవేదానికి సంబంధించిన ప్రయోగశాలలో ఉండి ఉంటే పచ్చల తాయెత్తుని అర్థం చేసుకోవటానికి సరైన విధానాన్ని అవలంబించటానికి సమయం ఇదే. కానీ నువ్వు ఎడారిలో ఉన్నావు. అందుకే దానిలో లీనమైపో. ప్రపంచాన్ని అర్థంచేసుకోడానికి ఎడారి నీకు సహాయపడుతుంది. వాస్తవానికి ఈ భూమి మీద ఏదైనా ఆ పని చెయ్యగలదు. నువ్వు ఎడారిని అర్థం చేసుకోవాల్సిన అవసరం కూడా లేదు. ఒక ఇసుక రేణువుని తదేకంగా ధ్యానిస్తే దానిలో నువ్వు సృష్టి మర్మాలను చూడగలుగుతావు."

"ఎడారిలో నేను లీనమైపోవటం ఎట్లా?"

"నీ హృదయాన్ని ఆలకించు. అది విశ్వాత్మ నుంచి వచ్చింది కాబట్టి, ఏదో ఒక రోజు తిరిగి అక్కడికి చేరుకుంటుంది. కాబట్టి దానికి అన్ని విషయాలు తెలుసు."

*

మరో రెండు రోజులపాటు వాళ్ళు మౌనంగా ఎడారిలో పయనించారు. భీభత్సపూరిత యుద్ధాలు జరిగే ప్రదేశానికి చేరువవుతుండటంతో పరుసవేది ఎంతో అప్రమత్తతతో ఉంటున్నాడు. వాళ్ళు ప్రయాణిస్తున్నప్పుడు యువకుడు తన హృదయాన్ని ఆలకించటానికి ప్రయత్నించాడు.

ఇది అంత తేలికగా లేదు. ఒకప్పుడు అతడి హృదయం తన కథలు చెప్పటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేది, కాని ఈ మధ్య అలా ఉండటంలేదు. హృదయం తన విచారాలు తెలియచేస్తూ గంటల తరబడి గడిపిన రోజులు ఉన్నాయి; ఎడారి సూర్యోదయాలకు ఆ హృదయం తీవ్ర ఉద్వేగానికి లోనై యువకుడు

కన్నీళ్ళపర్యంతం అయిన రోజులున్నాయి. నిధి గురించి యువకుడితో మాట్లాడేటప్పుడు హృదయం వేగంగా కొట్టుకునేది, ఎడారిలో అంతులేని క్షితిజాలను చూసి యువకుడు నిశ్శబ్దంగా ఉన్నప్పుడు కూడా అతడి హృదయం ఎప్పుడూ మౌనంగా ఉండేదికాదు.

"మన హృదయాలను ఎందుకు ఆలకించాలి?" ఆ రాత్రి బస చేసిన తరువాత యువకుడు అడిగాడు.

"ఎందుకంటే నీ హృదయమున్న చోటే నువ్వు నీ నిధిని కనుక్కుంటావు."

"కాని నా హృదయం ఆందోళన చెందుతోంది," యువకుడు చెప్పాడు. "దానికి కూడా కలలు ఉన్నాయి, అది ఉద్వేగాలకు గురి అవుతుంది. ఎడారిలోని మహిళ పట్ల అది రాగమయి అవుతోంది. నన్ను ఎన్నో కోరికలు కోరుతుంది. ఆమె గురించి ఆలోచిస్తున్నప్పుడు రాత్రిళ్ళు నిద్ర లేకుండా చేస్తుంది."

"అది మంచిదే. నీ హృదయం సజీవంగా ఉంది. అది చెప్పేది వింటూ ఉండు."

తరువాత మూడు రోజులలో వాళ్ళిద్దరికీ ఎందరో సాయుధ సైనికులు తారసపడ్డారు, ఎంతోమంది క్షితిజానికి దగ్గరగా కనిపించారు. యువకుడి హృదయం భయం గురించి మాట్లాడసాగింది. విశ్వాత్మ నుంచి విన్న కథలను, నిధి అన్వేషణకు బయలుదేరి విజయం సాధించని కథలను అతడికి చెప్పసాగింది. అతడు నిధిని కనుక్కోలేకపోవచ్చనీ, లేదా అక్కడ ఎడారిలో చనిపోవచ్చనీ చెబుతూ అతడిని భయపెట్టసాగింది. కొన్నిసార్లు తాను ప్రేమనూ, సంపదలనూ కనుగొన్నానని, తను తృప్తిగా ఉన్నానని యువకుడితో చెప్పేది.

గుర్రాలకు విశ్రాంతి ఇవ్వటానికి ఆగినప్పుడు యువకుడు పరుసవేదితో చెప్పాడు "నా హృదయం ద్రోహిలాగా ఉంది. నన్ను ముందుకు వెళ్ళినివ్వటం లేదు."

"దానిని అర్థం చేసుకోవచ్చు," పరుసవేది బదులిచ్చాడు. "నీ కలను అన్వేషించటంలో ఇప్పటి దాకా పొందిందంతా కోల్పోతానేమోనని అది భయపడటం సహజమే."

"అయితే నా హృదయాన్ని ఎందుకు ఆలకించాలి?"

"ఎన్నటికీ దాని నోటిని నొక్కెయ్యలేవు కాబట్టి అది చెప్పేది వినాలి. అది చెప్పేది విననట్టు నువ్వు నటించినా అది ఎప్పుడూ నీలోనే ఉంటుంది. ప్రపంచం గురించీ, జీవితం గురించీ నువ్వు ఏమనుకుంటున్నావో అది తిరిగి నీకు చెబుతూనే ఉంటుంది."

"అంటే విద్రోహానికి పాల్పడినా దానిని వినాలన్న మాట?"

"అనుకోకుండా తగిలే ముష్టిఘాతం విద్రోహమవుతుంది. నీకు నీ హృదయం బాగా తెలిసినట్లయితే, అది ఎన్నటికీ అలా చేయదు. దాని కలలు, కోరికలు నీకు తెలిసినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో నీకు తెలుస్తుంది.

"నీ హృదయం నుంచి నువ్వు ఎన్నటికీ తప్పించుకోలేవు. కాబట్టి అది చెప్పేదాన్ని వినటం మంచిది. అలా చేస్తే అనుకోకుండా పిడుగుపాటుకి గురవుతానేమోనన్న భయం నీకుండదు."

ఎడారిలో ప్రయాణిస్తూ యువకుడు తన హృదయాన్ని ఆలకించసాగాడు. దాని కవ్వింతలు, ఎత్తుగడలు అర్థం చేసుకోగలిగాడు. ఉన్నది ఉన్నట్టుగా హృదయాన్ని ఆమోదించసాగాడు. ఒక రోజు మధ్యాహ్నం సంతోషంగా ఉన్నానని అతడి హృదయం చెప్పటంతో అతడు తన భయాన్ని మరిచి పోయాడు.

ఒయాసిస్సుకు తిరిగి వెళ్ళాలన్న తలంపును మరిచిపోయాడు. “నేను మానవ హృదయాన్ని కాబట్టి అప్పుడప్పుడూ ఫిర్యాదులు చేస్తుంటాను. తాము అందుకు అర్హులం కామనో, వాటిని సాధించలేమనో మనుషులు తమ ముఖ్యమైన కలలను సాకారం చేసుకోటానికి భయపడుతుంటారు.... శాశ్వతంగా వెళ్ళిపోయిన ప్రియతమల గురించో, ఆనందమయంగా ఉండవలసిన క్షణాలు అలా లేవనో, చేతికి అందవలసిన నిధులు శాశ్వతంగా ఇసుకలో కప్పబడిపోయాయనో తలచుకుంటూ మనుషుల హృదయాలమైన మేము భయానికి గురవుతూ ఉంటాం. ఇటువంటివి జరిగినప్పుడు మేము తీవ్రంగా బాధపడుతుంటాం.”

చందమామ లేని ఆకాశం కేసి చూస్తూ ఉన్న పరుసవేదితో ఒక రాత్రి యువకుడు అన్నాడు. “బాధ పడవలసి వస్తుందేమోనని నా హృదయం భయపడుతోంది.”

"బాధపడటం కంటే బాధ పడతామేమోనన్న భయం దారుణమైనదని నీ హృదయానికి చెప్పు. తన కలల అన్వేషణలో బయలుదేరినప్పుడు ఏ హృదయమూ బాధ పడలేదని కూడా చెప్పు. ఎందుకంటే ఆ అన్వేషణలోని ప్రతి క్షణమూ శాశ్వతత్వంతో, దేవునితో భేటీ వంటిది.”

"అన్వేషణలోని ప్రతి క్షణమూ దేవునితో భేటీ వంటిది,” యువకుడు తన హృదయానికి చెప్పాడు. “నేను నా నిధి కోసం నిజంగా వెతుకుతూ ఉన్నప్పుడు ప్రతిరోజు ప్రకాశమయంగా ఉండేది, ఎందుకంటే ప్రతి ఘడియ ఆ కలలోని భాగంగా ఉండి, నిధి దొరుకుతుందని నమ్మకంగా ఉండేది. ఒక గొర్రెల కాపరికి అసాధ్యమనుకున్న విషయాలను ప్రయత్నించి చూసే ధైర్యంతో నిధికోసం నిజంగా వెతుకుతూ ఉన్నప్పుడు దారి వెంట ఎన్నో విషయాలను తెలుసుకున్నాను.

దాంతో అతడి హృదయం ఆ మధ్యాహ్నమంతా ప్రశాంతంగా ఉండి పోయింది. ఆ రోజు రాత్రి యువకుడు గాఢ నిద్రపోయాడు. అతడు నిద్రలేచిన తరువాత

విశ్వాత్మనుండి ప్రకటితమైన విషయాలను అతని హృదయం చెప్పసాగింది. సంతోషంగా ఉన్న వారందరిలో దేవుడు ఉన్నాడని అది చెప్పింది. పరుసవేది చెప్పినట్లుగా సంతోషాన్ని ఎడారిలోని ఒక ఇసుక రేణువు నుంచీ కూడా పొందవచ్చు. ఎందుకంటే ఇసుక రేణువు కూడా సృష్టిలో ఒక భాగం. దానిని సృష్టించడానికి విశ్వం కొన్ని లక్షల సంవత్సరాలు తీసుకుంది. "ఈ భూమి మీద ప్రతి ఒక్కరికీ వారికోసం ఎదురు చూసే నిధి ఉంటుంది," అతడి హృదయం చెప్పింది. "వాళ్ళు నిధిని అన్వేషించడం మానుకున్న కారణంగా మానవ హృదయాలమైన మేము ఈ నిధి గురించి అంతగా మాట్లాడం. మేం పిల్లలతోనే వీటి గురించి మాట్లాడతాం. ఆ తరువాత జీవితాన్ని తన దిశలో, కర్మవైపు పయనించనిస్తాం. చాలా కొద్దిమంది మాత్రమే వారి జీవితగమ్యం కోసం, సంతోషానికి వారి ముందు వేసి ఉన్న దారిని అనుసరిస్తారు. చాలామంది ప్రపంచాన్ని భయం గొలిపేదానిగా చూస్తారు, వాళ్ళు అలా భావించటం వల్ల ప్రపంచం నిజంగానే భయం గొలిపేదిగా ఉంటుంది.

"కాబట్టి మానవ హృదయాలమైన మేము మెల్లగా మాట్లాడటం మొదలు పెడతాం. మాట్లాడటం ఎప్పుడూ ఆపంగాని మా మాటలను వాళ్ళు వినిపించుకోరని ఆశిస్తూ ఉంటాం: తమ హృదయాలను అనుసరించటం లేదని మానవులు బాధపడటం మాకిష్టం ఉండదు."

"తమ కలలను వెతుక్కుంటూ వెళ్ళమని మానవులకు వాళ్ళ హృదయాలు ఎందుకు చెబుతూ ఉండవు?" పరుసవేదిని యువకుడు అడిగాడు.

"ఇది అన్నిటికంటే హృదయానికి బాధాకరంగా ఉంటుంది, బాధపడటం హృదయాలకు ఇష్టం ఉండదు."

ఆ క్షణం నుంచి యువకుడికి తన హృదయం అర్థమయ్యింది. తనతో మాట్లాడటం ఎన్నటికీ ఆపెయ్యవద్దని దానికి చెప్పాడు. నేను ఎప్పుడైనా నా

కలలకు దూరంగా వెళ్ళిపోతే హెచ్చరిక గంటలను మోగించమని హృదయాన్ని అడిగాడు. ఈ గంటలు వినగానే దాని సందేశాన్ని పాటిస్తానని ప్రమాణం చేశాడు.

ఆ రోజు రాత్రి ఇదంతా అతడు పరుసవేదికి చెప్పాడు. యువకుడి హృదయం విశ్వాత్మని చేరుకుందని అతడికి అర్థమయింది.

"మరి ఇప్పుడు నేనేమి చెయ్యాలి?" యువకుడు అడిగాడు.

"పిరమిడ్ల దిశగా సాగిపోతూ ఉండు," పరుసవేది చెప్పాడు. "శకునాలను గమనిస్తూ ఉండు. నిధి ఎక్కడ ఉందో చూపించగల సామర్థ్యం నీ హృదయానికి ఇంకా ఉంది."

"నేను తెలుసుకోవలసిన ఒక్క విషయం ఇదేనా?"

"కాదు," పరుసవేది బదులిచ్చాడు. "నువ్వు ఇంకా తెలుసుకోవలసింది ఇది: ఒక కల నిజం అయ్యేముందు దారిలో నేర్చుకున్న వాటినన్నిటినీ విశ్వాత్మ పరీక్షిస్తుంది. అలా చేయటానికి అది చెడ్డదేమీ కాదు. మనం కలను సాకారం చేసుకోవటంతో పాటు, ఆ యాత్రలో నేర్చుకున్న వాటన్నిటి మీద మనం పట్టు సాధించటానికి అది అలా చేస్తుంది. సాధారణంగా ఆ పరిస్థితుల్లో చాలా మంది తమ అన్వేషణను వదులుకుంటారు. ఎడారి భాషలో దీనిని క్షితిజ రేఖపై 'ఖర్జూర చెట్లు కనిపించే సమయానికి దప్పికతో చనిపోవటం' అని అంటాం.

"ప్రతి అన్వేషణ ఆరంభకుల అదృష్టంతో మొదలవుతుంది. ప్రతి అన్వేషణ అతడిని తీవ్ర పరీక్షకు గురి చేయటంతో ముగుస్తుంది."

తమ ప్రాంతంలోని ఏనాటిదో ఒక సామెత యువకుడికి గుర్తుకు వచ్చింది. రేయిలో అత్యంత చీకటి అలుముకునే ఘడియ సరిగ్గా ఉషోదయానికి ముందు వస్తుంది.

*

మరుసటిరోజు స్పష్టమైన ప్రమాద సంకేతాలు మొదటిసారి కనిపించాయి. సాయుధులైన ముగ్గురు ఎడారి జాతి ప్రజలు వారి వద్దకు వచ్చి ఇక్కడ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

"నా డేగతో వేటాడుతున్నాను," పరుసవేది బదులిచ్చాడు.

"మీ దగ్గర ఆయుధాలు ఉన్నాయేమో వెదకాలి," వాళ్ళల్లో ఒకడు అన్నాడు.

పరుసవేది మెల్లగా తన గుర్రం మీద నుంచి కిందకు దిగాడు, యువకుడు కూడా కిందకు దిగాడు.

యువకుడిని వెదకగా సంచిలో డబ్బు కనపడటంతో "డబ్బులు ఎందుకు తీసుకెళుతున్నావు?" అని అడిగారు.

"పిరమిడ్లను చేరుకోవటానికి కావాలి," యువకుడు చెప్పాడు.

పరుసవేదిని వెదకుతున్న వ్యక్తికి అతడి వస్తువులలో ఒక ద్రవం ఉన్న చిన్న సీసా, కోడిగుడ్డు కంటే కొంచెం పెద్దగా ఉన్న పసుపు వన్నె గాజు గుడ్డు కనిపించాయి.

"ఇవేమిటి?" అతడు ప్రశ్నించాడు.

"ఇవి తాత్వికుని రాయి, జీవామృతం. ఇది పరుసవేదుల నిపుణుల పని. జీవామృతాన్ని తాగిన వారెవ్వరూ మళ్ళీ ఎన్నడూ జబ్బు పడరు. ఈ రాయిలోని ఒక పిసరుతో ఏ లోహాన్ని అయినా బంగారంగా మార్చగలం."

అతడిని చూసి అరబ్బులు నవ్వసాగారు, వారి నవ్వులో పరుసవేది కూడా శృతి కలిపాడు. అతడి సమాధానం వారికి వినోదాన్ని కలిగించింది. యువకుడిని, పరుసవేదిని వారి సామానులతో ముందుకు సాగనిచ్చారు.

కొంచెం దూరం వెళ్ళిన తరువాత యువకుడు "నీకేమైనా పిచ్చి పట్టిందా? అలా ఎందుకు ప్రవర్తించావు?" అంటూ పరుసవేదిని ప్రశ్నించాడు.

"జీవితంలోని అతి చిన్న పాఠాన్ని నీకు విశదపరచాలని అలా చేశాను," పరుసవేది బదులిచ్చాడు. "నీలో అనంతమైన నిధులు ఉండి ఆ విషయాన్ని ఇతరులకు చెబుదామని అనుకున్నప్పుడు నిన్ను ఎవ్వరూ నమ్మరు."

వాళ్ళు ఎడారిలో ప్రయాణాన్ని కొనసాగించారు. రోజులు గడుస్తున్నకొద్దీ యువకుడి హృదయం మౌనం దాలుస్తోంది. గతాన్నికానీ, భవిష్యత్తుని గానీ తెలుసుకోవాలన్న కోరిక దానికి ఇప్పుడు లేదు. ఎడారిని పరిశీలిస్తూ, విశ్వాత్మను యువకుడితోపాటు ఆస్వాదిస్తూ అది సంతృప్తిగా ఉంది. యువకుడు, అతని హృదయమూ మంచి మిత్రులయ్యారు, ఇకపై ఒకరినొకరు వంచించుకోవటం వారి వల్లకాదు.

ఎడారిలో మౌనంగా ఉండే రోజులు అలసటకు గురిచేయటంతో యువకుడికి బలాన్ని ఇవ్వటానికి, అతడిలో ఉత్సాహాన్ని నింపటానికి మాత్రమే అతని హృదయం అతనితో మాట్లాడుతోంది. యువకునిలోని బలమైన గుణాలు ఏమిటో అతడికి హృదయం తెలియ చెప్పింది: తన గొర్రెలను అమ్మేసి తన జీవిత గమ్యాన్ని సాధించడం కోసం చేసిన సాహసం; గాజు వస్తువుల దుకాణంలో పని చేస్తున్నప్పుడు అతడు చూపిన ఉత్సాహం.

యువకుడికి తెలియని మరి కొన్ని విషయాలను కూడా అతడి హృదయం చెప్పింది: యువకుడు గ్రహించలేకపోయిన ప్రమాదాల గురించి అతడికి చెప్పింది. ఒకసారి తన తండ్రి వద్దనుంచి యువకుడు తుపాకీ తీసుకున్నప్పుడు అతడు తనని తాను గాయపరచుకుంటాడేమోనని దానిని దాచిపెట్టానని చెప్పింది. తరువాత మైదానంలో ఉన్నప్పుడు ఒక రోజు యువకుడికి వాంతులయ్యి, జబ్బు పడిన సంఘటనను గుర్తుచేసింది. ఆ తరువాత యువకుడు గాఢ నిద్రలోకి

జారుకున్నాడు. యువకుడిని చంపి, అతడి గొర్రెలను దొంగిలిద్దామన్న ఆలోచనతో ఇద్దరు దొంగలు కొంచెం దూరంలో మాటేసి ఉన్నారు. యువకుడు ఎంతకీ ఆ చోటుకి రాకపోవటంతో అతడు వేరే దారి తీసుకుని ఉంటాడనుకుని దొంగలు వెళ్ళిపోయారు.

"ఒకరి హృదయం ఎల్లప్పుడూ వారికి సహాయపడుతుందా?" పరుసవేదిని యువకుడు అడిగాడు.

"తమ జీవిత గమ్యాలను సాధించే ప్రయత్నంలో ఉన్నవారి హృదయాలు అలా చేస్తాయి. చిన్న పిల్లలకి, తాగుబోతులకి, వృద్ధులకి కూడా సహాయం చేస్తాయి."

"దీని అర్థం నేను ఎన్నటికీ ప్రమాదంలో చిక్కుకోననేనా?"

"దీని అర్థం హృదయం తాను చెయ్యగలిగింది చేస్తుందని మాత్రమే," పరుసవేది చెప్పాడు.

ఒక మధ్యాహ్నం ఒకానొక ఎడారి జాతి శిబిరం ముందు నుంచి వెళుతున్నారు. శిబిరం నలుమూలలా తెల్లని బట్టలు వేసుకుని సాయుధులైన అరబ్బులున్నారు. అక్కడి వాళ్ళు హుక్కా పీలుస్తూ యుద్ధానికి సంబంధించిన కథలు చెప్పుకుంటున్నారు. ఈ ఇద్దరు యాత్రికులను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు.

శిబిరం దాటి కొంత దూరం వెళ్ళిన తరువాత "ప్రమాదమేమీ లేదు," అన్నాడు యువకుడు.

"నీ హృదయంపై నమ్మకం ఉంచు, కాని ఎడారిలో ఉన్నావని ఎప్పుడూ మరిచిపోవద్దు. మనుషులు ఒకరితో ఒకరు యుద్దానికి దిగినప్పుడు యుద్ధకేకలు విశ్వాత్మకు వినపడతాయి. సూర్యుడి కింద జరిగే ప్రతి ఒక్కదాని పరిణామాలను ఏ ఒక్కరూ తప్పించుకోలేరు," పరుసవేది మాటలు తీవ్రంగా అనిపించాయి.

అన్ని విషయాలూ ఒకటే అని యువకుడు అనుకున్నాడు. పరుసవేది చెప్పింది నిజమని నిరూపించటానికన్నట్లు వారి వెనుకనుంచి ఇద్దరు అశ్వికులు వచ్చారు.

"మీరు ఇంకా ముందుకు వెళ్ళడానికి లేదు," వారిలో ఒకడు అన్నాడు. "ఎడారి ప్రజల మధ్య యుద్ధం జరుగుతున్న ప్రాంతంలో మీరు ఉన్నారు."

అశ్వికుడి కళ్ళలోకి సూటిగా చూస్తూ "మేమెంతో దూరం వెళ్ళటం లేదు," అన్నాడు పరుసవేది. వచ్చిన వాళ్ళిద్దరూ కాసేపు నిశ్శబ్దంగా ఉన్నారు. తరువాత పరుసవేది, యువకుడు ముందుకు వెళ్ళటానికి అనుమతించారు.

జరిగిందంతా యువకుడు మంత్రముగ్ధుడిలా చూస్తుండి పోయాడు. "నీ చూపులతో అశ్వికులపై ఆధిపత్యం సాధించావు," యువకుడు అన్నాడు.

"నీ ఆత్మబలాన్ని నీ కళ్ళు తెలియచేస్తాయి," పరుసవేది బదులిచ్చాడు.

అది నిజమేననుకున్నాడు యువకుడు. వాళ్ళు దాటి వచ్చిన శిబిరం దగ్గర సాయుధులలో ఒకడు వాళ్ళిద్దరవైపు తేరిపార చూస్తుండటం అతడు గమనించాడు. అతడు చాలా దూరంగా ఉండటంతో అతడి ముఖం కూడా సరిగా కనపడటం లేదు. కాని అతడు తమవైపే చూస్తున్నాడన్నది యువకుడికి నిర్థారణ అయ్యింది.

చివరికి క్షితిజాన్నంతా పరచుకున్న కొండలశ్రేణిని దాటిన తరువాత పిరమిడ్లకు మరో రెండు రోజుల దూరంలో ఉన్నామని పరుసవేది చెప్పాడు.

"మన దారులు త్వరలో వేరుకాబోతుంటే నాకు పరుసవేదం నేర్పించు," అని యువకుడు అడిగాడు.

"పరుసవేదం గురించి నీకు ఈ పాటికే తెలుసు. అది విశ్వాత్మను చేరుకోవటం, నీ కోసం ఉద్దేశించిన నిధిని కనుక్కోవటం."

"అది కాదు నేను అనేది. సీసాన్ని బంగారంగా మార్చటం గురించి అడుగుతున్నాను."

ఎడారి మాదిరి పరుసవేది నిశ్శబ్దంగా మారిపోయాడు. భోజనం చేయటానికి కూర్చున్న తరువాత గాని యువకుడికి బదులివ్వలేదు.

"ప్రపంచంలో ప్రతి ఒక్కటీ పరిణామం చెందినదే," అతడు చెప్పాడు. "అన్నిటికంటే బాగా పరిణామం చెందిన లోహంగా విజ్ఞులు బంగారాన్ని పరిగణిస్తారు. ఎందుకలా పరిగణిస్తారని నన్ను అడగవద్దు, ఎందుకో నాకూ తెలియదు. సాంప్రదాయం ఎప్పుడూ సరయినదని మాత్రమే నాకు తెలుసు.

"విజ్ఞుల మాటలను మనుషులు ఎప్పుడూ అర్థం చేసుకోలేదు. దాంతో పరిణామానికి సంకేతంగా చూడవలసిన బంగారం సంఘర్షణలకు కారణమయ్యింది."

"ఒకటే ఎన్నో భాషలు మాట్లాడుతుంది," యువకుడు చెప్పసాగాడు.

"ఒక సమయంలో నాకు ఒంటె మూలుగు మూలుగు కన్నా వేరేమీ కాదు. ఆ తరువాత అది ప్రమాదానికి సూచిక అయ్యింది. చివరికి మళ్ళీ అది మూలుగుగా మారింది."

అంతటితో యువకుడు ఆగిపోయాడు. ఇవన్నీ పరుసవేదికి ఈ పాటికి తెలిసే ఉంటాయి.

"నిజమైన పరుసవేదులు నాకు తెలుసు," పరుసవేది కొనసాగించాడు.

"వాళ్ళు ప్రయోగశాలల్లో తమని తాము బంధించుకుని బంగారంలా పరిణామం చెందటానికి ప్రయత్నించారు. ఏదైనా ఒకటి పరిణామం చెందుతున్న క్రమంలో దాని చుట్టూ ఉన్న ప్రతిదీ కూడా పరిణామం చెందుతున్న విషయం అర్థం చేసుకోవడంతో వాళ్ళు తాత్వికుని రాయి కనుగొన్నారు.

"ఇంకొందరు ఈ రాయిని ప్రమాదవశాత్తు కనుగొన్నారు. వాళ్ళు ఆ పాటికే బహుమతి గ్రహీతలు, ఇటువంటి వారి ఆత్మలు మిగిలిన వారి ఆత్మలకంటే ఇలాంటి విషయాల పట్ల సంసిద్ధంగా ఉంటాయి. అయినా వాళ్ళు వీటిని పరిగణలోనికి తీసుకోరు. అటువంటి వాళ్ళు చాలా అరుదు.

"మరికొంతమంది ఉన్నారు, వాళ్ళ ఆసక్తి అంతా బంగారం మీదే. వాళ్ళకా రహస్యం ఎప్పటికీ చిక్కదు. సీసం, రాగి, ఇనుములకు తమదైన జీవితగమ్యం ఉంటుందనీ, వాటిని అవి సాధించాలనీ వాళ్ళు మరచిపోతారు. మిగిలినవాటి జీవిత గమ్యాలకు అడ్డుపడేవాళ్ళు తమ జీవిత గమ్యాన్ని ఎన్నటికీ కనుగొనలేరు."

శపిస్తున్నట్లు పరుసవేది మాటలు ప్రతిధ్వనించాయి. అతడు నేలమీద ఉన్న నత్తగుల్లలను వంగి చేతిలోకి తీసుకున్నాడు.

"ఈ ఎడారి ఒకప్పుడు సముద్రం," అతడు అన్నాడు.

"నేను ఆ విషయాన్ని గమనించాను," యువకుడు బదులిచ్చాడు.

నత్త గుల్లని చెవిదగ్గర పెట్టుకోమని యువకుడికి పరుసవేది చెప్పాడు. బాల్యంలో అతడు ఆ పని చాలాసార్లు చేశాడు, అలా చేస్తే సముద్రపుహోరు వినపడేది.

"అది తన జీవిత గమ్యం కాబట్టి సముద్రం ఈ గుల్లలో ఇంకా జీవిస్తూనే ఉంది. ఎడారి మళ్ళీ నీళ్ళతో ముంచెత్తబడే దాకా అది అలా జీవిస్తూనే ఉంటుంది."

వాళ్ళు తమ గుర్రాలనెక్కి ఈజిప్టులోని పిరమిడ్లవైపు పయనమైపోయారు.

*

సూర్యుడు అస్తమిస్తూ ఉండగా యువకుడి హృదయం ప్రమాదాన్ని సూచించసాగింది. వాళ్ళచుట్టూ పెద్ద పెద్ద ఇసుక తిన్నెలున్నాయి. పరుసవేదికి ఏమైనా తెలిసిందేమోనని యువకుడు అతడి వైపు చూశాడు. కాని అతడి ముఖం

ప్రమాదాన్ని పసిగట్టినట్లుగా లేదు. అయిదు నిముషాల తరువాత తమకోసం ఎదర కాపువేసిన ఇద్దరు ఆశ్వికులు కనిపించారు. పరుసవేదితో యువకుడు ఏదో అనబోయేంతలో ఇద్దరు ఆశ్వికులు కాస్తా పదిమంది అయ్యారు, అంతలోనే వందమంది అయ్యారు. ఆ తరువాత వాళ్ళు ఇసుక తిన్నెలంతటా ఉన్నారు.

ఈ జాతి వాళ్ళు నీలం రంగు దుస్తులు ధరించి ఉన్నారు. తలపాగా చుట్టూ గుండ్రని బద్ద ఉంది. వాళ్ళ ముఖాలు నీలిరంగు ముసుగుతో కప్పి ఉండి ఒక్క కళ్ళు మాత్రమే కనబడుతున్నాయి.

అంతదూరం నుంచి కూడా వాళ్ళ కళ్ళు వారి ఆత్మల బలాన్ని సూచిస్తున్నాయి. వారి కళ్ళు మృత్యువుని తలపిస్తున్నాయి.

*

సమీపంలోని సైనిక శిబిరం వద్దకు వాళ్ళిద్దరినీ తీసుకువెళ్ళారు. జాతి ప్రముఖుడు తన సిబ్బందితో సమావేశంలో ఉన్న గుడారంలోకి ఒక సైనికుడు యువకుడిని, పరుసవేదిని తోశాడు.

"వీళ్ళు గూఢచారులు," వాళ్ళల్లో ఒకడన్నాడు.

"మేం కేవలం ప్రయాణీకులం," పరుసవేది బదులిచ్చాడు.

"మూడు రోజుల క్రితం మీరు శత్రు శిబిరం దగ్గర కనపడ్డారు. అక్కడ సైనికుల్లో ఒకరితో మీరు మాట్లాడుతూ ఉన్నారు."

"నక్షత్రాలు తెలిసి, ఎడారిలో సంచరించే మనిషిని నేను," పరుసవేది చెప్పాడు. "సైనికుల గురించి కానీ, వాళ్ళ కదలికల గురించి కానీ నాకు ఎటువంటి సమాచారమూలేదు. ఈ నా మిత్రుడికి నేను మార్గదర్శకుడిగా ఉన్నానంతే."

"నీ మిత్రుడు ఎవరు?" ప్రముఖుడు అడిగాడు.

"అతడు పరుసవేది," పరుసవేది బదులిచ్చాడు. "అతడు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోగలడు. తన అసాధారణ శక్తులను మీ ముందు ప్రదర్శించాలని అనుకుంటున్నాడు."

అదంతా యువకుడు నిశ్శబ్దంగానూ, భయం భయంగానూ వింటూ ఉన్నాడు.

"పరదేశీయుడు ఇక్కడ ఏం చేస్తున్నాడు?" వాళ్ళల్లో ఇంకొకడు అడిగాడు.

"మీ జాతికి ఇవ్వటానికి అతడు డబ్బులు తెచ్చాడు," యువకుడు ఏమీ మాట్లాడక ముందే పరుసవేది చెప్పాడు. తరువాత యువకుడి దగ్గర సంచి తీసుకుని ప్రముఖుడికి బంగారం నాణాలను పరుసవేది ఇచ్చాడు.

ఏమీ మాట్లాడకుండా అరబ్బు వాటిని స్వీకరించాడు. ఆ డబ్బుతో చాలా ఆయుధాలు కొనుక్కోవచ్చు.

"పరుసవేది అంటే ఎవరు?" చివరికి అతడు అడిగాడు.

"ప్రకృతిని, ప్రపంచాన్ని అర్థం చేసుకునే మనిషి అతడు. కావాలనుకుంటే అతడు ఈ శిబిరాన్ని కేవలం గాలికి ఉన్న శక్తితో నేలమట్టం చేయగలడు."

వాళ్ళు నవ్వారు. యుద్ధ పరిణామాలకు వాళ్ళు అలవాటు పడ్డారు. గాలి వాళ్ళని గట్టిదెబ్బ కొట్టలేదని వాళ్ళకి తెలుసు. కానీ ప్రతి ఒక్కరి గుండె కొంచెం వేగంగా కొట్టుకుంది. వాళ్ళు ఎడారి మనుషులు, మంత్రగాళ్ళంటే వాళ్ళకి భయముంది.

"దానిని ప్రదర్శిస్తే చూడాలని ఉంది," ప్రముఖుడు అన్నాడు.

"అతడికి మూడు రోజుల సమయం కావాలి," పరుసవేది బదులిచ్చాడు. "తన శక్తులను ప్రదర్శించటానికి అతడు గాలిలా మారతాడు. అతడు గనుక అలా చెయ్యలేకపోతే మీ జాతి గౌరవార్థం మేము మా ప్రాణాలను వినమ్రంగా సమర్పించుకుంటాం."

"నాకు చెందిన దాన్ని నువ్వు ఇచ్చేదేమిటి," ప్రముఖుడు పొగరుగా అన్నాడు. అయితే వారికి మూడు రోజుల గడువు ఇచ్చాడు.

యువకుడు భయంతో వణికి పోతున్నాడు. గుడారం బయటికి వెళ్ళటానికి పరుసవేది అతడికి సహాయపడ్డాడు.

"నువ్వు భయపడుతున్న సంగతి వాళ్ళకి తెలియనివ్వవద్దు," పరుసవేది అన్నాడు. "వాళ్ళు ధైర్యవంతులు. పిరికి వాళ్ళను వాళ్ళు ద్వేషిస్తారు."

కానీ యువకుడు ఏమీ మాట్లాడలేకపోయాడు. శిబిర కేంద్రాన్ని దాటిన తరువాత గానీ అతడికి నోట మాట రాలేదు. వాళ్ళని ఖైదు చేయాల్సిన పనిలేదు. వారి గుర్రాలను తీసేసుకున్నారంతే. తన అనేక భాషలను తిరిగి విశ్వం ప్రదర్శించింది: కొన్ని క్షణాల క్రితం వరకు ఎడారి అనంతంగానూ, స్వేచ్ఛగానూ అనిపించింది. ఇప్పుడు అది చొచ్చుకుపోలేని గోడ మాదిరి ఉంది.

"నా దగ్గర ఉన్నదంతా వాళ్ళకి ఇచ్చేశావు! " యువకుడు అన్నాడు. "నా జీవితమంతా సంపాదించింది ఇచ్చేశావు!"

"నువ్వు చనిపోబోతుంటే అదంతా నీ దగ్గర ఉండి ఏం ప్రయోజనం?" పరుసవేది బదులిచ్చాడు. "నీ డబ్బు మనకు మూడు రోజుల గడువు ఇచ్చింది. అన్నిసార్లూ డబ్బు మనిషి ప్రాణాలను కాపాడలేదు."

జ్ఞానపూరిత మాటలు వినే పరిస్థితిలో యువకుడు లేడు, అతడు ఎంతగానో భయపడిపోయాడు. తాను గాలిలా ఎలా మారగలుగుతాడో అతడికి అంతుపట్టడం లేదు. తాను పరుసవేది కాదు!

ఒక సైనికుడిని తేనీరు కావాలని అడిగి పరుసవేది దానిని యువకుడి మణికట్ల మీద పోశాడు. యువకుడి దేహంలో ఒక తరంగం వ్యాపించి ఊరట పొందింది. అతడికి అర్థంకాని ఏవో పదాలను పరుసవేది ఉచ్చరించాడు.

"నీ భయాలకు దాసోహం కావద్దు," వింతైన ప్రశాంత స్వరంతో పరుసవేది చెప్పాడు. "భయానికి గురయ్యావంటే నువ్వు నీ హృదయంతో మాట్లాడలేవు."

"నేను గాలిలాగా ఎలా మారాలో నాకు ఏమాత్రం తెలియదు."

"ఒక వ్యక్తి తన జీవిత గమ్యాన్ని సాధించాలంటే అతడు నేర్చుకోవలసిందల్లా నేర్చుకుంటాడు. కలను సాకారం చేసుకోవటాన్ని అసాధ్యం చేసేది ఒక్కటే: అది విఫలమవుతామేమోనన్న భయం."

"నేను వైఫల్యం గురించి భయపడటం లేదు. కాని నేను గాలిలా ఎలా మారాలో నాకు తెలియదే."

"నీ జీవితం దాని మీద ఆధారపడి ఉంది కాబట్టి, అది నువ్వు నేర్చుకోవాలి."

"నేను చెయ్యిలేకపోతే?"

"నీ జీవిత గమ్యాన్ని సాధించుకునే ప్రయత్నంలో నువ్వు చనిపోతావు. తమ జీవిత గమ్యం ఏమిటో తెలియకుండానే చనిపోయే లక్షలాది ప్రజలకంటే అది ఎంతో నయం.

"కాని చింతించకు," పరుసవేది కొనసాగించాడు. "సాధారణంగా ప్రాణభయం మనుషులను తమ జీవితంపట్ల మరింత ఎరుక కలిగేలా చేస్తుంది."

*

మొదటిరోజు గడిచిపోయింది. సమీపంలోనే ఒక తీవ్ర యుద్ధం జరిగింది. గాయపడిన వారిని శిబిరానికి తీసుకువచ్చారు. చనిపోయిన వారి స్థానాన్ని కొత్తవారు తీసుకున్నారు, ఎప్పటి మాదిరిగానే రోజు గడిచింది. 'మరణం వల్ల ఏదీ మారదు,' యువకుడు అనుకున్నాడు.

"నువ్వు తరువాత చనిపోయి ఉండవచ్చు," ఒక సైనికుడు తన సహచరుడి శవంతో అంటున్నాడు. "శాంతిని ప్రకటించిన తరువాత నువ్వు చనిపోయి ఉండవచ్చు. అయితే ఎప్పుడో ఒకసారి చనిపోవలసిందే."

సాయంత్రం అవుతుండగా తన డేగను తీసుకుని ఎడారిలోకి వెళ్ళిన పరుసవేదిని వెతుక్కుంటూ యువకుడు వెళ్ళాడు.

"గాలిలా ఎలా మారాలో నాకు ఇప్పటికీ ఏం పాలుపోవటం లేదు," యువకుడు మళ్ళీ చెప్పాడు.

"దేవుడిని సాక్షాత్కరింప చేసేది ఈ ప్రపంచం ఒక్కటే అని నీకు చెప్పిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకో. భౌతిక ప్రపంచానికి ఆధ్యాత్మిక పరిపూర్ణత తెచ్చే పనిని పరుసవేది చేస్తాడు."

"నువ్వేం చేస్తున్నావు?"

"నా డేగకు ఆహారం పెడుతున్నాను."

"నేను గాలిలా మారలేకపోతే మనం చనిపోతాం," యువకుడు అన్నాడు, "ఇంకా దానికి మేత పెట్టి ప్రయోజనమేమిటి?"

"చనిపోయేట్లయితే నువ్వే చనిపోతావు," పరసవేది అన్నాడు. "గాలిలా మారటం నాకు తెలుసు."

*

రెండవరోజు శిబిరం దగ్గర ఉన్న కొండ మీదకి యువకుడు ఎక్కాడు. పహారాకాస్తున్న వాళ్ళు అతడిని వెళ్ళనిచ్చారు. గాలిలా మారగల మాంత్రికుడి గురించి వాళ్ళు విని ఉన్నారు కాబట్టి అతడి జోలికి ఎవరూ వెళ్ళదలచుకోలేదు. ఏది ఏమైనా ఇక్కడి నుంచి తప్పించుకోవటం అసాధ్యం.

రెండవ రోజు మధ్యాహ్నమంతా అతడు ఎడారికేసి చూస్తూ, తన హృదయాన్ని ఆలకిస్తూ గడిపాడు. తన భయాన్ని ఎడారి గుర్తించిందని యువకుడికి తెలుసు.

వాళ్ళిద్దరూ ఒకే భాష మాట్లాడుతున్నారు.

*

మూడవ రోజు ప్రముఖుడు తన అధికారులతో సమావేశమయ్యాడు. పరుసవేదిని అక్కడికి పిలిపించి "యువకుడు గాలి లాగా మారటాన్ని చూద్దాం పద," అన్నాడు.

"అలాగే," అన్నాడు పరుసవేది.

అంతకు ముందురోజు ఎక్కిన కొండమీదకు యువకుడు వాళ్ళని తీసుకెళ్ళాడు. అందరినీ కూర్చోమన్నాడు.

"దీనికి కొంత సమయం పడుతుంది," యువకుడు చెప్పాడు.

"మాకేమీ తొందరలేదు," ప్రముఖుడు బదులిచ్చాడు. "మేం ఎడారి మనుషులం."

యువకుడు క్షితిజం వైపు చూశాడు. దూరంగా కొండలున్నాయి. అక్కడ ఇసుక తిన్నెలు, గుట్టలు, బతకటం అసాధ్యమనిపించే చోట్ల బతికి తీరతామనే చెట్లు ఉన్నాయి. అతడు ఎన్నో నెలల నుంచి తిరుగుతున్న ఎడారి ఉంది. అయినప్పటికీ అందులో అతడికి తెలిసింది ఇసుమంతే. ఆ కొంత లోనే అతడికి ఆంగ్లేయుడు, బిడారులు, ఎడారి జాతుల యుద్ధాలు, యాభైవేల ఖర్జూర చెట్లు, మూడు వందల బావులతో ఒక ఒయాసిస్సు పరిచయమయ్యాయి.

"ఈ రోజు నీకిక్కడ ఏం కావాలి?" ఎడారి అతడిని ప్రశ్నించింది. "నన్ను చూస్తూ నిన్న గడిపిన సమయం సరిపోలేదా?"

"నేను ప్రేమించిన వ్యక్తిని నువ్వు ఎక్కడో దాచి ఉంచావు," యువకుడు అన్నాడు. "నీ ఇసుకను చూస్తుంటే ఆమెను కూడా చూసిన అనుభూతి కలుగుతోంది. నేను ఆమె దగ్గరకు తిరిగి వెళ్ళాలి. నేను గాలిలా మారటానికి నీ సహాయం కావాలి."

"ప్రేమ అంటే ఏమిటి?" ఎడారి అడిగింది.

"ప్రేమ అనేది నీ ఇసుకమీద డేగ విహారం. డేగ ఎప్పుడూ ఆహారంతో తిరిగి వస్తుంది కాబట్టి నువ్వు దానికి పచ్చని పొలాలతో సమానం. దానికి నీ రాళ్ళు, నీ ఇసుక తిన్నెలు, నీ గుట్టలు అన్నీ తెలుసు. నువ్వు దాని పట్ల ఉదారంగా ఉంటావు."

"డేగ ముక్కులో కరుచుకుని తీసుకుపోయేది నాలో భాగాన్ని, నన్నే," ఎడారి అంది. "దాని ఆహారాన్ని నా దగ్గర ఉన్న కొద్దిపాటి నీటితో సంవత్సరాలపాటు సాకుతాను. తరువాత దాని ఆహారం ఎక్కడుందో చూపిస్తాను. దాని ఆహారం నాలో మనుగడ సాగిస్తోందన్న తెలివిడితో సంతోషంగా నేను ఉన్న సమయంలో ఒక రోజు డేగ వచ్చి రివ్వున వాలి నేను సృష్టించిన ఆహారాన్ని తీసుకుపోతుంది."

"నువ్వు ఆ ఆహారాన్ని సృష్టించింది కూడా అందుకే," యువకుడు బదులిచ్చాడు. "అది డేగకు పోషణ అవుతుంది. డేగ మనిషికి పోషణను అందిస్తుంది. చివరికి మనిషి నీ ఇసుకను సారవంతం చేస్తాడు, అక్కడ మళ్ళీ డేగ ఆహారం వర్ధిల్లుతుంది. ప్రపంచం ఈ విధంగానే కొనసాగుతుంది."

"అయితే, ప్రేమ అంటే ఇదేనా?"

"అవును, ప్రేమ అంటే ఇదే. ఎడారి జీవులు డేగగా, డేగ మనిషిలాగా, మనిషి ఎడారిగా మారేలా అదే చేస్తుంది. సీసాన్ని బంగారంగానూ, బంగారాన్ని మట్టిగా కూడా అదే చేస్తుంది."

"నువ్వు చెబుతున్న దేమిటో నాకు అర్థంకావటం లేదు," ఎడారి అన్నది.

"ఎక్కడో నీ ఇసుకల్లో ఒక మహిళ నా కోసం వేచి ఉందన్న సంగతి నీకు అర్థమవుతోంది కదా. అందుకోసమే నేను గాలిలా మారాలి."

కొంతసేపటివరకు ఎడారి ఏమీ మాట్లాడలేదు.

"గాలి వీచటానికి నా ఇసుక రేణువులను నీకు ఇస్తాను. కాని నేను ఒక్క దానిసే ఏమీ చేయలేను. నువ్వు గాలిని కూడా సహాయం అడగాలి," ఎడారి చెప్పింది.

పిల్ల తెమ్మెర వీచటం మొదలయ్యింది. కొంచెం దూరం నుంచి ఎడారి మనుషులు యువకుడిని చూస్తూ ఉన్నారు. యువకుడికి అర్థం కాని భాషలో వాళ్ళు తమలో తాము మాట్లాడుకుంటున్నారు.

పరుసవేది చిరునవ్వు నవ్వాడు.

గాలి యువకుడిని సమీపించి అతడి ముఖాన్ని సుతారంగా తాకింది. ఎడారితో అతడి సంభాషణ గాలికి తెలుసు. వాస్తవానికి గాలికి అన్ని విషయాలూ తెలుసు. జన్మదేశం, మరణస్థానం అనేవి లేకుండా అది ఈ ప్రపంచమంతటా వీస్తుంది.

"నాకు నీ సహాయం కావాలి," యువకుడు అన్నాడు. "ఒక రోజు నా ప్రియతమ స్వరాన్ని నాకు చేరవేయటంలో నువ్వు సహాయపడ్డావు."

"ఎడారి భాషను, గాలి భాషను మాట్లాడడం నీకు ఎవరు నేర్పించారు?"

"నా హృదయం నేర్పింది," యువకుడు బదులిచ్చాడు.

ఈ ప్రపంచంలో గాలికి అనేక పేర్లు ఉన్నాయి. అక్కడ అది సముద్రం మీద నుంచి తేమను తెస్తుంది కాబట్టి దానిని సముద్రపు గాలి అంటారు. యువకుడు

వచ్చిన ప్రాంతంలో దానిని తూరువు గాలి అంటారు, ఆ గాలి తనతోపాటు ఎడారి ఇసుకను, మూరిష్ యుద్ధాల కేకలను తీసుకువస్తుందని అక్కడి ప్రజలు నమ్ముతారు. తను గొర్రెలతో దాటిన మైదాన ప్రాంతంలోని ప్రజలు గాలి యాండలూసియా నుండి వస్తుందని అనుకుంటారేమో. వాస్తవానికి గాలి ఎక్కడి నుండీ రాదు, ఎక్కడికీ వెళ్ళదు. అందుకే అది ఎడారికంటే బలమైనది. ఒక రోజు ఎవరైనా ఎడారిలో చెట్లను నాటవచ్చు, అక్కడ గొర్రెలను కూడా పెంచవచ్చు. కానీ గాలికి పగ్గం వెయ్యటం ఎవరి తరమూ కాదు.

"నువ్వు గాలిలా మారలేవు", అంది గాలి. "మనిద్దరం పూర్తిగా భిన్నమైన వాళ్ళం."

"అది నిజం కాదు," యువకుడు అన్నాడు. "నా యాత్రలలో నేను పరుసవేది రహస్యాలను తెలుసుకున్నాను. గాలులు, ఎడారులు, సముద్రాలు, నక్షత్రాలు, విశ్వంలో సృష్టింపబడిన సమస్తమూ నాలో ఉన్నాయి. మనందరినీ ఒకే చెయ్యి తయారు చేసింది, మనందరిలోనూ ఉన్న ఆత్మ ఒక్కటే. నాకు నీలాగా మారి ప్రపంచంలోని ప్రతి మూలకూ చేరాలని ఉంది, సముద్రాలను దాటాలని ఉంది. నా నిధిని కప్పి ఉంచిన ఇసుకను ఊదెయ్యాలని ఉంది, నేను ప్రేమించిన మహిళ స్వరాన్ని మోసుకెళ్ళాలని ఉంది."

"నువ్వు రెండు రోజుల క్రితం పరుసవేదితో మాట్లాడినప్పుడు మీ మాటలు నేను విన్నాను," గాలి అంది. "ప్రతిదానికీ ఒక జీవిత గమ్యం ఉంటుందని అతడు అన్నాడు. కానీ మనుషులు గాలిలా మారలేరు."

"కొన్ని క్షణాలు మాత్రమే గాలిలా ఉండడం నాకు నేర్పించు," యువకుడు అన్నాడు. "మనుషులకు, గాలులకు ఉన్న హద్దులు లేని అవకాశాల గురించి మనం మాట్లాడుకుందాం."

గాలిలో కుతూహలం చోటు చేసుకుంది. అంతకు మునుపెన్నడూ అలా జరగలేదు. దానికి కూడా ఆ విషయాల గురించి మాట్లాడాలని ఉంది, కాని మనిషిని గాలిలా ఎలా మార్చాలో దానికీ తెలియదు. అది ఎడారులను సృష్టించగలదు, ఓడలను ముంచెయ్యగలదు, అడవులను సమూలంగా నేల మట్టం చేయగలదు. సంగీతాన్ని సృష్టించగలదు, వింత శబ్దాలు చేస్తూ నగరాలగుండా వీచగలదు. ఈ విషయాలన్నీ దానికి ఈ సరికే తెలుసు. దానికి ఏ పరిమితులూ లేవనిపించింది. కానీ ఇక్కడ ఒక యువకుడు అది చెయ్యవలిసిన మరికొన్ని పనులున్నాయని చెబుతున్నాడు.

తాను కోరింది అనుగ్రహించడానికి గాలి మెత్తబడుతుండటం చూసి యువకుడు ఇలా అన్నాడు: “దీనిసే ప్రేమ అని అంటాం. నువ్వు ప్రేమించబడినప్పుడు అంతా నీలోనే జరుగుతుంది కాబట్టి ఏం జరుగుతోందో కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదు. అప్పుడు మానవులు కూడా గాలిలా మారగలరు. అయితే అందుకు గాలికూడా సహాయ పడాలనుకో.”

గాలి చాలా గర్విష్టి, యువకుడు చెప్పేది దానికి చికాకు కలిగిస్తోంది. అది ఇంకా గట్టిగా వీయటం మొదలు పెట్టి ఎడారి దుమ్మును రేపసాగింది. తాను ప్రపంచాన్ని చుట్టి రాగలిగినప్పటికీ మనిషిని గాలిలా ఎలా మార్చాలో దానికి తెలియదని చివరకు ఒప్పుకోక తప్పింది కాదు. దానికి ప్రేమంటే కూడా ఏమీ తెలియదు.

"నేను ప్రపంచాన్ని చుట్టి వస్తున్న సమయాల్లో ప్రేమగురించి ప్రజలు మాట్లాడటం, ఆకాశంవైపు చూడటం నాకు తెలుసు,” తన పరిమితులను అంగీకరించవలసి రావటంతో గాలికి ఉక్రోషంగా ఉంది; “ఆకాశాన్ని అడిగితే పోతుందేమో.”

"అందుకు నువ్వు నాకు సహాయపడాలి," యువకుడు అడిగాడు. "సూర్యుడిని కమ్మేసేట్టు ఈ ప్రాంతంలో తీవ్ర ఇసుక తుపాను రేగేలా చెయ్యి. అప్పుడు నా కళ్ళు అంధకారమయం కాకుండా ఆకాశంవైపు చూడగలుగుతాను."

దాంతో గాలి దాని బలాన్నంతటినీ ఉపయోగించి వీచింది, ఆకాశమంతా ఇసకతో నిండిపోయింది. సూర్యుడు బంగారు పళ్ళెంలా మారాడు.

శిబిరంలో కంటికి ఏమీ కనపడకుండా పోయింది. అటువంటి గాలి ఎడారి మనుషులకు పరిచయమే. దానిని వాళ్ళు ప్రచండ మారుతం అంటారు. సముద్రంలోని తుపాను కంటె ఇది ప్రమాదకరమయినది. వాళ్ళ గుర్రాలు భయపడి సకిలిస్తున్నాయి. వాళ్ళ ఆయుధాలన్నీ ఇసుకతో నిండిపోయాయి.

శిఖరం మీద ఉన్న వారిలో ఒక దళాధిపతి ప్రముఖుడి వైపు తిరిగి "దీనిని ఇంతటితో ముగిస్తే బాగుంటుందేమో!" అన్నాడు.

వాళ్ళకి యువకుడు లీలామాత్రంగా కనబడుతున్నాడు. వారి ముఖాలను నీలిరంగు గుడ్డలు కప్పి ఉన్నాయి, వారి కళ్ళు భయాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

"దీనిని ఆపేద్దాం," మరో దళాధిపతి అన్నాడు.

"అల్లా గొప్పదనం చూడాలని నాకు ఉంది," ప్రముఖుడు వినమ్రంగా అన్నాడు. "ఒక వ్యక్తి గాలిలా ఎలా మారగలుగుతాడో చూడాలని నాకుంది."

భయాన్ని వ్యక్తపరిచిన ఆ ఇద్దరు దళాధిపతుల పేర్లను గుర్తుపెట్టుకున్నాడు. ఎడారికి చెందిన అసలైన పురుషులకు భయం అన్నది తెలియదు కాబట్టి గాలి ఆగిన తరువాత వాళ్ళిద్దరినీ దళాధిపతులుగా తొలగించాలి.

"నీకు ప్రేమ గురించి తెలుసని గాలి నాకు చెప్పింది," సూర్యుడితో యువకుడు అన్నాడు. "నీకు ప్రేమ తెలిస్తే, ప్రేమతో నిండిన విశ్వాత్మ కూడా నీకు తెలియాలి."

"ఉన్న చోటునుంచి విశ్వాత్మను నేను చూడగలను," సూర్యుడు చెప్పాడు. "అది నా ఆత్మతో సంభాషిస్తుంది. ఇద్దరం కలిసి చెట్లు పెరిగేలా చేస్తాం. గొర్రెలు నీడను చేరేలా చేస్తాం. నేను ఉన్న చోటునుంచి – భూమికి చాలా దూరంలో నేను ఉన్నాను – ప్రేమించటాన్ని నేర్చుకున్నాను. నేను భూమికి ఏమాత్రం దగ్గరకు వచ్చినా దానిమీద ఉన్న సమస్తమూ చనిపోతాయని, ఇక విశ్వాత్మ మనలేదని నాకు తెలుసు. అందుకే మేమిద్దరం ఒకరినొకరం దూరం నుంచి చూసుకుంటాం, ఒకరినొకరం కోరుకుంటాం. దానికి నేను వేడిమిని, జీవాన్ని ఇస్తే అది నాకు జీవించి ఉండడానికి కారణాన్ని ఇస్తుంది."

"అయితే నీకు ప్రేమ గురించి తెలుసు," యువకుడు అన్నాడు.

"నాకు విశ్వాత్మ గురించి కూడా తెలుసు. ఈ విశ్వంలో మా అంతులేని యాత్రల్లో ఇద్దరమూ సుదీర్ఘంగా కబుర్లు చెప్పుకున్నాం. ఇప్పటివరకు అన్ని విషయాలూ ఒకటేనని ఖనిజాలు, మొక్కలు మాత్రమే గుర్తించటం దాని అతిపెద్ద సమస్య అని నాతో చెబుతుంటుంది. అయితే ఇనుము రాగిలా ఉండాల్సిన పనిలేదు. అలాగే రాగి బంగారం కానవసరం లేదు. ప్రతిదానికీ ప్రత్యేక జీవిగా తనదైన ధర్మం ఉంటుంది. దీనినంతటినీ రాసిన చెయ్యి అయిదవ రోజున ఆగిపోయి ఉంటే అంతా శాంతి రాగాన్ని ఆలపిస్తూ ఉండేవి.

"కాని ఆరవరోజు కూడా ఉంది," సూర్యుడు చెబుతున్నాడు.

"అన్నిటినీ దూరం నుంచి చూస్తుంటావు కాబట్టి నువ్వు జ్ఞానివి," యువకుడు చెప్పాడు. "కాని నీకు ప్రేమ గురించి తెలియదు. ఆరవరోజు లేకపోతే మనిషి పుట్టుక ఉండేది కాదు. రాగి ఎప్పటికీ రాగిగానే, సీసం సీసంగానే ఉండేవి. ప్రతిదానికీ దాని జీవిత గమ్యం ఉంటుందన్నది నిజమే, ఏదో ఒక రోజు దానిని సాధిస్తారు. అప్పుడు ప్రతిదీ కొత్త రూపం సంతరించుకోవాలి. చివరికి విశ్వాత్మ అంతా ఒకటే అవుతుంది."

సూర్యుడు దీని గురించి ఆలోచించి మరింత ప్రకాశంతో వెలగాలని అనుకున్నాడు. ఈ సంభాషణ వింటూ సంబరపడుతున్న గాలి సూర్యడి ప్రకాశం వల్ల యువకుడికి హాని జరగకూడదనే ఉద్దేశంతో మరింత తీవ్రంగా వీచసాగింది.

"పరుసవేదం ఉంది అందుకే," యువకుడు చెప్పాడు. "ప్రతి ఒక్కరూ తమ నిధి కోసం వెతికి, దానిని సాధించాలి. ఆ తరువాత గత జీవితంలోకంటే తమను తాము మెరుగు పరుచుకోవాలి. తన అవసరం ఉన్నంతవరకు సీసం తన పాత్రను పోషిస్తుంది; ఆ తరువాత అది బంగారంగా మారాల్సి ఉంటుంది.

"పరుసవేదులు కూడా ఇదే చేస్తారు. మనం ఇప్పటికంటే మెరుగ్గా అయ్యేందుకు ప్రయత్నం చేయటం ద్వారా మన చుట్టూ ఉన్నవి కూడా మెరుగు అవుతాయని వాళ్ళు సూచించారు."

"నాకు ప్రేమ గురించి తెలియదని ఎందుకన్నావు?" సూర్యుడు యువకుడిని అడిగాడు.

"ప్రేమంటే ఎడారి మాదిరి కదలకుండా ఉండడం కాదు. ప్రేమ అంటే గాలిలా ప్రపంచమంతా చుట్టి రావటమూ కాదు. ప్రేమ అంటే నీలా ప్రతిదాన్ని దూరం నుంచి చూస్తూ ఉండటమూ కాదు. ప్రేమ అనేది ఒక శక్తి. అది విశ్వాత్మను మార్చి, మెరుగు పరుస్తుంది. నేను మొదటిసారి విశ్వాత్మను చేరుకున్నప్పుడు, అది లోపరహితమయినదని అనుకున్నాను. కాని ఆ తరువాత సృష్టిలోని మిగిలిన వాటి మాదిరే అది కూడా అని గ్రహించాను, దానికీ పోరాటాలూ, కోరికలూ ఉన్నాయి. విశ్వాత్మని పెంచి పోషించేది మనమే. మనల్ని మెరుగుపరచుకుంటామా, క్షీణింపచేసుకుంటామా అన్న దాన్ని బట్టి మనం నివసించే ప్రపంచం మెరుగుపడుతుంది లేదా క్షీణిస్తుంది. ఇక్కడే ప్రేమశక్తి రంగ ప్రవేశం చేస్తుంది. ఎందుకంటే ప్రేమలో ఉన్నప్పుడు నిరంతరం మెరుగుపడటానికి మనం ప్రయత్నిస్తుంటాం."

"అయితే నానుంచి నీకు ఏమి కావాలి?" సూర్యుడు అడిగాడు.

"నేను గాలిలా మారటానికి నీ సహాయం కావాలి," యువకుడు బదులిచ్చాడు.

"సృష్టిలో అన్నిటికంటే నేనే జ్ఞానినని ప్రకృతికి తెలుసు," సూర్యుడు చెప్పాడు. "కాని నిన్ను గాలిలా మార్చటం ఎలాగో నాకు కూడా తెలియదు."

"అయితే నేను ఎవరిని అడగాలి?"

సూర్యుడు ఒక నిమిషం పాటు ఆలోచించాడు. అదంతా గాలి శ్రద్ధగా వింటోంది. సూర్యుడి విజ్ఞతకు కూడా పరిమితులున్నాయన్న విషయాన్నీ, విశ్వభాష తెలిసిన ఈ యువకుడితో తలపడలేకపోయాడనీ ప్రపంచం నలుమూలలకూ చేరవేయాలని అది తహతహలాడుతోంది.

"అన్నింటినీ రాసిన చెయ్యితో మాట్లాడు," సూర్యుడు చెప్పాడు.

గాలి ఆనందంతో కేరింతలుకొడుతూ, అంతకుముందు కంటే బలంగా వీయసాగింది. నేలకు కట్టి ఉన్న గుడారాలు లేచిపోసాగాయి, కట్టుగొయ్యలకు ఉన్న పశువులు విముక్తమయ్యాయి. కొండపైన పురుషులు గాలికి కొట్టుకు పోకుండా ఒకరినొకరు గట్టిగా పట్టుకుని ఉన్నారు.

అన్నింటినీ రాసిన చెయ్యివైపు యువకుడు తిరిగాడు. అలా తిరుగుతూ విశ్వం నిశ్శబ్దంగా మారిపోవటాన్ని అతడు గమనించాడు, తాను కూడా మౌనంగా ఉండిపోవాలని నిర్ణయించుకున్నాడు.

యువకుడి హృదయంలో ఒక ప్రేమ అల పోటెత్తింది. అతడు ప్రార్థన చేయసాగాడు. అటువంటి ప్రార్థన అతడు ఇంతకు ముందెన్నడూ చేయలేదు. ఆ ప్రార్థనలో పదాలు లేవు, విన్నపాలు లేవు. తన గొర్రెలకు కొత్త మైదానాలు దొరికినందుకు అతడు తన ప్రార్థనలో కృతజ్ఞతలు తెలపలేదు. తాను మరిన్ని గాజు వస్తువులను అమ్మగలగాలని కోరలేదు. తాను కలుసుకున్న మహిళ అతడు తిరిగి

వచ్చేదాకా వేచి ఉండాలని మొరపెట్టుకోలేదు. ఆ నిశ్శబ్దంలో ఆ చెయ్యి రాసిన సంకేతాలను అర్థం చేసుకోవటానికి ఎడారి, గాలి, సూర్యుడు కూడా ప్రయత్నిస్తున్నాయని, ఇవన్నీ వాటి దారులను అవి అనుసరించడానికి ప్రయత్నిస్తున్నాయని, ఒక పచ్చలతాయెత్తు మీద రాసి ఉన్న దానిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాననీ యువకుడికి విశదమయ్యింది. శకునాలు భూమిమీదా, రోదసిలోనూ అంతటా చెల్లా చెదరుగా ఉన్నాయని, అవి కనపడటానికి ఒక కారణమూ, అర్థమూ లేదని అతడు చూడగలిగాడు. తాము ఎందుకు సృష్టింపబడ్డామో ఎడారులకు తెలియదు, గాలులకు తెలియదు, సూర్యుడికీ తెలియదు, చివరకి మనుషులకు కూడా తెలియదు. ఆ చెయ్యి మాత్రమే అద్భుతాలను చేయగలదు, సముద్రాన్ని ఎడారిగా మార్చగలదు.... లేదా మనిషిని గాలిలా మార్చగలదు. ఆరు రోజుల సృష్టి నిపుణులపనిగా పరిణమించిందన్న విస్తృత వ్యూహం గురించి ఆ చెయ్యికి మాత్రమే తెలుసు.

యువకుడు విశ్వాత్మను చేరుకోగలిగాడు, అది భగవంతుని ఆత్మలో భాగమని తెలుసుకున్నాడు. తన ఆత్మే భగవంతుని ఆత్మ అనేది అతడు చూడగలిగాడు. అప్పుడు ఆ యువకుడు కూడా అద్భుతాలు చేయగలిగాడు.

*

ప్రచండ మారుతం మునుపెన్నడూ లేనంతగా ఆ రోజు వీచింది. ఎడారిలో అత్యంత శక్తిమంతుడైన ప్రముఖుడిని ధిక్కరించి, గాలిలా మారి అతని సైనిక శిబిరాన్ని దాదాపు నిర్మూలించినంత పనిచేసిన యువకుడి అద్భుత గాథను అరబ్బులు కొన్ని తరాలపాటు చెప్పుకున్నారు.

ప్రచండ మారుతం తగ్గిన తరువాత అందరూ యువకుడు ఉండవలసిన వైపుచూశారు. కాని ఇప్పుడు అతను అక్కడ లేడు. శిబిరానికి అవతలి వైపు ఇసుకతో కప్పబడిపోయిన కాపలా వ్యక్తి పక్కన అతను నిలబడి ఉన్నాడు.

అతడి శక్తుల్ని చూసి వాళ్ళు భయపడి పోతున్నారు. కాని ఇద్దరు వ్యక్తులు మాత్రం చిరునవ్వు నవ్వుతూ కూర్చున్నారు: పరిపూర్ణ శిష్యుడు దొరికినందుకు పరుసవేది, తాను భగవంతుని లీలను అర్థం చేసుకున్నందుకు ప్రముఖుడు.

ఆ మరుసటి రోజు ప్రముఖుడు వాళ్ళిద్దరికీ వీడ్కోలు పలుకుతూ అవసరమయినంత వరకు ఉంచుకొమ్మని ఒక సైనిక బృందాన్ని తోడుగా ఇచ్చి పంపించాడు.

*

ఆ రోజంతా వాళ్ళు స్వారీ చేస్తూనే ఉన్నారు. సాయంకాలం అవుతుండగా వాళ్ళు ఒక సన్యాసుల మఠానికి చేరుకున్నారు. పరుసవేది గుర్రాన్ని దిగాడు. సైనికుల బృందం తిరిగి శిబిరానికి వెళ్ళటానికి అనుమతిచ్చాడు.

"ఇక్కడి నుంచి నువ్వు ఒంటరిగానే ఉంటావు," పరుసవేది చెప్పాడు. "పిరమిడ్లు ఇక్కడికి మూడు గంటల దూరంలో ఉన్నాయి."

తనకు విశ్వభాష నేర్పించినందుకు యువకుడు తన కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

"నీకు తెలిసినదానినే నేను మేలుకొలిపాను."

పరుసవేది సన్యాసుల మఠం తలుపులు తట్టాడు. నల్లని దుస్తులలో ఉన్న ఒక మత గురువు తలుపులు తెరిచాడు. వాళ్ళిద్దరూ కొంచెం సేపు అక్కడి భాషలో మాట్లాడుకున్నారు. తరువాత యువకుడిని లోపలికి రమ్మంటూ పరుసవేది సైగ చేశాడు.

"కొంచెం సేపు వంట గదిని ఉపయోగించుకోవటానికి అనుమతి అడిగాను," పరుసవేది నవ్వాడు.

సన్యాసుల మఠం వెనక ఉన్న వంటింటిలోకి వాళ్ళు వెళ్ళారు. పరుసవేది నిప్పురాజేశాడు. మత గురువు సీసం తీసుకొచ్చాడు. దానిని పరుసవేది ఇనుప మూకుడులో వేశాడు. సీసం కరిగిన తరువాత పరుసవేది తన సంచిలోంచి పసుపు పచ్చని గుడ్డుని బయటికి తీసాడు. దాంట్లోంచి సన్నని పొర గీరి దానిని మైనంలో కలిపి సీసం కరిగి ఉన్న మూకుట్లోకి వేశాడు.

దాంతో ఆ ద్రావణం దాదాపు రక్తం లాగా ఎర్ర రంగులోకి మారింది. పరుసవేది మూకుడుని మంట మీదనుంచి దింపి దానిని చల్లారబెట్టాడు. ఈలోగా ఎడారి జాతుల మధ్య యుద్ధాల గురించి మత గురువుతో మాట్లాడసాగాడు.

"ఈ యుద్ధాలు చాలాకాలం కొనసాగుతాయనిపిస్తోంది," అని మత గురువుతో చెప్పాడు.

మత గురువు చిరాకు పడ్డాడు. అక్కడికి రావలసిన బిడారు యుద్ధాల కారణంగా గిజా వద్ద ఆగిపోయింది. "అంతా దేవుని చిత్తం ప్రకారమే జరుగుతుంది," అన్నాడు మత గురువు.

"ఖచ్చితంగా, " బదులిచ్చాడు పరుసవేది.

మూకుడు చల్లారిన తరువాత మత గురువు, యువకుడు ఆశ్చర్యచకితులై దాని వంక చూశారు. సీసం మూకుడు ఆకారంలో గట్టిపడింది. కాని ఇప్పుడది సీసం కాదు, బంగారం.

"ఇలా చేయటం నేను ఎప్పటికైనా నేర్చుకోగలనా?" యువకుడు అడిగాడు.

"ఇది నా జీవిత గమ్యం, నీదికాదు," పరుసవేది బదులిచ్చాడు. "నిధి సాధ్యమని నీకు చూపించదలుచుకున్నానంతే."

వాళ్ళు సన్యాసుల మఠం తలుపుల వద్దకు తిరిగి చేరుకున్నారు. అక్కడ బంగారం ముద్దని పరుసవేది నాలుగు భాగాలుగా చేశాడు.

"యాత్రికుల పట్ల నువ్వు చూపిన ఉదారత్వానికి ఇది నీకు," ఒక భాగాన్ని మత గురువుకి ఇస్తూ పరుసవేది అన్నాడు.

"కాని ఇది నా ఉదారత్వాన్ని మించి ఎన్నో రెట్లు ఉంది," మతగురువు బదులిచ్చాడు.

"మళ్ళీ అలాంటి మాటలు మాట్లాడవద్దు. అంతా జీవితం వింటూ ఉంటుంది, ఈ సారి అది నీకు ఇంత ఉదారంగా ఇవ్వదు."

పరుసవేది యువకుడి వైపు తిరిగాడు: "ప్రముఖుడికి ఇచ్చిన దానికి బదులుగా ఇది నీకు."

ప్రముఖుడికి తాను ఇచ్చిన దానికంటే ఇది చాలా ఎక్కువని యువకుడు అనబోయాడు. కానీ మత గురువుతో పరుసవేది అన్న మాటలు విని ఉండటం వల్ల మిన్నకుండిపోయాడు.

ఒక భాగాన్ని అతని వద్ద ఉంచుకుంటూ "నేను తిరిగి యుద్ధాలు జరుగుతున్న ఎడారిలోకి వెళ్ళాలి కాబట్టి ఇది నాకు," అన్నాడు పరుసవేది.

నాల్గవ భాగాన్ని తీసుకుని మత గురువుకి ఇచ్చాడు.

"ఇది యువకుడికి అవసరమైతే అతడికి ఇవ్వటానికి."

"కాని నేను నిధిని అన్వేషిస్తూ వెళుతున్నాను," యువకుడు అన్నాడు. "ఇప్పుడు దానికి చాలా దగ్గరలో ఉన్నాను."

"నువ్వు దానిని తప్పకుండా కనుగొంటావన్న నమ్మకం నాకుంది," పరుసవేది బదులిచ్చాడు.

"మరి ఇది ఎందుకు?"

"నువ్వు ఇప్పటికే రెండుసార్లు నీ సొమ్మునంతా కోల్పోయావు. ఒకసారి దొంగకి, రెండవసారి ప్రముఖుడికి. నేను ముసలి, మూఢ నమ్మకాల అరబ్బుని. మా సామెతలను నేను విశ్వసిస్తాను. ఒక సామెత ఇలా చెబుతుంది: 'ఒక సారి జరిగింది రెండవసారి జరగకపోవచ్చు. కాని రెండుసార్లు జరిగింది మూడవసారి ఖచ్చితంగా జరుగుతుంది." వాళ్ళు గుర్రాలను ఎక్కారు.

*

"కలల గురించి ఒక కథను నీకు చెప్పాలని ఉంది," పరుసవేది అన్నాడు.

యువకుడు తన గుర్రాన్ని అతనికి మరింత దగ్గరగా తీసుకు వచ్చాడు.

"అనగా అనగా రోము నగరంలో టిబెరియస్ రాజుగా ఉన్నప్పుడు ఒక సాత్వికుడికి ఇద్దరు కొడుకులు ఉండేవారు. పెద్దవాడు సైన్యంలో పనిచేసేవాడు. అతడు సామ్రాజ్యంలోని ఓ మారుమూల ప్రాంతంలో ఉంటాడు. రెండవవాడు తన అందమైన కవితలతో రోము నగరమంతటినీ సమ్మోహపరచేవాడు.

"ఒక రాత్రి తండ్రికి ఒక కలవచ్చింది. కలలో దేవదూత కనిపించి అతని కొడుకులలో ఒకరి మాటలను ప్రజలందరూ నేర్చుకుని తరతరాలపాటు ప్రపంచమంతటా చెప్పుకుంటారని చెప్పింది. కలలోంచి మేలుకుని ఏ తండ్రి అయినా గర్వపడే విషయాన్ని తనకు జీవితం వెల్లడించినందుకు కృతజ్ఞతతో అతడు ఏడవసాగాడు.

"తరువాత కొంత కాలానికి ఒక పిల్లవాడు రథచక్రాల కింద పడకుండా కాపాడే ప్రయత్నంలో తండ్రి చనిపోయాడు. అతడు జీవితమంతా ధర్మమార్గంలోనూ, న్యాయంగానూ జీవించినందుకు అతడు నేరుగా స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ అతడికి తనకు కలలో కనిపించిన దేవదూత ఎదురయ్యింది.

‘నువ్వు చాలా ధర్మపరుడివి,’ దేవదూత అతడితో చెప్పింది. ‘నువ్వు జీవితాన్ని ఉన్నతంగా జీవించావు, ఆదర్శంగా చనిపోయావు. నీ కోరిక ఏదైనా నేను ఇప్పుడు తీర్చగలను.’

“జీవితం నా పట్ల దయగా ఉంది,” అతడు చెప్పాడు. 'నువ్వు నా కలలో కనిపించినప్పుడు నా కొడుకు కవితలు ప్రజల నాలుక మీద తరతరాల పాటు నిలిచి ఉంటాయని తెలపటంతో నా జీవితం ధన్యమైపోయిందనిపించింది. నా కోసం ఏమీ అవసరంలేదు. చిన్నప్పుడు సంరక్షించి, పెరుగుతున్నప్పుడు విద్యాబుద్ధులు గరిపిన తన కొడుకు పెద్దవాడై ఖ్యాతిగాంచటం ఏ తండ్రికైనా గర్వంగా ఉంటుంది. సుదూర భవిష్యత్తులోని నా కొడుకు మాటలను వినాలని ఉంది.'

"దేవదూత అతడి భుజాన్ని మెల్లగా స్పర్శించింది. దాంతో ఇద్దరూ భవిష్యత్తులోకి ఎంతో దూరం ప్రయాణించారు. ఒక వింత భాష మాట్లాడుతూ వేలాది ప్రజలు సమావేశమై ఉన్న ప్రదేశాన్ని చేరుకున్నారు.

"అతడు ఆనందంతో కన్నీటి పర్యంతం అయ్యాడు.

“కన్నీటిని అదుపు చేసుకుంటూ అతడు 'నా కొడుకు కవితలు అజరామరమైనవని నాకు తెలుసు. ఆ ప్రజలు పాడుతున్నది నా కొడుకు రాసిన ఏ కవితో చెప్పగలవా?' అంటూ దేవదూతను అడిగాడు.

"దేవదూత అతడికి మరింత చేరువగా వచ్చి, దగ్గరలో ఉన్న బల్ల వరకు మెల్లగా తీసుకెళ్ళింది. ఇద్దరూ దానిమీద కూర్చున్నారు.

"కవి అయిన నీకొడుకు కవితలు రోమ్‌లో ఎంతో ఆదరణ పొందాయి,” దేవదూత చెప్పింది. 'ప్రతి ఒక్కరూ వాటిని ఇష్టపడి, ఆస్వాదించేవారు. కానీ టిబెరియస్ పాలన అంతం కావటంతోనే ప్రజలు ఆ కవితలను కూడా మరిచిపోయారు. నువ్వు ఇప్పుడు విన్న మాటలు సైన్యంలో ఉన్న కొడుకువి.'

అతడు దేవదూతవైపు ఆశ్చర్యంగా చూశాడు.

"'నీ కొడుకు సైన్యంలో పనిచేయటానికి మారుమూల ప్రాంతానికి వెళ్ళి సెంచూరియన్ అయ్యాడు. అతడు న్యాయబద్ధంగానూ, సహృదయంతోనూ జీవించాడు. ఒకరోజు మధ్యాహ్నం అతడి సేవకులలో ఒకడు జబ్బుపడ్డాడు, అతడు చనిపోతాడేమోననిపించింది. నీ కొడుకు రోగాలను నయం చెయ్యగల ఒక రబ్బీ గురించి విని ఉన్నాడు. అతడిని వెతుక్కుంటూ ఎన్నో రోజులపాటు గుర్రంపైన స్వారీ చేశాడు. తాను వెదుకుతున్న వ్యక్తి దేవుని పుత్రుడని అతనికి దారిలో తెలిసింది. అతడి ద్వారా నయమైన వాళ్ళు ఎదురయ్యి నీ కొడుకుకి అతడి బోధనలగురించి చెప్పారు. అతడు రోమన్ సెంచూరియన్ అయినప్పటికీ వాళ్ళ మతాన్ని స్వీకరించాడు. మరికొంత కాలానికి తాను వెదుకుతున్న వ్యక్తి నివశిస్తున్న గ్రామానికి చేరుకున్నాడు.'

"తన సేవకులలో ఒకడు తీవ్రంగా జబ్బు పడ్డాడని చెప్పడంతో అతడితో వెళ్ళటానికి రబ్బీ సిద్ధమయ్యాడు. అతడు దేవుడిని నమ్మినవాడు కాబట్టి రబ్బీ కళ్ళలోకి చూసేసరికి తాను దేవుని కుమారుని సమక్షంలో ఉన్నానన్న విషయం అతనికి అవగతమయ్యింది.'

"ఆ సమయంలో నీ కొడుకు రబ్బీతో అన్న మాటలను ప్రపంచం ఎప్పటికీ మరిచిపోలేదు. ఆ మాటలు ఇవి: "ఓ నా ప్రభువా! నువ్వు నా ఇంటికి వచ్చేంత అర్హుడిని కాను నేను. కాని నువ్వు ఒక్క మాట మాట్లాడితే చాలు నా సేవకుడికి స్వస్థత చేకూరుతుంది" అంటూ దేవదూత అతడితో చెప్పింది."

పరుసవేది ఇలా చెప్పాడు. "ఈ భూమి పైన ప్రతి వ్యక్తీ ఏమి చేసినా ప్రపంచ చరిత్రలో కీలకమైన పాత్ర పోషిస్తుంటాడు. సాధారణంగా ఈ ఎరుక అతడికి ఉండదు."

యువకుడు నవ్వాడు. జీవితానికి సంబంధించిన ప్రశ్నలు ఒక గొర్రెల కాపరికి ఇంత ముఖ్యమవుతాయని అతడు ఎన్నడూ ఊహించలేదు.

"వెళ్ళి వస్తాను," అన్నాడు పరుసవేది.

"వెళ్ళి వస్తాను," అన్నాడు యువకుడు.

*

తన హృదయం చెప్పబోయేదానిపై శ్రద్ధ వహిస్తూ యువకుడు కొన్ని గంటలపాటు ఎడారిలో స్వారీ చేశాడు. తన నిధి ఎక్కడ దాగి ఉందో అతడి హృదయమే చెప్పనుంది.

'నీ నిధి ఎక్కడ ఉందో నీ హృదయం కూడా అక్కడే ఉంటుంది,' పరుసవేది తనతో చెప్పాడు.

కాని అతడి హృదయం వేరే సంగతులు చెబుతోంది.

రెండు సార్లు వచ్చిన కలను సాకారం చేసుకోటానికి తన గొర్రెలమందను అమ్మిన ఒక గొర్రెల కాపరి కథను అది ఎంతో గర్వంగా చెప్పింది. అది జీవిత గమ్యం గురించి చెప్పింది. సుదూర ప్రాంతాలు, అందమైన మహిళలను వెదకుతూ తమ కాలం నాటి మూసపోత అభిప్రాయాలను సవాలు చేస్తూ, దేశ దిమ్మరులుగా తిరిగిన పురుషుల కథలు చెప్పింది. యాత్రలు, ఆవిష్కరణలు, పుస్తకాలు, మార్పులను గురించి అది మాట్లాడింది.

అతడు మరొక ఇసుకతిన్నె ఎక్కబోతుండగా "నువ్వు ఎక్కడ కన్నీటి పర్యంతం అవుతావో జాగ్రత్తగా చూస్తుండు. అక్కడే నేను ఉంటాను, అక్కడే నీ నిధి ఉంటుంది," అంటూ అతడి హృదయం గుసగుసలాడింది.

యువకుడు ఇసుక తిన్నెను నిదానంగా ఎక్కసాగాడు. తారలు నిండి ఉన్న ఆకాశంలో పూర్ణచంద్రుడు ఉదయించాడు: అతడు ఒయాసిస్సునుంచి బయలుదేరి

ఒక నెల అయ్యింది. ఇసుక తిన్నెల మీద చంద్రుడు పరుస్తున్న నీడలు ఉరకలేస్తున్న సముద్రమా అన్న భ్రాంతిని కలిగిస్తున్నాయి. ఎడారిలో పరుసవేది పరిచయమైన దృశ్యాన్ని అది అతడికి జ్ఞప్తికి తెచ్చింది. ఎడారి నిశ్శబ్దంపైన, నిధికై అన్వేషిస్తున్న ఒక యువకుని ప్రయాణం మీద చంద్రకాంతి ప్రసరించింది.

అతడు ఇసుక తిన్నెపైకి చేరుకున్న తరువాత అతడి గుండె గొంతుకలో కొట్టుకున్నట్లయ్యింది. అక్కడ కంటికి ఎదురుగా చంద్రుని వెన్నెల్లో, ఎడారి కాంతిలో ప్రకాశిస్తూ ఈజిప్టుకి చెందిన అద్భుతమయిన పిరమిడ్లు ఉన్నాయి.

యువకుడు తన మోకాళ్ళ మీద పడి ఏడవసాగాడు. జీవిత గమ్యంపైన తనకు గల విశ్వాసాన్ని, దారిలో ఒక రాజుని, ఒక వ్యాపారిని, ఒక ఆంగ్లేయుడిని, ఒక పరుసవేదిని పరిచయం చేసినందుకు దేవునికి కృతజ్ఞతలు తెలిపాడు. అన్నిటికీ మించి మనిషిని అతడి జీవిత గమ్యం నుంచి ప్రేమ దూరం చేయదని చెప్పిన ఎడారి మహిళతో కలిపినందుకు అతడు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

అతడు కావాలనుకుంటే ఇప్పుడు ఒయాసిస్సుకి, ఫాతిమా దగ్గరికి తిరిగి వెళ్ళి సాధారణ గొర్రెల కాపరిగా జీవితాన్ని గడపగలడు. విశ్వభాష తెలిసినప్పటికీ, సీసాన్ని బంగారంగా మార్చగలిగినప్పటికీ పరుసవేది ఎడారిలో జీవితాన్ని కొనసాగించటం లేదా! అతడు తన జ్ఞానాన్నీ, కళనీ ఎవరి కోసం ప్రదర్శించాల్సిన అవసరంలేదు. తన జీవిత గమ్యాన్ని సాధించుకునే క్రమంలో తాను నేర్చుకోవలసిందంతా నేర్చుకున్నానని, తాను కలగన్న వాటినన్నింటినీ అనుభూతి చెందానని యువకుడు గుర్తు చేసుకున్నాడు.

కానీ ఇప్పుడు తన నిధిని కనుగొనే స్థితిలో ఉన్నాడు. ప్రారంభించిన పని ఉద్దేశం నెరవేరనిదే ఏదీ పూర్తి అయినట్టు కాదని యువకుడు మననం చేసుకున్నాడు. యువకుడు తన చుట్టూ ఉన్న ఇసుకని కలయచూశాడు. అతడి కన్నీళ్ళు పడిన చోట ఒక పెంకు పురుగు పాకుతోంది. అతడు ఎడారిలో గడిపిన

కాలంలో ఈజిప్టు ప్రజలు పెంకు పురుగుని దేవునికి సంకేతంగా భావిస్తారని తెలుసుకున్నాడు.

మరో శకునం! ఇసుకతిన్నెపై యువకుడు తవ్వటం మొదలుపెట్టాడు. అలా తవ్వుతుండగా ఒకనాడు గాజు వస్తువుల వ్యాపారి అన్న మాటలు గుర్తుకు వచ్చాయి: ఎవరైనా కావాలనుకుంటే వారి పెరట్లో పిరమిడ్లు కట్టుకోవచ్చని అతడు అన్నాడు. మిగిలిన జీవితమంతా రాయిమీద రాయి పేర్చుకుంటూ పోయినాగాని తాను పిరమిడ్లను కట్టలేనన్న విషయాన్ని యువకుడు ఇప్పుడు గ్రహించాడు.

తాను ఎంచుకున్న ప్రదేశంలో యువకుడు రాత్రంతా తవ్వుతూనే ఉన్నాడు కానీ అతడికి ఏమీ దొరకలేదు. పిరమిడ్లను కట్టిన కాలంనుంచి శతాబ్దాల భారం అతడిపైన ఉన్నట్లు యువకుడికి అనిపించింది. అయినా అతడు తన ప్రయత్నాన్ని విరమించలేదు. గాలిని ఎదుర్కొంటూ తవ్వటానికి అతడు తన ప్రయత్నాన్ని విరమించలేదు. గాలిని ఎదుర్కొంటూ తవ్వటానికి అతడు కష్టపడుతున్నాడు. తాను తవ్వినంత మేర గాలి ఒక్కొక్కసారి తిరిగి ఇసుకతో పూడ్చివేస్తోంది. అతడి చేతులు గీరుకుపోయాయి, అతడు అలసిపోయాడు. కాని అతడు తన హృదయం చెప్పేది ఆలకించాడు. తన కన్నీళ్ళు పడిన చోట తవ్వమని అది చెప్పింది.

తవ్వుతుండగా తగిలిన రాళ్ళు తియ్యబోతుండగా యువకుడికి అడుగుల చప్పుడు వినిపించింది. చాలా మంది గుంపుగా ఆ వైపు వస్తున్నారు. చంద్రకాంతి వారి వీపు మీద పడుతూ ఉండటంతో వాళ్ళ ముఖాలు గానీ, కళ్ళు గానీ యువకుడికి కనపడలేదు.

"అక్కడ ఏం చేస్తున్నావు?" గుంపులో నుండి ఒకరు అడిగారు.

యువకుడు భయంతో బిగుసుకుపోయి బదులివ్వలేదు. అతడికి తన నిధి దొరికింది, కానీ ఇప్పుడేమవుతుందోనని అతనికి భయంగా ఉంది.

"ఎడారి యుద్ధాల కాందిశీకులం మేం. మాకు డబ్బులు కావాలి," మరో వ్యక్తి అన్నాడు. "అక్కడ ఏం దాచిపెట్టావు?"

"నేను ఇక్కడ ఏమీ దాచలేదు," యువకుడు బదులిచ్చాడు.

వాళ్ళల్లో ఒకడు అతడిని పట్టుకుని గుంతలోంచి బయటికి లాగాడు. యువకుడి సంచులు వెతుకుతున్న మరొకడికి బంగారు ముద్ద దొరికింది.

"ఇందులో బంగారం ఉంది," అతడన్నాడు.

యువకుడిని పట్టుకున్న అరబ్బు ముఖంపై వెన్నెల పడింది. అతడి కళ్ళల్లో యువకుడు మృత్యునీడను చూశాడు.

"నేలలో మరింత బంగారం దాచి ఉంటాడు."

యువకుడితో వాళ్ళు మళ్ళీ తవ్వించటం మొదలు పెట్టారు. కాని అతడికి ఏమీ దొరకలేదు. సూర్యోదయం అయిన తరువాత యువకుడిని వాళ్ళు కొట్టడం మొదలు పెట్టారు. అతడికి బాగా గాయాలయ్యి నెత్తురోడుతున్నాడు. అతడి బట్టలు చిరిగి పీలికలయ్యాయి, చావు సమీపించిందని అతడు అనుకున్నాడు.

"నువ్వు చావబోతుంటే డబ్బు విలువ ఏముంటుంది? ఎప్పుడోగాని డబ్బు మనిషి ప్రాణాలను కాపాడలేదు," పరుసవేది చెప్పాడు. చివరికి యువకుడు "నేను నిధి కోసం తవ్వుతున్నాను!" అంటూ కేకపెట్టాడు. మూతి వాచిపోయి రక్తం కారుతున్నప్పటికీ తనపై దాడి చేస్తున్న వాళ్ళకి ఈజిప్టులోని పిరమిడ్ల దగ్గర నిధి ఉన్నట్లు తాను రెండుసార్లు కలగన్న విషయం చెప్పాడు.

ఆ గుంపుకి నాయకుడిలా ఉన్న వ్యక్తి "అతడిని విడిచిపెట్టండి, అతడి దగ్గర ఇంకా ఏమీలేదు. ఈ బంగారాన్ని కూడా అతడు దొంగిలించి ఉంటాడు," అని ఇతరులతో అన్నాడు.

దాదాపు స్పృహ కోల్పోయిన పరిస్థితిలో యువకుడు ఇసుకమీదకి కూలిపోయాడు. నాయకుడు అతడిని కుదిపి "మేం వెళుతున్నాం," అని చెప్పాడు.

కానీ వెళ్ళేముందు అతడు వెనక్కి వచ్చి యువకుడితో ఇలా చెప్పాడు: "నువ్వు చావబోవటం లేదు. నువ్వు బతకుతావు. మనిషన్నవాడు ఇంత అమాయకంగా ఉండకూడదని నువ్వు నేర్చుకుంటావు. రెండు సంవత్సరాల క్రితం నాకు ఇదే స్థలం దగ్గర మళ్ళీ, మళ్ళీ అదే కల వచ్చింది. ఆ కలలో పాడుబడిన క్రీస్తు దేవాలయంలోని సామానులు భద్రపరిచే గదిలోంచి మొలుచుకొచ్చిన అంజూర చెట్టు కనపడింది, దానిని తవ్వి చూస్తే నిధి దొరుకుతుందని చెప్పింది. కానీ ఒక కల మళ్ళీ, మళ్ళీ వచ్చిందని ఎడారి అంతటినీ దాటేటంత మూర్ఖుడనేమీ కాదు."

ఆ తరువాత ఆ గుంపు కనుమరుగైపోయింది.

యువకుడు ఒణుకుతూ నిలబడ్డాడు. పిరమిడ్ల వంక మరోసారి చూశాడు. అవి అతడిని చూసి నవ్వులు ఒలికిస్తున్నట్లున్నాయి, అతడు కూడా తిరిగి నవ్వాడు. అతడి హృదయం ఆనందంతో నాట్యం చేసింది.

తన నిధి ఎక్కడ ఉందో ఇప్పుడతనికి తెలిసింది.

# ముగింపు

చీకటి పడుతుండగా యువకుడు నిర్మానుష్యంగా ఉన్న ఆ చిన్న క్రీస్తు దేవాలయానికి చేరుకున్నాడు. సామాను భద్రపరిచేగది ఉన్నచోట అంజూర చెట్టు ఇంకా అలాగే ఉంది. సగం పడిపోయిన ఆలయం పై కప్పులోంచి నక్షత్రాలు కనపడుతున్నాయి. తన గొర్రెలతో అక్కడ గడిపిన రేయి అతడికి గుర్తుకు వచ్చింది. ఆ రేయి చాలా ప్రశాంతంగా ఉండింది.... తనకి వచ్చిన కల తప్పించి.

ఈ సారి అతడు ఇక్కడకి తన గొర్రెల మందతో కాకుండా ఒక చిన్న గునపంతో వచ్చాడు.

అతడు చాలాసేపు ఆకాశంకేసి చూస్తూ కూర్చున్నాడు. తరువాత తన సంచిలోంచి ఒక సీసాతీసి కొంచెం ద్రాక్షాసవం తాగాడు. ఎడారిలో పరుసవేదితో కూర్చుని చుక్కలను చూస్తూ, ద్రాక్షాసవం తాగిన రేయి అతడికి గుర్తుకొచ్చింది. అతడు పయనించిన అనేక దారులు గుర్తుకు వచ్చాయి. తన నిధిని చూపించటానికి దేవుడు ఎంచుకున్న వింత పద్ధతులు తలపునకు వచ్చాయి. మళ్ళీ, మళ్ళీ వచ్చే కలల ప్రాముఖ్యతను విశ్వసించి ఉండకపోతే అతడు బంజారా ముదుసలిని, వృద్ధరాజుని, లేదా మోసగాడినీ ఆ జాబితా చాలా ఉంది; వారెవ్వరినీ కలిసి ఉండేవాడు కాదు.... 'కాని శకునాలు దారిని స్పష్టంగా చూపించాయి, పొరపాటు పడే అవకాశమే లేదు,' యువకుడు తనలో తాను అనుకున్నాడు.

అతడు అక్కడే నిద్రపోయాడు. తిరిగి మెలకువ వచ్చే సరికి సూర్యుడు బారెడు పైకి ఎగబాకి ఉన్నాడు. అంజూర చెట్టు మొదట్లో తవ్వటం మొదలుపెట్టాడు.

"ఓయీ! ముసలి మాంత్రికుడా!" యువకుడు ఆకాశం వైపు అరిచాడు. "నీకు మొత్తం కథ ముందే తెలుసు. ఇక్కడికి తిరిగి రావటానికని సన్యాసుల మఠం వద్ద కొంత బంగారం కూడా నాకోసం వదిలిపెట్టావు. చిరిగిన బట్టలతో తిరిగి

వెళ్ళిన నన్ను చూసి ఆ సాధువు చిరునవ్వు నవ్వాడు. ఆ మాత్రమైనా నా మర్యాదను కాపాడలేకపోయావా?"

"లేదు," గాలిలోపైన అతడికి ఒక గొంతుక వినిపించింది. "నేను ముందే చెప్పి ఉంటే నువ్వు పిరమిడ్లను చూసి ఉండేవాడివి కాదు. అవి చాలా అందంగా ఉన్నాయి కదూ?"

యువకుడు నవ్వి తవ్వడం కొనసాగించాడు. అరగంట తరువాత అతడి గునపానికి ఏదో గట్టిగా తగిలింది. ఒక గంట తరువాత అతడి ముందు ఒక పెట్టెలో స్పానిష్ బంగారు నాణాలు ఉన్నాయి. విలువైన రాళ్ళు, ఎరుపు, తెలుపు ఈకలతో బంగారు తొడుగులు, వజ్రాలు పొదిగిన విగ్రహాలు కూడా అందులో ఉన్నాయి. దాడిలో దొరికి ఏనాడో మరిచిపోయిన సంపద అది. దానిని పాతిపెట్టిన వ్యక్తి పిల్లలకి చెప్పకుండానే చనిపోయినట్లున్నాడు.

యువకుడు తన సంచిలోంచి ఉరిం, తుమిం రాళ్ళను బయటకు తీశాడు. ఆ రెండు రాళ్ళను బజారులో ఉండగా ఒకే ఒక్కసారి ఉపయోగించాడు. అతడి జీవితమూ, మార్గమూ ఎప్పుడూ తగినన్ని శకునాలను చూపిస్తూనే ఉన్నాయి.

అతడు ఉరిం, తుమింలను పెట్టెలో భద్రపరిచాడు. అవి కూడా తనకు కొత్తగా దొరికిన నిధిలో భాగమే. తాను తిరిగి కలవని వృద్ధ రాజుని అవి గుర్తుకు తెస్తాయి.

తమ జీవిత గమ్యాన్ని అనుసరించే వాళ్ళ పట్ల జీవితం ఎంతో ఉదారంగా ఉంటుందన్నది నిజమేనని అతడు అనుకున్నాడు. తను మాట ఇచ్చినట్లు తనకు దొరికిన నిధిలో పదవ వంతు ఇవ్వడానికి టారీఫాకి వెళ్ళాలన్న సంగతి జ్ఞాపకానికి వచ్చింది. బంజారాలు బాగా తెలివైన వాళ్ళని అతడు అనుకున్నాడు. వాళ్ళు అంతటా సంచరిస్తుంటారు కాబట్టి అంత తెలివిగా ఉంటారనుకుంటా.

గాలి తిరిగి వీచసాగింది. అది ఆఫ్రికా మీదుగా వచ్చే తూరుపుగాలి. అది తనతోపాటు ఎడారి వాసనలనుగానీ, మూరిష్ దాడుల భయాన్నిగానీ మోసుకు రాలేదు. అది అతడికి బాగా పరిచయమైన ఒక సువాసనను, ఒక ముద్దు స్పర్శను తీసుకువచ్చింది. ఆ ముద్దు ఎంతోదూరం నుంచి మెల్ల మెల్లగా వచ్చి అతడి పెదాలపై వాలింది.

యువకుడు నవ్వాడు. ఆమె అలా చెయ్యటం అదే మొదటిసారి.

"ఫాతిమా! నేను వస్తున్నాను," అతడు బదులిచ్చాడు.

## రచయిత గురించి

పాలో కొయిలో 1947 ఆగస్టులో బ్రెజిల్‌లో పుట్టాడు. తల్లిదండ్రుల కోర్కెలకు వ్యతిరేకంగా చిన్నప్పటినుంచీ రచయిత, కళాకారుడు కావాలని కలలు కన్నాడు. నిరంకుశ మిలటరీ పాలనలో ఉన్న బ్రెజిల్‌లో 1968 హిప్పీ, గెరిల్లా ఉద్యమాల ఉత్తేజంతో అతడు ప్రగతిశీల రాజకీయాల పంథాను, శాంతి, ప్రేమ తరాన్ని ఎంచుకున్నాడు.

సంగీత వాద్యకారుడు, పత్రకారుడుగా పనిచేసిన కొయిలో 'యాత్ర' ముగించిన ఒక సంవత్సరం తరువాత 1987లో 'The Pilgrimage' అన్న తన మొదటి పుస్తకం రాశాడు. ఆ తరువాత ఒక సంవత్సరానికి 'The Alchemist' రాసాడు. మొదటి ముద్రణ 900 ప్రతులు మాత్రమే అమ్మింది. ఆ తరువాత ఇది అమెరికాలో ప్రచురితమై ఎంతో జనాదరణ పొందింది.

రచయిత రాసిన ఇతర పుస్తకాలు 'The Valkyries', 'By the River Piedra I sat Down and wept', 'The Fifth mountain', 'Veronika Decides to Die', 'The Devil and Miss Prym', 'Manual Of the Warrior'. ఇటీవలే రాసిన పుస్తకం 'The Witch of Portobello'.

తన రచనలకు పాలో కొయిలోకి దేశ, విదేశాల్లో ఎన్నో అవార్డులు, బహుమానాలు లభించాయి. పత్రికలకు ప్రపంచవ్యాప్తంగా సిండికేట్ అయిన వీక్లీ కాలమ్ కొయిలో రాస్తున్నారు. పాలో అతని భార్య క్రిస్టినా కలిపి పాలో కొయిలో ఇన్‌స్టిట్యూట్ స్థాపించి నడుపుతున్నారు. ఇది బ్రెజిల్ లోని అట్టడుగు వర్గాల వారికి అవకాశాలను, సహాయాన్ని అందచేస్తోంది. రచయిత గురించి మరిన్ని వివరాలకు : www. paulocoelhoblog.com

## పద సూచిక

పరుసవేది : Alchemist, రసవాది అని కూడా అంటారు; ఇతర లోహాలను, పాదరసాన్ని బంగారంగా మార్చగల వ్యక్తి

పరుసవేదం : Alchemy

నిపుణుల పని : Masters Work; పరుసవేది పనిలో పరాకాష్ఠ; దీంట్లో రెండు భాగాలు ఉంటాయి : 1) ఘనరూపంలో ఉండేది తాత్వికుని రాయి: philosopher's stone; దీనితో ఇతర లోహాలను బంగారంగా మార్చవచ్చు ; 2) ద్రవరూపంలో ఉండేది జీవామృతం: Elixir of life; దీనితో అన్ని రోగాలు నయమవుతాయి అని నమ్ముతారు.

పాఠకుల జీవితాలను శాశ్వతంగా మార్చివేసే పుస్తకాలు ఎప్పుడోగాని ప్రచురితం కావు. అటువంటి పుస్తకాల్లో పాలో కొయిలో రాసిన 'పరుసవేది' ఒకటి. ఇప్పటికే ఈ పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా 160 దేశాలలో 66 భాషలలోకి అనువాద మయ్యింది. నాలుగు కోట్ల ప్రతులకు పైగా అమ్ముడుపోయాయి.

యాండలూసియాలో గొర్రెల కాపరి అయిన శాంటియాగో అనే యువకుడు నిధి కోసం అన్వేషించే అద్భుతకథ ఇది. తన స్వదేశమైన స్పెయిన్‌ని విడిచి టాంజియర్స్‌లోని బజార్లు, ఈజిప్టులోని ఎడారికి చేరతాడు. అక్కడ అతని కోసం ఒక పరుసవేది ఎదురుచూస్తూ ఉన్నాడు.



మన హృదయాలను ఆలకించటం గురించి, జీవిత పథమంతా పరచి ఉన్న శకునాలను అర్థం చేసుకోవటం గురించి, అన్నిటికీ మించి కలలను అనుసరించటం గురించి ఈ గాథ చెబుతుంది.

రూ.90/-

ISBN 978-81-904518-4-0